ISSN 2278-3423

Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

# సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

# భాష, ప్రాంతం, జన సముదాయాలు

సంచిక : 8&9 (త్రైమాసికం) తెలుగు & ఇంగ్లీష్ డిసెంబర్ 2014 విరాళం : 50 రూ.

**విషయసూచిక**


**సంపాదకీయం**

**ప్రాంతం**

ఇదీ నా గొడవ కాళోజి

గుర్తింపును నిర్మించుకునే క్రమంలో జూపాక సుభద్ర

ఉద్యమానికి ఊపిరైన భాష సంగిశెట్టి శ్రీనివాస్

తెలంగాణా, తెలుగు సినిమా భాషా రాజకీయాలు సత్యప్రకాశ్ ఎలవర్తి, వంశీ వేమిరెడ్డి

**రాజకీయాలు**

దళితులు ఇంగ్లీష్ కంచ ఐలయ్య

దళిత సాధికారతకు బాటవేసిన లార్డ్ మెకాలే చంద్ర భాన్ ప్రసాద్

దార్శనికత లేని ప్రభుత్వాలు భాషా సమస్యలు జయధీర్ తిరుమల రావు

జాషువా చూపిన జాడ డొక్కా మాణిక్య వరప్రసాద్

సంస్కృతం, మాతృభాషల బోధన సౌమ్య దేచమ్మ

**ఉర్దూ**

ఉర్దూ మాధ్యమంలో హైద్రాబాద్ వైద్య విద్యాలయ సంస్థ స్థాపన సయ్యద్ ముస్తఫా కమల్

పర్షియన్ స్థానంలో ఉర్దూ తారిఖ్ రెహమాన్

ఉస్మానియా నుండి మౌలానా ఆజాద్ యూనివర్శిటీ వరకు ఎమ్.ఏ.మోయిద్

మహ్మద్ జునైద్ జాకిర్‌తో ఇంటర్వ్యూ

ఖాలిద్ సయ్యద్‌తో ఇంటర్వ్యూ

మద్రసాల్లో ఆంగ్ల భాష సాజిదా సుల్తానా

ఉర్దూ యూనివర్శిటీలో ఇంగ్లీషు చదువు ఎమ్.డి.ముజీబుద్దీన్

**ప్రామాణికత : ప్రజాస్వామ్యం**

ప్రముఖ దళిత రచయిత వేముల ఎల్లయ్యతో ఇంటర్వ్యూ శ్రీవత్సన్, ఎన్.మనోహర్ రెడ్డి

"ప్రామాణిక భాష" పరిధిని దాటి ఆలోచించాలి దుగ్గిరాల వసంత





స్థానిక రైల్వే సైన్ బోర్డు


చేరా : ఒక అసమాపక క్రియ కె.శ్రీనివాస్

భాష మరియు ప్రజాస్వామ్యం మాధవ ప్రసాద్

**దళిత సాహిత్యం-భాష**

జాతీయకవి వేమన బాటలో జాషువ కత్తి పద్మారావు

ఆధునిక తెలుగు సాహిత్యంలో దళిత కవుల భాషా ఒరవడి గోగు శ్యామల

మాతృభాష మారువేషం ప్రసేన్

భాష, జీవనం దీపా శ్రీనివాస్

దళిత కవిత్వానికి 'తిట్టు' అంతిమ లక్ష్యం కాదు! జిలుకర శ్రీనివాస్

పుస్తక సమీక్ష : హెూలీ షిట్ : ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ స్వేరింగ్, ఆర్.శ్రీవత్సన్

దళిత బహుజనుల 'గ్రామ్య భాష'పై 'గ్రంథ చక్షువు'ల దాడి చరిత్ర ఎన్.మనోహర్ రెడ్డి

**అనువాదం**

నిశ్శబ్దపు భాష : కె.లలితతో ఇంటర్వ్యూ గోగు శ్యామల, ఏ.సునీత

అనువాద ప్రపంచం ఏ. సునీత, శ్రీవత్సన్ మరియు మోయిద్‌ల మధ్య సంభాషణ

జ్ఞానరంగాలు, భాష ప్రథమా బెనర్జీ


*మధ్యపేజీ చిత్రం : జ్యోతి వహీద్*


***ప్రత్యేక సంపాదకులు : ఎన్. మనోహర్ రెడ్డి, ఎమ్.ఏ.మోయిద్ మరియు గోగు శ్యామల***

*సంపాదకులు:* ఏ. సునీత, ఆర్. శ్రీవత్సన్



***అడ్వయిజరీ బోర్డ్:*** శీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, అస్మా రషీద్, రమా మెల్కొటే, కె.సజయ, బి.శ్యామసుందరి, సూశీ థారు, వీణా శతృఘ్న, డి.వసంత, కె.లలిత, ఎన్.వసుధ, గోగు శ్యామల, ఉమ భృగుబండ, కనీజ్ ఫాతిమా, స్వాతీ మార్గరెట్, మధుమిత సిన్హా



*ప్రొడక్షన్:* ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి

***ప్రచురణ సంస్థ : అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్,*** 2-2-18/2/A, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు-13.


వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి


*ప్రింటింగ్:* రౌష్ని గ్రాఫిక్స్, అంబర్‌పేట్, హైదరాబాదు-13. సెల్: 9246172133

# సంపాదకీయం

ఆధునిక భారత దేశంలో వలస పాలనా కాలం నుండి భాష ఒక రాజకీయ చర్చనీయాంశంగా వుంటూ వచ్చింది. అయితే 1940, 50 దశకాల్లో జాతీయవాదం బలపడిన క్రమంలోనూ, భారత ఉప ఖండం భాషా అస్తిత్వ భూమికపై పునర్వ్యస్థీకరింపబడినప్పుడు భాష చుట్టూ పెద్ద ఎత్తున రాజకీయ సమీకరణలు జరిగాయి. 1980ల నుండి 90ల వరకూ, ఆ తరువాత రాజకీయాల్లో జెండర్, కులం, ప్రాంతం వంటి అంశాలు కేంద్ర స్థానం ఆక్రమించాయి. ఆయా అంశాలని స్త్రీవాద, దళిత, ప్రత్యేక తెలంగాణా ఉద్యమాలు సమర్థవంతంగా ముందుకు తీసుకువచ్చాయి.

ఈ నేపథ్యం నుండి చూస్తే ప్రస్తుతం భాషను కేవలం గత చరిత్రకు సంబంధించిన విషయంగా మాత్రమే పరిగణించాలనే భావన రావచ్చు. అయితే ఇది సరైంది కాదు. రాజకీయ రంగం నుండి భాషా చర్చ కనుమరుగు కాలేదు. స్త్రీల స్వీయ అస్తిత్వ నిర్మాణ చర్చలోనూ, దళిత సాహిత్యంలో వాడిన భాషకి 'అశ్లీలత' ఆపాదించిన సందర్భంలోనూ, ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఉద్యమంలో ఆంధ్రా తెలుగు ఆధిపత్యం గురించి – ఇలా అన్ని ఉద్యమాలలోను భాష ఒక కీలక మేథోపరమైన అంశంగా చర్చకి వచ్చింది. 1948లో భారత రాజ్యం హైదరాబాద్ రాజ్యాన్ని విలీనం చేసుకున్న తరువాత ఉర్దూ/దక్కని భాష నిర్లక్ష్యానికి గురికావటం, 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత దాని పరిస్థితి మరింత క్షీణించటం, వీటితో ముడిపడి ఉన్న తెలంగాణా ముస్లింల మనుగడ విషయం నివురుగప్పిన నిప్పులా వుంది. అత్యంత రాజకీయ ప్రాముఖ్యత కలిగిన ఒక కొత్త ఆలోచనా విధానాన్ని రేకెత్తించే ఇటువంటి చర్చలన్నిటినీ ఒకసారి పునరావలోకనం చేసుకొని వాటన్నింటిని ఒక దగ్గరికి తీసుకురావటానికి ఈ బ్రాడ్ షీట్ ద్వారా ప్రయత్నం చేసాము. అలాగే కొత్త దృక్పథాలను మన ముందుంచిన రచయితలను ఇందులో చేర్చటం జరిగింది.

ఈ రెండూ పాఠకులకు భాషా సమస్య చుట్టూ ఉన్న వివిధ అంశాల పై ఒక సమగ్ర అవగాహనను కలిగిస్తాయి. ఈ బ్రాడ్‌షీట్‌లో పొందుపరచిన వ్యాస కర్తలందరూ కూడా భాషను చాలా ముఖ్యమైన అంశంగా పరిగణించి, దానికి సంబంధించిన మేథోపరమైన చర్చల్లో లోతుగా పాల్గొన్న అనుభవం ఉన్న వారే. మేము అడగంగానే ఒప్పుకొని బ్రాడ్ షీట్ కోసం వ్యాసాలు పంపినందుకు వారికి మా కృతజ్ఞతలు.

బ్రాడ్‌షీట్ లోని వ్యాసాలను, పైన చెప్పిన విషయాలను చూసిన వారెవరికైనా ఈ సంచిక స్థానిక రాజకీయ అంశాలకు ప్రాధాన్యతనతనిచ్చిందని అర్థమవుతుంది. కొన్ని వ్యాసాలు మాత్రమే యావత్ భారత అంశాలయిన భాషా ప్రామాణికత, దళితులు–ఇంగ్లీషు లేదా ఈ మధ్యనే వివాదాస్పదమైన కేంద్రీయ విద్యాలయాల్లో సంస్కృతం నేర్పటం వంటి వాటి గురించి చర్చిస్తాయి. అవి కూడా విషయాలని అమూర్తంగా సాధారణీకరించకుండా రోజువారీ స్థానిక విషయాలతో ముడిపెట్టి చర్చిస్తాయి.

వ్యాసాలని స్థానిక అంశాలపై దృష్టిపెట్టి ఎంచుకోవటం వల్ల (స్థానిక అంశాలకి తప్పక బయటి అంశాలతో సంబంధం ఉంటుందనే స్పృహతో) మిగిలిన భారతీయ భాషల్లో జరుగుతున్న చర్చల గురించిన రచనలను, అవి ఎంత ముఖ్యమైనవైనప్పటికీ, వాటిని ఈ బ్రాడ్ షీట్‌లో చేర్చ లేదు.

ఈ సంచికకు ఒక చారిత్రక సందర్భం ఉంది. కొత్తగా ఏర్పడిన తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం, వివిధ వ్యక్తులు, సంస్థలు తెలంగాణా తెలుగును బల పరచాలనే ఉద్దేశంతో ప్రయత్నాలు చేస్తున్నారు. ఉదాహరణకి స్థానిక తెలుగు మాండలికంలో పాఠ్య పుస్తకాలను తీసుకురావటం కోసం ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పరిచింది. కొన్ని వార్తా పత్రికలూ, ప్రసార మాధ్యమాలు కూడా తెలంగాణా తెలుగును బలపరచటం కోసం కృషి చేస్తున్నాయి. అయితే, అక్కడక్కడా ప్రామాణిక తెలుగుతో కొన్ని స్థానిక పదాలని కలిపి వాడటం తప్ప అన్ని రకాలైన మేథోచర్చల కనువైన ప్రత్యేక తెలంగాణా తెలుగు ఇప్పటికీ తయారవలేదు. ఉర్దూ /దక్కనికి సంబంధించి కొత్త విధానాన్ని రాష్ట్రం తీసుకువస్తుందనే ఆశ కూడా వుంది. ఈ చారిత్రక సందర్భమే ఈ బ్రాడ్ షీట్‌కి ప్రత్యేకతని, ఔచిత్యాన్ని కల్పిస్తుంది. దీనిలో వున్న వ్యాసాలు ఒకే దృక్పథంతో కాక, ఒకే అంశంపై విభిన్న దృక్పథాలతో చర్చిస్తాయి.

ఈ బ్రాడ్ షీట్ సంకలనం మాకు చాలా సంతృప్తినివ్వడమే కాక దీని ద్వారా మేము చాలా కొత్త విషయాలు నేర్చుకొన్నాము. భాష పైన మాకు ఇప్పటి వరకూ తెలియని రచనలు మా దృష్టిలో కొచ్చాయి. కొన్ని పాత చర్చలని కొత్త రాజకీయ పరిణామాల నేపథ్యంలో తిరిగి చూడటం జరిగింది. సామాజిక ఉద్యమాలలో పాల్గొని, రాడికల్ సాహిత్యాన్ని సృష్టించటానికి తీవ్ర కృషి చేసిన వ్యక్తులతో వారి అనుభవాల గురించి ఇంటర్వ్యూలు చేసాము. నాలుగు సంవత్సరాల నుండి బ్రాడ్‌షీట్‌ను రెండు భాషల్లో తీసుకొచ్చే క్రమంలో ఎదురైన అనువాద సమస్యల చుట్టూ ఉండే కొన్ని అంశాలను సంపాదక బృందం ఈ సంచికలో చర్చించింది.

కొత్త అనువాదకులన్ని పరిచయం చేసే అవకాశం మాకు కలిగింది. మాలో కొంత మందికి ఒక భాషలో మాత్రమే మేథోపరమైన ఒనరులు ఉన్నాయనుకున్నప్పుడు కొన్నిసార్లు కలిసి అనువదించాము. ఆ ప్రయత్నంలో ఒకరి నుండి ఒకరు నేర్చుకున్నాం. జాషువా కవిత్వం అనువదించటం ఒక పెద్ద సవాలు, ఆనందదాయకం కూడా. అనువాదాన్ని ఒక రాజకీయ ప్రక్రియగా తీసుకోవటం చాలా అవసరమనే విషయం కూడా అనుభవంలోకి వచ్చింది. రచయితలకి, అనువాదాకులకి ధన్యవాదాలు తెలుపుకుంటూ.

– సంపాదక బృందం

ఎన్. మనోహర్ రెడ్డి, ఎమ్.ఎ.మోయిద్, గోగు శ్యామల

*ఎన్.మనోహర్ రెడ్డి EFL విశ్వవిద్యాలయంలో Ph.D చేస్తున్నారు.*

**అనువాదం : ఏ. సునీత**









# ఇదీ నా గొడవ

## ■ కాళోజీ

హైదరాబాద్ సంస్థానంల జిల్లాలు 16- తెలుగు 8, మరాఠ్వాడ 5, కర్నాటక 3, తెలుగువాండ్లు కోటిమంది. ఎనిమిది జిల్లాలను కలిపి తెలంగాణా అనేటిది. సంస్థానం జనాభాలో తెలుగువాండ్లు 50 శాతం, మహారాష్ట్రులు 25 శాతం, కన్నడులు 11 శాతం, ముస్లిములు 12 శాతం. సంస్థానమంతట పటేలు పట్వారీలు పెద్ద సంఖ్యల వుండెటోళ్ళు. కవిలెకట్టలు (రికార్డులు) రాసెటందుకు తెలంగాణల తెలుగు, మరాఠ్వాడల మరాఠీ, కర్నాటకల కన్నడం వాడెటోళ్ళు. విచిత్రమేమిటంటే ఈ శతాబ్దం మొదట హైదరాబాద్ సంస్థానంల అధికార భాష పర్షియన్. పర్షియా (ఈనాటి ఇరాన్) నుంచి వచ్చిన కొద్ది కుటుంబల వాండ్లే ఆ భాష మాట్లాడెటోళ్ళు. నైజాంలో సామాన్యులు, పై తరగతుల వాండ్లు కూడ ఉర్దూనే మాట్లాడేటోళ్ళు. కాని కొందరు ముస్లింలు, ఉత్తరాదినుంచి వచ్చిన కాయస్థులు, బ్రాహ్మలు పర్షియన్, అరబిక్ భాషలు నేర్చుకునేటోళ్ళు. వలస పాలనలో వుద్యోగాలకి ఎగబాకడం కోసం ఇంగ్లీషు నేర్చుకున్నట్టు. హిందీలో భాషా ప్రవీణ, విద్వాన్ పరీక్షల్లాగ అరబిక్, పర్షియన్ భాషల 'మున్షిఫాజిల్, దబీర్' అనే పరీక్షలుండేటివి. నవాబు దర్బారుతో సంబంధమున్న ముస్లింలు మాత్రం పర్షియన్ భాషల పాండిత్యంకోసం ప్రయత్నించెటోళ్ళు.

మామూలు ముస్లింలకి అసలు పర్షియన్ భాషరాదు. అరబ్బీ అసలు రాదు. అరేబియా నుంచి వచ్చినవాండ్లు మాత్రం ఇండ్లల అరబ్బీ మాట్లాడేటోళ్ళు. ఉదా: మౌలానా అబుల్ కలాం ఆజాద్ కుటుంబం. ఇట్లకొన్ని కుటుంబాలు ఎన్నో తరాల క్రితం అరేబియా నుంచి వచ్చినవి. ఆ ఇండ్లల మాత్రం అరబ్బీ వుచ్చారణ విషయంల చాలా పట్టింపు వుండేది. ఖురాన్ అరబ్బులే చదవాలనెటోళ్ళు (వేదాలు స్వరయుక్తంగా ఘనాపాఠీలు మాత్రమే చదవాలన్నట్టు.) ఖురాన్ చదవడాన్ని కిరాత్ అంటరు. ఆజాద్ జైలు ఉత్తరాల్ల ఒకదాన్ల యిట్ల రాసిండు. "మా అన్నదమ్ములం బెంగాలీమౌల్వీ (మాతృభాష బెంగాలీ అయినా అరబ్బీలో పండితుడె) దగ్గర ఖురాన్ పాఠాలు నేర్చుకొన్నాం. అరేబియాలో ఉండే మా మేనత్త ఇక్కడి కొచ్చినప్పుడు ఆ పంతులు పాఠాలు విన్నది. మా నాయనని పిల్చి, 'ఈ పంతులు తప్పుడు వుచ్చారణతో పిల్లల్ని చెడగొడుతున్నడు. పాఠాలు మాన్పించేసెయ్. పంతుల్ని పంపేసెయ్' అని గొడవ చేసింది." నాకు శ్రీపాద సుబ్రమ్మణ్యశాస్త్రి 'అనుభవాలు-జ్ఞాపకాలు' (ఆత్మకథ) యాదికొచ్చింది. అప్పట్లో ఏది రాసినా సంస్కృతంలోనే రాయాలె, ఏది చదివినా సంస్కృతంలోనె చదువాలె అనేది. ఓసారి శ్రీపాదవారు తెలుగుల కవిత్వం రాస్తే వాళ్ళ నాయన ఆయన చెయ్యి విరగ్గొట్టిండంట. సంస్కృత నాటకాలల్ల స్త్రీ పాత్రలు, శూద్రపాత్రలు సంస్కృతంల మాట్లాడవు. ప్రాకృతం మాట్లాడాలె. సీత ప్రాకృతం, రాముడుగారు సంస్కృతం మాట్లాడతరు. ఒకే కుటుంబంలోని మనుషులైనా ఇద్దరు (స్త్రీ పురుషులు) ఒకే భాష మాట్లాడరాదన్నమాట. విషయం దేవునికి సంబంధించింది కావాలె. పురాణానికి సంబంధించింది కావాలె. భాషమాత్రం సంస్కృతం. ఈ పట్టింపు నుంచి దేశీయభాషల్ని తప్పించిన ఘనత కొందరు ఇంగ్లీషు మహానుభావులది. 'ప్రజానీకం మాట్లాడుకునే భాషల కవిత్వం రాయాలె' అని తెలుగుకి ఏట్స్ మహాశయుడు చేసినట్టు ప్రతి దేశీయ భాషకు ఒక బ్రిటిషర్ ఈ మేలు చేసిండు. వారి ఉద్దేశం ఏమైనప్పటికి దీనివల్ల మనభాషలకు మంచిదయింది. లోపాయికారిగా వాండ్ల వెనుక బిషప్పులు వాళ్ళూ వుండి, మత ప్రచారానికి ఈ భాషను వాడుకుని వుండవచ్చు. కాని ఇవాళ మన తెలుగు గానీ, బెంగాలీగానీ, మారాఠీగాని, హిందీగానీ నిలబడి వున్నాయంటే వాటి వెనుక ఒక ఇంగ్లీష్‌వాడున్నడు. అట్లాగే ఉర్దూకి కూడ కలకత్తాలో గిల్గిట్ పనిచేసిండు. గిరిజన భాషలకు సంబంధించి చేసింది కూడ వాండ్లే – గోండుభాషకి హెమన్ డార్ఫ్ చేసిండు. అట్లనే అధికారభాషగా పర్షియన్ వున్నప్పటికీ, క్రమంగా ఉర్దూకి మారింది.

నూరేళ్ళక్రితం వరకూ కూడ ఉర్దూలో కవిత్వం రాసేవారు కాదు. తెలుగుల రాయకూడదన్నట్టే ఉర్దూల కూడ రాయకూడదు. పర్షియన్‌లోనే రాసేటిది. అరబ్బీల అయితే దేవుణ్ణి ప్రస్తుతిస్తూ మాత్రం కవిత్వం చెప్పాలె గాని మరే విషయమూ రాయగూడదని ఆంక్షలుండేటివి. విశ్వనాథ సత్యనారాయణగారు 'దేవుణ్ణి స్తుతించాలంటె దేవభాషలోనే రాయాలె, దేవభాషవుండాలె' అని వాదించినట్లన్నమాట. ముస్లింలు మాట్లాడేది ఉర్దూ అయినా పర్షియన్‌లోనె కవిత్వం చెప్పినట్టు, ముస్లిమేతరులు కూడా (నూటికి కోటికొకరు) పర్షియన్‌ల కవిత్వంల ప్రసిద్ధిపొందినారు. ఉర్దూల చెబితే చిన్నచూపు చూసెటోళ్ళు. విశ్వనాథ సత్యనారాయణ గారితో ఒకసారి చెప్పిన "మీరు తెలుగుల రాసింది నా బోటివాండ్లకి కూడా తెలవకపోయె. తెలుగుల రాయడంవల్ల తెలుగురాని ప్రాంతం వాండ్లకి మీ ప్రతిభ తెల్వడం లేదు. కాబట్టి దయచేసి మీరు తెలుగు రాయటం మానుకుని సంస్కృతంలోనె రాస్తె సంస్కృతం తెల్సినవాండ్లకి మీ ప్రతిభ బోధపడుతుంది. మీ స్థాయీ వాండ్ల కర్థమవుతుంది. మీరు తెలుగులో రాయడమెందుకు? మీ భాష అర్థంకాక మేం బాధపడడమెందుకు? 'నీకేం తెలుస్తుందిలే' అని మీరనడమెందుకు? సంస్కృతంలోనే రాయండి' అని. (విశ్వనాథ ప్రతిభ ఉత్తరాదివారికి తెలిసేటందుకు వీలుగా వారి 'వేయి పడగలు' ని ఈనాటి ప్రధాని పి.వి. నరసింహారావు 'సహస్రఫణి' పేరుతో హిందీలోకి అనువదించిండు.) దేశీయ భాషలకు (వెర్నాక్యులర్) సంబంధించి ఆనాటి పురాతనభావాలు అట్లుండేవి. మొదట దేవుళ్ళు, తర్వాత దేవతలు, అటు తర్వాత అవతారాలు, వాటిపైన ఉన్నత వంశాలు-పురాణాలనిండా ఇవే. వీటిని దేవభాషల చెప్పిన్రు. ఇది సామాన్య ప్రజల భాషా కాదు, అది వారి జీవితమూ కాదు. ఈ ధోరణి అన్ని భాషలలోను ఒకటే, అట్లాంటి పర్షియన్ (రాజ) భాష నుంచీ ఉర్దూ (ఉర్దూ ప్రజలభాష)కి రావడం పెద్ద మార్పేగద. అయితే అది ఒక వర్గానికి మాత్రమే మేలు కలగజేసింది.

శంకరాచార్యులవారు, మధ్వాచార్యులవారు బోధనలు సంస్కృతంల చేసినా,శిష్యులకు వ్యాఖ్యానాలు చెప్పేది వాండ్లు మాట్లాడుకునే భాషలోనెగద! అట్లనే ఈ పండితులు పర్షియన్‌ల ప్రావీణ్యం సంపాదించుకున్నగానీ వాండ్ల ఇంటిభాష మాత్రం అదికాదు. మిగిలిన వాండ్లకు చదవడం రాయడం రాకపోయినా వాండ్ల భాష మాత్రం ఉర్దూ. అయితే ఇంట్ల ఉర్దూ మాట్లాడుకునె వాండ్లకూ, ఉర్దూ వచ్చినవాండ్లకూ కార్యకలాపాలు ఉర్దూల జరిగితే, ఆభాష నేర్చుకోవడమైనా, ప్రావీణ్యం సంపాదించడమైన సులువు. తెలుగువాడైనా, కన్నడిగుడైనా మరే ముస్లిమేతరుడైనా, ఉర్దూ ఎంత నేర్చుకొన్నా సరె, ఉర్దూ పండితుడిగా పరిగణనలోకి రాడు. ఉర్దూ మాతృభాషగాని కాయస్థునికి మున్షీ, మున్షీఫాజిల్, కబీర్ వగైరా సర్టిఫికెట్లున్నా సరే, స్కూళ్ళల్ల ప్రైమరీ, మిడిల్ క్లాసులకైనా ఉర్దూభాష బోధించటానికి నియమించడం ఎక్కడా కానరాదు. కవి సమ్మేళనంలనైనా 20మంది కవులు పాల్గొంటే ఒక్కరు ముస్లిమేతరుడుండడం ఘనం. 'పర్షియన్ వస్తేగాని ఉర్దూ రాదు, వీండ్లకు ఉర్దూ రాయడం ఏమొస్తది?' అంటారు. 'సంస్కృతం రాకుండ తెలుగు కవిత్వం ఎట్ల రాస్తరు?' అని అడిగినట్టు అదీ ధోరణి. నైజాంల ముస్లిమేతరులు నూటికి 80-85మంది. మిగిలినవాండ్లు మహమ్మదీయులు. వీండ్లల చదువుకున్నవాండ్లెంతమంది? ఢిల్లీనుంచీ మొదటి నైజాముల్ ముల్క్‌తోపాటు ఇక్కడికి వచ్చిన కుటుంబాలల్ల అరబ్బు, పర్షియన్ పండితులెక్కువ. ఆధిపత్యం వీండ్లదే. మొగలాయిలు ఎట్లయితే బయటినుంచీ వచ్చి అధికారం చలాయించిండ్రో, వీండ్లుకూడ అంతే. వీండ్ల ఇండ్ల పేర్లు ప్రత్యేకంగ వుంటయి. సిద్దిఖీ వగైరా. అరబ్‌దేశం నుంచీ వచ్చీ ఇరవై తరాలైన, గొప్పగా 'మేం సీదా అరేబియానుంచీ వచ్చినవాండ్లం అని చెప్పుకుంటూ "ఇక్కడి వాళ్ళకి మా వుచ్చారణ ఏమొస్తది, ఏం మాట్లాడుతరు?" అని ఈసడిస్తరు-బెజవాడవాండ్లు, సర్కారుజిల్లాలవాండ్లు మమ్మల్ని "మీకు తెలుగేం ఒస్తుంది?" అన్నట్టు. వీడు తెలుగు రాదంటడు, వాడు ఉర్దూరాదంటడు, మరోడు ఇంగ్లీషు రాదంటడు. మరి మనకొచ్చేదేమిటని ప్రశ్న.

*కాళోజీ నారాయణ రావు (1914-2002), కవి, స్వాతంత్ర్య సమరయోధుడు, మేధావి. పద్మవిభూషణ్ గ్రహీత.*

*'ఇదీ నా గొడవ' పుస్తకం నుండి పే.15-17, స్వేచ్ఛాసాహితీ ప్రచురణ 1995*

# గుర్తింపును నిర్మించుకునే క్రమంలో...

■ జూపాక సుభద్ర

సింగరేణి కాలరీస్‌లో మా ఇళ్ళ పక్కనే ప్రైమరీ స్కూలు 4వ తరగతి దాకా ఉండేది. రెండు గదుల్లో నాలుగు క్లాసులు జరిగేవి. అది తడ్కలతో కట్టింది గనక అందరూ దాన్ని తడ్కల బడి అనేటోల్లు. మాకున్న ఒకే ఒక్క సారు నాలుగు క్లాసులకు పాఠాలు చెప్పేవాడు. ఒక్కొక్క క్లాసుకు వారానికి రెండు పాఠాలు జరిగితే మహా ఎక్కువ. వారంలో జరిగే రెండు క్లాసులు మినహా మిగతా టైమంతా మగ పిల్లలు సెరువుల్లో యీతలకు, పరికి పండ్లకు, రేగ్గాయలకు సెట్లల్లకు, సైకిలు తొక్కనీకి గ్రౌండ్లకు పోయేవాల్లు. కాని మా ఆడపిల్లలం బొమ్మరిల్లాటలు, గురుగులాటలు, బొమ్మల పెండ్లిలాటలు, సిన్న సిన్న ఏటువలతో నీల్లుమోసుడు, గిన్నెలు తోమడం, వాకిలూడ్చే పనులు చేసేటోల్లం. మాక్కూడా దోస్తులతోని సెరువుకు బోయి యీతకొట్టాలని, చెట్లెక్కాలని, పండ్లు తెచ్చుకోవాలని, సైకిలు తొక్కాలని చాలా కోరికగా ఉండేది. ఒకసారి దొంగతనంగా నేను, మా దోస్తు గ్రౌండులో సైకిలు తొక్కితే, అది బైటబడి మా అన్నలతోని చావుదెబ్బలు తిన్నాము. ఈ మొగ పోరగాండ్లను గాలికి వదిలేసినట్లు మా ఆడపోరగాండ్లను గూడ వదిలేస్తే వాళ్ల తాత సొమ్మేంబోయేదనిపిచ్చేది.

నాల్గవ తరగతి వరకు చెప్పీ చెప్పని, వినీ వినని పాఠాలతో, చదివీ చదవని పరీక్షలతో బయటపడిన తరువాత మా ఇండ్లకు రెండు కిలోమీటర్ల దూరమున్న హైస్కూల్‌లో చేర్పించిండ్రు. నాల్గో తరగతి దాకా చదివిన పది, పదిహేను మంది నా క్లాసు ఆడపిల్లల్లో ముగ్గురం మాత్రమే కొత్త స్కూల్లో హైస్కూల్లో చేరినాము. ఆ స్కూలు ఊరు, వాడకు దూరంగా ఆఫీసర్ల కాలనీ మధ్యలో ఉండేది. సింగరేణి బొగ్గు బావులు తవ్వే కార్మికుల పిల్లలు అక్షరాన్ని అందుకోవాలంటే రోజూ నాలుగు కిలోమీటర్ల దూరం నడవాల్సి వచ్చేది. ఆఫీసర్ల కాలనీ వాళ్ళు, మా స్కూలు టీచర్లు, ఆ కాలనీ పిల్లలు 'అండీ', 'గారు' అని ప్రతి మాటకు వాడేవారు. ఆ పదాలు నాకు కొత్తగా వింతగా అనిపించేది. వాటిని పట్టుకోవాలని ప్రయత్నించాను కాని నా భాషకు ఇప్పటి వరకు అతకలేదు.

ఆంధ్ర వంటలు, తెలుగు వంటల్లో దద్దోజనం, ఆవడ, గోంగూర, పూతరేకులు, బొబ్బట్లు, ఇడ్లీ, దోశ లాంటివన్నీ టీచర్ చెప్పే పాఠాల్లో వినుడే గాని అవెట్లుంటాయో తెల్వకపోయేది. మరి మా పల్లెల్లో, మా ప్రాంతంలో వండుకునే ఉల్లిగడ్డల కూర, పచ్చిపులుసు, సింతపండు తొక్కు, చాపల కూర, బొక్కల సోరువ, వంకాయ వట్టిచాపలు, సియ్యల కూరలు, బెల్లంబువ్వ, పాశంబువ్వ, బెల్లపప్పులు, రొట్టెలు, కుడుములు, పేలాలు, గుడాలు...వాటి రుచి తెలుగు వంటల్లో ఎందుకు చేరలేదు? ఇక నోరు తిరగని, అలవాటు లేని సుబ్రహ్మణ్యం, మీనాక్షి, పంకజం, సుబ్బారావు, గాయత్రి, పద్మానాభశాస్త్రి లాంటి పేర్లే గానీ మాకలవాటైన మా ప్రాంతపు ఎల్లమ్మ, మల్లన్న, సమ్మక్క, సారక్క, లింగయ్య, ఐలయ్య, కొమురయ్య, భద్రక్క, పోశమ్మ, ఉప్పలమ్మ పేర్లు నేను చదివే పుస్తకాలల్లుంటే బాగుండేదనుకునేది. ఆకరికి మా దేవుల్లు గూడ పుస్తకాలల్ల, సినిమాలల్ల కనబడకుంట, రేడియలల్ల వినబడకుండా ఉండేది. రామేశుడు, బద్దిపోశమ్మ, కట్టమైసమ్మ, కొమురెల్లి దేవుడు, మల్లన్న దేవుడు, సమ్మక్క, సారక్క, పోశవ్వ, ఉప్పలమ్మ దేవుల్లు మా పుస్తకాలల్లుంటే వాళ్లకు నెమలీకలు బెట్టి మొక్కుకుంటే మంచిగుండేదనుకొనేది. సదువు బాగొస్తదనుకునేది.

ఇక ఆంధ్రప్రదేశ్ భౌగోళిక చరిత్రలో నదుల ప్రస్తావనొచ్చి కృష్ణ, గోదావరి, పెన్నా, తుంగభద్ర నదులున్నాయని చదూకున్నపుడు, మరి మా ఊరు పక్కనుంచి చాలా ఉుళ్లపొంటి పెద్దగా పారే మా 'గంగ' పేరు లేదేంది? అదే టీచర్నడిగితే 'గంగేంటి గంగా అది వారనాసిలో ఉంటది, నోర్మూసుకొని కూర్చో' అన్నది చాలా కసురుకొంటూ. స్పష్టత కోసం పడే నా ఉత్సాహాన్ని కూడా నోర్మూయించింది. కాని మా మంచిరాల 'గంగే' గోదావరి నది. నాకప్పటి వరకూ, యింకా చాలా రోజుల వరకే తెల్వలేదు. ఇట్లా నా చదువంతా నాకు, నా కుటుంబానికి, నా పరిసరాలకు సంబంధించని, సామరస్యంలేని, సామ్యంలేని, సమన్వయం కాని, అలవాటులేని, అలవికాని పేర్లని, పదాలని గుర్తు పెట్టుకోవడానికి, తిరిగి అవి పేపరు మీద పెట్టడానికే నా బాల్యపు శక్తియుక్తులన్నీ ధారపోశాను.

*22-12-2003 ఆంధ్రజ్యోతిలో వచ్చిన, 'గుర్తింపును నిర్మించుకునే క్రమంలో...' వ్యాసం నుండి.*
*జూపాక సుభద్ర ప్రముఖ తెలంగాణా, దళిత స్త్రీవాద రచయిత్రి, కవి.*









# ఉద్యమానికి ఊపిరైన భాష

■ సంగిశెట్టి శ్రీనివాస్

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం 'తెలంగాణ అస్తిత్వా'న్ని నిలుపుకునేందుకు భాషను వాహికగా వాడుకుంది. భాషా అస్తిత్వంలోనే సాంస్కృతిక అస్తిత్వముంది. సాంస్కృతిక అస్తిత్వ స్ఫూర్తితో రాజకీయ ఉద్యమాలు నడిచాయి. ఇదే చివరికి రాష్ట్ర సాధనకు పునాది అయింది. రాష్ట్ర సాధన కల సాకారం కావడానికి కవులు, రచయితలు, ప్రజలు నిత్య జీవితంలో ఉపయోగించే భాషను, సామెతలను, హాస్యాన్ని, వ్యంగ్యాన్ని, ఆగ్రహాన్ని కవిత్వీకరించింద్రు. తాము సదువుకున్న పుస్తకభాషను పక్కనబెట్టి 'సోయి'తో సామాన్య జనాల మాటల్లో తమ మూలాలు వెతుక్కుంద్రు. మట్టి పరిమళాలను తమ గళాల్లో పలికించింద్రు. కవులు, కళాకారులు, ఉద్యమకారులు యేండ్ల నుంచి చెబుతున్న విషయాలకు రాజకీయ కోణం జత కావడంతో పత్రికల్లో అవి పతాక శీర్షికలయ్యాయి.

నిజానికి తెలంగాణ భాష విశిష్టమైంది. వ్యాకరణ బద్ధమైంది. తెలంగాణలో 'గ్యాసు నూనె' అంటే ఆంధ్రలో కిరసనాయిలు అంటరు. కిరసనాయిలు పదంలో అసలు తెలుగే లేదు. గ్యాసునూనెలో కనీసం 'నూనె' అయినా ఉంది. కాళోజి చెప్పినట్టు వాళ్ళకు రోడ్డంటె కరెక్ట్. సడక్ అంటె తప్పు. తెలంగాణ వారికి తెలుగు రాదు అనే పూర్వ నిశ్చితాభిప్రాయంలో ఉన్న వాండ్లు ప్రముఖ సాహితీవేత్త దేవులపల్లి రామానుజరావు లాంటి వారు విజయవాడలో ఉపన్యాసమిస్తే 'అరె మీరు తెలుగు చాలా బాగా మాట్లాడుతున్నారే!' అని ఆశ్చర్యం ప్రకటించారట.

అయితే కొంతమంది తెలంగాణ వాండ్లు భాషను సులభం చేసే బదులు మరింత కఠినం జేసింద్రు. ఉద్యమ సందర్భంలో కొంత మంది తమ పుస్తకాల్లో ఉచ్ఛారణ భాషను ఉన్నదున్నట్లుగ రాసింద్రు. వేముల ఎల్లయ్య రాసిన కక్క, సిద్ధి నవలలు దళిత జీవితాన్ని ఉచ్ఛారణ భాషలోనే రికార్డు చేసిండు. దీనివల్ల భాష 'గొట్టు'గయ్యింది. ఉచ్ఛారణ పదాలు ఎక్కువ మందికి సులభంగా అర్థమయ్యే విధంగా ఉన్నట్లయితే గానీ అది పుస్తకాన్ని చదివించదు. ఇంగ్లీషులో మాదిరిగా ఉచ్ఛారణకు ప్రత్యేక పుస్తకాలున్నట్లుగానే తెలుగుకు కూడా అట్లాంటి పుస్తకాలు అందుబాటులోకి వస్తేగానీ ఈ 'ఉచ్ఛారణ భాష' అర్థం కాదు. పుస్తక ప్రియులతో పాటు పాఠశాల విద్యార్థులు ఇలాంటి అవస్థలే ఎదుర్కొంటుంద్రు.

తెలంగాణ విద్యార్థులు పుస్తకంలో ప్రామాణిక భాష పేరిట ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల భాష చదువుకుంద్రు. అది తెలంగాణ వారికి పరాయి భాషే. ఈ పుస్తకాన్ని బోధించే ఉపాధ్యాయుడు కూడా సగం సగం మాత్రమే ప్రామాణిక భాషకు అలవాటు పడడంతో ఇంకా చెప్పాలంటే తాను నేర్చుకున్న పండిత భాషలో చెప్పడానికి ప్రయత్నిస్తాడు. దీంతో విద్యార్థి గందరగోళానికి గురయ్యే ప్రమాదముంది. పంతులు ఇంట్లో మాట్లాడుకునే భాష ఒకటి. పాఠశాలలో బోధించేది ఒకటి. విద్యార్థి ఈ రెండింటిని సమన్వయం చేసుకుంటూ తనకు తెలిసింది పరీక్షల్లో జవాబుగా రాసినట్లయితే దానికి కచ్చితంగా మార్కులొస్తాయనే గ్యారంటీ లేదు. ఉచ్ఛారణ భాషకు, పుస్తక భాషకు, బోధన భాషకు బలమైన లంకె ఏర్పడితేగాని దానికి శాశ్వతత్వం రాదు.

విద్యా, ఉద్యోగ స్థాయిని బట్టికూడా భాష మారుతుంది. ఇంకా చెప్పాలంటే కులాన్ని బట్టి, జెండర్‌ని బట్టి కూడా ఈ మార్పులుంటాయి. అయితే ఈ తేడాల్ని కేవలం తెలంగాణకే వర్తింప జేస్తూ ఇక్కడి భాషను 'మాండలికం'గా తీర్పులిచ్చింద్రు కొంత మంది మేధావులు. సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, బిరుదురాజు రామరాజు, సామల సదాశివ, యశోదారెడ్డి, రవ్వాశ్రీహరి లాంటి తెలంగాణ పండితులు పక్కా 'తెలంగాణ భాష'లోనే మాట్లాడింద్రు. బోధన చేసింద్రు. రాసింద్రు. బిరుదురాజు రామరాజు లాంటి వాండ్లు 'తంతెలు' అని పుస్తకాల్లో రాస్తే పత్రికల్లో చర్చలు చేస్తూ 'మెట్లు' అని రాయాలని ఆయనకు బోధ చేసింద్రు. అయినా బిరుదురాజు తన తెలంగాణ తనాన్ని మార్చుకోలె. తెలంగాణ భాషలోనె పుస్తకాలు కూడా రాసింద్రు.

ఇప్పటికీ తెలంగాణ తెలుగును 'మాండలికం'గా ముద్దరేస్తుంద్రు. తౌరాక్యాంధ్రము అని నిరసనకు దిగింద్రు. ఈసడింపుకు గురైన ఈ ప్రాంత భాష మాధుర్యాన్ని గుర్తిస్తూ ఆంధ్ర ప్రాంతం వారే తమ నిత్యజీవితంలో ఉర్దూ పదాలు ఎక్కువ వాడతారని తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ కొన్ని వందల సభల్లో చెప్పిండు. దీనికి ఉదాహరణగా ఆంధ్రప్రాంతంలోని పత్రికలు శీర్షికలుగా పెట్టిన 'జైలు నుంచి ఖైదీ పరార్' లాంటివి ఎత్తి చూపిండు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం 1986-87 నుంచి మళ్లీ పాణం పోసుకున్నా ఉద్యమానికి అంతకు ముందు ఏ తెలంగాణ నాయకుడు ఇవ్వని ఊపు, చూపు ఇచ్చింది కె.చంద్రశేఖరరావు. ఉపన్యాసాల్లో, పత్రికా విలేకరుల సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కె.చంద్రశేఖరరావు ప్రయత్న పూర్వకంగానే తెలంగాణ భాషలో మాట్లాడిండు. కేవలం మాట్లాడటమే కాదు ఈ ప్రాంతంలో వాడుకలో ఉన్న సామెతలు, శాత్రాల్ని, పొడుపుకథల్ని తాను చెప్పే విషయం సునాయసంగా ప్రజలకు చేరవేయడానికి వాహికగా ఆయన ఎంచుకుండు. కొన్ని కొన్ని సార్లు ఈ యవ్వారం ఆయనకు తంటాలు కూడా తీసుకొచ్చింది. ఒక సందర్భంలో తెలుగుదేశం నాయకుడు దేవేందర్ గౌడ్‌ని విమర్శిస్తూ 'ఏబూషి'గాడిలాగా అంటూ మాట్లాడిండు. అయితే పత్రికా విలేకరులకు ఈ పదం అర్థం తెలియక పోవడంతో తామే సొంతంగా 'ఏబీసీ' గాడు (రిజర్వేషన్లు పొందే, ఇంకా చెప్పాలంటే బీసీ కులస్తుడిగా) అంటూ వ్యాఖ్యానించాయి. 'ఏబూషీ'లు తెలంగాణలో ఒక తెగ అనే విషయం జర్నలిస్టులకు తెలియదు. తెలుగు సాహిత్యంపైనే గాకుండా భాషపై కూడా పూర్తి పట్టు ఉండటంతో కేసీఆర్ మాటలకు అన్ని ప్రాంతాల్లో 'బాగా మాట్లాడుతాడు' అనే ఆమోదం లభించింది. ప్రజలు తమ నిత్యజీవితంలో, వివిధ వ్యవహారాల్లో వాడే భాషనే పత్రికల్లో మరీ ముఖ్యంగా టీవీల్లో రావడంతో ప్రజల్ని విపరీతంగా ప్రభావితం చేసింది. కేసీఆర్ చెప్పే మాటలు వినిపించుకునేలా, పట్టించుకునేలా చేసింది.

ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత తెలంగాణ భాషలో రాయడానికి సాహితీవేత్తలు చాలా కాలం వరకు సంశయించారు. అంటే అధికారం అనేది ఇక్కడి ప్రజల వాడుక, వేడుక భాషను కూడా శాసించింది. అయితే ఈ పరిస్థితి 1969 ప్రత్యేక తెలంగాణ నాటికి కొంత మారింది. కాళోజి ఒక్కడు ఎప్పటికీ ఒక్క తీరుగనే ఎక్కువ భాగం తెలంగాణ భాషను కన్సిస్టెంట్‌గా వాడిండు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కాలంలో పంచరెడ్డి లక్ష్మణ 'యిసిత్రం' కవిత్వం, దేవరాజు మహారాజు కవిత్వం 'గుడిసె గుండె', విద్యాసాగర్ కథలు పూర్తిగా తెలంగాణ భాషలో వెలువడి

సంచలనం సృష్టించాయి. తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎన్.గోపి ఎన్కటి నుంచి ప్రయత్న పూర్వకంగా తన కవిత్వానికి 'తంగెడుపూలు', 'కుదురు' 'ఎండపొడ' లాంటి పాపులర్ తెలంగాణ పేర్లు పెట్టిండు. సామల సదాశివ గారు చనిపోయే వరకు 'తెలంగాణ భాష' మాధుర్యాన్ని వొదులలేదు. 'సృజన' పత్రికలో ఐలయ్య లాంటి వ్యక్తులు తెలంగాణ భాషలోనే రాసిండ్రు. ఇదే ఒరవడిని 1990 తర్వాత ఒకరిద్దరు మినహా తెలంగాణ కవులందరూ కొనసాగించారు. ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. టి.కృష్ణమూర్తి యాదవ్ వెలువరించిన 'తొక్కుడు బండ' పక్కా తెలంగాణ భాషలో ఉంది. 'పొక్కిలి' తెలంగాణ ఉద్యమంలో వచ్చిన తొలి సంకలనం. దీని పేరే ఒక సంచలనమయ్యింది. అలాగే ఉద్యమం ఊపందుకున్న తర్వాత వేముగంటి మురళి తదితరులు వేసిన 'మునుం' నిజంగనే 'తొవ్వ' చూపింది. వ్యక్తులుగా అన్నవరం దేవేందర్ కృషి ఎన్నదగింది.

కవులు తమ పుస్తకాలకు కొన్ని వందల, వేల సంఖ్యలో తెలంగాణ పదాలు పెట్టుకుండ్రు. తెలంగాణ కవి, చరిత్రకారుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి తన సాహిత్య పరిశోధన గ్రంథానికి 'ముంగిలి', కవిత్వానికి 'దాలి' సంకలనానికి 'మత్తడి', వ్యాసాలకు 'గనుమ'అని పేర్లు పెట్టడం ద్వారా తెలంగాణ అస్తిత్వాన్ని చాటి చెప్పిండు. 'సింగిడి' పేరిట రచయితల సంఘమే ఏర్పడింది. ఇట్లా ఉద్యమస్ఫూర్తి ఉన్న ప్రతి ఒక్కరూ తమ 'తెలంగాణ తనం' కనబడే విధంగా కవితలకు శీర్షికల్ని పెట్టిండ్రు. ఒకానొక సమయంలో 'సోయి' పత్రిక ఈ వ్యక్తీకరణలకు వేదికయ్యింది. ఈ పత్రిక తీసుకొచ్చిన తెలంగాణ రచయితల సంఘం వివిధ ప్రాంతాల్లో సభలు న్విహించడం ద్వారా సాహిత్యానికి ప్రచారాన్ని, గౌరవాన్ని రెండింటిని కల్పించింది.

జిల్లా, జిల్లాకు  ఇంకా చెప్పాలంటే ఒకే జిల్లాలోని వివిధ తాలూకాల్లోని ప్రజలు మాట్లాడుకునే భాష ఒక్క తీరుగుండదు. అయితే తెలంగాణలోని పది జిల్లాల్లో ఎక్కువ మంది మాట్లాడుకునే/ ఎక్కువ మందికి అర్థమయ్యే భాషను ప్రాథమికంగా 'ప్రామాణిక' భాషగా అంగీకరించవచ్చు. దీనికి నిరంతరం కొత్త పదాలు, పదబంధాలు వచ్చి చేరుతూ ఉంటాయి.

ఇందులో భాగంగానే తెలంగాణ పద(బంధ)కోశం వెలువడింది. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితోనే నలిమెల భాస్కర్ ఈ 'తెలంగాణ పదకోశం' పుస్తకాన్ని 2003లో తీసుకొచ్చిండు. విస్మరణకు గురైన దాదాపు ఏడువేల పదాలను ఏరి ఒక ప్రాథమికమైన సమాచారాన్ని 'ఉద్యమావసరాల'కోసం వెలువరించిండు. నలిమెల భాస్కర్ చెప్పుకున్నట్టుగా ఇందులో మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లా ప్రజల వాడుకలో ఉన్న పదాలకు పెద్దగా చోటు దొరుకలేదు. ఉదాహరణకు నల్లగొండలో నల్లతేలుని ఇంగిలీకం అంటరు. ఆ పదానికి ఇందులో అర్థం లేదు. భాస్కర్ గారు ఆయనకున్న అనేకానేక పరిమితుల్లోంచి పదకోశాన్ని వెలువరించాడు. ఇది దారి చూపింది. దీన్ని కొనసాగిస్తూ పూర్తిగా అకడెమిక్‌గా కొత్తది రూపొందించాలి. ఇందుకు గాను రవ్వాశ్రీహరి లాంటి పండితుల నేతృత్వంలో ఒక కమిటీని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. ఈ పరంపర ఇలాగే కొనసాగి మరుగున పడ్డ తెలంగాణ పదాలన్నీ వాడుకలోకి వచ్చినట్లయితే ఎంత కఠినమైన విషయాన్నైనా సునాయసంగా చెప్పడానికి మార్గమేర్పడుతుంది.

*సంగిశెట్టి శ్రీనివాస్ తెలంగాణా హిస్టరీ సొసైటీ వ్యవస్థాపక సభ్యులు. తెలంగాణా సంస్కృతి, సాహిత్యం, చరిత్రపై అనేక రచనలు చేసారు.*



# తెలంగాణా, తెలుగు సినిమా భాషా రాజకీయాలు

■ సత్యప్రకాశ్ ఎలవర్తి, వంశీ వేమిరెడ్డి

**పరిచయం:** తెలుగు సినిమాలో అంతర్భాగమైన భాషా రాజకీయాలను ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఉద్యమం ముందుకు తీసుకొచ్చింది. కోస్తా ఆంధ్రుల ఆధిపత్యంలో ఉన్న తెలుగు సినిమాల్లో తెలంగాణా మాండలికం, సంస్కృతులు తక్కువ చేసి చూడబడటం ఈ ఉద్యమంలో భాగంగా తెలంగాణా కార్యకర్తల క్రియాశీలక పరిశీలనకు గురైంది. తెలుగు సినీ పరిశ్రమపైన అన్నిటికంటె ముఖ్యమైన విమర్శ, దీనికి తెలంగాణా సంస్కృతి పట్ల ఉన్న తేలిక భావం(లోకువగా చూడటం). తెలంగాణా మాండలికాన్ని, సంస్కృతిని హేళన చేస్తూ తక్కువగా చూపించిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. కొన్ని తెలుగు సినిమాలలో పాత్రల స్వభావాన్ని హేళన చేయటానికి తెలంగాణా మాండలికాన్ని సాధనంగా వాడుకున్నారు. ఈ ధోరణి 1990 తరువాత విడుదలైన సినిమాలు, జయమ్ము నిశ్చయమ్మురా (1990), మొండి మొగుడు పెంకి పెళ్ళాం (1991) లలో స్పష్టంగా కనిపించింది. ఈ కాలంలోనే ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి హైదరాబాద్ నగరానికి వలసలు పెరగటం, తెలుగు సినీ పరిశ్రమ మద్రాసు నుండి హైదరాబాద్‌కు బదిలీ కావటం జరిగాయి. సీమాంధ్ర ప్రాంతాల నుండి పెరుగుతూ వస్తున్న జనాభాలో, తమ యాసను వాడుకోవటం, నిలబెట్టు కోవటం పట్ల ఉన్న ఆకాంక్ష జటిలమైన పరిస్థితులను సృష్టించింది.

1994లో అప్పటి ఎన్.టి.రామారావు ప్రభుత్వం ఇచ్చిన మద్దతుతో పూర్తిగా హైదరాబాద్‌కు తరలి వచ్చిన తెలుగు సినీ పరిశ్రమ, తెలంగాణాను సాంస్కృతికంగా భిన్నమైన ప్రాంతంగా చూడటం మొదలు పెట్టింది. సినిమా పరంగా చూస్తే తెలుగు సినిమా తెలంగాణాను భౌగోళికంగా, సాంస్కృతికంగా, భాషరీత్యా ఒక భిన్నమైన తావుగా పరిగణించింది. ఈ క్రమంలో, సాంస్కృతిక అధ్యయన సైద్ధాంతికుడు స్టువార్ట్ హాల్ (వేరే సందర్భంలో) చెప్పినట్లు, తెలంగాణా పట్ల "భిన్నత్వం పట్ల ఏర్పడే మోజు"తో మొదలై తరువాతి కాలంలో ఈ ప్రాంతాన్ని, మాండలికాన్ని, సంస్కృతిని ఒకే మూసలో చూడటం మొదలైంది. తరువాత దశాబ్ధాల కాలంలో, సినిమా తెరపైన తెలంగాణాను సాంస్కృతికంగా, భాష రీత్యా "వేరు చేసి" చిత్రీకరించడం జరిగింది. తెలుగు సినిమాలు, ఎప్పటి నుంచో కోస్తా ఆంధ్ర ముఖ్యంగా కృష్ణా, గోదావరి యాసను ప్రామాణిక భాషగా భావిస్తూ వచ్చి, తెలంగాణాతో సహా, ఇతర ప్రాంతాల మాండలికాలను ఉపేక్షించాయి. అయితే 90లలో తెలంగాణా యాసను లోకువగా చూడటం మొదలు పెట్టేదాకా, సాంస్కృతి మరియు భాష ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశాలుగా రాజకీయీకరింపబడలేదు. ఆ తరువాత ఇది అస్తిత్వానికి, ఆత్మ నిశ్చయానికి ప్రతీకగా మారింది. ఈ దశలో, తెలంగాణా మాండలికం 'కేవలం భాష'కు సంబంధించిన విషయంగా కాకుండా అస్తిత్వానికి, ప్రాతినిధ్యానికీ సంబంధించిన అంశంగా మారింది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉధృతం కావటంతో, తెలంగాణా ఉద్యమకారులు, తమ మాండలికాన్ని అస్థిత్వంగా మార్చుకొని ప్రసార మాధ్యమ పరిశ్రమ, సినిమాల ద్వారా ప్రచారం అవుతున్న అసత్యపు తెలుగు ప్రామాణికత, ఏక శిలా సదృశతీరులను (Monolithic) ప్రతిఘటించే ధోరణిలో ముందుకు వెళ్ళడం జరిగింది.

**90లలో తెలుగు సినిమాలో తెలంగాణా మాండలికం:**
ఇంతకు ముందు చెప్పినట్లుగా, తెలంగాణా మాండలికాన్ని, సంస్కృతిని, ఒకే మూసలో పోసి, "వేరుగా"(మనకంటే 'భిన్నమైనదిగా)  చిత్రీకరించటం 1990ల తరువాత మొదలైంది. 'జయమ్ము నిశ్చయమ్మురా' అనే సినిమాలో కోట శ్రీనివాసరావు హాస్యం సృష్టించటం కోసం తెలంగాణా మాండలికంలో మాట్లాడుతాడు. ఈ పాత్రకు అందర్నీ పట్టుకొని సినిమా కథలు తెలంగాణా మాండలికంలో చెప్పే అలవాటుంటుంది. అయితే, ఈ సినిమాలో ఆసక్తికరమైన విషయమేమిటంటే ఈ పాత్ర తప్ప ఇంకెవ్వరు చివరకి అతడి కొడుకు కూడా తెలంగాణా భాషలో మాట్లాడరు. మిగిలిన పాత్రలన్నీ ప్రజామోదమున్న కోస్తా ఆంధ్రా యాసలో మాట్లాడుతాయి. అంతే కాకుండా, ఈ పాత్ర డైలాగు చెప్తున్న ప్రతిసారీ గాడిద ఓండ్ర పెట్టటం నేపథ్యంగా వినిపించటం హాస్యానికి తోడైంది. ఇది 'తెలంగాణా భాష, గాడిద పెట్టే ఓండ్రం లాగా ఉంటుంది' అని ధ్వనింపచేయటమే కదా! మొండి మొగుడు పెంకి పెళ్ళాం అనే మరో సినిమాలో నటి విజయశాంతి ఒక పోలీసు అధికారి భార్య పాత్రను పోషిస్తుంది. తెలంగాణా మాండలికంలో మాట్లాడుతూ నలుగురిలో ఎలా ప్రవర్తించాలో తెలియని గృహిణి పాత్ర అది. ఆ పాత్ర తప్ప సినిమాలో మరే ప్రధాన పాత్ర తెలంగాణా మాండలికంలో మాట్లాడదు. ఆమె ప్రవర్తన, భాషను, వేళాకోళానికి గురి చేసి సినిమాలో హాస్యం సృష్టించటం కోసం వాడుకున్నారు. పోలీసు అధికారైన ఆమె భర్త ఆమె పట్ల ప్రేమ ఉన్నప్పటికీ ఆమె మాట్లాడే భాష తనకు అవమానంగా భావించి, తన సహోద్యోగుల ఎదుట, స్నేహితుల ఎదుట, ఆమె మాట్లాడకుండా ఉండే విధంగా జాగ్రత్త పడతాడు. మొదటి సీనులో ఆమె తన సహోద్యోగి సమక్షంలో మాట్లాడినప్పుడు ఇబ్బందిగా భావించి ఆమె 'తెలంగాణా మాండలికం' అనే అంశంపై పరిశోధన చేస్తోంది అని కప్పిపుచ్చటానికి ప్రయత్నం చేస్తాడు. రెండు రాష్ట్రాలూ విడిపోవటానికి కొన్ని నెలల ముందు కూడ, ఆంధ్ర రాజకీయవేత్తలు, సమైక్య రాష్ట్రాన్ని సమర్థించేవాళ్ళు, రెండు రాష్ట్రాల మధ్య వివాదాన్ని భార్యా భర్తల మధ్య వివాదంతో పోలిక పెడ్తూ, దీనిని తీర్చటానికి బయటవారి ప్రమేయం అనవసరం అని మాట్లాడారు. ఒక ప్రాంతం మరొక ప్రాంతాన్ని తనకు అవమానకరంగా భావిస్తూ, ఆ ప్రాంతాన్ని తన ప్రమాణాల కనుగుణంగా సంస్కరించాలని భావించే విచిత్రమైన ఆలోచనావిధానాన్ని ఈ సినిమాలో చూడవచ్చు.

ఈ రెండు సినిమాలు భాష ద్వారా తెలంగాణాను ఇతర ప్రాంతాలకు మొదటిసారిగా సినిమా రూపంలో పరిచయం చేయటం జరిగింది. వీటిలో పరస్పర విరుద్ధమైన ఆందోళన, దానితోపాటు తమకంటే భిన్నంగా ఉండేవాళ్ళపట్ల వ్యతిరేక వైఖరి స్పష్టంగా కనిపిస్తాయి. ఇదే ధోరణి వివిధ రకాల ప్రతీకల ద్వారా, సంకేతాల ద్వారా, ఉపమేయాల ద్వారా కనిపిస్తూ, హాస్య ప్రధానమైన పాత్రల నుండి తెలంగాణా యాసతో మాట్లాడే దుర్మార్గపు పాత్రలను సృష్టించటం వరకు వెళ్ళింది. ఈ పరిణామం మనం 'నువ్వు నేను' (2001) సినిమాలో చూడవచ్చు. ఇందులో ఒక ముఖ్యమైన పాత్ర తెలంగాణా యాసలో మాట్లాడుతుంది. నాయిక నాయనమ్మ (తెలంగాణా శకుంతల) నటించిన పాత్ర, తెలంగాణా యాసలో మాట్లాడుతుంది. దీనిలో తెలంగాణా మాండలికాన్ని ఆమె క్రూరమైన, దుర్మార్గమైన స్వభావాన్ని నొక్కి చెప్పటానికి వాడుకున్నారు. ఈ సినిమాలో కూడా నాయిక తండ్రి, నాయనమ్మ తప్ప నాయికతో సహా ఇంక ఏ పాత్రా తెలంగాణా మాండలికంలో మాట్లాడదు. ఇంకా ఎన్నో

సినిమాలు రెండు విపరీత పరస్పర విరుద్ధమైన భావాలను, అంటే హాస్యము, దుష్టత్వము పాత్రల్లో ప్రకటింపచెయ్యటానికి తెలంగాణా మాండలికాన్ని వాడుకున్నారు. 'పరాయివాళ్ళు' అనే ఈ భావనను తెలంగాణా మాండలికం ఆధారంగా నిర్మించడం జరిగింది. ఇంతే కాకుండా, మర్యాద తెలియకపోవటం, లౌక్యంతో కూడిన భాష, భావ ప్రకటన లోపించటం వంటి లక్షణాలను, తెలంగాణా తెలుగు మాట్లాడే పాత్రలకు ఆపాదించటం కూడ చూస్తాము. తెలంగాణా తెలుగుని, సంస్కృతినీ ఈ విధంగా చిత్రీకరించటం ఆంధ్ర సినీ నిర్మాతలు వీటిని తెలుగు భాషా సంస్కృతుల తక్కువ స్థాయి రూపంగా భావించే అభిప్రాయం నుండి ఉద్భవించింది.

**తెలుగు సినిమాలో 'తెలుగు' ను ప్రశ్నించటం:** మామిడి హరికృష్ణ 'నూరేళ్ళ తెరపై తెలంగాణా ఆత్మ' అనే వ్యాసంలో తెలుగు సినిమాలో తెలంగాణా లేనే లేదని వాదిస్తాడు. ఆయన ఉద్దేశ్యంలో, ఒకే భాష మాట్లాడుతున్నప్పటికీ, ప్రధాన స్రవంతి తెలుగు సినిమా తెలంగాణ ఆత్మనుగానీ, సంఘర్షణను గానీ, వైవిధ్యాన్ని గానీ ప్రతిబింబించదు. అంతే కాకుండ, తెలంగాణా జీవనశైలి, పరిస్థితులు సమాంతర సినిమా, ప్రత్యామ్నాయ సినిమాలను ప్రభావితం చేసాయని వాదించాడు. ఉదాహరణకు తెలుగు సినిమాలు కానప్పటికీ, *అంకుర్ (1974), నిశాంత్ (1975), బాజార్ (1982), మండి(1983). సుశ్మన్ (1987), హైదరాబాద్ బ్లూస్ (1998), అంగ్రేజ్ (2005), హైదరాబాద్ నవాబ్స్ (2006)* వంటివి ఈ ప్రాంతం ప్రత్యేకతను, పరిమళాలను ఎలా ప్రతిబింబిస్తాయో చెప్తాడు.

తెలంగాణా ప్రాతినిధ్య ప్రతిపత్తికి, భాషకు సంబంధించిన ప్రశ్నలను సినిమాల విషయంలో మాత్రమే కాక, ఇతర అంశాల విషయంలో (స్థాయిలలో) కూడా తెలంగాణా ఉద్యమం లేవనెత్తింది: పాఠ్యాంశాలలో వివక్షత, ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే సాంస్కృతిక ఉత్సవాలలో తెలుగు భాషల వైవిధ్యాన్ని నిర్లక్ష్యం చేయటం, ఒక రకమైన తెలుగును మాత్రమే పరిపాలనా కార్యకలాపాలకు ఆమోదించటం వంటివి. ఉద్యమకారులు తెలుగు సినిమా పరిశ్రమలోని ఆధిపత్య నిర్మాణాలను, వీటికి సీమాంధ్ర పెత్తందారీ వర్గాలతో నిండి ఉన్న రాజకీయ పాలకులతో వున్న సంబంధాలను ప్రధానంగా వ్యతిరేకించారు. సినీ పరిశ్రమకు అతి తక్కువ ధరకు ముఖ్యమైన ప్రాంతాలలో భూమిని కేటాయించటమే కాక సినిమా నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయటం, తక్కువ వడ్డీకి రుణాలు, పన్ను ప్రోత్సాహకాలు ఇవ్వటం ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు వరుసగా తెలుగు సినీ పరిశ్రమ మద్రాసు నుండి హైదరాబాద్‌కు మారటానికి సహకరించాయి. ఈ సహాయ సహకారాల ద్వారా సీమాంధ్ర సినీ నిర్మాతలు తమ ఆస్తులను ఎన్నో రెట్లు పెంచుకోవటమే కాకుండ, వివక్షత చూపించటం ద్వారా స్థానికులకు సమాన ఉద్యోగ అవకాశాలు నిరాకరించారని తెలంగాణా ఉద్యమకారులు అభిప్రాయపడ్డారు. నమస్తే తెలంగాణా అనే వార్తాపత్రిక, "బొమ్మ బొరుసు" (నవంబరు 2012) అనే శీర్షికతో, తెలుగు సినీ పరిశ్రమలో పెత్తందార్లైన కొన్ని ఆంధ్రా కుటుంబాల పైన ఆరోపణలతో కూడిన వ్యాసాలు ప్రచురించింది. ఈ వ్యాస రచయితల ఉద్దేశ్యంలో, రాజకీయ పక్షాలకు సన్నిహితులైన సినీ తారలు, స్టూడియో యజమానులు, సినిమా పరిశ్రమ ద్వారా కంటే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఎక్కువ సంపాదించారని. హైదరాబాద్‌లో విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి, స్టూడియోల నిర్మాణానికని కేటాయించిన వాటితో ఇతర వ్యాపారాలు చేస్తూ, తిరిగి అవే భూములను తక్కువ ధరకు ప్రభుత్వం స్టూడియో నిర్మాణానికి కేటాయించే విధంగా ఆదేశాలు సంపాదించారని కూడా ఈ వ్యాసాలు ఆరోపించాయి. వీటిలో చేసిన మరో ఆరోపణ ఏమిటంటే వీరికి (సినీ నిర్మాతలు,తారలు) పరిశ్రమలోని కీలకమైన విభాగాల్ని తమ గుప్పిట్లో పెట్టుకోవటం ద్వారా తెలంగాణా సినీ నిర్మాతలు, దర్శకులు, కళాకారుల పట్ల ఉన్న ద్వేషాన్ని అమలుపరుస్తున్నారని.

**తెలుగు సినిమాకు మాండలిక భాష సవాలు :** ఆంధ్రుల ఆధిపత్యంలో ఉన్న ప్రసార మాధ్యమాల చేత రకరకాల అవమానాలకు గురైన మాండలికాన్ని తెలంగాణా ఉద్యమకారులు తమ భావ ప్రకటన మాధ్యమంగా ఎంపిక చేసుకున్నారు. తెలంగాణా ప్రాంతం ప్రజల ethno-aestheticsలో రూపొందించబడిన ఈ మాండలికం ప్రామాణికమైన భాష మాట్లాడే వారిలో అయోమయాన్ని సృష్టించింది. ఉద్యమంలో నిరంతరం వాడబడిన తెలంగాణా మాండలికంలో అనుకూల aesthetic మార్పులు చోటు చేసుకున్నాయి. విద్యార్థులు, సాంస్కృతిక సమూహాలు ఆంధ్రా తెలుగు సంస్కృతి పెత్తందారీతనానికి వ్యతిరేకంగా కొత్త వాదనలు లేవనెత్తారు. ఉద్యమం కొనసాగిన క్రమంలో ఇది ఒక విశిష్టమైన కళగా, చాలా మటుకు పాటల రూపంలో ముందుకు వచ్చింది. వీరు నిర్వహించిన దూమ్‌ధామ్‌లు, ఇతర సాంస్కృతిక ఉత్సవాలు తెలంగాణా మాండలికంలో కొత్త రూపాలు సృష్టించటానికి అవకాశం ఇచ్చాయి. ఈ వేదిక పెద్ద ఎత్తున ప్రతిఘటన సాహిత్యం రావటానికి, మీడియా పరిశ్రమను విశ్లేషణాత్మక విమర్శకు గురి చేయటానికి అవకాశాన్నిచ్చింది. సృజనాత్మకమైన ప్రతిఘటనను ఎదుర్కోవలసి రావటంతో ప్రామాణిక భాష అలసత్వ సంకేతాలను చూపించడం మొదలు పెట్టింది. తెలంగాణాకు చెందిన ప్రింట్, టీవీ, వార్తా సంస్థలు, తెలంగాణా మాండలిక భాషను వాడటం ప్రారంభించటంతో, ప్రామాణిక భాషకు ఆపాదించబడిన శక్తి క్షీణించటం మొదలు పెట్టింది. తెలంగాణా ఉద్యమకారుల దాడులు ఎదుర్కొంటున్న తెలుగు సినీ పరిశ్రమ కూడ ఇదివరకటి ధోరణిని కొనసాగించలేక పోయింది. తమకు సరైన ప్రాతినిధ్యం లభించటంలేదని భావించినప్పుడు, లేదా పరిశ్రమలోని వారు సమైక్యాంధ్రకు మద్దతునిస్తున్నారని భావించినప్పుడు, ఉద్యమకారులు ప్రతిఘటించడం మొదలు పెట్టారు. ఈ ప్రతిఘటన సినిమా రీళ్ళను తగలపెట్టటం, షూటింగ్ స్థలాలలో నటీనటులను గెరావ్ చేయటం, సినిమా థియేటర్లను సినిమా కంపెనీల కార్యాలయాలను ధ్వంసం చేయటం, వ్యక్తుల దిష్టి బొమ్మలను తగలపెట్టటం, పోలీసు కంప్లెయింట్లు దాఖలు చేయటం, ప్రదర్శనలు చేయటం వంటి చర్యల ద్వారా సినిమా పరిశ్రమపైన పెద్ద ఎత్తున వత్తిడి తీసుకువచ్చారు.

ఈ పరిస్థితి సినీ పరిశ్రమ తెలంగాణా మాండలికం, సంస్కృతులను గురించి పునరాలోచన చేయటానికి, వ్యక్తీకరణలో మార్పుకు పురిగొల్పింది. తెలంగాణాను చిత్రీకరించటంలో గుణాత్మకమైన మార్పు, తెలంగాణా కళాకారులకు, కథలకు సూచన మాత్రంగానైనా ప్రాతినిధ్యం ఇవ్వటం పట్ల సుముఖత మొదలైంది. దీని పర్యవసానంగా గతంలో ఎప్పుడూ ఆంధ్రా తెలుగు మాత్రమే మాట్లాడే సినీ హీరోలు, తెరపైన తెలంగాణా తెలుగులో కూడా మాట్లాడటం మొదలు పెట్టారు. హీరో తెలంగాణా ప్రాంతం వాడని సూచించటానికి తగిన కథను తీసుకుంటున్నారు. మొత్తానికి తెలుగు సినిమా తెలంగాణ ఉద్యమ ఒత్తిడికి లొంగక తప్పలేదు. చైతన్యవంతమైన ప్రజల మద్దతుతో కొనసాగిన తెలంగాణా ఉద్యమానికి grand narratives తో కూడిన తెలుగు సినిమా, అతిశయోక్తులతో మాట్లాడే ఆంధ్రా హీరోలు లొంగిపోక తప్పలేదు. తెలుగుదనం (సంస్కృతి, భాష, సౌందర్య రూపాలు) లోని అన్ని భావనలను వినిర్మాణం (deconstruction) చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. మాండలిక భాష కేంద్రంగా లేవనెత్తిన రాజకీయ ప్రతిఘటన, తెలంగాణా ఉద్యమ క్రమంలో కళాత్మకతను సంతరించుకుంది. తెలుగు సినిమా అన్ని రకాలుగా లోపభూయిష్టమనే విషయం స్పష్టమైంది. దాడికి గురైనపుడు తనను గానీ, తాను ప్రాతినిధ్యం వహించే వాటిని గాని సమర్థించుకోలేక పోయింది.

**అనువాదం : పి.మాధవి**

*సత్యప్రకాశ్ హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు.*

*వంశీ వేమిరెడ్డి రూర్కెలా NITలో అధ్యాపకులు*

*మధవి మానవ హక్కుల వేదిక సభ్యురాలు. కామర్స్ లెక్చరర్‌గా రిటైర్ అయ్యారు.*

# దళితులు ఇంగ్లీష్

■ **కంచ ఐలయ్య**

**1960లో** ఒక తేట తెల్లవారుజామున కొత్తగ ఉద్యోగంలో చేరిన సింగిల్ టీచర్ ఒకరు మా ఇంటికొచ్చిన్రు. అప్పుడు నాకు ఎనిమిదేండ్లు. మా అవ్వ అప్పటికే వాకిలి ఊడ్చి, పేడనీళ్ళు కళ్ళాపి చల్లుతుంది. బర్రెల్ని గడ్డి మేపటానికి తీస్కపోయేటందుకు బర్రెల కట్లు ఇప్పుతున్న మా అన్నకి సాయం జేస్తున్న నేను. పదేళ్ళ మా అన్నని, నన్ను స్కూల్‌కి పంపమని అడిగింది టీచర్ మా అవ్వని. అయ్యాల టీచర్‌కి మాయవ్వ చెప్పిన ముచ్చట ఇప్పుడు తల్చుకుంటే మాకందరికి చాలా ఆశ్చర్యమైతది. "అయ్యా, మా పోరగాల్లని సదవనీకి, రాయనీకి బడికి దోల్తే, గా రాక్షసి సరస్వతి మా పోరల్ని సంపుతది. బాపనోళ్లు, కోమటోల్లు మట్టుకే గా పని జెయ్యాల్నంటది గారాక్షసి".

వందల యేండ్లకొద్ది సదువుల దేవత అని జనం కొలిసేటి ఈ సరస్వతి దళితులు ఏ భాషలోనైనా సరే సదవటం, రాయటం నేర్వటానికి వ్యతిరేకంగ ఉన్నది. ఈమె పై కులాలకు, ముఖ్యంగ బాపనోల్లకు, కోమటోల్లకు మాత్రమే సదువుల దేవత. సదువులు నిరాకరించబడిన కింది కులపోల్లు ఈమెని దెయ్యం లెక్క జూస్తరు. వాళ్ళ పిల్లలు బడికి పోతే ఈ దెయ్యం వాళ్ళని సంపుతదని అనుకునేటోల్లు.

మా అక్కచెల్లెల్లనైతే బడికి దోలే సవ్వాలే లేదు గానీ, మా అన్నని, నన్ను బడికి దోల్తుంటె మట్టుకు మా అమ్మమ్మ మా అవ్వతోటి మస్తు కొట్లాడుతుండె. బడికి పోతే మమ్ములను గా సరస్వతి రాక్షసి సంపుతదన్న ముచ్చట గట్టిగ బడ్డది మా అమ్మమ్మ మనసులో. సరస్వతి నుంచి మమ్ముల కాపుగాయమని మా ఊరి దేవత పోచమ్మకి దండం బెట్టుకుంట ఉండేటిది మా అమ్మమ్మ. మేము బడికిబోవుడు షురు జేసిన కొద్ది నెలల్లోపటనే మా అమ్మమ్మ సచ్చిపోయింది – మేం సరస్వతి చేతుల ఖాయంగ సస్తమన్న పరేషానితోటి.

కిందికులపోల్లకి ఉండేటి ఇటువంటి భయాలు తప్పు అని ప్రజాస్వామ్య దేశం నిరూపించింది. ప్రాంతీయ భాషా విద్యలోకి వీళ్ళు పెద్దయెత్తున దూసుకెల్లారు. సంస్కృత విద్యా సరస్వతినే కింది కులపోల్లు ప్రాంతీయ భాషా విద్యకి గూడ దేవతని జేసి సాదుకున్నరు. దేశమ్మొత్తం మీదున్న చాలా మంది స్కూల్ టీచర్లు, వీళ్ళలో ఎక్కవమంది ఓబిసి టీచర్లే. గవర్మెంట్ స్కూల్లల్లో ముస్లింలు, క్రిస్టియన్లు, ఇతర మైనారిటీలు కూడ ఉండొచ్చన్న ముచ్చట పక్కన బెట్టి సరస్వతి బొమ్మను స్కూళ్ళలో పెట్టిన్రు.

చాలా మంది హిందూ టీచర్లు ముస్లింల గురించి, క్రిస్టియన్ల గురించి హ్యూమిలియేట్ చేసే తీర్న మాట్లాడటం అందరికి తెలిసిన వాస్తవమే. మైనారిటీలకు తమకి ఉన్నట్లు సదువుల దేవత లేదు కాబట్టి వీళ్ళ విద్యా విలువలు తక్కువవిగ చూసేటోళ్ళు. దేశమంతటా సరస్వతీ శిశు మందిరాలు వెలిశాయి. పంతొమ్మిదొందల డెబ్బయిల, ఎనభైల దశకాల్లో మాతృభాషా సూత్రాన్ని, భారత దేశ విద్యా దేవతగ సరస్వతిని సొంతం చేసుకున్న విద్యా వ్యవస్థ జాతీయవాద వాణిని సంతరించుకుంది. ఈ జాతీయత ఎంతటి తీవ్రవాద రూపం కలిగి ఉన్నదంటే, సరస్వతి పటాలను స్కూల్లలో, కాలేజీల్లో పెట్టేందుకు వ్యతిరేకించిన సందర్భాల్లో ముష్టి యుద్ధాలు ఎదురయ్యేవి.

రైట్ వింగ్ విద్యార్థి సంఘాలు సరస్వతి చిత్రపటాల్ని విశ్వవిద్యాలయాల్లో డిపార్ట్‌మెంట్లలో పెట్టటం షురు జేసిన్రు. ప్రాంతీయ భాషా విభాగాలు సరస్వతిని విద్యా సంస్కృతికి గుర్తుగ నిలబెట్టిన్రు.

మనది లౌకికవాద రాజ్యాంగమన్న సంగతి విస్మరించి విశ్వ విద్యాలయ అధ్యాపకులు సైతం – ముఖ్యంగ నొసటి మీద కుంకుమ తిలకం కానొచ్చేటట్లు పెట్టుకొనే ప్రాంతీయ భాషా విభాగాల వారు, ఈ 'సరస్వతీ విద్యా' సాంస్కృతిక ప్రమాణానికి వెలుపల పని చేసే వాళ్ళని తక్కువగా చూడటం షురువయింది.

స్కూల్లలో, కాలేజీల్లో, యూనివర్శిటీల్లో మహిళా టీచర్ల సంఖ్య పెరగటంతో దేశంలో సరస్వతి ఒక నడిచే దేవతే అయింది. బుద్ధుడు, జీజస్, మొహమ్మద్, గురు నానక్ వంటి వారి జీవితం మనుషులందరికీ విద్యనందించే దిశగా గడిపినప్పటికీ జాతీయ విద్యా పటం మీద వీళ్ళెప్పుడూ కానరాలేదు.

మెజారిటీ ఓబిసిలు, కొంత మంది దళితులు, ఆదివాసీలు – ప్రాంతీయ విద్యా సెంటర్లలో సరస్వతిని కొలవటం మొదలుపెట్టినప్పటికీ, అసలు పూజ చేసేటి రోజు మాత్రం పూజారి ఆమెతో సంస్కృతంలోనే మాట్లాడ్తడు. శ్లోకాలు వల్లించే పూజారికి తప్ప ఎవరికీ అర్థం కానప్పటికీ సరస్వతి భారతీయ భాషలన్నిటికీ దేవత అయింది.

ఒక పక్క చారిత్రకంగా వెనుకపడిన వాళ్ళు మిధ్యా సరస్వతికి చేరువయ్యామనే తమకొత్త స్థాయిని చూస్కుని సంబరపడుతున్నారు. మరొక పక్క పైకులాల వాళ్ళు. ఆమె అక్క లక్ష్మి (పైసల దేవత) పంచన చేరేటందుకు ఆమె కార్యాచరణ స్థావరాన్ని వలసవాద ఇంగ్లీష్ ప్రపంచానికి మార్చారు. భారత దేశంలో వెనకబడిన తరగతుల ప్రజలకు మాత్రం ఇప్పటి వరకైతే ఈ కొత్త ప్రపంచంలోకి ప్రవేశం లేదు.

ఇటీవలి కాలంలో అన్ని గవర్నమెంట్ స్కూల్లల్లో ఒకటవ తరగతి నుండి ఇంగ్లీష్ బోధన షురు జెయ్యాలనన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం భారత దేశంలోని వెనకబడిన కులాలు ఇంగ్లీష్ విద్య దిశగా ఒక కొత్త అంకంలో అడుగుబెట్టటానికి దోహదపడుతుంది. ఇంగ్లీష్ బోధనలో ఇటువంటి పద్ధతి దళిత–బహుజన మైనారిటి కమ్యూనిటీల పిల్లల్ని కాన్వెంట్ చదువులు చదివే అగ్రకులాల స్థాయికి తీసుకుపోనప్పటికీ భవిష్యత్తులో సమ సమాజవాద విద్య అనే కల సాకారానికి ఒక నూతన ఆరంభం కాగలదు.

ప్రపంచీకరించబడిన భారత దేశానికి అనువైన ఆధునిక విధానానికి తాళం చెవి ఇంగ్లీష్ విద్య. ఇంగ్లీష్‌కి తమ బ్రాహ్మణీయ సంస్కృతికి మధ్య నున్న వైరుధ్యాలను అగ్రకులాలు చాలా జాగ్రత్తగ సంభాళించుకున్నారు.

కానీ కింది కులాలకు ఇంగ్లీష్ బోధించడం అనే వరకు, వారి 'భూమి సంస్కృతి'ని ఇంగ్లీష్ నాశనం చేస్తుందనే సిద్ధాంతం ప్రతిపాదిస్తున్నారు. ఇంగ్లీష్ ప్రాముఖ్యతని గుర్తెరిగిన కేంద్ర ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకుంది.

అంతేకాక, మౌలిక సదుపాయాల విషయంలో, ఇంకా బోధనా పద్ధతుల్లో కూడ ప్రయివేట్ ఇంగ్లీష్ మీడియమ్ స్కూల్లకి, గవర్నమెంట్ స్కూల్లకి మధ్య ఉన్న దూరాన్ని నిర్మూలించే దిశగా తర్వాతి దశ ఉండాలి.

దేశమంతటా భాషకి సంబంధించిన పరిధిలో పబ్లిక్, ప్రయివేట్ స్కూల్లు రెండిటినీ ద్విభాషా సూత్రం కిందకి తెచ్చి, ఏభై శాతం సిలబస్ ఇంగ్లీష్‌లో మిగిలిన సిలబస్ ప్రాంతీయ భాషల్లో బోధించాలి.

*డెక్కన్ హెరాల్డ్ 15 ఫిబ్రవరి, 2011న ఈ వ్యాసం ప్రచురింపడింది.*

**అనువాదం : స్వాతీ మార్గరేట్**

*కంచ ఐలయ్య MANUUలో అధ్యాపకులు. దళిత బహుజన మేధావి, ఉద్యమకారుడు, రచయిత*

*స్వాతీ మార్గరెట్ దళిత స్త్రీవాది, హైదరాబాదులో స్వతంత్ర్య పరిశోధకురాలుగా ఉన్నారు.*

# దళిత దేవత ఇంగ్లీష్‌కు జై!

■ చంద్ర భాన్ ప్రసాద్

హిందూ దేవగణాన్ని ఎదుర్కొనగలిగే దైవం ఎవరైనా ఉన్నారంటే ఆయన లాడ్ బుద్ధ. కానీ ఈయనొక గొప్ప ఫెమినిస్టు కావటం చేత ముగ్గురు అగ్రదేవతలైన సరస్వతి, లక్ష్మి, దుర్గలను తెగనాడలేదు. – వారు చారిత్రకంగా అస్పృశ్యుల పట్ల వివక్ష పాటించారన్నది వాస్తవమైనప్పటికి. ఇక మరి ఎదురులేని ఈ దేవతాత్రయాన్ని, గుట్టులేని వీరి దళిత ద్వేషాన్ని ఎదిరించే లడాయి ఎవరిది? దళితులను వేరు చేయటమన్నదాన్ని హిందు దేవతలు సమర్థిస్తారు. అందుచేత హిందు దేవుళ్ళు, దేవతలు ఇకమీదట తమ భవిష్యత్తుపై ఇటువంటి అదుపాజ్ఞలు పెట్టకుండా ఉండే రోజు కోసం అంటరానితనం బారినపడిన వాళ్ళు ఎల్లప్పుడూ ప్రార్థిస్తూ వచ్చారు. శక్తివంతమైన సరస్వతి–లక్ష్మి–దుర్గ దేవతాత్రయాన్ని ఓడించే ఒక దేవత కోసం దళితులు ఎదురు చూడసాగారు. అంటరానితనమనే దురాచారం హిందూ కుల వ్యవస్థలోని భాగంగా వారు అర్థం చేసుకున్నారు. ఇంగ్లీష్ దేవతకి ఒక్కదానికే కులవ్యవస్థను నాశనం చేసే శక్తిసామర్థ్యాలు ఉన్నాయని వారు క్రమంగా గుర్తెరగటం మొదలుపెట్టారు.

వినాశనకరమైన హిందూ కులవ్యవస్థ వృత్తిస్వచ్ఛత, వంశస్వచ్ఛత అనే కవల సిద్ధాంతాలపై ఆధారపడి ఉండేది. ఒక ఖచ్చితమైన, మార్పు లేని వృత్తి లేకుండా కులం లేదు; అలాగే కులం లేకుండా నిశ్చయమైన మార్పులేని వృత్తి అంటూ లేదు. మనువాద వ్యవస్థలో ఏ ఒక్కరూ తన వృత్తిని మార్చుకోవడానికి వీల్లేదు. అలాగే ఎవరూ తమ కులం వెలుపట పెండ్లి చేసుకోవడానికి వీల్లేదు. చారిత్రకంగా చూస్తే, కులాలు ప్రముఖంగా వృత్తి సమూహాలుగ ఉంటూ వచ్చాయి. అదే విధంగా, అవి వివాహ సమూహాలుగ కూడా ఉంటూ వచ్చాయి. దళితుల మీద రుద్దబడిన వృత్తులు నీచమైనవిగ చెప్పుకోబడ్డాయి. అటువంటి 'నీచమైన' పనులు చేసినందుకు వారు మురికి వారుగా, హీనమైన వారిగా ముద్ర వేయబడ్డారు. అందుచేత, దళితులు ఎవరూ చెయ్యని పనులు చేస్తూ సమాజపుటంచుల్లో బ్రతుకులు వెళ్లదీస్తూ ఉండేవాళ్ళు.

కానీ గత వంద సంవత్సరాల్లో కొన్ని ముఖ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయి. మిలియన్ల కొద్ది దళితులు పరువు ప్రతిష్టలు గల కొలువుల్లో ప్రవేశం పొందారు. ఈ రకంగ విముక్తులైన దళితులే కులాధారిత వృత్తుల సంకెళ్ళను తెగ్గొట్టుకున్నారు. ఒక వ్యక్తి యొక్క కులానికి, తను పుట్టిన కులానికి లంకె లేకుండా పోయినప్పుడే కుల వ్యవస్థ ధ్వంసమవుతుంది.

కులాధారిత వృత్తులను విడిచిపెట్టటాన్ని ఇంగ్లీష్ సులభతరం చేస్తుంది. ఉదాహరణకి ఇంగ్లీష్ మాట్లాడే దళితులని చచ్చిన ఆవుల తోలు ఒలవమని ఎవరైనా అడుగుతారా? ఇంగ్లీష్ మాట్లాడే దళితులు రోడ్లు, మురిక్కాలువలు శుభ్రం చేస్తారని ఎవరైనా ఆశిస్తారా? ఇంగ్లీష్ మాట్లాడే దళితులు భూస్వాముల పొలాల్లో జీతగాళ్ళుగ పనిచేసి సంతృప్తిపడతారా? శతాబ్దాల కొద్దీ పీడనకు గురైన దళితులకు హింస నుండి విముక్తి కలిగించుకొనేలా చేసి సాధికారతనిస్తుంది ఇంగ్లీష్ దేవత.

ఇవాళ గ్లోబల్ విలేజ్ వ్యవహారిక భాష ఇంగ్లీష్. ఇంగ్లీషేతర భాషలు మాట్లాడే ప్రపంచ పౌరులు భారీగ నష్టపోతారు. అందుకే, ఇంగ్లండ్ మొత్తం జనాభా కంటే ఆరు రెట్లు అధికంగా ఉన్న 300 మిలియన్ల చైనా దేశస్థులు ఇంగ్లీష్ నేర్చుకుంటున్నారు. ఇంగ్లీష్ నేర్వటమన్నది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజా ఉద్యమం అయింది.

భారత దేశంలో భాగ్యవంతులైన తల్లిదండ్రులు తమ పిల్లల కోసం తప్పకుండా ఇంగ్లీష్ మీడియమ్ బడి మాత్రమే చూస్తారు. అయినప్పటికీ, ఇండియాలో చాలా మంది ఇంగ్లీష్ నేర్చుకోవాలనే కోరికను ఒప్పుకోవటానికి ఇష్టపడరు. వీరు ఇప్పటికీ ఇంగ్లీష్‌ను పర భాషగానే యెంచుతారు. ఇంగ్లీష్ విద్యా విధానాన్ని భారత దేశంలో నిర్బంధంగా అమలు పరిచిన లాడ్ మెకాలేను చాలా మంది భారతీయులు నీచంగా చూస్తారు. కానీ అతని కారణంగానే 'అంటరానివారు' మొదటిసారిగ విద్యకు నోచుకున్నారు.

ఇంగ్లీష్ పూర్వపు దేశ విద్యా విధానంలో అంటరానివారు విద్యాపరంపరకు వెలుపల ఉంచబడ్డారు. ఈ బడులు దళితులకు ప్రవేశ హక్కులేని దేవాలయాల్లో గానీ, పండితుల ఇళ్ళల్లోగానీ ఎక్కువగ నిర్వహించబడేవి. లాడ్ మెకాలే ఇదంతా మార్చివేశాడు. అందుకే దళితులకు ఇతను పూజ్యనీయుడు.

దళితేతర భారతీయులు ఇంగ్లీష్‌ను, లాడ్ మెకాలేను లక్ష్య పెట్టకపోయినట్లయితే, ఈ భాషను గుత్తాధిపత్యం చేసే హక్కు వారికెక్కడిది?

కాబట్టి ప్రతి దళిత శిశువు పుట్టిన కొన్ని నిమిషాల్లోనే ఇంగ్లీష్ అక్షరమాలనే ఈ కొత్త ప్రపంచపు మొదటి శబ్దాలుగ వింటుంది అని దళితులు నిర్ణయించుకోవాలి. తల్లిదండ్రులు లేదా దగ్గరి బంధువులు ఈ శబ్దాలని బిడ్డ చెవిలో నెమ్మదిగ వినిపించాలి. మరొక బంధువు ఒక నిమిషం పాటు ఇంగ్లీష్ దేవత పటాన్ని అప్పుడే పుట్టిన శిశువు ముందు ఉంచి పట్టుకోవాలి. ప్రతి సంవత్సరం, లాడ్ మెకాలె పుట్టిన రోజయిన అక్టోబర్ 25న దళితులు భగవతి జాగరణ చేస్తారు. ఇంగ్లీష్ దేవతకి... తమ ఇంగ్లీష్ దేవతకి.

*ఈ వ్యాసం డి.ఎన్.ఎ. వెబ్‌సైట్‌లో 28 అక్టోబర్, 2006న వచ్చింది.*

**అనువాదం : స్వాతీ మార్గరేట్**

*చంద్ర భాన్ ప్రసాద్ ప్రముఖ జర్నలిస్టు, మేధావి, వ్యాఖ్యాత*









# దార్శనికత లేని ప్రభుత్వాలు - భాషా సమస్యలు

■ జయధీర్ తిరుమల రావు

తల్లిదండ్రులకన్నా, ఆస్తి తగాదాలకన్నా, దైవదూషణకన్నా భాషా సెంటిమెంట్ మనిషికి ఎక్కువ. అందుకే 'భాష' చుట్టూ యుద్ధాలు, రాజకీయాలు ఆవరించి ఉంటాయి. ఆనాడు సైనికపరంగా, ఈనాడు మిలటరీపరంగా యుద్ధాలు చేసినవారు కేవలం రాజ్యాన్ని కైవసం చేసుకోవడం వరకే పరిమితం కాలేదు. విజేతలు తమ భాషను గెలిచిన దేశాల్లో అమలు అయ్యేట్లు కృషిచేశారు. అరబీ, పారశీకం, డచ్చీ, ఆంగ్లం వంటి పర దేశాల భాషలు, భారతదేశంలోకి అలా వచ్చినవే. వలసవాద దేశాలలో ఆంగ్లాన్ని రుద్ది దాని ప్రభావంతో జాతీయ భాషని, ప్రాంతీయ భాషలన్నింటినీ బలహీనపరచడం జరిగింది. స్వీయశక్తితో ఎదగకుండా పరాధీనతకు లొంగి పోవడం భాష ద్వారానే జరిగింది. బ్రిటిష్ వారు మెకాలే విద్యా సంస్కరణల పేరుతో ఆంగ్లాన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టారు. అప్పటి నుండి ఆంగ్లం యధాతథంగా ఈనాటికీ మనుగడ సాగిస్తూ వచ్చింది. ప్రస్తుతం అమెరికా అగ్రరాజ్యం కనుసన్నల్లో రచించిన గ్లోబలీకరణ, ప్రైవేటీకరణ వంటి వాటిని మన దేశంలో సులభంగా రుద్దడానికి ఆంగ్లభాష కూడా ఒక కారణమే. ఆఫ్రికా దేశాలలో ఆదివాసీ భాషలను చిదిమి ఆంగ్లాన్ని బలవంతంగా వారి నెత్తిన రుద్దారు. వివిధ భాషీయ బానిసలు తెల్లవారికి సేవ చేయాలంటే ఆంగ్లం నేర్చుకోవాలి. తెల్లవాడు ఆదివాసీ భాష నేర్చుకోవడం స్థాయి దిగజారడమే. అందుకే మన పాలకులు కూడా ఆంగ్ల విద్యని అమలు చేస్తారు. పాలకులెప్పుడూ తమ అల్పసంఖ్యాక భాషను బహుసంఖ్యాక ప్రజలపై రుద్దుతారు. భాషకు కూడా బానిసలను తయారుచేసే అద్భుత శక్తి ఉంటుందని కొందరు దేశీయ పాలకులకి తెలియదు. దేశీయ పాలక వర్గం కూడా అగ్రరాజ్యాల సంస్కృతిని, కళలను, ఆహార్యాన్నీ, ఆహారాన్ని అభిమానించినట్లే వారి భాషను కూడా విశ్వాసంతో అనుకరిస్తుంది. పెద్ద దేశాలు ఆధునిక కాలనీలుగా ఇతర దేశాల్ని తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తాయి. డాలర్ నమూనాని అంగీకరించడం అంటే దాని వెనుక ఉన్న భాషా సంస్కృతులను సైతం స్వీకరించడమే. కేవలం బహుళ జాతి పెట్టుబడులకే కాదు దానికి ముందూ వెనకా ఆ సంస్కృతికి ద్వారాలు తెరవాల్సిందే. మనం అనుమతించాల్సిందే. సంస్కృతికి వాహిక భాషే కదా.

అప్పుడప్పుడు మన దేశీయ పాలకులు సైతం అగ్రరాజ్యాల మనస్తత్వంతో జాతీయ భాషని వివిధ ప్రాంతాలలో, రాష్ట్రాలలో పున:ప్రవేశపెట్టాలని ఆలోచిస్తారు. ఆంగ్లానికి పోటీగా హిందీని ప్రచారం చేయాలనే ఆలోచనతో కాక, వివిధ రాష్ట్రాలలోని ప్రాంతీయ భాషలపై పెత్తనం చేయాలనే ఆలోచనతోనే ఇలాంటి ప్రయత్నాలు చేస్తారు. ఇప్పుడు 'అంగ్రేజీ హఠావో' అని ఏ దేశీయ పార్టీ అనదు. దక్షిణాదిలో బలమైన రాష్ట్రాలపై ఉత్తరాది ఆధిపత్యం కొనసాగాలంటే (రాజకీయేతర రంగంలో కూడా) భాష ప్రధానం. అందుకే అప్పుడప్పుడు హిందీ పేరుతో జోక్యం చేసుకుంటారు. ప్రత్యక్షంగా రాజకీయ ప్రమేయంతో కాకుండా భాషా ప్రమేయంతో చొరబాటు ప్రయత్నం చేస్తారు.

భారతదేశంలో ఈ ఆధిపత్యం ఉత్తర భారత భావనగా దక్షిణ, ఈశాన్య భారతాలపై పెత్తనమై కనుపిస్తుంది. హిందీ బాషా సంస్కృతులకు మిగిలిన ప్రాంతాలపై ప్రభావం కలిగేట్లు చేయడమే దీని ఉద్దేశం. భారతదేశంలో చాలా యుద్ధాలు, విదేశీ చొరబాట్లు ఉత్తర భారతదేశంలోంచే జరిగాయి. మొదట విదేశీ భాషలు అక్కడనుండే స్వారీచేయడం ప్రారంభించాయి. కాబట్టి వారికి భాషా పెత్తనం తెలుసు. ఈ పెత్తనాన్ని సాంస్కృతికంగా, మతపరంగా మొదట ప్రవేశపెడతారు. అది రాజకీయ ఆధిపత్యానికి దారితీస్తుంది. అందువల్ల ఎప్పుడూ ఉత్తర భారతం నుండే ఆ దేశాధిపతులు పుట్టుకొస్తారు. గంగా నది పవిత్రత జాతీయ భావన అవుతుంది. కాశీ అత్యున్నత కేంద్రమై, కంచి వివాదాస్పదం అవుతుంది. గంగానదీ నాగరికత, సంస్కృతి భాషాధిపత్యంగా కొనసాగుతుంది. దాని అనువాదాలే ఆది కావ్యాలుగా మారతాయి. స్థానిక / ప్రాంతీయ భాషలలో ఆది కావ్యాలు అజ్ఞాతం అవుతాయి.

అంతర్గతంగా వలస వచ్చి రాజాస్థానాలలో చోటు సంపాదించి బలమైన ప్రాంతీయ భాషలో కాకుండా సంస్కృతీకరించిన మిశ్రమ భాషలో సాహిత్యం వెలువడుతుంది. దేశవ్యాప్తంగా, అన్ని ప్రాంతాలలో ఉత్తర హిందుస్థానీ సంస్కృత కవులే జాతీయ కవులుగా చెలామణి అవుతారు. ఇప్పటి వరకు కూడా అదే సంప్రదాయం కొనసాగుతున్నది. తమిళ భాషలోని సంగం సాహిత్యం, కన్నడ భాషలోని అక్కమహాదేవి అద్భుత వచనాలు, బసవ రచనలు ఇత్యాదులు: తెలుగులో పాలకురికి సోమన, పోతన, వేమన వంటి అనేక మంది కవులకు జాతీయ స్థాయిలో ఎలాంటి స్థానం అందదు. పైగా వారిని దక్షిణ భారతదేశ స్థాయి కవులుగా కూడా గుర్తించరు. ఆయా రాష్ట్రాలకు చెందిన భాషా కవులుగా మాత్రమే వీరిని గుర్తిస్తారు. వీరి రచనల అనువాదాలు పెద్దగా ప్రచారం కావు. బెంగాల్, మరాఠీ వంటి ప్రాంతీయ భాషా సాహిత్యాలు జాతీయ స్థాయిలో గుర్తించబడతాయి. కాని దక్షిణ దేశ సాహిత్యం ఒకటి ఉందని, దానిలో అద్భుతమైన రచనలు ఉన్నాయని అంగీకరించరు.

ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం హిందీ భాషతో రాజకీయ క్రీడ ఆరంభించింది. దాని ఫలితాలు మరో దశాబ్దం తరువాత చూపిస్తాయి. ఆంగ్లాన్ని అంటుకోకుండా, సామ్రాజ్యవాద భాషపై ఈగ వాలనివ్వకుండా హిందీ భాష ప్రాంతీయ భాషలపై ప్రభావం చూపుతుంది. చరిత్రలో ఇలా చాలాసార్లు జరిగింది. ఇప్పుడూ అంతే. కేంద్రంలో ఉన్న ప్రభుత్వంలో దక్షిణాది ప్రభావం తక్కువ. ఉన్నవారు రాజకీయ నాయకులు, రాజకీయ క్రీడాభిమానులు. స్వీయ ప్రయోజనం ముందు రాష్ట్రం, ప్రాంతం (దక్షిణాది) దిగదుడుపే అవుతుంది. దక్షిణాది బలమైన ఐక్యరాజకీయ శక్తిగా ఎదగనంత కాలం రెండోశ్రేణి ప్రాంతంగానే ఉండిపోక తప్పదు. ఈ ప్రాంతంలోని వివిధ ప్రాంతీయ / స్థానిక భాషలు సైతం అణగారిపోక తప్పదు.

తెలుగు భాషాభివృద్ధి కోసం గత శతాబ్దంలో జరిగిన ఉద్యమం ఫలితంగా తెలుగుకి కొంత గౌరవం లభించింది. తత్ఫలితంగా ప్రభుత్వం తెలుగు భాషలో, ఆ భాషాభివృద్ధి కోసం అప్పుడప్పుడు కొన్ని సంస్థలను ఏర్పాటు చేసింది. కానీ వాటిలో కొన్నింటిని ప్రభుత్వమే రద్దు చేసింది. మరి కొన్నింటిని ఇతర సంస్థల్లో కలిపేసింది. సాహిత్య అకాడమిని రద్దు చేసి తెలుగు విశ్వవిద్యాలయంలో కలిపింది. తెలుగు విశ్వవిద్యాలయాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి తెలుగులో ఉన్నత విద్య, శాస్త్రవిద్య, భాషాభివృద్ధి, నిఘంటు నిర్మాణం, తెలుగు చరిత్ర పరిశోధన వంటి రంగాలలో కృషిచేయాలని భావించింది. ఆ తదుపరి యూజిసి వారి ఆర్థిక సహకారం కోసం దానిని సంప్రదాయ సాధారణ విశ్వవిద్యాలయంగా మార్చివేసింది. తెలుగు అకాడమి ద్వారా ఇంటర్, డిగ్రీ, పీజీ స్థాయి శాస్త్ర గ్రంథాలను రాయించి అచ్చేయాలని నిర్ణయించింది. కాని ఆ పాఠ్య పుస్తకాలలో తెలుగు తక్కువ, సంస్కృత భాష ఎక్కువ అయ్యింది. భాషా సేవ మాట అటుంచి కొత్త సంక్లిష్ట తెలుగు భాషను సృష్టించింది. దీనికి

నమూనా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలో వాడే సంస్కృత మిళిత హిందీ భాష కావడం విశేషం.

తెలుగు అకాడమి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సహాయంతో 1968లో ఏర్పడింది. ప్రాంతీయ భాషలలో విద్యాబోధనని సజావుగా సాగించడం కోసం, కళాశాల స్థాయి పాఠ్య పుస్తకాలను రాయించి ప్రచురించడం కోసం వివిధ రాష్ట్రాలలో అకాడమీలను స్థాపించారు. చాలా రాష్ట్రాలలో ఇవి మూతపడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఇది నిలదొక్కుకుంది. కాని, ప్రాంతీయ భాష అయిన తెలుగు పరిరక్షణ కోసం ఏర్పడిన అకాడమి దానికి న్యాయం చేయడంలో విఫలం అయినట్లేనని చాలా మంది భావిస్తారు.

ఉన్నత విద్యాబోధన స్థిరీకరించడానికి మాతృభాష అవసరం అని నమ్మిన అకాడమి వివిధ శాస్త్ర గ్రంథాలను తెలుగులోకి అనువదించింది. కొత్తగా పాఠ్యపుస్తకాలను రాయించింది. కాని అందుకు ఉపయోగించిన భాష మాత్రం తెలుగు కాదు. అది సంస్కృత భాషలాగే ఉంటుంది. అంటే సంస్కృతానికి క్లోనింగ్ భాషలా తయారైంది. ఆ భాష సృష్టించిన పారిభాషిక పదాలలో అత్యధిక శాతం సంస్కృత పదాలే. ఆంగ్లపదాలు అర్థం కావడం కష్టం అని తెలుగులో సమానర్థకాలను సృష్టించారు. కాని ఆ ధ్యేయం నెరవేరలేదు. వెన్నుముక రహిత, వెన్నుముక సహిత ప్రాణులు అనడానికి బదులు అకసేరుకాలు, సకశేరుకాలు అని రాసి విద్యార్థికి భాషా లాలిత్యత, అర్థ కాఠిన్యతని అదనంగా తెచ్చి పెట్టారు. సులభంగా ఉండాల్సిన పుస్తక భాషలో కాఠిన్యత తెచ్చి పెట్టడం వల్ల అకాడమి నగుబాటు పాలయ్యింది. తెలుగులో చదివి పాస్ అయిన వారికన్నా ఆంగ్లంలోనో, అధ్యాపకుడు బోధించిన విషయం అర్థం చేసుకునో పరీక్ష రాయడం వల్లనే ఎక్కువ మంది గట్టెక్కారు. అలా కృత్రిమ భాష రూపొంది అనతి కాలంలోనే దాని ప్రభావం కోల్పోయింది. ఇకపోతే కొన్ని జిల్లాల మాండలిక భాషా పదాలను సేకరించడం, అధ్యయనం చేయడం జరిగింది. కాని అది భాషా శాస్త్ర అధ్యయన రీతిలోనే జరిగింది. అంటే కేవలం భాషా పరిశోధన వరకే పరిమితం అయ్యింది. అందువల్ల తెలుగు భాషకి ఒక ప్రజాస్వామిక రూపం కలిపించడంలో విఫలం చెందింది. సరైన, ప్రయోజనాత్మక భాషా దృక్పథం, భాషా ప్రయోజనం సాధించలేక చతికిలపడింది. కొన్ని పదకోశాలు వేసినా అవి సమాజంపై ప్రభావం కలిగించలేకపోయాయి. తెలుగు భాష ప్రామాణీకరణకీ చేయూత నివ్వలేదు. దానిని ఆధునీకరించనూ లేకపోయింది. మారుతున్న సమాజం అవసరాలను భాష అందుకోగలగాలి. ఈ విషయంలో ప్రభుత్వ సంస్థలు తగినంత రాణించలేపోయాయి. ఎన్ని సంస్థలు ఉన్నా, ఎంత మంది ఉద్యోగులు ఉన్నా ప్రామాణికమైన నిఘంటువులను నిర్మించడంలో వైఫల్యం పొందాయి. చిన్న చిన్న పదకోశాలు బృహన్నిఘంటువుల సాటిరావు కదా. ఇంటర్, బి.ఎ, ఎం.ఎ, విద్యార్థులకు అవసరపడే పదకోశాలు, రీడింగ్ మెటీరియల్ అందించడంలో కూడా వెనకబడిపోయాం. అందుకే ఆ తరువాత కాలంలో ఆంగ్ల విద్య మీద ఆధారపడక తప్పలేదు. అలా ఆంగ్ల విద్య అభ్యాసంపై మోజు పెరిగిపోయింది. అందుకు ఒకకారణం భాష అని చెప్పవచ్చు. ముఖ్యంగా అందుకు కారణం ఇలాంటి సంస్థలే అని కూడా చెప్పాలి. మూడు దశాబ్దాల కింద స్థాపించిన తెలుగు విశ్వవిద్యాలయం సైతం సాహిత్యానికే అధికంగా అంకితమైంది. నిఘంటువు నిర్మాణంలో, భాష ఆధునీకరణలో, నవీకరణలో పరిపాలనా భాషగా రూపొందించడంలో అంతిమంగా విఫలమైందనే చెప్పాలి.

చాలా ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా తెలుగుకి న్యాయం జరగలేదు. ప్రతి సంస్థ తనవంతుగా భాషను క్లిష్టతకు గురి చేసిందనే చెప్పాలి. ప్రజాదృక్పథం కలిగిన బలమైన సంస్థ నిర్మాణం లేకపోతే భాషాభివృద్ధి జరగదు. బడ్జెట్ ఇస్తే ఉద్యోగాలు లేవు. ఉద్యోగులు ఉన్నచోట ప్రణాళికలు లేవు. ఏ సంస్థ బడ్జెట్ చూసినా అంతంత మాత్రమే. పాలకులకు భాషా క్రాంత దర్శిత్వం లేకపోవడం ప్రజలకు శాపం.

భాష కేవలం పెత్తనం కోసమే అనే పాలకుల భావన. అందుకే దేశంలో, రాష్ట్రాలలో అన్ని సమస్యలు. వీటిని అధిగమించడానికి దార్శనికత అవసరం. అది లేకపోతే కొన్ని పాత రాష్ట్రాలలో, కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలలో భాషా సమస్య తీవ్ర రూపం దాల్చుతుంది.

*జయధీర్ తిరుమలరావు తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులు, జానపద సాహిత్యం, సంస్కృతిపై విస్తృత పరిశోధనలు జరిపారు. ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు.*

# గోగు శ్యామల

హాస్టల్లో సాయంత్రం అన్నాలు తిన్నాక ఎవ్వరికొచ్చే కథలు వాళ్లు చెప్పకునేది. మాయవ్వోళ్లు చెప్పిన కథలన్నింటినీ నేను నా తోటి పిల్లలకు చెప్తేది. కొంతసేపు చదువుకొని, బిస్తర్లు పర్సుకొని ఆడికీడికీ సాలుగా పడుకొనేది. వామ్‌మెన్ వచ్చి 'అందరూ నిద్రపోండి' అన్న వెంటనే నిండ దుప్పటి కప్పకునేది కాని నిద్ర పోకపాయ్యేది. ఇంటికాడి సంగతులన్ని మనుసులకు వచ్చేవి. ఒక్కసారే వీపుల జర్సుకుంట కడుపుల బుగులు జొచ్చేది. అది ఊర్ల మాయప్పను పటేండ్లు ఏమన్నరో, ఏమైయిందో, కొట్టిరో, తిట్టిరో ఏమవస్త వెడుతున్నరో, మైయమ్మ, సంగవ్వ, తమ్ముడు, అన్న ఎంతేడుస్తున్నరో అని దేవులాడుకునేది. అట్ల యాదికి చేసుకుంటే నాకు ఏడుపొచ్చేది. ఎప్పడు నిద్ర పోయేదాన్నో నాకే తెలవదు. నిద్రలోకూడా పీడకలలొచ్చి దిగ్గున లేచి కూసునేది. మావోళ్ల మీద పానంబడ్డది. ఒక్కసారి అందరినీ చూడాలనిపిస్తుంది. తెల్లవారి 'ఏంటమ్మాయి జ్వరమేమన్న వచ్చిందా? ముఖం అంత నీరసంగ ఉంది. కళ్లు ఎర్రగయినయి.' అని హాస్టల్లో వంటజేసేటామె అడిగింది. నేను బదులు చెప్పలేదు. ఏం చెప్పాలో తెలువక ఏంకాలేదని నెత్తి ఊపిన. కాని కడుపులకెల్లి ఏడుపు తన్నుకొస్తున్నది. ఏడిస్తే ఇంటికాడ పానం పెట్టినని ఇంటికి పంపియ్యగల్ల అనే బుగులుతో దుఖాన్ని దిగమింగుకున్న. అంతట్లనే 'అమ్మ, నాయిన యాదికొస్తున్నరా? ఇంక రొండు దినాలైతె నాలుగు దినాల సెలవులు వస్తున్నయి. అందరూ ఇండ్లల్లకు పొయ్యోస్తరు. నీవు పోదువు రందెందుకు పిల్లా' అన్నది. ఈ ఇగురం బాగనే ఉందనిపించింది. ఇగ మాఇంటికి పొయ్యేరోజున నిన్న వేసుకున్న జడలకు రిబ్బన్లు మాత్రమే ఇప్పిన, మీద మీద దువ్వి ఇడిసిన పాతజడలనే మడిసి కట్టుకున్న. అన్ని పనులు బరబరా చేసుకొని పిల్లలతో పాటు బడికెల్లిన. పొద్దుమూకి బడిగంట కొట్టినంక మా అన్న గోటీలాడి గెల్సుకొని దాసుకొమ్మని నాకిచ్చిన చిల్లర పైసలు లంగజేబిలేసుకున్న బస్సు కిరాయికని. హాస్టల్లిచ్చిన కొత్త పుస్తకాలని మైయప్పకు జూపియ్యనీకే బస్తల సర్దుకున్న. మెడకు పక్కపొంటి పుస్తకాల బస్తను వేలాడేసుకొని బసెక్కి ఇంటికి బైలెల్లిన.

**'రడం' కథ నుండి, ఏనుగంత తండ్రి కన్న ఏకుల బుట్టంత తల్లే నయం పుస్తకం, హైదరాబాద్ బుక్ ట్రస్టు, డిశంబరు 2013**

# జాషువా చూపిన జాడ

■ డొక్కా మాణిక్య వరప్రసాద్

**కొత్తగా** ఏర్పడిన తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.అది తన విధి విధానాలను, అభివృద్ధి నమూనాను రూపొందించుకుంటూ అలాగే భాషా సాంస్కృతిక విధి విధానాలను, రాజధానిని ఎక్కడ ఏర్పరచాలన్న పనిలోనూ నిమగ్నమై ఉంది. తెలుగు సమాజాన్ని పరిపాలించే సువర్ణావకాశాన్ని దక్కించుకున్న తెలుగుదేశం ప్రభుత్వానికి భాషా విధానాన్ని (పాలనా భాషగా తెలుగు) రూపొందించుకొని తెలుగుభాష, జాతి, నిరంతరాయంగా ముందుకెళ్ళేట్టు చేయడంలో గురుతర బాధ్యత ఉంది. అందుకోసం మన పూర్వకవుల ప్రసక్తి, తెలుగుభాషను సుసంపన్నం చేసిన ఆధునిక భాషావేత్తలు, కవులు చేసిన కృషిని మరింత ముందుకు తీసుకుపోవలసి ఉంది.

తెలుగు సాహిత్యంలో ఆదికవిగా ప్రఖ్యాతుడైన నన్నయ మహాభారత రచనను జగద్ధితంగా చేస్తానని చెప్పినా, భారతంలో వాడిన భాష చాలా వరకు సంస్కృతమే, పండిత భాషే. ఉభయ కవి మిత్రుడిగా ప్రఖ్యాతి గాంచి భారతాన్ని తెలుగు వాళ్ళ కథలె అనుకునేంతగా తెలుగీకరించిన తిక్కన సోమయాజి కొన్ని వాడుక భాషా పదాలు, తెలుగు కొంచెం ఎక్కువే వాడినా ఆయన కవిత్వంలో సంస్కృతాంధ్ర భాషల కలయిక బాగా కనబడుతుంది. పోతే తిక్కన తెలుగు ఎనిమిది వందలేండ్ల క్రితం నాటిది. రాచరిక వ్యవస్థ కాలం నాటిది. ఆధునిక అవసరాలకది సరిపోదు. శ్రీకృష్ణదేవరాయలు దేశ భాషలందు తెలుగులెస్స అన్నప్పటికీ, తెలుగు సాహిత్య వికాసానికెంతో అది తోడ్పడుతున్నప్పటికీ భాష విషయంలో అతని కాలం నాటిది ప్రబంధ పండిత భాషే. ప్రకృష్టమైన బంధంతో కూడుకున్నదైన సంస్కృత పండిత భాషే రాయల కాలం నాటి భాష. ఇక శ్రీనాధుడి ప్రౌఢగంభీర భాష గూర్చి చెప్పనవసరం లేదు. క్షీణ ప్రబంధ యుగంలో కొంత తెలుగు వాడబడినా సాహిత్యకారులుగా, భాషావేత్తలుగా విశేష ప్రభావం చూపిన కవులు అంతగా కనబడరు. మధ్య యుగాల్లో వేమన ప్రజల భాషలో కవిత్వం రాసి ప్రజల కోసం కవిత్వం చెప్పి మొట్ట మొదటి ప్రజాకవి అయ్యాడు. గురజాడ వాడిన వాడుక భాషలో కళింగ ప్రాంత ప్రాంతీయ ముద్ర, శ్రీశ్రీ భాషలో సంస్కృత పాండిత్య భాషా ప్రళయ ఘోష దర్శన మిస్తుంది. 20వ శతాబ్ధంలో, ఇంకా చెప్పాలంటే ఇంతకు ముందరి తెలుగునాడు సమైక్యాంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన సుప్రసిద్ధ ఆధునిక కవులు వచన రచయితల రచనల్లో ప్రాంతీయ మాండలికాల హేల కనబడుతుంది. భావంలో వేమన మార్గాన్ని, భాషలో అచ్చమైన తెలుగునుడికారాన్ని, తెలుగుదనాన్ని ప్రతిబింబింపజేస్తూ, తీయనైన తెలుగులో రచనలు చేసిన ఆధునిక కవి గుర్రం జాషువా. అతడు పుట్టి పెరిగిన గుంటూరు ప్రాంత నేపథ్యం, కుల నేపథ్యం విశేషమైన జీవితానుభవాలను సమకూర్చి అద్భుతమైన భాషను ఇచ్చింది. గుంటూరు ప్రాంత వ్యావహారిక భాషను సుమధుర సుందరమైన తెలుగు నుడికారంతో కవిత్వ భాషను చేసిన సామాజిక విప్లవకారుడు జాషువా. గుంటూరు – విజయవాడ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా చేస్తున్న ఈ చారిత్రక సమయంలో అదే విధంగా భాషా విధానాన్ని రూపొందించుకుంటున్న సమయంలో దాదాపు శతాబ్ధి క్రితం నుంచే ఆ భాషలో రచనలు చేసిన మహాకవి గుర్రం జాషువా కమనీయ సాహిత్యానికెంతో సందర్భ శుద్ధి ఉంది. ప్రస్తుత కాలానికి దాని అవసరమూ ఉంది.

జాషువా కావ్యాల్లోని ఏ పద్యం చదివినా హాయిగా, హృదయానందం కల్గించే విధంగా ఉంటుంది. అది కమ్మని తెలుగు భాష. ఆ కావ్యాలలో అందరికీ అర్థమయ్యే తెలుగు భాష దర్శనమిస్తున్నది. మనల్ని తెలుగు మాగాణంలో విహరింపజేస్తుంది. జాషువా వాడిన కమ్మని తెలుగు నుడికారం కల భాష వల్లనే తెలుగుకు ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్, సుందర తెలుగు అన్న విశేషణాలు వచ్చాయి. గిడుగురామమూర్తి పంతులు తెలుగు భాషకు ఉన్న గొప్పతనం ఆ భాషలోని వ్యావహారిక పదాల వల్లనే వచ్చిందని చెప్పడంలోని ఆంతర్యాన్ని గ్రహిస్తే మంచిది. జాషువా తెలుగుకు ఇంత తీయదనం, తెలుగుదనం ఎలా అబ్బిందో తెలుసుకోవాలంటే అతని జీవిత నేపథ్యంలోంచి వచ్చిన భాషా సౌందర్యాన్ని తిలకించాల్సిందే. జాషువా చదువుకున్న నాటి పరిస్థితులు, అంటరాని తనం విశృంఖల విహారం, దళితులు పొందిన అవమానాలు, పీడిత కులాల బాధల్లోంచి ఆ భాష పుట్టింది. మొట్టమొదటి తెలుగు ప్రజాకవి వేమనలా ప్రజలభాషా సంప్రదాయాన్ని ఎన్నుకున్నారు. సాహిత్య ప్రయోజనం కేవలం ఆనందం కాదని ఉపదేశమని, ప్రజల కష్టసుఖాలను వెల్లడి చేసే సృజనాత్మక సాధనమని, ప్రగతిశీల సామాజిక మార్పుకి అది ఎంతగానో దోహదపడుతుందని భావించి, తెలుగు నుడికారానికి గుడికట్టి దాన్ని స్వంతం చేసుకుని పద్యరచన చేశాడు. అట్లని జాషువా పండిత భాషను అసలే వాడనేలేదని కాదు. జాషువా గొప్ప మానవీయ తాత్వికుడైన విద్యావంతుడు. రామాయణం, మహాభారతం, భగవద్గీత, పురాణాలు, బైబిల్, ఖురాన్ లాంటి అన్ని ఉద్గ్రంధాలను ఔపోసన పట్టినవాడు. ప్రాచీన సాహిత్యంలో గాఢమైన అభినవివేశం, అనురక్తి ఉన్నవాడు. వీటన్నిటితోపాటు ఆధునికతనూ అవగాహన చేసుకొన్నాడు. వీటి సమ్మిశ్రమంతో తనదైన పద్ధతిని ఎన్నుకొని అద్భుతమైన శైలిలో పద్యరచన చేసాడు. సాంప్రదాయక మూసలో పద్యం మునిగితేలుతున్న సమయంలో పద్య సాహిత్య రథచక్రాలను నేల మీదకి రప్పించి పద్యం ద్వారా ప్రజాస్వామిక ప్రగతిశీల రచనలు చేయవచ్చని నిరూపించాడు. పద్యం నడ్డి విరుస్తానని ఓ కవి, తెలుగు కవిత్వాన్ని భూమార్గం పట్టిస్తానని, భూకంపం సృష్టిస్తానని మరోకవి గర్జిస్తుంటే జాషువా నిశ్శబ్ధంగా పద్యాన్ని ప్రజాస్వామ్యీకరించి అట్టడుగు దళిత జీవితాన్ని చిత్రించడానికి దాన్ని ఉపయోగించారు. పాతకొత్తల మేలుకలయికగా అటు ప్రాచీనతను, ఇటు నవ్య సాంప్రదాయాన్ని జీర్ణించుకొని కవితావ్యవసాయం చేసిన అచ్చమైన తెలుగు కవి. తేలిక శబ్దాలతో, తీయని శయ్యలతో కవ్వితు మల్లిన జాషువా తెలుగు పక్కా తెలుగు సమాజపు తెలుగు.

జాషువాకి తెలుగు నేలపై ఉన్న భక్తికి, తెలుగు కవులపై ఉన్న గాఢాభినివేశానికి ఇలాంటి ఉదాహరణలెన్నో కనబడతాయి. అలాగే శ్రీకృష్ణదేవరాయల గురించి కూడా అద్భుతంగా చిత్రించాడు. ఇలా తెలుగు నేలలోని అణువణువు గురించి తెలుగుదనం ఉట్టిపడేలా స్వచ్ఛమైన తెలుగునుడికారంతో కవితాయజ్ఞం కొనసాగించిన జాషువా తెలుగే సీమాంధ్ర తెలుగు. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన ఈ సందర్భంలో జాషువా తెలుగుకెంతో ప్రాధాన్యమున్నది. ఇప్పుడు ప్రామాణిక భాషగా వాడుతున్న పత్రికా భాష, సీమాంధ్ర ప్రాంతపు సాహిత్య భాష కూడా జాషువా వాడిన భాషే. అయితే ప్రపంచీకరణం, కంప్యూటరీకరణం అంటూ ఏవేవో పోకడలు పోతున్న ఆధునిక సమయంలో, ఇంగ్లీషే ప్రపంచమంటూ పరుగులు తీస్తున్న సమయంలో, జాషువా లాంటి విద్వత్కవి పీడితుల కనివాడిన భాష గురించి ఆలోచించాల్సి ఉంది. ఇంగ్లీషును పూర్తి స్థాయిలో చదువుతూనే పాఠశాల స్థాయి వరకు తెలుగు మాధ్యమం అమలుచేయాల్సి ఉంది. అందుకు అధికార భాషగా తెలుగును పూర్తి స్థాయిలో అమలుచేయాల్సి వుంది. అందుకు విశ్వమానవ కవియైన జాషువా చూపిన తెలుగు భాషా మార్గాన్ని అనుసరించాల్సిందే. 'గవ్వకు సాటిరాని పలుగాకుల మూకలసూయ చేతన / న్నెవ్విధి దూరినన్ ననువరించిన శారద లేచిపోవునే / యివ్వసుధా స్థలిం బొడమరే రసలుబ్ధురు గంటమూనెధన్ / రవ్వలు రాల్చెదన్ గరగల్ పచరించెద నాంధ్రవాణికిన్' అని ఆంధ్ర దేశానికి అమూల్య అనర్ఘ రత్నాలనదిగిన రచనలందించిన జాషువా ప్రాసంగికతలను (నేటి ఆవశ్యకతను) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా విధాన రూపకల్పనలో పరిగణనలోనికి తీసుకోవాల్సిందే.

మన రాష్ట్రంలోని సాహితీవేత్తల విగ్రహాల్లో జాషువ విగ్రహాలే ఎక్కువగా ఉన్నాయి. దానికి కారణం ఆయన సాహిత్య సమకాలీనతే. జాషువా సాహిత్యం సామాన్యులకు అంతగా దగ్గరైంది. సమాజంలో అసమానతలు ఉన్నంత కాలం జాషువా సాహిత్యం మనల్ని ప్రశ్నిస్తూనే వుంటుంది.

ఇటీవలి కాలంలో తెలుగు భాషాభిమానులు భాషను బ్రతికించుకోవాలనే తాపత్రయం ఎక్కువగా వ్యక్తం చేస్తున్నారు. వారికి నా మనవి ఏమంటే జాషువా సాహిత్యాన్ని ఎంత బాగా ప్రజల్లోకి తీసుకెళితే అంత బాగా తెలుగు భాష మనగలుగుతుంది.

*రచయిత మాజీ మంత్రివర్యులు. భాష, సాహిత్య విషయాలలో ఆసక్తి గలవారు.*

*ఈ వ్యాసం ఆంధ్రజ్యోతి దినపత్రిక 2014లో ప్రచురించబడింది.*

# సంస్కృతం, మాతృభాషల బోధన :
## స్మృతి ఇరానీకి బహిరంగ లేఖ

## ■ సౌమ్య దేచమ్మ

*ప్రియమైన ఎమ్ఎస్ ఇరానీ,*

కేంద్రీయ విద్యాలయాల్లో (మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వ పాఠశాలలు) విద్యార్థులు నేర్చుకోవాల్సిన భాషల జాబితా నుండి జర్మన్ భాషను తొలగించాలని మీరు తీసుకున్న నిర్ణయం మమ్మల్ని దిగ్భ్రాంతి పరిచింది. ఇంతకన్నా బాధాకరమైన సంగతి ఏమిటంటే, సంస్కృత భాషను నేర్చుకోవడాన్ని తప్పనిసరి చేసిన మీ నిర్ణయం. ఈ నిర్ణయంలోని అసమానతను చాలా మంది బాగానే ఎత్తి చూపారు. ఒకవైపు జర్మన్ భాష మీద గొడ్డలి పోటు, మరో వైపు ప్రస్తుత ప్రభుత్వం అత్యుత్సాహంతో ప్రజల మీద రుద్దుతున్న నయా ఉదారవాద విధానాలు. యివాళ్టి గ్లోబల్ ప్రపంచంలో ఒక విదేశీ భాష నేర్చుకోవడం వల్ల పిల్లల నైపుణ్యం, వాళ్ళ అర్హతలు మరింత మెరుగు అవుతాయనీ, వారిని భావి పౌరులుగా ప్రపంచం ముందు ప్రదర్శించుకోవచ్చని చాలా మందే సూచించారు. 1923లో విల్‌హెల్మ్ వాన్ ష్లెగెల్ (Wilhelm von schlegel) మొదలుకొని సంస్కృత సాహిత్యాన్ని అనువదించి, పటిష్టపరచి, వర్గీకరించి, దాన్ని "భారతీయ సాహిత్యానికి" ఏకైక ప్రతినిధిగా నిలబెట్టింది జర్మన్ ప్రాచ్యవాదులే అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అయితే నా ఆందోళన దీని గురించి కాదు.

మా అబ్బాయి హైదరాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్నాడు. ఈ స్కూల్లో హిందీ, సంస్కృతం, జర్మన్ భాషలు తప్ప, తెలుగు గానీ, యితర భారతీయ భాషలు గానీ నేర్పించడం లేదని తెలిసి నేను ఆశ్చర్యపోయాను. కొంత కాలం క్రితం నేను ఈ స్కూలుకెళ్ళి తెలుగును ఎందుకు నేర్పించడం లేదని అధికారుల్ని అడిగాను. ఎందుకంటే, వాళ్ళు చెబుతున్న మూడు భాషల సూత్రం ప్రకారం అన్ని స్కూళ్ళల్లో స్థానిక / ప్రాంతీయ భాషను తప్పని సరిగా నేర్పించాలి. అధికారులు చెప్పిన సమాధానం మరింత విచిత్రంగా వుంది. తెలుగు నేర్పమని ఎవరైనా విద్యార్థులు కానీ, తల్లిదండ్రులు కానీ కోరుకొంటే, కనీసం పది మంది తల్లిదండ్రులు అటువంటి విజ్ఞాపన చేయాలి. ఇక్కడ నాకు అర్థం కానిది ఒకటే – స్థానిక భాషల్ని నేర్పించడానికి యిటువంటి విజ్ఞాపనలు అవసరం అయితే, మరి ఈ రూలు హిందీ, సంస్కృత భాషలకు వర్తించదా?

మరింత క్లిష్టమైన ప్రశ్న ఒకటుంది. ఏది "స్థానిక" భాష? ఏది "మాతృభాష"? హైదరాబాద్‌లో తెలుగుకు సమానంగా ఉర్దూ కూడా స్థానిక భాషే. 1956లో భాషా ప్రాతిపదిక మీద రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరిగే దాకా యిక్కడ ఉర్దూనే విద్యా మాధ్యమం. ఈ భాషలో సంస్కృతి, ఉత్తమ విలువలు వున్నాయి. దానికి తనదైన 'స్వంత' చరిత్ర, సంస్కృతి వున్నాయి. సంస్కృతంలాగా కాకుండా ఉర్దూ గతంలోనూ, యిప్పుడూ అందరికీ అందుబాటులో ఉన్న భాష. ఈ భాషకు సాంస్కృతిక చరిత్ర మాత్రమే కాదు, ప్రజామోద చరిత్ర కూడా ఉంది. యిది ముంబయి సినిమాల్లో చూడవచ్చు. ఆ సినిమాల్లో మనం చూసేది హిందీ కాదు ఉర్దూ. అందువల్ల ఉర్దూని ఎందుకు నేర్పించకూడదు? ఉర్దూ చెప్పనిదేమిటి? సంస్కృతం చెప్పేది ఏమిటి? కాసేపు ఉర్దూ సంగతి పక్కన పెడదాం. ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చడానికి అర్హత లేనివిగా, ఆధునిక భాషలుగా పరిగణించడానికి పనికిరానివిగా వున్న యితర స్థానిక భాషల సంగతి ఏమిటి? నేను జీవిస్తున్న తెలంగాణాలో భారత దేశంలోని యితర ప్రాంతాల్లో వున్నట్టుగానే అనేక భాషలున్నాయి. బంజారా, గోండి, కొండ, కుయ్, కువి, పెంగో, ముండా వంటివి మచ్చుకు కొన్ని. హైదరాబాద్‌లో ప్రధానమైనవి ఉర్దూ, తెలుగు అయితే, ఆదిలాబాద్‌లో యితర వాటితో పాటు గోండు భాష ప్రధానంగా వుండాలి కదా? పిల్లలు మాతృభాషలో బాగా నేర్చుకుంటారని ఒప్పుకున్నప్పుడు వారి స్వంత భాషలో నేర్చుకునే అవకాశం ఉండాలి కదా?

నేను ఈ భాషల గురించిన ప్రసక్తి ఎందుకు తెచ్చానంటే, నా పిల్లల మాతృభాష ఒకటి కాదు. ఒకరిది కొడవ. కర్నాటకలోని కొడుగు ప్రాంత భాష అది. యింకొకరిది తెలుగు. పైన చెప్పిన భాషల్లాంటిదే కొడవ. అది కేవలం మాట్లాడే భాష. అందుకే ఆధునిక రాష్ట్రాల్లోని నేర్చుకోవాల్సిన భాషల జాబితాలో అది లేదు.

చారిత్రకంగా చూసినపుడు 'మాతృభాష' అనే భావన యిటీవలదే. సుమతీ రామస్వామి, లీసా మిచెల్, ఫ్రాంచీస్కా ఓర్సని తమిళ, తెలుగు, హిందీ భాషలు చారిత్రకంగా మాతృభాషలుగా రూపొందిన క్రమాన్ని అద్భుతంగా వివరించారు. మాతృభాషను రూపొందించడం ఒక మేథోపరమైన కార్యక్రమమనీ, యిలా రూపొందించబడే క్రమం మిగిలిన భాషల్ని పక్కకు నెట్టివేసే వ్యూహాల మీద ఆధారపడి వుంటుందనీ వారు చెప్పారు.

నేను ఈ 'అప్రధాన' భాషల ప్రస్తావన ఎందుకు తెచ్చానంటే, మనలోని విభిన్నతల్ని తిరిగి పొందాలి. మనల్ని ఐక్యపరుస్తున్న వూహాజనిత చరిత్రలకూ, ఆచరణలో, వునికిలో వున్న జీవితాలకూ మధ్య ఉన్న తేడాలను చూడాలని నా అభిప్రాయం.

2013లో వచ్చిన పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా భారతదేశంలో 780 భాషలున్నాయని చెప్పింది. ఈ 780లో 210 భాషలు ఈశాన్య భారతానికి చెందినవి. ఈ 210 సుసంపన్నమైన, వైవిధ్యమైన భాషల్లో మనలో ఎంత మందిమి కనీసం రెండు భాషల పేర్లయినా చెప్పగలం? పట్టించుకొనే వాళ్ళెవ్వరు? 'వాళ్ళు' మాత్రం 'మన' భాషల్ని తెలుసుకోవాలి కానీ, మనం మాత్రం వాళ్ళవి తెలుసుకోము. మానవ చరిత్రలో 'ఎవరు దేన్ని తెలుసుకోవాలి?' అనే విషయం అమాయకంగా, అధికార సంబంధాలకి బయట ఎప్పుడూ లేదు. యిటువంటి వాతావరణంలో ఈ భాషల్ని అధ్యయనం చేయాల్సిన పద్ధతుల గురించి ఆలోచించడం ఎంతైనా అవసరమైనప్పుడు, సంస్కృతం ఎందుకు?

జర్మన్, ఉర్దూ, హిందీ, తెలుగు, ఇంగ్లీషు భాషలవలే ఈ భాషలకు వేరే ఉపయోగాలు, ప్రయోజనాలు లేవు. వాటికి రాయదగ్గ చరిత్ర లేదు. జర్మన్ భాష విదేశీ భాష అనుకొంటే ఇంగ్లీష్ కూడా విదేశీ భాష కదా? దానిని ఏం చేసుకోవాలి మనం? ఈ వాదనని యింకొంచెం ముందుకు తీసుకెళ్తే ఎక్కువ మంది భారతీయులకు సంస్కృతం కూడా పరాయిదే. అయితే భాషలు పెరుగుతాయి, చనిపోతాయి, యితర భాషల నుండి అరువు తెచ్చుకుంటాయి, యితర భాషలకు అరువిస్తాయి. అలా నిరంతరం చలనశీలంగా వుంటాయి. ఇంగ్లీష్ లాగ వేరే వారి భాష ప్రత్యక్ష, పరోక్ష శక్తుల వల్ల ఇప్పుడు మన భాష అయింది. సింగపూర్‌లోని అధికారిక భాషల్లో తమిళం వుండటం మనకు గర్వకారణంగా లేదా? అమెరికా, కెనడా, యూరప్ యితర దేశాల్లో హిందీ, బెంగాలీ, తమిళం, సంస్కృతం నేర్పిస్తున్నారని మనం మురిసి పోవడం లేదా? నైజీరియాలో ఉర్దూ / హిందీ సినిమా ఒక ప్రత్యేక పరిశ్రమగా వుండటం మనకు ఆర్థిక లాభాలను అందివ్వడంతోపాటు, సాంస్కృతికంగా కూడా గర్వపడే అంశంగా గూడా వుంది కదా.

గతంలో సంస్కృతం కొద్ది మందికే పరిమితమైన జ్ఞానానికి వాహికగా వుండి, దాన్ని నేర్చుకోవాలనుకున్న అత్యధిక సంఖ్యాకులకు అది నిరాకరించబడిందనే విషయం తప్పని సరిగా మీకు తెలిసే వుంటుంది. కులం పునాదిగా జ్ఞానాన్ని రక్షించుకుంటూ వచ్చిన ఆ భాష సహజమరణం చెందడంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

సమకాలీన పరిస్థితుల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నది ప్రధానంగా "వెనుకబడిన", "క్రింది" కులాల పిల్లలే. ఈ స్కూళ్ళల్లో సంస్కృత భాష ఛాయలెప్పుడూ లేవు. ఒకప్పుడు వాళ్ళకు నిరాకరించబడిన భాషనే, యివాళ వాళ్ళు వద్దని మొత్తుకుంటూ వున్నా, బలవంతంగా రుద్దడం ఎంత విచిత్రమైన విషయం? ఒకప్పుడు సంస్కృతం ఏ కులాలకు చెందిందని చెప్పబడిందో, ఆ వున్నత వర్గాల/ కులాల వాళ్ళు అత్యాధునిక ప్రయివేటు స్కూళ్ళల్లో ఫ్రెంచి, జర్మన్ లేదా స్పానిష్ భాషల్ని ఎంచుకుంటున్నారు.

'స్థానికత'ల నుండి విభిన్నతల్ని తిరిగి పొందాల్సిన అవసరాన్ని గురించి బహుశా మనం యివాళ ఆలోచించాలి. ఎందుకంటే, అది ప్రతి ఒక్కరికి తనకంటూ స్వంతం ఒకటి ఉందనే భావనని యిస్తుంది. అప్పుడు మాత్రమే చరిత్రల్నీ, ఆధ్యాత్మిక ప్రతీకల్నీ కలిపి వేయడానికి వ్యతిరేకంగా ప్రతిఘటన రాగలదు. 'అప్రధాన' భాషలు మాట్లాడే ప్రజల పట్ల వున్న చిన్న చూపు మనకు స్కూళ్ళల్లో, మరెక్కడైనా చాలా నేర్పిస్తుంది.

మీరు మీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొంటారనీ, మన పిల్లలు దేన్ని నేర్చుకోవాలో, ఎంత బాగా నేర్చుకోవాలో అనే విషయంలో మరింత సృజనాత్మక భావాలతో ముందుకొస్తారని ఆశిస్తాను.

*ఈ వ్యాసం ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో నవంబర్ 22, 2014న వచ్చింది.*

**అనువాదం : దాము**

సౌమ్య దేచమ్మ హైదరాబాదు విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు.

దాము కవి, డాక్యుమెంటరీ సినిమా దర్శకులు.

# ఉర్దూ మాధ్యమంలో హైద్రాబాద్ వైద్య విద్యాలయ సంస్థ స్థాపన

■ సయ్యద్ ముస్తఫా కమల్

**వివిధ** విద్యాలయ సంస్థల్లో ఉర్దూ భాషని మాధ్యమిక భాషగా ప్రవేశపెడుతున్న తరుణంలో అందులో భాగంగా ఒక అల్లోపతి వైద్య విద్యా సంస్థ (1846)ను కూడా స్థాపించడం నిజంగా ఒక గొప్ప విశేషం. అప్పుడప్పుడే ఆధునిక విజ్ఞానానికి పరిచయం అవుతున్న హైదరాబాదీలు అనువాద రచనల ద్వారా ఉర్దూకి మారడం మొదలైంది. ఆ క్రమంలో వారు ఆధునిక, పాశ్చాత్య వైద్యం మరియు చికిత్స గురించి తెలుసుకున్నారు. 19వ శతాబ్దం వరకు హైదరాబాద్ ప్రజలకు పాశ్చాత్య, ఆధునిక వైద్యం అందుబాటులో లేదు. ధనవంతులకి, సామాన్యులకి యునాని చికిత్స అందుబాటులో ఉంటే బ్రిటీష్ వారికి స్వంత వైద్యులు ఉండేవారు.

**వైద్య విద్యా కళాశాల స్థాపన:**

హైదరాబాద్‌లో వైద్య కళాశాల స్థాపనకు దారి తీసిన సంఘటన గురించి బుస్తాన్-ఎ-అసాఫియాలో ఇలా ప్రస్తావించారు. 1842లో నాల్గవ నిజామ్ నవాబ్ నజీరుద్దీన్ దౌలా అనారోగ్యం పాలవుతాడు. యునాని వైద్యులు ఎంత ప్రయత్నించినా అతని జబ్బు నయం కాదు. ఒక రోజు నవాబ్‌ని కలవడానికి ఫ్రేజర్ అనే బ్రిటిష్ వాసి అతని నివాసానికి వస్తాడు. నవాబ్ ఆరోగ్యం గురించి వాకబు చేయగా నవాబ్ పాశ్చాత్య వైద్యుల చికిత్స బాగుంటుందని విన్నానని అనగానే, వెంటనే ఫ్రేజర్ నవాబ్ ఒప్పుకుంటే ఒక వైద్యుడ్ని పంపిస్తానని చెప్తాడు. ఎలాంటి మందులు వాడకుండా హకీం అల్వీ ఎలా అయితే నాదిర్ షా తలనొప్పి తగ్గించాడో అలా తనకి కూడా ఎలాంటి మందులు వాడకుండా జబ్బు నయం చేసే వైద్యుడు కావాలని నవాబ్ కోరగా డా॥మెక్లైన్ అనే వైద్యుడ్ని ఫ్రేజర్ పంపిస్తాడు. ఆ వైద్యుడు కేవలం నవాబు తినే ఆహారం పై నియంత్రణ విధించి 3 నెలల్లో నవాబుని ఆరోగ్యవంతుణ్ని చేస్తాడు. దానితో ఎంతో సంతోషించిన నవాబు హైదరాబాద్‌లో మద్రసా ఆఫ్ డాక్టరీని స్థాపించాలని ఆదేశిస్తాడు.

నసీరుద్దీన్ దౌలా ఆదేశాల ప్రకారం 1846లో డా॥ఫ్రాంక్లిన్ పర్యవేక్షణలో హైదరాబాద్ వైద్య విద్యాలయం మొదలైంది. ప్రారంభంలో బేరార్‌కి చెందిన వైద్యశాఖ మరియు ఆసుపత్రి సిబ్బంది ఇక్కడ వైద్య విద్యనందించే వారు. కాని ఆంగ్లంలో బోధన కష్టంగా ఉండడంతో ఉర్దూని మాధ్యమిక భాషగా ప్రవేశ పెట్టడం జరిగింది. అప్పటికే బెంగాల్‌లో ఉర్దూ మీడియమ్‌లో వైద్య కళాశాలను నడుపుతున్న అనుభవం ఉండడం వల్ల అలాంటి విద్యా సంస్థనే హైదరాబాద్ లో నడపడం బ్రిటీష్ వారికి పెద్ద కష్టం కాలేదు.

ఈ కళాశాలలో విద్యార్థులను చేర్పించడానికి ఆధునిక విద్యపై అభిమానమున్న షామ్సుల్ ఉమారా లాంటి వారు ఎంతగానో సహాయపడ్డారు. ప్రారంభ దశలో విద్యార్థులు ఆంగ్లంలోనే రాయడం, చదవడం, వివిధ రకాల జబ్బులను వాటి మందులను తెలుసుకోవడం చేసే వారు. తరువాత వాటికి సంబంధించిన బోధన, వివరణ మరియు చర్చలు, నోట్సు రాసుకోవడం అంతా కూడా ఉర్దూలో సాగేది. కొన్నేళ్ళ తర్వాత ఈ విద్యా సంస్థలో చేరడానికి ఆంగ్లంపై కనీస అవగాహన అవసరం అన్న నియమం మొదలైంది.

1851లో డా॥స్మిత్ సంపాదకునిగా హైద్రాబాద్ వైద్య కళాశాల ఒక పత్రికను కూడా ప్రారంభించింది. డా॥మెక్లైన్, డా॥మెకండీ విద్యార్థుల కోసం ఉర్దూలో రాసిన పుస్తకాలు షామ్సుల్ ఉమారాకి సంబంధించిన ప్రెస్ ద్వారా ప్రచురించబడేవి. ఈ విద్యా సంస్థలో బోధన అత్యంత సమర్థవంతంగా ఉండేదని చెప్పుకునేవారు. అనాటమీ, ఆర్థోపెడిక్స్, ప్రాపర్టీస్ ఆఫ్ మెడిసిన్, రూల్స్ అండ్ లాస్ ఆఫ్ లైఫ్, ప్రిన్సిపల్స్ ఆఫ్ హెల్త్ అనే ఆరు సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహించేవారు. పరీక్ష నిర్వాహకుడిగా డా॥మెకండీ, డా॥వాల్టర్, డా॥డికెన్ సన్ మరియు డా॥రీడ్ పని చేసారు. కోర్సు పూర్తయిన తర్వాత ముఖ్య వ్యక్తులుగా మారారు. బుస్తాన్-ఎ-అసఫియాలో మొదటి 8 సంవత్సరాల పట్టబద్రుల పేర్లు ప్రస్తావించారు. వారు మహ్మద్ యాకూబ్, మహ్మద్ బఖర్ అలీ, గులామ్ హుస్సేన్, బర్హా షరీఫ్, ఖాజా అష్రఫ్, మహ్మద్ హుస్సేన్, గులామ్ ఓలానీ, సయ్యద్ ఒమర్, గులామ్ మొహమ్మద్, అయాన్ ఖాన్, ఫైజుల్లా ఖాన్, మహ్మద్ మౌలానా, ఫకీర్ సాహెబ్, వజీర్ అలీ, షిఫామ్ ఖాన్, మిర్జా అలీ, మహ్మద్ అష్రఫ్, మరియు షంషుద్దీన్; మహ్మద్ అష్రఫ్ మరియు ఫయిజుల్లా ఖాన్ మొట్టమొదటి క్లినిక్‌లను హైద్రాబాద్‌లో స్థాపించారు.

**ప్రవేశ పరీక్షలు-భాష:**

ప్రభుత్వం నిర్వహించే ప్రవేశ పరీక్ష ద్వారా విద్యా సంస్థలో అడ్మిషన్లు జరిగేవి. 1870లో ప్రభుత్వ పత్రికలో వచ్చిన ఒక ప్రకటనలో ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు పర్షియన్ మరియు ఉర్దూ భాషలలో ప్రావీణ్యంతోపాటు, ఆంగ్లభాష పరిజ్ఞానం కూడా ఉండాలనే నిబంధన ఉంది. అయితే 1878లో వచ్చిన ప్రకటనలో పర్షియన్, ఉర్దూతోపాటు ఆంగ్ల భాష తప్పని సరిగావచ్చి ఉండాలని ఉంది. 1885లో వచ్చిన ప్రకటనలో ఆంగ్లభాషలో కనీస పరిజ్ఞానం, చరిత్ర, జాగ్రఫీ, మాథమాటిక్స్ వచ్చి ఉండాలి, ఉర్దూలో ప్రావీణ్యత ముఖ్యం అని ఉంది. క్రమేణా హైదరాబాద్‌లో ఆంగ్ల భాషా ప్రాముఖ్యత పెరుగుతుండడంతో ఈ వైద్య కళాశాల కూడా ఆంగ్ల మాధ్యమానికి మారింది. అయితే అదే సమయంలో ఉర్దూని అధికార భాషగా నిజాం ప్రభుత్వం ప్రకటించడం గమనార్హం.

మూడేళ్ళ తర్వాత వచ్చిన ఒక వైద్య ఉద్యోగ ప్రకటనలో 20 మంది వైద్యులు మరియు 5గురు అసిస్టెంట్లను ఎంపిక చేయడానికి కావలసిన కనీస అర్హతలను ఇలా పేర్కొంది. ఇంగ్లీష్ మాట్లాడటం, ఉర్దూలో వ్రాయడం, చదవడం వచ్చి ఉండాలని, అర్హత పరీక్ష జాగ్రఫి, చరిత్ర, మాథమటిక్స్ మరియు జామెట్రీ సబ్జెక్టులలో ఉంటుందని. పర్షియన్ భాష తెలిసిన వారికి ప్రాముఖ్యత ఉంటుందని పేర్కొంది. కొన్నేళ్ళ తర్వాత పర్షియన్‌తో పాటు, లాటిన్ భాషలో కూడా జవాబులు రాయడానికి అనుమతినిచ్చింది. 1885 వరకు సికింద్రాబాద్ మెడికల్ బోర్డు పరీక్షను నిర్వహించేది. ఇంగ్లీష్ మీడియమ్ కి మారిన తర్వాత ప్రశ్నా పత్రాలు మద్రాస్ లేదా బాంబే నుండి వచ్చేవి. మౌఖిక పరీక్షను మాత్రం సికింద్రాబాద్ మెడికల్ బోర్డ్ నిర్వహించేది. 1885 నుండి మద్రాస్ ఎల్ఎమ్ అండ్ ఎస్ కి అనుగుణంగా సిలబస్‌ను మార్చారు. 1921లో ఛాదర్‌ఘాట్‌లోని రెసిడెన్సీ ఆసుపత్రి పరిధిలో ఉన్న హైదరాబాద్ వైద్య కళాశాలను సైఫాబాదుకి మార్చారు. అదే ఏడాది ఉస్మానియా విశ్వ విద్యాలయానికి అనుబంధ కళాశాలగా మార్చారు. అప్పటి నుండి ఈ సంస్థని ఉస్మానియా వైద్య కళాశాలగా పిలవసాగారు.

**ఆంగ్ల విద్య ప్రారంభం:**

హైదరాబాద్‌లో క్రైస్తవ మిషనరీలు ఆంగ్ల విద్యను ప్రారంభించాయి. 1825లో సికింద్రాబాద్‌లోని సెయింట్ జాన్ చర్చికి కొంత మంది పిల్లలను తీసుకు వచ్చి వారికి యూరోపియన్ సైన్సెస్ మరియు ఇంగ్లీషు భాషను నేర్పడం మొదలు పెట్టారు. అతి కొద్ది కాలంలోనే అది ఒక పాఠశాల స్థాయికి చేరడం, తరువాత 1846లో ఆ పాఠశాలను చాదర్‌ఘాట్‌కు మార్చడం జరిగింది. మొదట్లో ఈ పాఠశాలను ప్రొటెస్టెంట్ ఇంగ్లీష్ స్కూల్ అని పేరు పెట్టారు. తరువాత సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్ గా మార్చారు. 1855లో ది ఆల్ సెయింట్స్ స్కూల్ స్థాపించారు. 1874లో ఔరంగాబాద్‌లో మొదటి స్కూల్‌ని స్థాపించడంలో ఇతర జిల్లాలలల్లో కూడా ఆంగ్ల విద్యా వ్యాప్తికి చర్యలు మొదలయ్యాయి. అలాగే గుల్బర్గాలో ఆంగ్లో వెర్నాక్యులర్ స్కూల్ వచ్చిందది.. ఆ విధంగా ఇంగ్లీష్ మీడియమ్ స్కూల్స్‌కి ఒక సుహృద్భావ వాతావరణం తయారు చేయడం జరిగింది.

ఆంగ్ల భాష ప్రవేశంతో హైదరాబాద్‌లో భాషాపరమైన పోటీ ఊపందుకుంది. అరబిక్ మరియు పర్షియన్ భాషలు తమ చివరి పోరాట దశకు చేరుకున్నాయి. కొంత మంది భూస్వాములు, ధనవంతులు ఆంగ్ల భాష తమ పిల్లలకు ఆధునిక విద్య నందించే మాధ్యమంగానే కాకుండా తాము బ్రిటిష్ వాళ్ళతో సంబంధాలు పెంచుకోవడానికి కూడా ఉపయోగపడుతుందని గుర్తించారు.

*హైదరాబాద్ మె ఉర్దూకీ తరఖ్ఖి (హైదరాబాద్‌లో విద్య మరియు అధికారిక భాషగా ఉర్దూ భాష అభివృద్ధి, 1990) షగుఫా పబ్లికేషన్స్, హైదరాబాద్ 226-229 నుండి.*

***అనువాదం - డి. సుజాత***

*ఎమ్.ఏ.మోయిద్ ఈ భాగాన్ని మొదట ఉర్దూ నుండి ఇంగ్లీషులోనికి అనువదించారు.*

*సయ్యద్ ముస్తఫా కమల్ హైదరాబాదు నుండి వెలువడే 'షగుఫా' అనే ఉర్దూ హాస్య పత్రిక సంపాదకుడిగా ఉన్నారు. డి. సుజాత హైదరాబాద్‌లో స్వతంత్ర పరిశోధకురాలుగా పనిచేస్తున్నారు.*

# పర్షియన్ స్థానంలో ఉర్దూ

■ **తారిఖ్ రెహమాన్**

హైదరాబాద్ రాష్ట్రంలో పర్షియన్ నుంచి ఉర్దూకి జరిగిన మార్పుకి కారణమైన సంఘటనలను సయ్యద్ ముస్తఫా కమల్ ఎంతో చక్కగా వివరించారు...

**1869లో మొదలయిన ఉర్దూ ప్రయాణం:**

ఉర్దూకి సానుకూలంగా ఉన్న హిందుస్థానీ ప్రభావాన్ని ఒప్పుకోలేక ఆ భాష యొక్క మార్పునకు పునాది వేసిన బషీరుద్దౌలా సర్ అస్మన్ జా ఒక హైద్రాబాదీ ఉన్నత సంపన్న వంశానికి చెందిన వాడు. ఆయన 1869లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా (సద్రుల్ మహమ్ అదాలత్) నియమితులైనారు. 1871లో న్యాయస్థానాలలో పర్షియన్ స్థానంలో ఉర్దూని వాడాల్సిందిగా ప్రతిపాదించాడు. అప్పటి ప్రధాన మంత్రి అయిన సాలార్ జంగ్ I, వాంగ్మూలనాలను సాధారణ వాడుకలో ఉన్న ఉర్దూలో రాస్తే సరిపోతుంది అని భావించారు. మిగిలిన అన్నిరకాల రాతకోతలు పర్షియన్‌లో మాత్రమే ఉండాలని శాసించారు. బషీరుద్దౌలా ఉర్దూకి మరిన్ని రాయితీలు కల్పించటానికి విన్నవించినప్పటికీ ఆయన ప్రతిపాదనని తోసి పుచ్చుతూ "చాలా మంది ప్రజానీకానికి 'సహజమైన' ఉర్దూ రాసే నైపుణ్యం లేనందున ఈ రకమైన ఉర్దూ పునరుద్ధరణని ప్రోత్సహించడం రాజు గారికి ఎంత మాత్రం సమ్మతం కాదు. అంతేకాక ఏదో ఊరికే ఉర్దూ వాడకాన్ని ఆమోదించాము కానీ దాని అవసరం దృష్ట్యా కాదు" అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు.

1876లో అడ్మినిస్ట్రేటర్స్ (నజామా) మరియు క్లర్కులు (మున్షిస్) ఉర్దూలో నైపుణ్యాన్ని సాధించారని ప్రధాన మంత్రి అంగీకరించారు. అయితే వారి ఉర్దూ నైపుణ్యత కష్టమైన పర్షియన్ పదాలపై తమకున్న పట్టును ప్రదర్శించటానికో లేదా సాహితీ సమావేశాల్లో వాడే గ్రాంధిక భాష వాడటానికో కాదు అని కూడా స్పష్టం చేశారు.

1883 నాటికి సనాతనవాదైన సాలార్‌జంగ్ I పర్షియన్ పట్ల తనకున్న మోహాన్ని వదిలి చనిపోటానికి రెండు రోజుల ముందు ఉర్దూకు మరెన్నో రాయితీలను, సదుపాయాలను కల్పించారు. కానీ న్యాయస్థానాలకు సంబంధించి ఆయన ఆదేశాలు ఆయన మరణించిన తర్వాత 1883 ఫిబ్రవరి 8న ప్రచురించబడ్డాయి. ఆయా ప్రాంతాల అధికారులకు మరాఠీ మరియు తెలుగు భాషల్లో వారి నిర్ణయాలను నమోదు చెయ్యడానికి అనుమతి ఇచ్చినట్టు, ఎవరికైతే ఉర్దూ మాతృ భాషగా ఉందో వారికి కూడా ఈ సౌలభ్యం కల్పించాలనే నిర్ణయానికొచ్చాడు. ఈ రాజ భాష మార్పు లాంఛన ప్రాయంగా 1884 ఫిబ్రవరి 5న ప్రధానమంత్రిగా నియమించబడిన మీర్ లాయక్ అలీఖాన్ సాలార్ జంగ్ II సమయంలో జరిగింది. ఆయన ఆ పదవి నుంచి 1887లో రాజీనామా చేశారు.

న్యాయస్థానాల్లో అన్ని రకాల కార్యకలాపాలకు ఉర్దూ భాషని ఉపయోగించాలన్న మొదటి ఆదేశం 1884, ఫిబ్రవరి 21న వచ్చింది. ప్రధాన మంత్రి మొదట న్యాయస్థానాల్లో ప్రబలిపోయిన భాషాపరమైన గందరగోళం పట్ల ఆందోళన వ్యక్తపరిచారు. అధికారులు ఉర్దూ మరియు పర్షియన్ భాషను తమకు తోచినట్టుగా ఉపయోగిస్తున్నారనీ, ఇలాంటి పరిస్థితికి ముగింపు పలుకుతూ అందరికీ అర్థమయ్యే భాష అయిన ఉర్దూలో రాష్ట్ర సంబంధిత వ్యవహారాలు నడపాలనే వాదన ముందుంచారు. ఉర్దూ భాషలోని ఈ ఆదేశం స్పష్టంగా 'అందువలన ఈ ఆదేశం దర్బారు కార్యాలయాలకి చేరగానే అప్పటి నుంచి అన్ని కార్యకలాపాలను ఉర్దూ భాషలోనే నిర్వహించాలని' అని చెప్తుంది.

అంతే కాకుండా పర్షియన్ ప్రభావిత ఉర్దూలో కాక సాధారణమైన ఉర్దూలోనే రాయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అయినప్పటికీ గ్రామ స్థాయి కార్యాలయాలన్నీ అక్కడి స్థానిక భాషల్లోనే కార్యకలాపాలు కొనసాగిస్తాయి. ఉన్నతాధికారులను ఉర్దూ భాషలోనే సంభోదించాల్సిందిగా తాలూక్ దారులను శాసించడం జరిగింది. స్థానిక భాషల్ని ఒప్పుకోవచ్చు కానీ హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతంలో ఉర్దూ భాషనే ఉపయోగించాలి. 1884 ఫిబ్రవరి 28లో జరిగిన ముఖ్యమైన రాష్ట్ర మండలి సమావేశంలో మహబూబ్ అలీఖాన్ తన ప్రసంగాన్ని ఉర్దూలో ఇవ్వడం ఇంకో ముఖ్య లాంఛనప్రాయ సంఘటనగా చెప్పుకోవచ్చు. ఆ సంభాషణలో ఆయన ఉపయోగించిన భాష చాలా సహజంగా మరియు అర్థం చేసుకోవడానికి వీలుగా ఉంది. 1886లో అన్ని కార్యాలయాల పనులన్నీ ఉర్దూ భాషలోనే జరగాలని ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

ప్రధాన మంత్రిచే నిజాంకి పంపబడ్డ ఈ విషయానికి సంబంధించిన విజ్ఞాపన పత్రంలోని సారాంశం ఈ విధంగా ఉంది: 'అన్ని కార్యాలయాల్లో ఉర్దూని వాడుతున్నారని, కేవలం ప్రభుత్వ కార్యదర్శులు మాత్రమే పర్షియన్ ఉపయోగిస్తున్నారని అన్ని అధికార ఉత్తరపత్యుత్తరాలలో పర్షియన్‌కి బదులు ఉర్దూను ఉపయోగించటానికి ఆదేశాలు జారీ చేయాలని; అంతే కాకుండా ఉర్దూ భాషను ఉపయోగించినందువల్ల కలిగే లాభాలను కూడా వివరించామనీ, అన్ని ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాల్లో ఉర్దూని ఉపయోగించాల్సిందిగా నిజాం ఉత్తర్వులు జారీ చేసారని వివరిస్తుంది.

**రాజకుటుంబం ఉర్దూ**

ఇంతకు ముందు ప్రస్తావించినట్లు పర్షియన్ రాష్ట్ర అధికారిక భాష గా ఉన్న సమయంలో కూడా ఉర్దూని బోధించేవారు. 1871 జనాభా లెక్కల్లో అరబిక్, పర్షియన్ మరియు హిందుస్తానీతో పాటు ఆంగ్లం కూడా బోధించే వారు అని నమోదు కూడా చేయడం జరిగింది. రాజ వంశంలో పర్షియన్ మరియు ఆంగ్లం కాకుండా ఉర్దూ కూడా నేర్చుకొనేవారు. 1871లో అప్పటి వైస్రాయ్ సాండర్స్ హిందుస్తానీ భాష హైదరాబాద్ నగరంలో మంచి ఫలితాలను ఇస్తుంది అనే నమ్మకంతో సాలార్ జంగ్ Iని ఆ భాషలో సంబోదించారు.

చిన్న వయస్కుడయిన ఆరవ నిజాం మహబూబ్ అలీఖాన్ ఒక ఆంగ్ల శిక్షకుడి పర్యవేక్షణలో చదువుకున్నారు. అయినప్పటికీ ఆయనకు ఇంగ్లీషుతోపాటు ఉర్దూ మరియు పర్షియన్ కూడా నేర్పటం జరిగింది. నిజాం మొత్తం విద్యాభ్యాస పర్యవేక్షణ బాంబే గవర్నరయిన జి.ఆర్.క్లర్క్ యొక్క కొడుకు కెప్టెన్ జాన్ క్లర్క్ చూసుకునేవారు. ఆయన హైదరాబాద్ నగరానికి 1875లో వచ్చారు. అది పెద్దగా చెప్పుకోదగిన మంచి పద్ధతి కానప్పటికీ పిన్న వయస్కుడయిన నిజాంకు భజనపరులయిన వృద్ధ రాజసేవకులచే విద్యా బోధన జరిగేది అని నిజాం భారతీయ ఉపాధ్యాయుడు సర్వర్ జంగ్ చెప్తాడు. అయినప్పటికీ 1879 చివరికి రాజకుమారుని రిపోర్టు కార్డు ప్రకారం ఆయన జాగ్రఫీ, అర్థమెటిక్ మరియు ఉర్దూలో ప్రతిభ కనబరిచారు అని తెలుస్తుంది. అంతేకాకుండా సర్వర్ జంగ్ పర్షియన్ స్థానంలో ఉర్దూని మధ్యాహ్నం నాలుగు గంటల వరకు ఎలా నేర్పించడం ఆరంభించారో, అలాగే ఉర్దూ లిపిని ఒక అరగంట పాటు నేర్పేవారు అని వివరించారు.

ఆ తరవాత ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ విద్యాభ్యాస సమయానికి బ్రిటీషు వారి ఆలోచనలో ప్రధాన రాజవంశీకులకు ఉర్దూ నేర్పడం ముఖ్యమైనదిగా పరిణమించింది. ఆయన తన మాట్లాడే భాష అయిన ఉర్దూ నేర్చుకోవడంతో మొదలుపెట్టాలని, దానితో పాటుగా ఆంగ్లం కూడా నేర్చుకోవాలని వైస్రాయ్ ప్రతినిధి రాశారు.

ఈ విధంగా భవిష్యత్తు పాలకులకు ఆంగ్లం మరియు ఉర్దూని నేర్పారు. ఉర్దూని నేర్పటం కోసం సయ్యద్ హుస్సేన్ బిల్‌గ్రామీని రాజకుమారుడి టీచరుగా 1895లో నియమించారు. అలాగే ఇంగ్లీషు బోధించడానికి బ్రెయిన్ ఎగర్టన్‌ని నియమించారు. దీనితోపాటు అరబిక్, పర్షియన్, ఉర్దూ మరియు ఇంగ్లీషు కోసం భారతీయ టీచర్లు కూడా ఉన్నారు.

రాజవంశంలోని ఇతర సభ్యులయిన ఉస్మాన్ అలీఖాన్ కోడలు దుర్రేషవార్, (1967 నుండి 1971 వరకు ఎనిమిదవ నిజాంగా ఉన్న మీర్ భక్తర్ అలీఖాన్ ముక్రమ్ ఝా గారి తల్లి మరియు టర్కీ సుల్తాన్ అబ్దుల్ మాజిద్ గారి కుమార్తె) అగా హైదర్ హసన్ మిర్జా నుంచి కేవలం ఒక్క సంవత్సరంలోనే ఉర్దూలో ధారాళమయిన ప్రావీణ్యతను సాధించారు. మొదట్లో ముక్రమ్ విద్యాభ్యాసం మద్రసా-ఏ-అలీయాలో జరిగింది. ఆ తరువాత ఆయన డూన్ స్కూల్ మరియు హారోకు వెళ్ళారు. ముక్రమ్ ఝా టర్కిష్ భార్య ఎస్రా బెర్గిన్ కూడా ఉర్దూలో మాట్లాడటం నేర్చుకున్నారు. ఇదంతా ఇలా ఉన్నప్పటికీ కులీన వర్గాల్లో పెరుగుతున్న ఆధునికీకరణ మరియు ఆంగ్ల భాషీయుల దృష్ట్యా రాజకుమారులు విద్యాభ్యాసంలో అన్ని భాషల కంటే ఎక్కువగా ఆంగ్ల భాషనే అభ్యసించ సాగారు.

ఉర్దూ భాషని నేర్చుకున్నది కేవలం రాజవంశీయులే కాదు సాధారణ ప్రజలు, ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలు కూడా ఉద్యోగాలను పొందటానికి ఉర్దూ భాషను అభ్యసించారు. ఉర్దూ భాషను ప్రోత్సహించిన వారిలో ఎన్నో సంస్థలు మరియు ఎందరో వ్యక్తులు ఉన్నారు. అలాంటి వ్యక్తుల్లో చెప్పుకోదగ్గ, దాదాపు ఒక సంస్థలా చూడదగ్గ వ్యక్తి గులాబీ అబ్దుల్ హక్ (1890-1961). అనంతరం ఆయనను బాబా-ఎ-ఉర్దూ (ఉర్దూ పిత) అని పిలిచేవారు. అనేక ఇతర విషయాలతో పాటు ఆయన 1901లో ఉర్దూలో లేఖ రాయడం గురించి రెండు కర పత్రాలను రాసారు. రెండో దాంట్లో తండ్రి తన కుమారుడికి మాతృ భాష (ఉర్దూ)పై ఆసక్తి చూపించాల్సిందిగా ప్రోత్సహిస్తూ రాసిన ఉత్తరం ఉంది. ఆ కొడుకు దానికి అంగీకరిస్తూ తన కృషిని మొదలు పెడతాడు. ఈ కరపత్రాలు రాజకుమారుడి ఉపాధ్యాయుడైన సయ్యద్ హుస్సేన్ బిల్‌గ్రామీ మనవిని గౌరవించి రాయడం జరిగింది. ఈ విధంగా అబ్దుల్-హక్ భవిష్యత్తు పాలకుల హృదయంలో ఉర్దూ పట్ల ప్రేమను నాటడానికి ప్రయత్నించారు.

మౌల్వీ అబ్దుల్ హక్ ఉస్మానియా విశ్వవిద్యాలయ స్థాపనకు కారణమయిన వారిలో చెప్పుకోదగ్గ వ్యక్తి. ఆయన అధ్యక్షత వహించిన దారుల్ తర్జుమాకి ఉత్తర భారత దేశం నుంచి ఎంతో మంది ప్రముఖులను ఆహ్వానించారు. జఫర్ అలీఖాన్, అబ్దుల్ మాజిద్ దర్యాబడి, అబ్దుల్ హలీమ్ షరర్, వహీదుదిన్ సలీమ్, సయ్యద్ సులైమాన్ నద్వీ, మౌలానా మీర్జా మోహిద్ ఖాన్, రోజ్ మసూద్ మరియు తదితరులు వచ్చారు. మౌల్వీ అబ్దుల్ హక్ అనబడే ఒక స్నేహితుణ్ని నిజమైన ముసల్మాన్‌గా భావించేవారు, ఎందుకంటే (ఆయన పేరు కూడా అబ్దుల్ హక్) ఆయన దృష్టిలో ఉర్దూకీ మొహబ్బత్ (ఉర్దూని ప్రేమించటం) నిజమైన ముసల్మాన్ లక్షణం.

ఈ విధంగా పెరుగుతున్న ఆధునీకరణ మరియు ఆంగ్ల భాష ప్రభావం వలన ఉన్నత వర్గాల వారు ఆంగ్ల భాషకి మారుతూ ఉంటే మధ్య తరగతి వాళ్ళు మాత్రం విద్యాభ్యాసాన్ని పూర్తిగా ఉర్దూలోనే చేసేవారు.

*'హిందీ నుంచి ఉర్దూ : ఒక సామాజిక రాజకీయ చరిత్ర' (2011), ఓరియంట్ బ్లాక్ స్వాన్, హైదరాబాద్. పేజీలు 238-243*

**అనువాదం : నవదీప్**

*ఈ భాగాన్ని ఎంపిక చేసింది ఎమ్.ఏ.మోయిద్. నవదీప్ హైదరాబాదులో LGBT ఉద్యమకారుడు.*







## మహమ్మద్ ఖదీర్ బాబు

నెల్లూరుకి దక్షిణం తట్టు కళకళలాడతా వుండే నీళ్ల చెరువు గట్టున వుంటుంది దర్గా మిట్ట. దాని చుట్టూ మా పాతూరంతుండే పెద్ద మైదానం. నడిమధ్యన పన్నెండు మంది పీర్ల సమాదులుండే 'దర్గా మిట్ట దర్గా'! దీనినే మేము 'బారా షహీద్ దర్గా' అంటాము('బారా' అంటే పన్నెండు. 'షహీద్' అంటే యుద్ధంలో వీరగతి పొందినోళ్లు).

దర్గామిట్ట దర్గాను చూస్తే బలే బయమూ బలే బక్తీ కలిగేవి నాకు. యీడ ఏ మొక్కు మొక్కుకున్నా తప్పకుండా తీరుతుందని మా నాయినమ్మ చెప్తా వుంటుంది. ఈ దర్గాకు ఒక కత వుందంట. ఆ కతను కూడా మా నాయినమ్మ చెప్పింది.

చానా వందల ఏళ్ల కిందట యాణ్ణో ఒక చోట మా మతాన్ని నిలబెట్టేదానికి బీకరమైన యుద్ధం జరిగిందట. ఆ యుద్ధంలో ఒక పన్నెండు మంది యోదానుయోదులు కత్తులు చేతపట్టి మా 'యీమాన్' కోసరం పోరాడినారంట. అయితే దుష్మన్‌లు ఆ పన్నెండు మందినీ చాటుగా మల్లుకొని తలలు ఎగర గొట్టేసినారంట. అయినాగానీ మా యోదులు యుద్ధం ఆపకుండా, కత్తి వదల కుండా, ఒట్టి మొండాలతో పోరాడతానే యిప్పుడున్న మిట్టదాకా వచ్చి, అణ్ణే పడి షహీదులయినారంట. అప్పుడు జనం ఆ పన్నెండు మంది మొండాలకి బక్తిగా సమాదులు కట్టి, దర్గా ఏర్పాటు చేసినారంట. ఆ దర్గా వున్న చోటే యిప్పుడు 'దర్గామిట్ట' అయ్యిందంట.

బారా షహీద్ దర్గాలో ఉన్న పన్నెండు మంది పీర్ల పేర్లు తెలియకపోయినా, వాళ్ల వూర్లు తెలియకపోయినా వాళ్లు చూపే మహిమ మాత్రం అందరికీ తెలిసిపొయ్యింది. అందుకని సాయిబులూ హిందువులూ అనే తేడా లాకుండా ఆడ జరిగే రొట్టెల పండక్కి విరగబడతా వుంటారు జనం.

**'దర్గా మిట్టలో రొట్టెల పండగ తీరు' కథ నుండి; దర్గా మిట్ట కతలు పుస్తకం, కావలి ప్రచురణలు మే, 1999. పే.111.**

# ఉస్మానియా నుండి మౌలానా ఆజాద్ యూనివర్శిటీ వరకు

■ ఎమ్.ఏ.మోయిద్

దక్షిణ భారత దేశంలో భాషా రాజకీయాల దృక్పథం నుంచి దక్కన్‌లో ఉర్దూ చేసిన ప్రయాణం ఎంతో ముఖ్యమైంది. ఉర్దూ భాష ప్రయాణంలో దక్కన్ పాత్ర గురించి ఎన్నో వాదనలొచ్చాయి. ఓ.యు నుండి మానూ వరకు అనే అంశం మీద చేసిన ఈ రచనలు ఇటీవల కాలంలో ఉర్దూ భాష తన ప్రయాణంలో ఎదుర్కొన్న సమస్యలను చూపిస్తాయి. పాత ఉర్దూ మీడియం ఉస్మానియా విశ్వవిద్యాలయం 1919లో స్థాపించబడింది. దాదాపుగా 80 ఏళ్ళ తర్వాత మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (మానూ) 1998లో స్థాపించారు. ఈ రెండు విశ్వవిద్యాలయాల స్థాపన వెనుక ఉద్దేశ్యాలు కొంత ఒకే విధంగా ఉన్నప్పటికీ, వాటి చారిత్రక మరియు రాజకీయ సందర్భాలు వేరు. ఓ.యూ దృష్టి 'ప్రగతి'కి దగ్గరగా ఉంటే, మానూది 'అభివృద్ధి'కి దగ్గరగా ఉంటుంది. ఓ.యూను ఆధునికీరణే లక్ష్యంగా ఉన్న రాచరిక రాష్ట్రం స్థాపించింది. సామ్యవాదం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం మరియు స్వరాజ్యమనే సిద్ధాంతాల భూమికపై తమ విధానాలను, దృష్టి కోణాన్ని ఏర్పరచుకున్న స్వతంత్ర్య ఆధునిక భారత దేశం మానూని స్థాపించింది. ఓ.యూ ఉర్దూకి శాస్త్రీయతను ఆపాదించి ఉప ఖండ భాషా సంబంధిత అస్తిత్వంలో దానిని భాగం చెయ్యాలని ఆశించింది. మానూ ఉర్దూ యొక్క ఉపయోగాన్ని విస్తరింపచేస్తూ, దానిని ఉపయోగించే వారికి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సాధికారతను ఇవ్వాలని ఆశించింది. ఓ.యూకు ఈ ఉర్దూ కార్యక్రమం ఉర్దూ భాషను, అలాగే ప్రాచ్యాన్ని పునరుద్ధరించాలన్న ఉన్నత లక్ష్యానికి మార్గం కాగా, మానూకి మాత్రం ఉర్దూ భాషను ఉపయోగించే వారి అభివృద్ధి, దేశాభివృద్ధికి ఒక సాధనం లాంటిది. ఇన్ని బేధాలు ఉన్నప్పటికీ ఈ రెండు విశ్వవిద్యాలయాలను హైదరాబాద్ నగరంలోనే ఏర్పాటు చేయటాన్ని గమనిస్తే, ప్రగతి, అభివృద్ధి మరియు అస్తిత్వానికి సంబంధించిన పలు రకాల ఉద్దేశ్యాలలో ఈ నగరం యొక్క ప్రాముఖ్యత చూడవచ్చు.

ఓ.యూ నుంచి మానూ వరకు ఉర్దూ భాష చారిత్రక ప్రయాణాన్ని అర్థం చేసుకోవడానికి భిన్నమైన విషయాలలో పాండిత్యం కలిగిన ఇద్దరిని (ఈ ఇద్దరు ప్రస్తుతం మానూతో కలిసి పనిచేస్తున్నప్పటికి) ఇంటర్వ్యూ చేయడం జరిగింది. ఓ.యూపై దృష్టి సారిస్తూ డాక్టర్ జునైద్ జాకిర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉర్దూ భాషను వైజ్ఞానిక చర్చలకు అనుగుణంగా మలచటానికి అనుసరించిన పద్ధతులను సవివరంగా అర్థం చేసుకోవడానికి సహాయపడతారు. అలాగే ఓ.యూ ఆధునిక శాస్త్రాన్ని స్థానిక భాషలో బోధించే స్థాయికి ఎలా ఎదిగిందో వివరిస్తారు. స్వతంత్ర్య భారత దేశంలో కొత్త తరం విద్య గురించి ఆందోళన చెందిన భారత జాతీయ వాదులకు కూడా ఈ పథకం పట్ల ఎంతో ఆసక్తి. జాకిర్ ఇలాంటి ప్రక్రియలను, వాటి ఫలితాలను స్వతంత్ర్య భారత దేశంచే స్థాపించబడిన ఇంకో సంస్థ అయిన నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్ (ఎన్.సి.పి.యు.ఎల్)తో పోల్చి చూస్తారు. ఈ సంస్థ ఆయన్ను పెద్దగా ప్రభావితం చెయ్యలేదు. ప్రజాస్వామ్య పాలనలో ప్రజల కోరిక మేరకు కానీ, రాజకీయ ఒత్తిడి వల్ల కానీ ఏర్పాటు చెయ్యబడ్డ ఇలాంటి సంస్థల పనితీరు ఎంత ప్రభావితమైనది అన్న సున్నితమైన ప్రశ్నను ఆ ఇంటర్వ్యూ లేవనెత్తుతుంది.

మానూకు సంబంధించిన రెండవ ఇంటర్వ్యూ ప్రొఫెసర్ ఖాలిద్ సయ్యద్ గారిది. ఆయన దృక్పథం మరియు అనుభవాలు స్వతంత్ర్య భారత ప్రభుత్వంచే మైసూరులో స్థాపించబడిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (సి.ఐ.ఐ.ఎల్) ద్వారా రూపుదిద్దుకున్నాయి. ఈ సంస్థలో భారతీయ భాషలను బోధించడానికి అనేక వినూత్నమైన మరియు శాస్త్రీయమైన పద్ధతులను జయప్రదంగా రూపొందించారు. ఈయన అలాంటి అనేక వినూత్నమైన పద్ధతులను యూనివర్శిటీలోనూ, బయటా కూడా ఉర్దూ భాషను బోధించటానికి విజయవంతంగా ఉపయోగించారు. ఆ విజయం జాకిర్ ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు పట్ల వెలిబుచ్చిన అభిప్రాయానికి విరుద్ధమైన అభిప్రాయాన్ని ముందుకు తెస్తుంది.

ఈ రెండు ఇంటర్వ్యూలు భారత దేశంలో రెండు దృక్పథాలలో ముఖ్యంగా దక్కన్‌లో ఉర్దూ స్థితి గతులను చూడటమే కాక మారుతున్న నేపథ్యంలో ఉర్దూకు సంబంధించి, ముస్లింల ఆకాంక్షల గురించి చెప్తాయి. ఉర్దూ కేవలం ముస్లింలకు మాత్రమే సంబంధించిన భాష కాదు. గత శతాబ్ద కాలంలో వచ్చిన అస్తిత్వ రాజకీయాలు, భాష మరియు ప్రజా సమూహాల మధ్య 'అవినాభావ' సంబంధాన్ని ఏర్పరిచాయి. ఉర్దూ ఇంకెవరి అంశం కానట్టుగా ఒత్తిడి చేసి ముస్లింలు దానిని తీసుకునేట్టు చేసాయి. ఇది కాస్తా ఉర్దూ భాష కోసం కృషిచేసే క్రియాశీల కార్యకర్తల మధ్య విభేదాలకు దారితీసింది. ఏక కాలంలో వచ్చిన అభివృద్ధి మరియు అస్తిత్వానికి సంబంధించిన డిమాండ్లు వారిని గందరగోళానికి గురి చేసాయి. ఉదాహరణకు ఆంగ్ల భాష మరియు అవకాశాలకు సంబంధించిన అవసరాలు చాలా రకాల రాజీలకు దారి తీసాయి. ఉర్దూ వాదులపై పనిచేసిన ఈ విరుద్ధమైన అంశాలు తమపైన తమకే అనుమానాలు వచ్చేటట్లు చేసాయి. ఉర్దూ భాష కంటే ఇప్పుడు ఇంగ్లీషు భాషే ముఖ్యమైందని భావిస్తున్నారు కనుక ఇంగ్లీషు పక్షమే వహించాలా?. స్థానికత ముసుగులో మెకాలే అనుచరులుగా మారిపోవాలా? ఈ విరుద్ధమైన డిమాండ్లకు ఎలా స్పందించాలి అనేది వారి ముందున్న సవాలు. ఇన్ని రకాల ఒత్తిళ్ళ ద్వారా ఉద్భవించిన ఉర్దూ రాజకీయాలు అనేక సంబంధింత విషయాలను చర్చించే ఒక వేదికగా రూపొందాయి. ఈ వేదిక అంతర్గత విమర్శకు, ముస్లింలను సమీకరించటానికి, మెజారిటీ వాదాన్ని ప్రతిఘటించటానికి మరియు ప్రభుత్వ ఉదాసీనతను ప్రశ్నించటానికి అవకాశం కల్పిస్తోంది.

ఈ రెండు ఇంటర్వ్యూలు దక్షిణ భారత దేశంలో ఉర్దూ పరిస్థితి గురించి, అదే మార్గంలో ప్రయాణిస్తున్న అనేక ఇతర స్థానిక భాషల స్థితి గురించి కూడా ప్రశ్నలు లేవనెత్తుతూ చివరికి ఈ అభివృద్ధి ఆధారిత ప్రజాస్వామ్యంలో స్థానిక భాషల ప్రస్థానం ఏమిటన్న సవాలును మనముందుంచుతాయి.

**అనువాదం : నవదీప్**

# మహ్మద్ జునైద్ జాకిర్‌తో ఇంటర్వ్యూ

■ ఎమ్.ఏ.మోయిద్

*ప్ర : ఉర్దూ భాషాభివృద్ధి క్రమంలో మీ పి.హెచ్.డి పాత్ర చాలా ప్రముఖమైనది. దాని గురించి వివరించండి?*

జ : హ్యూమానిటిస్ మరియు సోషల్ సైన్సెస్ విభాగాలకు చెందిన అనేక పదాలను అనువదించిన ఉస్మానియా యూనివర్శిటీలోని ట్రాన్స్‌లేషన్ బ్యూరో పనితనాన్ని మరియు నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్ (ఎన్.సి.పి.యు.ఎల్)తో సరిపోల్చుతూ ఒక తులనాత్మక అధ్యయనం చేయాలనే ఉద్దేశ్యంతో అదే టాపిక్‌ని నా పిహెచ్.డికి ఎంపిక చేసుకున్నాను. ఉర్దూని శాస్త్రీయ భాషగా అభివృద్ధి చేయాలనేది నా ముఖ్య ఉద్దేశ్యం. ఎందుకంటే కళలు, సాహిత్యంలో ఉర్దూ అప్పటికే ఉన్నత స్థానాన్ని సంపాదించింది. ప్రతి పదానికి ఒక భావం, ఒక అంతరార్థం ఉంటాయని మనకి తెలుసు. నా థీసిస్‌లో 12,736 పదాలను విశ్లేషణ చేసాను. ఏ భాషకైనా ఉచ్ఛశబ్దావళి ఉంటే దానిని అభివృద్ధి చెందిన భాషగా గుర్తిస్తాము. నా రిసెర్చిలో భాగంగా పైన చెప్పిన రెండు సంస్థలు అనువదించిన వివిధ రకాల అకడమిక్ పదాలను ఒక సైద్ధాంతిక కోణంలో వివరించడానికి ప్రయత్నించాను. ఆధునిక శాస్త్రీయ గ్రంథాలను ఉర్దూలోకి అనువదించే లక్ష్య దిశగా ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో హైదరాబాద్‌లో ట్రాన్స్‌లేషన్ బ్యూరోని 1917లో ఏర్పాటు చేసారు. ఆ ప్రాజెక్ట్‌లో భాగంగా శాస్త్రీయ పదాలను ఉర్దూలోకి అనువదించడంలో బ్యూరో విజయం సాధించింది. స్వాతంత్ర్యం తరువాత భారత ప్రభుత్వం "నేషనల్ కౌన్సిల్ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్"ని 1969లో స్థాపించింది. దీని ముఖ్య ఉద్దేశ్యం 20 విభాగాలకు చెందిన పదాలను అనువదించి ఒక పదకోశ పట్టికను తయారు చేసి ప్రచురించడం. నా పిహెచ్.డిలో ఈ రెండు సంస్థలు అనువదించిన పదాలపై ఒక తులనాత్మక అధ్యయనాన్ని చేసాను.

*ప్ర : మీ రిసెర్చిలో కనుగొన్న కొత్త విషయాలు ఏమిటి?*

జ : ఎన్.సి.పి.యు.ఎల్ 30 ఏళ్ళ విరామం తరువాత స్థాపించబడింది (అంటే ఉస్మానియా లోని ట్రాన్స్‌లేషన్ బ్యూరో కార్యక్రమాలు ఆగిపోయిన తరువాత అనగా 1948లో ఆపరేషన్ పోలో అయిన వెంటనే, 1949లో ప్రచురించడానికి సిద్ధంగా ఉన్న లెక్కలేనన్ని వ్రాతప్రతులు అనుమానాస్పద స్థితిలో తగులబడిపోయాయి. ఈ సంఘటన తరువాత పేరుకి బ్యూరో ఉన్నప్పటికి 1960 వరకు దాని కార్యకలాపాలు అన్నీ నిలిచిపోయాయి). అప్పటి సిలబస్ అవసరాలకు తగ్గట్టు అనువాదం ఉండాలనేది ఉస్మానియా యూనివర్శిటీ లక్ష్యం అయితే ఎన్.సి.పి.యు.ఎల్‌కి అలాంటి లక్ష్యం ఏదీ లేదు. ఎన్.సి.పి.యు.ఎల్ కొన్ని కొత్త పదాలను కనుగొన్నప్పటికి వాటిలో నైపుణ్యత గాని లోతైన విశ్లేషణ గాని లేవు. ఓ.యూ చేసిన వర్కు ఏ రకంగా చూసినప్పటికి ఈ రోజు క్కూడా ఎంతో క్రమ పద్ధతిలో, ఎంతో ఉన్నతస్థాయిలో ఉంది. ఎన్.సి.పి.యు.ఎల్ చాలా ఆంగ్ల పదాలను ఎలాంటి వివరణా లేకుండానే తన పదకోశంలోనికి తీసుకుంది. కొన్ని అప్పటికే ఉర్దూలో అనువాదంలో ఉన్న పదాలను తీసుకుని వాటి ఆంగ్ల పదాలను కూడా పక్కనే ఉర్దూ లిపిలో ఇచ్చింది. ఉదా॥కి ఎకౌంటెంట్ అనే పదానికి 'మెహ' అనే అర్థాన్నిచ్చి పక్కనే ఎకౌంటెంట్ అని ఉర్దూ లిపిలో ఇచ్చారు. అలాగే మాగ్నాకార్టా కూడా. కాని ఉస్మానియా అనువాదంలో మాగ్నా కార్టా అనే పదానికి మన్షూర్-ఏ-అజమ్ అని సనద్-ఏ-అజమ్ అని అనువదించారు. అలాగే కొన్ని పదాలను రెండు సంస్థలు వేర్వేరుగా అనువదించాయి. ఉదా॥కి ప్లెబిసైట్ అనే పదాన్ని ఎన్.సి.పి.యు.ఎల్ రాయ్‌షుమారీ అని అనువదిస్తే ఉస్మానియా రాయ్ తలబ్ అని అనువదించింది. అయితే ఉస్మానియా అనువాదమే వాడుక అర్థానికి దగ్గరగా ఉంది.

*ప్ర : ఉస్మానియా యూనివర్శిటీ ఇంత ఉన్నత ప్రమాణాలు పాటించడానికి గల కారణాలు ఏమిటి?*

జ : ఇక్కడ మనం గమనించాల్సిన విషయం ఏమంటే ఉస్మానియా యూనివర్శిటి ఈ ప్రాజెక్టుపై చూపించిన ఔత్సాహికత మరియు దాని కోసం ఎంచుకున్న పద్ధతులు. ట్రాన్స్‌లేషన్ బ్యూరోని ఉద్దేశ్యపూర్వకంగానే రెండేళ్ళ ముందుగా స్థాపించారు. దానివల్ల వివిధ కోర్సులకు కావలసిన పుస్తకాలు అనువాదం చేయడానికి వీలయింది. దేశం మొత్తం మీద గాలించి ఆంగ్లంలోను, ఉర్దూలోను గొప్ప మేథో సంపత్తి కలిగిన వ్యక్తులను ఎంపిక చేసుకొని వారికి మంచి జీతాలు, సౌకర్యాలు ఇచ్చి ఇక్కడకు రప్పించింది. మొదట సంవత్సరం అంతా కూడా ఈ ప్రాజెక్టుపై ఎలా ముందుకు వెళ్ళాలి అనే విషయంపై చర్చలు జరిపి కొన్ని ప్రమాణాలు పాటిస్తూ అనువాదం ఎలా చేయాలి అనే దానిపై ఒక నియమావళి రూపొందించింది. ఉర్దూ పదజాలానికి సమానమైన అరబిక్, పర్షియన్, సంస్కృతం మరియు హిందీ పదాలను కూడా వాడొచ్చని నిర్ణయించింది. ఫుల్‌టైమ్ మరియు పార్ట్‌టైమ్ అనువాదకుల టీమ్‌కి ఇన్‌చార్జ్‌గా ఆయా విభాగాల్లో నిష్ణాతులైన వారిని నియమించింది. ఈ కమిటీల్లో సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌తో పాటు భాషా వేత్తలు కూడా ఉండేవారు. కొత్త విభాగాన్ని జత చేసినపుడు కొత్త కమిటీ కూడా ఏర్పడేది. ప్రతిష్ఠాత్మక ఆంగ్ల విశ్వవిద్యాలయాల్లో ఉన్న సిలబస్‌ని దృష్టిలో పెట్టుకుని ఈ కమిటీలు టెక్స్టుబుక్స్ ఎంపిక చేసుకుని అనువాదానికి అవసరమైన పదాలను ఒకలిస్టు తయారు చేసేవారు. రెండవది, 'దేశీయ విశ్వవిద్యాలయం' అన్న భావనకు భారత జాతీయ వాదుల నుండి మంచి సపోర్ట్ రావడంతోపాటు నిజాం రాజకీయాపేక్ష కూడా ఈ ప్రాజెక్టును ఆకర్షణీయంగా మార్చింది.

*ప్ర : అయితే ఎన్.సి.పి.యు.ఎల్ ఎలాంటి పద్ధతులు అవలంబించింది?*

జ : ఎన్.సి.పి.యు.ఎల్ ముందుగా అనువాదం చేయాల్సిన పదాల పట్టికని తయారు చేసి ఆయా సబ్జెక్ట్ నిష్ణాతులతో ఒక వర్క్‌షాప్ పెట్టేది. ఈ వర్క్‌షాప్‌లోనే కొత్త పదాలను నిర్మించడం, మార్పు చేయడం, ఆమోదించడం అన్నీ జరిగేవి. చాలాసార్లు ఓ.యూ అనువదించిన పదాల్నే వీళ్ళు తీసుకొనేవారు. ఆమోదించిన పదాల శబ్ద కోశం నుండి ఆయా సబ్జెక్టుల్లో ప్రచురించేవారు. ఈ పదాలు కళాశాల స్థాయికే సరిపోయేవి. కొన్ని ఉన్నత విద్య, మరియు సాంకేతిక అవసరాలకు ధీటుగా ఉండేవి కావు.

*ప్ర : ఓ.యు పై ఉర్దూని విపరీతంగా పర్షియణీకరణ మరియు అరేబియణీకరణ చేసిందని అందువల్ల రోజువారీ భాషగా వాడడానికి వీల్లేకుండా పోయిందనే అపవాదు ఉంది. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి? మరియు ఈ పదాలు హైదరాబాద్ స్టేట్‌లో ఎలా జనాదరణ పొందాయి?*

జ : వివిధ రకాల విభాగాల్లోని శాస్త్రీయ పదాలు ఆంగ్లంలో పలకడానికి కూడా సరిగా రావు. ఆ పదాలు ఆయా సబ్జెక్టులలో నిష్ణాతులైన వారికే పరిమితమై ఉంటాయి.

ఓ.యూ అనువాదాల్లో కూడా అదే జరిగింది. ఆంగ్ల భాష ఇప్పుడెంత కఠినంగా ఉందో అప్పటి సబ్జెక్టు పదజాలం కూడా అదే విధంగా ఉండేది. అయితే అనువాదకులకు ఈ సమస్య తెలుసు కాబట్టి వారి నియమావళిలోని ఒక పాయింట్ ప్రకారం అనువాదకులు ఎప్పుడూ వాస్తవానికి దగ్గరగా ఉండాలి అనే దానిపై ఒక పద్ధతిని ప్రవేశపెట్టారు. దాని ప్రకారం ఒక పదాన్ని నిర్ణయించిన తరువాత ఆ పదాన్ని మొదటగా డైరెక్టర్ ఆఫ్ రెలిజియస్ ఎఫైర్స్‌కి పంపించేవారు. ఆ పదం ఎలాంటి మతపరమైన భావాన్ని దెబ్బ తీయకుండా ఉందని ఆ డైరెక్టర్ నిర్ణయించిన తరువాత ఆ పదాన్ని డైరెక్టర్ ఆఫ్ లిటరేచర్ పంపేవారు. అక్కడ ఆ పదాన్ని వాడుక భాషా కోణం నుండి చూసి దాని సహజత్వాన్ని అంచనా వేసేవారు. తరువాత ఆ పదం వాడడానికి వీలుగా వివిధ ప్రభుత్వ విభాగాలకు పంపబడేది. వారి మీటింగ్‌లలో, ట్రైనింగ్‌లలోను ఆ పదం వాడేవారు. అలా వ్యవసాయం, నీటి పారుదల, విద్య, ఆరోగ్య, న్యాయ మరియు సివిల్ విభాగాల్లో ఆ పదం వాడకంతో పాటు వాటి పదావళిని విస్తరించుకోవడానికి వీలుకలిగేది. ఇంకొకటి, ట్రాన్స్‌లేషన్ బ్యూరో ఒకకొత్త ప్రయోగం కూడా చేసింది. అది ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతి. అలా చాలా పాత పదాల స్థానంలో కొత్త పదాలు చేరాయి. ధర్మామీటర్ అనే పదానికి మొదటగా ఇచ్చిన అనువాదానికి చివరగా ఇచ్చిన అనువాదానికి ఉన్న తేడా గమనిస్తే ఆ మార్పు తెలుస్తుంది.

***ప్ర : తెలుగు భాషాభివృద్ధిని మరియు హిందూ మతాన్ని అణచివేయడానికి ఓ.యూని ఉర్దూ మాధ్యమంలో స్థాపించారు అనే వాదనపై మీ అభిప్రాయం ఏమిటి?***

జ : కాదు. ఈ పుకార్లన్నీ హైదరాబాద్ వ్యతిరేకులు మరియు మతతత్వ శక్తులు పుట్టించినవే. ఈ రోజు ఆంగ్ల భాషకున్న జనాదరణ చూడండి. బ్రిటీష్ కాలం కన్నా ఇప్పుడే ఆంగ్లం ఎక్కువగా వాడుతున్నాం. దానివల్ల తెలుగు భాషకు ఏదైనా చేటు జరిగిందా. క్రైస్తవ మతం విస్తరించిందా? పైగా ఈ ప్రయోగం కన్నడ, మరాఠీ మరియు ముఖ్యంగా తెలుగు మాట్లాడే వారికి కొత్త ఆశయాలని, కొత్త రచయితలని, కొత్త ఉద్యమకారులని ఇచ్చింది. నిజానికి ఇప్పుడు ఇంగ్లీష్‌కి ఎలా వ్యతిరేకం కాదో అప్పుడు వారుకూడా ఉర్దూకి వ్యతిరేకం కాదు. ఎందుకంటే ఓ.యూలో చదువుకుంటే ఇంగ్లీష్‌తో పాటు ఉర్దూ కూడా వస్తుంది. దానివల్ల దేశంలో ఎక్కడికయినా వెళ్లి స్థిరపడొచ్చు అన్న ఆలోచన ఉండేది. అలాగే ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్ళే అవకాశం కూడా ఉండేది. ఓ.యూ ప్రయోగం విజయవంతమైతే మిగతా 3 భాషల విశ్వవిద్యాలయాలు స్థాపిస్తానని నిజాం చెప్పిన మాటను వారునమ్మారు. కాని తొందరపడి కొన్ని తప్పుడు ప్రచారాలు నమ్మి ఉర్దూపై వ్యతిరేక భావాన్ని భయాన్ని ఏర్పరచి సమాజాన్ని చీల్చి నిజాం పాలనని కూల్చే ప్రయత్నం చేసారు.

***ప్ర : ఉర్దూ ఎప్పటికీ శాస్త్రీయ భాష కాలేదని కొంత మంది ఉర్దూ సపోర్టర్ల నిర్ధారణకు వచ్చారు?***

జ : మన దేశంలో మెకాలే అభిప్రాయానికి దేశీయవాదుల అభిప్రాయాలకి మధ్య ఎప్పుడు ఒక సంఘర్షణ ఉంది. ఏ భాష అయినా సరే ఉన్నత భాషల నుంచి నేర్చుకుని, వాటి నుంచి స్వీకరించినప్పుడే ఆ భాష అభివృద్ధి జరుగుతుంది. మనం యూరోప్‌లో చూసినట్లైతే అక్కడ అనువాదాలు శతాబ్ధాలుగా జరిగాయి. విమర్శకులకు ఓ.యూ ప్రయోగం ఒక ఉదాహరణ మాత్రమే. కాని ఈ ప్రయోగాన్ని మధ్యలో ఆపేసి 3 దశాబ్ధాలలోనే ముగించేసారు. ఇది ప్రాంతీయ భాషలకు అండగా ఉన్న కొన్ని రాజకీయ శక్తులు చేసిన పని. ఉర్దూని శాస్త్రీయ భాషగా పనికిరాదని అన్నవారు ఇతర భారతీయ భాషల గురించి కూడా అదే రకమైన భావాన్ని వ్యక్తం చేసారు. అదే సమయంలో ఉర్దూపై సానుభూతి చూపే పరిపాలకుల దృష్టిలో పడడానికి కూడా వీరు ప్రయత్నించారు.

***ప్ర : అంటే ఉర్దూని కోల్పోవడం అంటే ఇతర భాషలని కూడా కోల్పోవడమే అని మీరంటారా? అదెలా?***

జ : ఉదాహరణకి పరిపాలన మరియు ఉన్నత విద్య భాషకి సంబంధించి రెండు కొలమానాలను తీసుకుందాం. చాలా ప్రయత్నాల తరువాత మన భారతీయ భాషలు కొన్ని పరిపాలనా భాషలుగా మారినప్పటికి, వాటికి ప్రత్యామ్నాయంగా ఇంగ్లీష్‌నే వాడతాం. పైగా కేంద్రం ఇంగ్లీష్ లేకుండా పని చేయలేదు. ఉన్నత విద్యా కొలమానం ప్రకారం ఏవో కొన్ని ప్రాంతీయ యూనివర్శిటీలు స్థాపించబడినప్పటికీ నేచురల్ మరియు ఫిజికల్ సైన్సు బోధించడానికి ప్రాంతీయ భాషలు సరిపోవు. పైగా ఆ యూనివర్శిటీ అందించే విద్య క్వాలిటీపై కూడా ప్రశ్నలు మొదలవుతాయి. పాత హైదరాబాద్ స్టేట్‌నే తీసుకుంటే పరిపాలనకూ, ఉన్నత విద్యకు కూడా ఉర్దూనే వాడటం జరిగింది. ఓ.యూ ప్రయోగం కనుక కంటిన్యూ అయ్యుంటే ఈ పాటికి ఉర్దూ అంతర్జాతీయ భాషగా అవతరించి ఉండేదని నా నమ్మకం. ఇది ఇతర భాషలకు కూడా ఉపయోగపడేది ముఖ్యంగా హిందీ. ఆంగ్ల స్థానంలో హిందీ ఉండేది. మాట్లాడే వాళ్ళు ఎంత మంది ఉన్నా కూడా ఏ భారతీయ భాషకి అంతర్జాతీయ స్థాయి రాలేదు. ఓ.యూ ప్రయోగం మధ్యలోనే ఆగిపోవడమే కాక, మరే ఇతర భాష కూడా ఈ ప్రయోగం నుండి ఏమీ నేర్చుకోలేదు. ఉర్దూపై ఉన్న విరుద్ధ అభిప్రాయాల వల్ల ఏ భాష కూడా తన అభివృద్ధికి కృషి జరపలేదు.

***ప్ర : ఇప్పుడు మీరు ఉర్దూ మాధ్యమిక యూనివర్శిటీ అయిన 'మానూ'లో ఉన్నారు. 1948 ముందు ఉన్న ఓ.యూని దృష్టిలో పెట్టుకుని చెప్పండి, దీనిని మీరెలా చూస్తున్నారు?***

జ : 'మానూ' 1998లో స్థాపించారు. అంటే పాత ఉర్దూ మాధ్యమిక ఓ.యూ స్థాపించిన 50 ఏళ్ళకి 'మానూ' ని ఓ.యూతో పోల్చడం అనేది చాలా దారుణంగా అన్పిస్తుంది. అప్పటి నిజాం పాలనలో ఉర్దూ పరిపాలన భాగం మరియు కే.జి నుండి పి.జి వరకు ముఖ్యమైన సబ్జెక్ట్. అంతేకాక చాలా కాలేజీలు, స్కూల్స్ ఉర్దూ మీడియంలోనే నిజాం రాష్ట్రమంతా ఉండేవి. 'మానూ' స్థాపించిన కాలమాన పరిస్థితులు వేరు. 'మానూ' తన పాలసీలను వాస్తవికతకు దగ్గరగా మార్చుకుని జాబ్ మార్కెట్‌కి అనువుగా కోర్సులను మొదలు పెట్టింది. ఇక్కడి ట్రాన్స్‌లేషన్ డిపార్ట్‌మెంట్ 350 పైగా గ్రంధాలను అనువాదం చేసి యూజీ మరియు పి.జీలో దూర విద్యా కేంద్రం ద్వారా కోర్సులు అందిస్తుంది. 'మానూ'లో విజయవంతంగా నడుస్తున్న ప్రోగ్రామ్‌లలో ఇది ఒకటి. అలాగే ట్రాన్స్‌లేషన్ డిపార్ట్‌మెంట్ పూర్తి స్థాయిలో ఎమ్.ఎ., ఎమ్.ఫిల్, పి.హెచ్‌డిని అందిస్తుంది.

***ప్ర : ఓ.యూ ప్రయోగం గురించి ఆలోచిస్తే ఇప్పుడు మీకేమన్పిస్తుంది?***

జ : ఆ ప్రయోగం నుంచి మనం చాలా విషయాలు నేర్చుకోవాలి. ఇది ఉర్దూ వాలాలకి చాలా ప్రోత్సాహకరంగాను. వారిపై వారికి నమ్మకం కుదిరేట్లుగా చేయడమే కాక మన దేశంలో చాలా మందిని విద్యావంతులని చేయడానికి, మన దేశాన్ని ఏకత్వ దిశగా నడిపించడానికి ఉపయోగపడుతుంది. ఎందుకంటే ఈ దేశం ఏ ఒక్క ప్రాంతానికో చెందినది కాదు. ఇది భాషలపై పాలసీలు రూపొందించే వారికి, విద్యావంతులకి ఒక భాషను ఎలా అభివృద్ధి చేయవచ్చో నేర్పుతుంది. ఎలా ఉన్నత విద్యను ప్రాంతీయ భాషలో నేర్పవచ్చో చెప్తుంది. అంతేకాక వారెందుకు ఈ లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారో తెలియ చేస్తుంది. ఓ.యూ నుండి నేర్చుకోవ పోవడానికి కారణం ఉర్దూపైన, ముస్లిమ్‌ల పైన మానసికంగా ఉన్న వ్యతిరేక భావనే కారణమా? మతతత్వ రాజకీయాలు, కుంచిత మనస్తత్వాలు ఒక భాషను ఎలా నష్టపరచగలవో చెప్తుంది. ఒక ఉర్దూ యూనివర్శిటీని స్థాపించి దక్కన్ ఎలా విజయం సాధించిందో ఇది చెప్తుంది. అలాగే ఉత్తర భారతంలో జరిగిన ప్రయోగాలు అక్కడి ఫలితాలను కూడా చెప్తుంది. తెలంగాణ రాష్ట్రంలో విద్యావేత్తలకు, భాషా ఉద్యమకారులకు ఇది ఎంత విలువైనదో చెప్తుంది. తెలంగాణా గర్వపడే ఈ విజయవంతమైన ప్రయోగానికి వీరంతా కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

**అనువాదం – డి.సుజాత**

*మహ్మద్ జునైద్ జాకిర్ ట్రాన్స్‌లేషన్ డిపార్ట్‌మెంట్, మానూలో అధ్యాపకులు. ఈయన ఉర్దూ ఆక్టివిస్ట్ కూడా.*

# ఖాలిద్ సయ్యద్ తో ఇంటర్వ్యూ

■ ఎమ్.ఏ.మోయిద్

***ప్ర : "ఉర్దూ ద్వారా ఉన్నత విద్య సాధ్యమేనా" అనే ప్రశ్న ఎప్పటికప్పుడు పునరావృతం అవుతూనే ఉంది. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?***

జ : ప్రాంతీయ భాషల ద్వారా ఉన్నత విద్య సాధ్యపడదని నమ్మేవారి మనో భావమే మీ ప్రశ్న. ఈ ప్రశ్న ఎప్పుడు ఉదయించినా కూడా ఉర్దూని అభిమానించే వారు నిరాశపడలేదు. అది ఫోర్ట్ విలియమ్ కాలేజి కావచ్చు, ఢిల్లీ కాలేజీ జామియా మిలియా లేదా మానూ(మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్శిటీ) కావచ్చు. బ్రిటీష్ అధికారులకు ట్రైనింగ్ ఇవ్వడానికే ఫోర్ట్ విలియమ్ కాలేజిని స్థాపించారు కాని ఉర్దూని ఉద్ధరించటానికి కాదు. అయినప్పటికీ చరిత్ర, జాగ్రఫీ, లా, అడ్మినిస్ట్రేషన్ లాంటి అనేక సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలను ఉర్దూలోకి అనువదించడం జరిగింది. ఢిల్లీ కాలేజిని స్థాపించడం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఉర్దూ మాధ్యమం ద్వారా ఆధునిక విద్యను భారతీయులకి అందించడమే. వెర్నాక్యులర్ సొసైటీకి ప్రముఖ సభ్యుడైన లార్డ్ మెకాలే మాటల్లో "కొత్త విద్య ద్వారా మనం 'ఇండియన్ బాబూ'లని తయారు చేయాల్సిన అవసరం ఉంది".

మెకాలే ఉద్దేశ్యం ఏదైనప్పటికి 57 విషయాలపై 120 గ్రంథాల్ని ఢిల్లీ కాలేజి అనువాదం చేసింది. మనలో చాలా మంది సంశయిస్తున్న అదే ఉర్దూ భాషలోకి వీటిని అనువదించడం జరిగింది. ఈ విషయంలో హైదరాబాద్ ప్రత్యేకత గురించి చెప్పుకోవాలి. ఇక్కడ మద్రసా-ఏ-ఫక్రియా, జామియా ఉస్మానియా మరియు మానూ లాంటి సంస్థలను స్థాపించారు.
మద్రసా-ఏ-ఫక్రియా అనేది నవాబ్ ఫక్రుల్ ముల్క్ స్వంత ప్రాజెక్టు. ఇందులో భాగంగా సైన్సుకి సంబంధించిన అనేక గ్రంథాలను ఉర్దూలోకి అనువదించడమే కాక ఒక ప్లానిటోరియంని కూడా కట్టించారు. అలాగే మనకు విశ్వాసం ఉంటే ఏ ప్రాంతీయ భాషకైనా కూడా ఆధునిక విజ్ఞానాన్ని అందించ గలిగే సత్తా ఉందని జామియా ఉస్మానియా నిరూపించింది. ఇక ఉస్మానియా విశ్వవిద్యాలయం మనకు తెలియని భాషల్లో బంధించబడిన విజ్ఞానాన్ని బంధవిముక్తి చేయడమే కాక, సులువుగానూ, సరళంగానూ నేర్చుకోవడానికి ఎంతగానో తోడ్పడింది. 'జామియా ఉస్మానియా వల్ల హైదరాబాద్‌లో మధ్య తరగతి అనే వర్గం ఏర్పడింది అని ఒక ఉవాచ. (ప్రొఫెసర్ సిరాజుద్దీన్, ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ హెడ్).

***ప్ర : మీరు చాలా కాలం మైసూరు లోని సెంట్రల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజెస్ (సిఐఐఎల్)తో కలిసి పనిచేసారు. ఈ సిఐఐఎల్ అజెండా ఏమిటి? అక్కడ ఎలాంటి పరిశోధనలు జరిగేవి?***

జ : నేను ఒక ప్రాజెక్టు పని మీద కాకతాళీయంగా సిఐఐఎల్ కి పరిచయం కాబడ్డాను. కర్నాటక ప్రభుత్వం సిఐఐఎల్ సహాయంతో 9వ తరగతి పాఠ్య పుస్తకాలను తయారు చేయడానికి ఒక కమిటీని నియమించింది. నేను కూడా ఆ కమిటీలో ఉన్నాను. అలా సిఐఐఎల్ తో పరిచయం మొదలైంది. ఈ సిఐఐఎల్ మానవ వనరుల శాఖ కింద పని చేస్తోంది. భారతీయ భాషల అభివృద్ధికి కార్యక్రమాలు రూపొందించడం దీని పని. ముఖ్యంగా భాషని ఎలా బోధించాలి, భాషా శాస్త్రాన్ని ఎలా అర్థం చేసుకోవాలి, భాష యొక్క గుణగణాలు, ప్రథమ వాచకాలు రూపొందిండం, పాఠ్య పుస్తకాలు, నిఘంటువులు, పదకోశాలు, రిఫరెన్సు పుస్తకాలు రూపొందించడం, ఏ ప్రాంతంలో ఏ భాషకు ప్రాముఖ్యత ఉన్నదో తెలుసుకునే సర్వేలు చేయడం, మాండలికాలని భాషలుగా మార్చడం మొదలైనవి. నేను పదేళ్ళుగా సిఐఐఎల్ తో అసోసియేట్ అయి ఉన్నాను.

ఒక టీచర్‌గా ఇది నాకు ఎంతో ఉపయోగపడింది. భాషా బోధనా పద్ధతులతోపాటు వాటి స్వభావాన్ని అర్థం చేసుకోవడంలో నాకు ఎంతో తోడ్పడింది. దీనికి నేను సిఐఐఎల్ కి ముఖ్యంగా అక్కడ రీసెర్చ్ ఆఫీసర్‌గా పని చేసిన డా॥శ్యామలా కుమారి గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఇక ఉర్దూకి సంబంధించి ఇతర రాష్ట్ర ప్రభుత్వాల అభ్యర్థన మేరకు సిఐఐఎల్ ఆడియో క్యాసెట్స్, టీచింగ్ ఎయిడ్స్, పద్యాలు, సామెతలు పిల్లలకు లాంగ్వేజ్ గేమ్స్ తయారు చేసింది.

***ప్ర : మీరు ఐఎఎస్ మరియు ఐపిఎస్ ట్రైనీలకు ఉర్దూ నేర్పిస్తున్నారు. వారంతగా ఉర్దూపై ఆసక్తి చూపడానికి గల కారణాలేంటి? వారికి బోధించడంలో మీ అనుభవాల గురించి చెప్పండి.***

జ : నా స్నేహితుడు మరియు సహాధ్యాయుడు అయిన డా॥ఫజల్ రహ్మాన్ జమ్మూకాశ్మీర్ క్యాడర్‌కి చెందిన ట్రైనీలకు బోధించడానికి నా పేరుని **నేషనల్ పోలీస్ అకాడమీకి(NPA)** సూచించాడు. తరువాత **మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థ** నా పేరుని ఎన్‌పిఎ నుండి తీసుకుని ఐఎఎస్ ట్రైనీలకు కూడా బోధించమని అడిగింది. అలా నాకు రెండు రకాల అధికారులకు బోధించే అవకాశం వచ్చింది. ఎన్‌పిఎ లో రెండు రకాల వారికి ఉర్దూ నేర్పుతున్నాను. ఒకరు జమ్మూ కాశ్మీర్ క్యాడర్‌కి చెందినవారు. అక్కడి అధికార భాష ఉర్దూ కాబట్టి వారు ఉర్దూ నేర్చుకుని తీరాలి. ఇక రెండవ రకం వారు కేవలం ఆసక్తితో నేర్చుకుంటున్నవారు.

ఉర్దూకి ఉన్న సాంస్కృతిక నేపథ్యాన్ని బట్టి ఐఎఎస్ ట్రైనీలు ఇష్టపడి ఉర్దూ కవితలు నేర్చుకుంటారు. ఒక టీచర్‌గా ఇది నాకు పెద్ద సవాల్ లాంటిది. ఎందుకంటే ఈ ట్రైనీస్ అందరూ ఉన్నత విద్యావంతులు, వారిని కాలేజీ విదార్థులుగా చూడలేం. అంతేకాక ఉర్దూకున్న సాంస్కృతికపరమైన విలువలు నచ్చి వారు ఉర్దూ నేర్చుకోవాలను కోవడం. నేను వారికి బోధిస్తున్నప్పుడు ఈ రెండు విషయాలను పరిగణనలోకి తీసుకుని కోర్సు మెటీరియల్‌ని అందిస్తాను. ఈ రెండు సంస్థల్లోనూ 20 నుంచి 25 వరకు క్లాసులు ఉంటాయి. ఒక్కో క్లాసుకి 40 నిముషాలు కేటాయిస్తారు. ఇంత తక్కువ సమయంలోనే ఒక సవాల్‌గా ఉన్న భాషను నేర్పించాల్సి వస్తుంది. అందులోనే నేర్చుకునేవారి ఓపికను, అవసరాన్ని గుర్తించి నేర్పాలి. సిఐఐఎల్ పనిచేసిన అనుభవం నాకిక్కడ బాగా ఉపయోగపడింది. ఉర్దూ నేర్చుకోండి. *(లెర్న్ ఉర్దూ)* అనే పుస్తకంలో నేను సేకరించిన కోర్సు మెటీరియల్‌ని ప్రచురించాను.

***ప్ర : ఉర్దూ భాషను నేర్పించడంపై వచ్చిన ఈ పుస్తకం చాలా ప్రముఖమైంది. ఉర్దూ మాట్లాడ్డం రాని వాళ్ళ మధ్య కూడా ఇది బాగా పాపులర్ అయింది. ఇప్పటి తరానికి ఉర్దూ నేర్పించడంలో ఎదురవుతున్న సవాళ్ళపై మీ అభిప్రాయం ఏమిటి?***

జ : లెర్న్ ఉర్దూ *(ఉర్దూ నేర్చుకోండి)* అనే ఈ పుస్తకం నా అనుభవాలు మరియు ఐఎఎస్, ఐపిఎస్ ట్రైనీలకు బోధించినప్పుడు నేను నేర్చుకున్న విషయాల ఫలితమే కాకుండా అది ఒక బహుమతి కూడా! కొద్ది కాలంలోనే ఉర్దూ నేర్చుకోవడం ఎలా అనేది ఈ పుస్తకంలో ఉంది. 12 యూనిట్లు, 44 పాఠాలుగా ఈ పుస్తకాన్ని విభజించాము. కొన్ని అక్షరాలు మాత్రమే ఉపయోగించి వాక్యాలు వ్రాయడం ద్వారా ఉర్దూని నేర్పించడం అనేది ఇందులో ఒక పద్ధతి. సంప్రదాయ పద్ధతిలో కాకుండా ఇలా నేర్చుకునే వారికి మొదటి పాఠం నుంచే వ్రాయడం వచ్చేస్తుందన్న భావన కలగజేస్తుంది. రెండవ పద్ధతి తమకు ఆ భాష తెలిసినప్పటికీ చదవడం, రాయడం రాని వారి కోసం. మూడవది వినడం, మాట్లాడటం, చదవడం, వ్రాయడం అన్నిటినీ ఒకేసారి నేర్పించడం. సరైన ఉచ్ఛారణ కోసం హిందీ, ఇంగ్లీష్ భాషను ఉపయోగిస్తారు. వారికి ఇచ్చే ఎక్సర్‌సైజులు కూడా భాషపై అభిరుచిని పెంపొందించేవిగానే ఉంటాయి.

***ప్ర : మీరు 'ఘజల్స్ ఆరాధన' అనే ఒక చిన్న కోర్సుని కూడా ప్రారంభించారు. ఈ కోర్సు ఎవరు నేర్చుకుంటున్నారు? ఈ కోర్సు ఇంతగా విజయవంతం కావడానికి కారణాలు ఏంటి? ఈ క్లాస్‌లో మీరు ఏం నేర్పిస్తారు?***

జ : 'ప్రథమ్' అనే ఎన్‌జిఓ ఉర్దూ ఉపాధ్యాయుల కోసం ఒక వర్క్‌షాప్‌ని నిర్వహించినప్పుడు ఆ ఎన్‌జిఓ ఛైర్మన్ చౌహాన్ గారు ఏదో మాటల్లో తనకి ఘజల్స్ అంటే చాలా ఇష్టమనీ కానీ వాటి భావం అర్థం కాదనీ అంటూ ఎవరైనా ఘజల్స్‌ని అర్థం చేసుకోవడం ఎలా అనే దానిపై కోర్సు మొదలు పెడితే తాను కూడా అందులో చేరతానని అన్నారు. అంతేకాక, తనకి ఉర్దూ నేర్చుకునేంత సమయం ఉండదనీ, ఉర్దూ రాకపోయినా ఘజల్స్ అర్థం అయ్యేటట్లు ఉంటే ఇంకా బాగుంటుందని అనడంతో ఈ మాటలు నన్ను చాలా

ఆలోచింపచేసాయి. అప్పుడే నేను 'ఉర్దూ ఘజల్స్' ఆరాధన అనే ఈ కోర్సుని తయారు చేసాను. మా 'మానూ' యూనివర్శిటీ కూడా ఈ కోర్సుని ఇష్టపడింది. ముఖ్యంగా మా వైస్ ఛాన్సలర్ మొహమ్మద్ మియాన్ గారు ఈ విషయంలో అందించిన సహాయం, ప్రోత్సాహం మరువలేనివి. సంప్రదాయ ఘజల్స్‌లో ఉండే సున్నితమైన భావ ప్రకటన వినే వారిని ఎంతో ఆకట్టుకుంటుంది. నిజానికి ఘజల్స్‌ని ఇష్టపడే వారంతా కూడా గాయకుల ద్వారా విన్న వారే. వారికి అందులోని సున్నితత్వాన్ని పరిచయం చేయడం చాలా ముఖ్యం. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని నేను తయారు చేసిన ఈ కోర్సు చాలా పాపులర్ కావడంతోపాటు, అనేక మంది ఉర్దూ నేర్చుకోవడానికి కూడా దోహద పడింది.

***ప్ర : ఉర్దూలో బాలల సాహిత్యం కూడా మీకున్న అభిరుచుల్లో ఒకటి. దానిపై మీరు కొంత పని చేసారు కూడా! ఉర్దూలో చిన్న పిల్లల కోసం వచ్చే పుస్తకాల తీరు ఎలా ఉంది?***

జ : పిల్లల సాహిత్యంలో నాకున్న అనుబంధం రెండు రకాలుగా ఉంది. ఒకటి ఉపాధ్యాయుడిగా, ఇంకొకటి వాటి రూపకర్తగా. శాస్త్రీయ పద్ధతిలో పిల్లల పుస్తకాలు రాయడానికి నాకు సిఐఐఎల్ తో ఉన్న అనుబంధం చాలా ఉపయోగపడింది. అక్కడ ఉన్నప్పుడు మేము లాంగ్వేజ్ గేమ్స్, పద్యాలు, సామెతలు మొదలైన వాటిపై పని చేసాము. పిల్లల అభిరుచిని దృష్టిలో పెట్టుకుని భాషాపరమైన ఎక్సర్ సైజులు, టెక్స్ట్ బుక్స్ తయారు చేసే వాళ్ళం. సిఐఐఎల్ పిల్లల కోసం 5 రకాల కార్యక్రమాలు తయారు చేసి వాటిని ఆడియో క్యాసెట్స్, టీచింగ్ ఎయిడ్స్‌గా తీసుకు వచ్చింది. ఇంతకు ముందు చాలా పెద్ద రచయితలు, కవులు కూడా పిల్లల కోసం వ్రాసే వారు. క్రిషన్ చందర్, జాఫర్ హయామి, సిరాజ్ అన్వర్ వారిలో కొందరు. అలాగే కవులలో హమీద్ ఉల్లా అఫ్సర్, ఇస్మాయిల్ మిర్ఠి, హఫీయుద్దీన్ నాయర్, రాజా మెహదీ అలీఖాన్ చాలా పాపులర్. కాని ఇప్పుడు ఉర్దూలోని పెద్ద రచయితలు పిల్లల కోసం రాయడానికి ఇష్టపడడం లేదు. ఉర్దూలో బాల సాహిత్యం అన్నదే లేకుండా పోయింది. ఒక్క గుల్జార్ మాత్రమే మోగ్లీ కథను తనక్క కూతురు కోసం రాసిన పుస్తకంలో చేర్చారు. దీనికి కారణం రచయితలు, కళాకారులు ఈ విషయంపై శ్రద్ధ పెట్టకపోవడమే కాక ఇలాంటి ప్రాజెక్టులకు ఎవరూ సహకారం అందించక పోవడం కూడా. ఇంకా చెప్పాలంటే మా ఉర్దూ వాళ్ళం ఆధునిక సమాచారాన్ని వాడడంలో పెద్దగా శ్రద్ధ చూపించనపుడు ఇక పిల్లలకు చదవడం పై ఆసక్తిని ఎలా కలిగిస్తాం?

ఉర్దూలో నేను ఖేల్ కహావత్ (ఆటలు, సామెతలు) అనే పుస్తకాన్ని తీసుకువచ్చాను. నిజానికి ఇది 'ఇండియా త్రూ ప్రోవెర్బ్స్' అనే సిఐఐఎల్ ప్రాజెక్టు నుంచి ఉత్తేజితుడినై రాసిన పుస్తకం. ఇందులో సామెతలు విజువల్స్ రూపంలో చూపిస్తారు. నేను కూడా వారి నుంచి అనుమతి తీసుకుని అదే పద్ధతిని ఉపయోగించాను. నా పబ్లికేషన్స్ అన్నిట్లోను ఈ పుస్తకం ఒక్కటే బాగా అమ్ముడు పోయింది. నేను చెప్పేదేంటంటే పిల్లల అభిరుచిని, ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని మంచి క్వాలిటీతో పుస్తకాలను తీసుకు వస్తే నేర్పించడం, నేర్చుకోవడం రెండూ కూడా సరదాగా సాగుతాయి. పుస్తకాలు కూడా అమ్ముడవుతాయి. ఈ రోజుల్లో చాలా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. పుస్తకాలు ప్రచురించడం కష్టమైతే సీడీలు తేవచ్చు. ఖర్చు కూడా తగ్గుతుంది.

***ప్ర : మీరు గుల్బర్గా పట్టణానికి చెందిన వారు. దక్కనీ భాషకు గుల్బర్గా చేసిన సేవలు ఎంతో గొప్పవి. దక్కనీ ప్రాచుర్యానికి గుల్బర్గా చేసిన సహాయ సహకారాలు గురించి వివరించండి. అలాగే దక్కనీలో ఎలాంటి పరిశోధనలు జరుగుతున్నాయో తెలపండి?***

జ : నేను గుల్బర్గా మరియు బీదర్ ప్రాంతాలకు చెందిన వాడిని. ఈ రెండు ప్రాంతాలు కూడా దక్కనీ సాహిత్యంలో ఎంతో గొప్ప పాత్ర పోషించాయి. మొట్ట మొదటి విషాద గీతం 'కదమ్ రావ్ పదమ్ రావ్' బీదర్‌లోనే రాసారు. అలాగే గుల్బర్గాకి చెందిన సంత్ హజ్రత్ ఖాజాబందే నవాజ్‌కి చెందినదిగా భావిస్తున్న మిరాజ్-వుల్-ఆషిఖిన్ దక్కనీ సాహిత్యంలోని మొదటి గద్య కావ్యానికి ఉదాహరణ. ఈ రెండు నగరాలు బహమనీయుల రాజ్యానికి రాజధానులుగా ఉండేవి. మొదటి దశలో రాజులు తమ రాజ్యాలు కాపాడుకునే పనిలో ఉండి సాహిత్యాన్ని, కవితలని పట్టించుకోలేదు. కొంత మంది మతపరమైన వ్యక్తులు, కళాకారుల వల్లనే దక్కనీ సాహిత్యం అభివృద్ధి చెందింది. బహమనీ రాజ్యం 5 రాజ్యాలుగా విడిపోయిన తరువాత అందులోని రెండు పెద్ద వంశాలైన ఆదిల్ షా మరియు కుతుబ్‌షాహి పాలకులు తిరిగి సాహిత్యాన్ని కళలను ఆరాధించడం మొదలు పెట్టారు. గంగా యమున ప్రాంతంలో ఉర్దూని అభివృద్ధి చేసినందుకు ఉత్తర భారతీయులు గర్వపడగా, దక్కన్ ప్రాంతంలో సాహిత్యంతోపాటు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు కూడా మనం ఈ భాషను వాడుతున్నందుకు దక్కనీలు గర్వపడుతున్నారు.

అలా మొదటి పద్య, గద్య, సంగీత, విషాద కావ్యాలు దక్కన్‌లో వచ్చాయి. దక్కనీ సాహిత్యాన్ని కనుగొనడంతో మన సాహిత్య చరిత్రకారులు ఉర్దూ చరిత్రని ఇంకో 150-200 సంవత్సరాలు పెంచారు. ఇందులో హైదరాబాద్ మరియు ఉస్మానియా యూనివర్శిటీల పాత్ర విస్మరించరానిది. విచారకరమైన విషయం ఏంటంటే దక్కనీలో పరిశోధనలు చేస్తున్నవారు రాను రాను తగ్గిపోతున్నారు. ఉన్న ఒకరిద్దరు తప్ప మిగతా వారు ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు... దక్కనీలో ఎలాంటి పరిశోధన జరగకపోవడం అంటే మనకు పాత గ్రంథాలు, శాసనాలపై ఎలాంటి మమకారం లేకపోవడమే కారణం. కొత్త కొత్త డిమాండ్లు, కొత్త కోర్సులు, కొత్త చదువులు వచ్చిన తరువాత మన అభిరుచి కూడా కొత్త పుస్తకాలపైకి మళ్ళింది. కాని ఒక కొత్త కోణం నుండి దక్కనీలో పని చేయడానికి, పరిశోధించడానికి ఇంకా అవకాశం ఉందని నేను నమ్ముతాను.

***ప్ర : ఉత్తర భారత ఉర్దూ ప్రాభవంతో దక్కనీకి ఎప్పుడు రావలసినంత ప్రాముఖ్యత రాలేదని అంటారు. దీనిలో నిజం ఎంత ఉంది? దక్కనీకి తిరిగి తన ప్రాముఖ్యతను పొందడానికి ఏం చేయాల్సి ఉంటుంది?***

జ : దక్కనీ భాషకు సుమారు 600 సంవత్సరాల చరిత్ర ఉంది. దక్షిణ భారతదేశంలో మొహియుద్దీన్ ఖాద్రిజోర్, అబ్దుల్ హాకీ, అబ్దుల్ ఖాదర్ సర్వారీ, రఫియా సుల్తానా, సయ్యద్ జఫర్, గులామ్ ఒమర్ ఖాన్, అష్రఫ్ రఫీ, నజీముద్దీన్ ఫరీస్, హబీబ్ నిసార్ లాంటి వారి వల్ల దక్కనీ ఎంతో ప్రాచుర్యంలోకి వచ్చింది. కాని ఉత్తరాన దక్కనీ భాష సిలబస్‌లో భాగం కాదు. ఎందుకంటే దక్కనీ ఉచ్చారణ, వ్యాకరణం అన్నీ కొంచెం కష్టంగా ఉంటాయి. అయితే కొత్తగా వచ్చిన టెక్నాలజీ ద్వారా సమస్యలను దాటవచ్చు. ఉదాహరణకి పుస్తకాలను చదవడానికి సరైన ఉచ్చారణ అందిస్తూ క్యాసెట్స్ తయారు చేయవచ్చు. ఆడియో వీడియోలని ఉపయోగించి దక్కనీకి తిరిగి ప్రాముఖ్యత కలిగించవచ్చు. బాధాకరమైన విషయం ఏంటంటే ఒకప్పుడు గొప్ప సాహిత్యాన్నందించిన దక్కనీ ఈ రోజు కామెడీ అయిపోయింది. మన ఆలోచనా విధానం చాలా మారాలి. హిందీ మేధావి వర్గాన్ని, హిందీ మాట్లాడే వారిని ఎదుర్కోవాలి అంటే మనం కూడా మేధోవంతంగానే పోరాడాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా హిందీ టీచర్స్, విమర్శకులని ఎదుర్కోవాలి.

***ప్ర : ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణా తెలుగుకి, దక్కనీకి ఒక భవిష్యత్‌ని ఏర్పర్చాల్సిన అవసరం ఉంది. ఈ రెండు భాషలు తమ అభివృద్ధితో పాటు పరస్పర అభివృద్ధికి ఎలా తోడ్పడగలవని అనుకుంటున్నారు?***

జ : దక్కన్ చరిత్రని చూసినప్పుడు మనకు రెండు విషయాలు కన్పిస్తాయి. అది ప్రాంతం - ఒక ప్రాంతంలో పూర్వం ఉర్దూ ప్రాభవం ఉండేది. ఇంకొక ప్రాంతంలో ఉర్దూ లేదు. తెలంగాణ మొదటి రకానికి చెందింది. తమ అస్తిత్వానికి చిహ్నంగా బహ్మనీ సుల్తాన్ అల్లాఉద్దీన్ హసన్ మొదటిసారి దక్కనీ అనే పదాన్ని కనుగొన్నాడు. దాన్ని అతను రాజకీయ అస్త్రంగా వాడుకుని ఉత్తర భారతంలో తుగ్లక్‌లతో తలపడ్డాడు. అంతేకాక ఈ ప్రాంతంలో ఉన్న అనేక రకాల సమూహాలతో ఒకే విధమైన సంస్కృతిని పెంపొందించటానికి కూడా దక్కనీని వాడటం జరిగింది. అదే విధంగా సూఫీమతస్తులు ఇస్లామ్‌ను ప్రాచుర్యంలోకి తేవడానికి హిందూ పాత్రలను వాడుకున్నారు. షామ్స్ ఉల్ ఇషాక్ మీరన్ రాసిన విషాధగాధ 'బ్రహమ్ మరియు హసన్ భాను'లో క్రిష్ణన్ మొహమ్మద్ అనే కొత్త పేరు కనిపిస్తుంది. అలాగే నస్రతో విష్ణుచక్రని, హజ్రత్ అమీనుద్దీన్ పంచ సూత్రాలని, 25 గుణాలని వేదాంతం నుండి తీసుకుని సూఫీ సిద్ధాంతంలో వాడుకున్నారు. ఇస్లామిక్ సూఫీ మతంలో 4 సూత్రాలే ఉండేది. ఐదవదైన విశ్వం, శూన్యంని మాత్రం భారతీయ తత్వశాస్త్రం నుంచి తీసుకున్నారు. ముస్లిం పాలనలో ఉన్న ప్రాంతాల్లో ఈ ఇచ్చి పుచ్చుకోవడం అనే సంస్కృతి బాగా కనిపిస్తుంది.

తెలంగాణ ఉద్యమంలో మన నాయకులు చెప్పినదాన్ని బట్టి చూస్తే దక్కనీ మరియు ఉర్దూ భాషల సహకారం తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డంలో ఎంతో ఉంది. తెలంగాణ తెలుగు మరియు దక్కనీ భాషలు రాష్ట్ర ప్రగతికి తోడ్పడాలనే ఒక సహృద్భావ భావం వ్యక్తమవుతుంది. తెలంగాణ ప్రజలు కూడా అదే కోరుకుంటున్నారు.

**అనువాదం : డి. సుజాత**

*ఖాలిద్ సయ్యద్, సెంటర్ ఫర్ ఉర్దూ లాంగ్వేజ్, లిటరేచర్ మరియు కల్చర్, మానూకి డైరక్టర్‌గా ఉన్నారు.*
*(98493 59660)*

# మద్రసాల్లో ఆంగ్ల భాష

■ సాజిదా సుల్తానా

ప్రపంచ వాణిజ్య కేంద్రంపై జరిగిన దాడి తరువాత మద్రసాలు, వాటి విద్య ప్రసార మాధ్యమాలకు పెద్ద చర్చా విషయాలుగా తయారయ్యాయి. అయితే ఈ చర్చల్లో ఎక్కడా కూడా ఐరోపా వికాసం తరువాత మద్రసాలలో ఆధునిక సబ్జెక్టులని పాఠ్యాంశాలుగా చేర్చాలనే అంశంపై చాలా లోతైన చర్చలు, వివాదాలు జరిగి దీన్ (మతము) మరియు దునియా(ప్రపంచం) విద్య అనే భావపరమైన తేడా ముందుకొచ్చిందనే వాస్తవాన్ని గుర్తించలేదు.

అంతేకాక వలసవాదం ప్రసాదించిన అంతర్గత మరియు బహిర్గత రంగాల మధ్య వైరుధ్యం ఇప్పటికీ మద్రసాలలో కొనసాగుతోందని; ఆ నేపథ్యం లోనే తమ సంస్థలని ముస్లింల అంతర్గత విషయం గాను, దాన్లో బయటి వాళ్ళు లేదా రాజ్యం ప్రవేశించకుండా కాపాడు కుంటారు అని కూడా విశ్లేషకులు చెప్తారు.

ఈ రోజు మద్రసా ఆధునికీకరణ కార్యక్రమంలో భాగంగా భారత ప్రభుత్వం మద్రసాలలో ఇంగ్లీషు నేర్పాలనే నిబంధన ప్రవేశ పెట్టింది. మద్రసాల నుండి బయటికొచ్చే పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయని వారి ఉద్దేశం. దీనికి కారణాలు రాజకీయమైనవి, సామాజికమైనవి కూడా.

ఉద్యోగ అవకాశాలు పెంచటానికే కాక ఇస్లాం గురించిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పటానికి, మతాన్ని గురించిన గందరగోళాన్ని తొలగించటానికి కూడా మద్రసా విద్యలో ఇంగ్లీషు అవసరం ఎక్కువవుతోంది. తల్లి తండ్రులు తమ పిల్లలు ఇంగ్లీషు భాషను నేర్చుకుంటే ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యతే కాక మతాన్ని కూడా సరిగ్గా అర్థం చేసుకుంటారని భావిస్తున్నారు.

మద్రసా విద్యలో ఇంగ్లీషు ప్రాముఖ్యతని అర్థం చేసుకునే ప్రయత్నంలో భాగంగా హైదరాబాదులో వున్న రెండు మద్రసాలలో జరుగుతున్న ప్రక్రియని దగ్గరగా చూద్దాం. వీటిలో ఒకటి అమ్మాయిల మద్రసా; రెండవది అబ్బాయిలది. ఆయా సంస్థల అధిపతుల్ని, ఇంగ్లీషు నేర్పే ఉపాధ్యాయుల్ని ఇంటర్వ్యూలు చేసి కనుక్కున్న వివరాలివి.

2009లో మొదలైన ఈ మద్రసా ఇంగ్లీషు భాషకు మత సంబంధిత సబ్జెక్టులతో సమాన ప్రాముఖ్యత నిస్తుంది. విద్యార్థులలో కొంత మంది అది తమ మాతృ భాష కాదు, వలసవాదుల భాషనీ, దాన్ని నేర్చుకోవటం వల్ల పెద్ద ఉపయోగం లేదని భావిస్తారని అక్కడి ఆంగ్ల ఉపాధ్యాయులు చెప్పారు. అయితే మద్రసాల్లో చాలా మంది అమ్మాయిలు ఆంగ్ల భాషలో మాట్లాడాలని కోరుకుంటున్నారు కూడా. ఎందుకంటే అది అందరూ మాట్లాడే భాష అని వారికి తెలుసు. అంతేకాక తమ బంధువుల పిల్లలు ధారాళంగా, ఆత్మ విశ్వాసంతో ఇంగ్లీషులో మాట్లాడటం చూసి తాము కూడా వారితో ఇంగ్లీషులో మాట్లాడాలని అనుకుంటున్నారు. అది నేర్చుకోవటం వారికి సరదా కూడా. మద్రసాల నుండి ఉత్తీర్ణులైన తరువాత, పెళ్లి చేసుకుని ఇతర దేశాలకి వెళ్ళిపోయిన అమ్మాయిలు ఆయా దేశాల్లో మతపరమైన జ్ఞానమూ, ఇంగ్లీషు మీద పట్టు వున్న వారికి చాలా ఉద్యోగ అవకాశాలు వున్నాయని ఇక్కడి అమ్మాయిలకు తెలియ చేసారు.

ఉపాధ్యాయులు కూడా అమ్మాయిలని ఉద్యోగాల కోసమో, వ్యక్తిగత కారణాల కోసమో కాక, దేవుని మార్గంలో (ఇబాదత్ అంటే భోజనం చేసినా, భాష నేర్చుకున్నా దేవుని కోసమే అన్న భావన) ఉండటం కోసం ఇంగ్లీషులో మాట్లాడమని ప్రోత్సహిస్తారు. ఒక టీచర్ భాషకు మతంతో సంబంధం లేదని, అయితే మతాన్ని వ్యాప్తి చెయ్యటం కోసం అవతలి వ్యక్తి మాట్లాడే భాషలో మాట్లాడటం అవసరం అని కూడా చెప్పారు.

హైదరాబాదులోని ఒక పాత మద్రసా పూర్వ విద్యార్థులు స్థాపించిన అబ్బాయిల మద్రసాలో, నిర్వాహకులు ప్రాథమిక స్థాయిలో ఇంగ్లీషును నేర్పటానికి అద్వితీయ పద్ధతిని ఎంచుకున్నారు. ఇంగ్లీషు, అరబిక్ గ్రామర్‌ల మధ్య ఉన్న సారూప్యతలని విద్యార్థులకి చెప్పటం ద్వారా. ఈ ప్రయోగాత్మక పద్ధతిని ఈ మధ్యనే రెండు బాచ్‌ల విద్యార్థులకు విజయవంతంగా అమలు చేశామని ఆ సంస్థ అధిపతి చెప్పారు. మొదట నామవాచకాలు, తరువాత క్రియా రూపకాలు, ఆ తరువాత గ్రామర్ మరియు దాని వివరణ, చివరగా పాఠాలని బట్టీ కొట్టటం నేర్పిస్తారు.

మొదటి మూడు నెలలూ కోర్సులో వెసులుబాటు ఉంటుంది. విద్యార్థులు ఇంగ్లీషు బదులు ఉర్దూ, అరబిక్ పదాలని వాడొచ్చు. ఉపాధ్యాయులు వాటికి ఇంగ్లీషు పదాలను చెప్తారు. మూడు నెలల తరువాత విద్యార్థులు తప్పని సరిగా ఇంగ్లీషులోనే మాట్లాడవలసి ఉంటుంది. అరబిక్, ఉర్దూ పదాలు వాడకుండా, విస్తృత వాడకంతోపాటు, సంభాషణ అంతా ఇంగ్లీషులోనే జరుగుతుంది. బోధనలో భాగంగా సినిమాలు చూపించి, ఆ తరువాత గంట సేపు చర్చ జరుపుతారు. విద్యార్థులని ఇంగ్లీషులో ప్రెజెంటేషన్స్ ఇవ్వమని ప్రోత్సహిస్తారు. ఇది విద్యార్థిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది.

ఈ విధంగా, మద్రసాలో ఇంగ్లీషు భాషను ఇస్లాం మత సంస్కృతిని అభివృద్ధిని పరచి, వ్యాప్తి చెందించే దావాలో వెళ్ళటానికి, అరబిక్ మరియు ఉర్దూ భాషల్లో ఉన్న పాత రచనలను ఇంగ్లీషులోకి అనువదించటానికి, ఉద్యోగ అవకాశాలు అంది పుచ్చుకోవటానికి సమాజ అవసరాలు, ఆకాంక్షలు పూర్తి చేసుకోవటానికి, విశ్వ విద్యాలయాల్లో పై చదువులు చదవటానికి మార్గంగా చూస్తున్నారు. విదేశాలకు వెళ్ళాలని కోరుకుంటున్న వారికి అరబ్ దేశాల్లో ఇంగ్లీషు వచ్చిన వారి అవసరం చాలా వుంది. ప్రపంచంలో వస్తున్న మార్పులని అర్థం చేసుకోవటానికి మద్రసా విద్యార్థులకి ఇంగ్లీషు భాషలో శిక్షణ ఇస్తున్నారు. దియోబంద్ మద్రసాలో ఇస్లాంలో కోర్సులు చెయ్యటానికి విదేశీ విద్యార్థులకి ఆన్‌లైన్ సదుపాయం కల్పించారు. కోర్సు అంతా ఇంగ్లీషు భాషలోనే ఉంటుంది.

చాలా మద్రసాలలో ఇప్పుడు ఇంగ్లీషు భాష సిలబస్‌లో భాగం. మరి కొన్ని ఇంగ్లీషు కోసం ప్రత్యేక విభాగాలనే ప్రారంభించాయి. ఒకరకంగా చూస్తే ఇది మద్రసా విద్యా విధానంలోనే చాల పెద్ద మార్పు. మద్రసా విద్యా విధానంలో తమ దగ్గర చదువు పూర్తి చేసుకుని బయటికి వెళ్ళే వారు ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోవటానికి సిద్ధపరచటానికి జాగ్రత్తగా ఆలోచించి కావాల్సిన ఏర్పాట్లు చేస్తారు.

**అనువాదం - రమా మెల్కొటె**

*సాజిదా సుల్తానా EFL లో Ph.D చేస్తున్నారు.*
*రమా మెల్కొటె ప్రముఖ తెలంగాణా మేధావి. ఉద్యమకారులు, రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి రిటైరయ్యారు.*

# ఉర్దూ యూనివర్శిటీలో ఇంగ్లీషు చదువు

■ ఎమ్.డి.ముజీబుద్దీన్

**ఉర్దూలో చదువు కొనసాగించటానికి నేను ఉర్దూ యూనివర్శిటీలో చేరాను.**

"నేను చిత్తూరు పట్టణానికి దగ్గర చిన్న పట్టణంలో పెరిగాను. అక్కడ 300 ముస్లిం కుటుంబాలు వుంటాయి. మా వూరి బడి ఒక మద్రసా భవనంలో వుండేది. అందరికీ ఒక భవనం అవటంతో కొన్ని సార్లు పక్కనే వున్న చింత చెట్టు కింద క్లాసులు జరిగేవి. సరిగ్గా పరీక్షలకి మూడు నెలల ముందు విద్యా వాలంటీర్లు అయిన టీచర్లు వచ్చి పాఠాలు చెప్పి పొయ్యేవారు. 150 మందికి ఇద్దరు ఉపాధ్యాయులు. మా అమ్మ నాన్నలు రోజు కూలీలు. మద్రసాకు పోవటం వల్ల వాళ్లకు కొంత ఉర్దూ వచ్చు కానీ మేమే కుటుంబంలో మొదట స్కూలుకు పోయిన వాళ్ళం".

మౌలానా ఉర్దూ మద్రసా యూనివర్శిటీలో చేరే ఉర్దూ మాధ్యమం విద్యార్థులు సాధారణంగా మొదటి తరం చదువరులు అయుంటారు. వారి తల్లి తండ్రులు ఊళ్లలో రోజు కూలీలో, టీ కొట్టు, చిల్లర దుకాణాలు వంటివి నడిపే చిన్న వ్యాపారులో లేదా వడ్రంగి పని, మెకానిక్ పని, కమ్మరి పని చేసే వాళ్ళు. కొంత మంది గ్రామ మసీదుల్లో ఇమామ్‌లు. కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా, మహారాష్ట్రలలో ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో చదివి వస్తారు. కొంత మంది కాశ్మీర్ నుండి కూడా వస్తారు. ఉత్తర భారత దేశం నుండి వచ్చిన వాళ్ళు స్కూల్లో, కాలేజీలో అన్ని సబ్జెక్టులు ఇంగ్లీషులోనో, హిందీలోనో చదివి ఉర్దూని ఒక సబ్జెక్టుగా చదివి వస్తారు. ఉత్తర భారత దేశ విద్యార్థులతో పోలిస్తే దక్షిణ భారత దేశ విద్యార్థులు ఉర్దూలో మెరుగ్గా వుంటారు.

ఈ విశ్వ విద్యాలయం గురించి కాలేజీల్లో ఉపాధ్యాయుల నుండో, దూర విద్య తరగతులలో ఉపాధ్యాయుల నుండి తెలుసుకుంటారు. కొంత మంది సీనియర్ విద్యార్థులు కూడా కొంత సహాయం చేస్తారు. చాలా మంది దూర విద్య కోర్సులలో చేరి తరువాత పోస్టు గ్రాడ్యుయేషన్ కోసం యూనివర్శిటీకి వస్తారు. ఇక్కడ చేరటానికి ముఖ్య కారణాలు : ఉర్దూ మాధ్యమంలో ఉన్నత విద్యకు పరిమితమైన అవకాశాలు; తక్కువ ఫీజులు; హాస్టల్ వుండటం; ఉర్దూలో చదువు కొనసాగించగలగటం. రాజకీయపరంగా చూసినా ప్రధానంగా ముస్లిం విద్యార్థులు వుండటం వల్ల సురక్షిత ప్రదేశమని అందరి భావన. మహిళా విద్యార్థులు కూడా దీన్ని సురక్షిత ప్రదేశంగా చూస్తారు.

**కానీ ఇక్కడికి వచ్చిన తరువాత క్లాసులో ఇంగ్లీషులో ఉపన్యాసాలు వినాల్సి వచ్చింది.**

"ఇక్కడ క్లాసులు ఇంగ్లీషులో చెప్తారు. మొదట ఏమీ అర్థమయ్యేది కాదు. ఉపాధ్యాయులకి ఉర్దూ రాకపోవటం వల్ల మాకు అనువాదం చేసి చెప్పలేకపొయ్యేవాళ్ళు. మేము మా కోర్సులో మొదటి బాచ్ అయేసరికి మాకు సీనియర్లు కూడా లేరు. టీచర్లు నోట్సు కూడా ఇవ్వలేదు. అయిదు మంది మా బాచ్‌లో. మేమే పరీక్షల కోసం నోట్స్ తయారు చేసుకున్నాం. సిలబస్ అయిదు భాగాలుగా విభజించుకున్నాం. లైబ్రరీకి వెళ్లి దానికి సంబంధించిన ఇంగ్లీషు పుస్తకాలు తీసుకుని, ఇంగ్లీషు-ఉర్దూ నిఘంటువు దగ్గర పెట్టుకుని నోట్స్ తయారు చేసుకున్నాం. దానిని అయిదు కాపీలు చేసుకుని అందరూ చదువుకున్నాం".

"ఇప్పుడు లైబ్రరీకి వెళ్ళటం అలవాటుగా మారింది. ప్రతి రోజు మూడు గంటలు లైబ్రరిలో గడుపుతాను, నా సబ్జెక్టు కి సంబంధించిన ఇంగ్లీషు పుస్తకాలు చదువుతూ నా ఇంగ్లీషు మెరుగయింది. నేను వ్యక్తిగా మారాను. రెండో సెమిస్టరులో క్లాసులో చెప్పింది అర్థమవుతోంది. పరీక్షలు ఉర్దూలో రాసినప్పటికీ, చాలా మంది టీచర్లకి ఉర్దూ రాదనీ తెలుసు గనక ఇంగ్లీషులో సైడ్ హెడ్డింగ్స్ పెడతాము. కనీసం అవి అర్థం చేసుకుని అయినా టీచర్లు మార్కులు వేస్తారని, కొంతమంది ఈ విశ్వవిద్యాలయాన్ని ఇంగ్లీషు మాధ్యమ విశ్వవిద్యాలయంగా మార్చాలని చెప్తున్నారు. అలా చేస్తే ఉర్దూ మాధ్యమ విద్యార్థులు నష్టపోతారు".

ఉర్దూ మాధ్యమ విద్యార్థులు యూనివర్శిటీ ప్రచారం చేసినట్లుగా ఉర్దూలోనే తాము క్లాసు రూంలో ఉపన్యాసాలు వినొచ్చని, పరీక్షలు రాయొచ్చని, క్లాసు రూములో జరిగే చర్చల్లో పాల్గొనవచ్చని, పుస్తకాలు చదవొచ్చని అనుకుని వస్తారు. కానీ ఇక్కడికి వచ్చిన తరువాత ఉపాధ్యాయులు ఇంగ్లీషులో పాఠాలు చెప్తారని, వారికి ఉర్దూ రాదనీ, అంతేకాక ఉర్దూ అంటే చిన్న చూపు ఉందనీ తెలుసుకుంటారు. వారికి క్లాసు రూములో అడుగుపెట్టిన దగ్గర నుండి ఇంగ్లీషు నేర్చుకోవాలనీ, క్లాసులో అసైన్‌మెంట్లు, ప్రెజెంటేషన్లు ఇంగ్లీషులో ఇవ్వాలని, పరీక్షలు ఇంగ్లీషులో రాయాలని చెప్తారు. భయపడిపోయిన విద్యార్థులు చచ్చినట్లు ఇంగ్లీషు నేర్చుకోవటానికి సిద్ధమవుతారు: తమంతట తామే కొన్ని రోజుల్లోనే ఇంగ్లీషు నేర్చుకోగలిగే పుస్తకాలు, సీనియర్ల నుండి, నగరంలో ఇంగ్లీషు పాఠాలు చెప్పించుకోవటం ద్వారా.

క్లాసు రూములో ఉపన్యాసాలు వినటం లేదా పరీక్షలు రాయటం ఇంగ్లీషు రాకుండా అసాధ్యం అవ్వటం వల్ల వెంటనే నేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. దీనికి తోడు యునివర్శిటీ గ్రంథాలయంలో సబ్జెక్టు పుస్తకాలు కూడా కేవలం ఇంగ్లీషులోనే వుంటాయి. ఉర్దూలో వెలువడే సామాజిక శాస్త్ర జర్నల్స్ కూడా అందుబాటులో వుండవు. వాటిని ఉర్దూలోనికి అనువదించే ప్రక్రియ అనివార్యమవుతుంది. క్లాసులో టీచర్ చెప్పింది అస్పష్టంగా అర్థమయితే ఆ ఊహని బట్టి సిలబస్‌ని అనుసరించి లైబ్రరిలో అందుబాటులో ఉన్న పుస్తకాలని చదివి నోట్స్ తయారు చేసుకుంటారు.

అనేక కోర్సులలో విద్యార్థులు తమంతట తామే సమిష్టిగా నోట్స్ తయారు చేసుకుని వాటిని తమ తరువాత చేరిన విద్యార్థులకి అందించారు. క్లాసు అసైన్మెంట్ ఉర్దూలో లేదా ఇంగ్లీషులో ఇచ్చే అవకాశం వుంది కానీ, సంవత్సర పరీక్షలు ఉర్దూలో నే రాయాలి. టీచర్లకి ఉర్దూ రాదు కాబట్టి విద్యార్థులు జవాబులు రాసేటప్పుడు ఇంగ్లీషు కూడా కలిపి రాస్తారు. ఉర్దూ రాని టీచర్లు పేపర్లు దిద్దిన సందర్భాలలో ఫెయిల్ అయిన విద్యార్థులు చాలా మంది వున్నారు. తిరిగి వాల్యుయేషన్ చేసే అవకాశం లేకపోవటం విద్యార్థులకి పెద్ద సమస్య. పి.హెచ్.డి థీసెస్ కూడా ముందు గైడ్ కోసం ఇంగ్లీషులో ఇవ్వాలి. దీని కోసం సీనియర్లు, ఇంకా చాలా మంది శ్రేయోభిలాషులు సహాయం చేస్తారు. ఒకసారి గైడ్ సరే అన్న తరువాత, యూనివర్శిటీ నిబంధనల ప్రకారం దాన్ని ఉర్దూలో రాసి సమర్పించాలి.

విద్యార్థులకి ఇంగ్లీషు అంటే విముఖత లేదా వ్యతిరేకత లేదు. అయితే యూనివర్శిటీలో అది నేర్చుకునే అవకాశాలు, వనరులు సమకూర్చకుండా 'నేర్చుకోండి, నేర్చుకోండి' అని బలవంత పెట్టటం పట్ల వుంది. మీ చావు మీరే చావండి అని వదిలేస్తున్నారు. దాదాపు 50 మంది విద్యార్థులు పొద్దున్నే 7 గంటలకి తిండి కూడా తినకుండా యునివర్శిటీ నుండి 25 కిలోమీటర్ల ప్రయాణం చేసి ఇంగ్లీషు నేర్చుకోవటానికి రామకృష్ణ మఠానికి వస్తుంటారు. ఇటువంటి అవకాశం యునివర్శిటీ లోనే ఎందుకు కల్పించకూడదు అని వారి ప్రశ్న.

*అన్వేషికి సమర్పించిన రిపోర్టు 'MANUU లో ఉర్దూ మాధ్యమం మరియు మద్రసాల నుండి వచ్చిన విద్యార్థుల సమస్యలు' నుండి.*

**అనువాదం : ఏ..సునీత**

ఎమ్.డి.ముజీబుద్దీన్ హైదారాబాదు విశ్వవిద్యాలయంలో *Ph.D* చేస్తున్నారు

# భాష అనంతం :

## వేముల ఎల్లయ్యతో ఇంటర్వ్యూ

■ ఎన్.మనోహర్ రెడ్డి, ఆర్.శ్రీవత్సన్

***ప్ర : దళిత సాహిత్యంలో చాలావరకు ఇంచు మించు ప్రామాణిక తెలుగునే వాడినట్లు నాకు అనిపిస్తుంది. మీరు రాసిన తరువాత మీ భాష అర్థం కాలేదని చాలా మంది అన్నారు. కానీ మీరు భాషా ప్రయోగంలో ఒక కొత్త ఒరవడిని తీసుకొచ్చారు. మీరు అలా ఎందుకు రాయాల్సి వచ్చిందో దాని గురించి చెప్పండి.***

జ : మేము అకడమిక్స్‌కి వచ్చే వరకు మాకు సంబంధించిన భాష సబ్జెక్టుల్లో లేదు, లేనప్పుడు అయి చూసిన తర్వాత ఈ భాష మాది కాదని మేము రైటింగ్స్ చూయించాలని, మా భాషలో, తెలంగాణా డైలెక్ట్, మాదిగ భాష అట్లా రాయవలసి వచ్చింది, రాసినా!

***ప్ర : దానికున్న ప్రాముఖ్యత ఏంటి? ఆ భాష రాయడం వల్ల ఉపయోగం ఏంటి?***

జ : భాష వల్ల జాతికి నిర్మాణం జరుగుతాది. జాతి అంతరించిపోతున్న మూలాలు భాష మీదనే ఆధారపడి ఉంటాయి కాబట్టి అది తీసుకురావలనుకున్నం. తీసుకొచ్చినం.

***ప్ర : అప్పటి వరకు దళిత సాహిత్యంలో వచ్చిన భాష ఆ పని చేయలేదా?***

జ : అప్పటి వరకు వాళ్ళు ఒకరు చెప్తే విని, ఆ కవిత్వ నిర్మాణాలు పాటించిండ్రు. వారికి సొంతం వచ్చినవి కావు. తమ భాషని తక్కువగా వాడిండ్రు. పూర్తి అవగాహనతోటి వచ్చిన భాష కాదు. ఉదాహరణకి శివారెడ్డుండు. శివారెడ్డి శిష్యుడు మద్దూరి నగేశ్‌బాబు. కాని ఈయన పెట్టిన టైటిల్స్ ఇంచు మించుగా ఆయన టైటిల్సుకి దగ్గరయ్యేది. ఆ క్రమంలో నాగప్పగారి సుందర్రాజు వచ్చిండు, 'మాదిగోడు' టైటిల్ తెచ్చిండు. మద్దూరి నగేశ్‌బాబు 'కాకి' పుస్తకంలో 'నందిలాగ నాలుగు నాళ్ళు బతికేకంటే కాకిలాగ కలకాలం బతకా'లన్నడు. కాకి అని పండితులు కూడ అన్నరు కాని మాదిగోడు అని మాదిగోడే అన్నడు, పండితులు అనలే.

***ప్ర : సుందర్రాజు వాడిన భాష?***

జ : అది రాయలసీమ మాదిగ భాష. అయితే 'కక్క' పుస్తకం సుందర్రాజు కంటే ముందే వచ్చింది. అప్పటికి ఆయన ఇంకా స్టార్ట్ కాలే. మమ్మల్ని దూరం నుంచి చూసేటోడు. అప్పుడే మేం ఉద్యమాలు చేస్తుండే వాళ్ళం. ఆయన ఉద్యమాల కెళ్ళి వచ్చినోడు కాదు. అకడమిక్‌గా, సెంట్రల్ యూనివర్శిటీ కుల రాజకీయాలకెళ్ళి వచ్చినోడు, రాయలసీమలో కుల రాజకీయాలెక్కువ, ఇక్కడ విప్లవ రాజకీయా లెక్కువుంటయి.

***ప్ర : అంటే మాలవాళ్ళు, మాదిగ వాళ్ళు ఒక భాష మాట్లాడరా ఊర్లల్ల? మా వూర్లో మాదిగ, మాలోల్ల ఇండ్లన్నీ ఆనుకొని ఉంటయి, వాళ్లంతా ఇంచుమించు ఒకే భాష. మాట్లాడతరు.***

జ : లేదు. మాదిగ వాళ్ళల్ల గూడ సబ్‌క్యాస్టులుంటయి తేడాలుంటయి. చదువుకున్న మాదిగోడుంటడు, చదువుకోని మాదిగోడుంటడు. కార్జముంటదనుకో కార్జాన్ని మాలలు తినరు. తినరంటే దానికి సంబంధించిన పదాలు కూడ ఉండవన్నమాట. పశువులను కోయడం మేమే చేస్తం. వాళ్ళు కొయ్యరు.

***ప్ర : తెలుగు సాహిత్యం మొత్తంలో చూస్తే నేను అనుకోవడం మీరు వాడిన భాష మాలలకంటే కూడా, మిగతా అప్పర్ క్యాస్ట్ కే పెద్ద దెబ్బ. ఛాలెంజి వాటికే ఉంది. ఏమంటారు?***

జ : అవును వారికే దెబ్బ.

***ప్ర : ఎందుకంటే అప్పటి వరకు పత్రికల్లో వున్న భాష, పుస్తకాల్లో వున్న భాష అంతా అప్పర్ క్యాస్ట్ భాషే కాబట్టి. మీరు రాసినప్పుడు ఎలాంటి రెస్పాన్సెస్ వచ్చాయి?***

జ : మా జనాభా కదా, మా వాళ్ళే మా భాషను ఎక్కువ చదివి మమ్మల్ని ఇన్‌స్పైయిర్ చేసిండ్రు. అండ్ల రాజీ పడేదుండదు. వాళ్ళు చేయపట్టికే మేము ఇప్పటికీ రాస్తున్నం. చదువుకున్న లెక్చరర్స్ టీచర్స్ ఎంత మందుంటరు? వంద మందుంటరు. అంటరాని వసంతం కళ్యాణ రావ్ రాసిండు. ఆయన ఒక స్కూల్ల టీచర్. వాళ్ళొక ఇరవై మందుంటరు. మేము వేల మందుంటం. నేను ఎఫ్.సి.ఐ గోడౌన్ల హమాలివర్కర్‌గా పనిచేస్త. అండ్ల మూడు వందల అరవై మందుంటం. వీళ్ళంతా నా భాష చదివిండ్రు కాబట్టి భాష నిర్మాణం మా దగ్గరయితది.

***ప్ర : వాళ్ళంత మీరు రాసింది చదివారా?***

జ : చదివిండ్రు. వాళ్ళు మళ్ళా మాకు కొంత చెప్తరు గదా 'ఇది గిట్ల తక్కువయిందని'. పబ్లిష్ కాక ముందు, పబ్లిష్ అయినంక కూడా చదివిండ్రు. మామూలు చదువుకున్నాల్లకంటే వాళ్ళు చెప్పిండ్రు కాబట్టే మళ్ళీ మేము రాస్తున్నం. లేకపోతే రాయలేం. వీళ్ళు హర్టు చేస్తరు, మనం మల్లా రాయకుండా చేస్తరు. ఒక పేరున్న అగ్రకుల రచయిత్రికి ఫస్టు స్క్రిప్టు ఇచ్చినం. నేను ఇయ్యాలని ఇయ్యలే; శిఖామణి ఎల్లయ్యకు డబ్బుల్లేవు కాబట్టి ***(కక్క)*** నవలెయ్యనీకి చదివి ఏమన్నా సాయం చేస్తరా అని ఆమెకిచ్చిండ్రు. తీసుకుని రెండు మూడు నెలలు పెట్టుకోని నాకు అర్థం కాలే, నేను చదవలేను అని రిటర్న్ ఇచ్చింది. అట్ల ఆమెకు అర్థం కాలేదని నేనూర్కొలేను గదా. మా వూర్లో వాళ్లని, వీళ్లని అడిగిన. కలేకూరి ప్రసాద్‌ని అడిగిన. ఇద్దరం ఫ్రెండ్‌షిప్‌గా వుండే. పేపరు ఖర్చు మూడు వేలు ఇచ్చిండు. చాలా మంది అన్నరు, మాకీ భాష అర్థం కాదు అని. దళితులు, దళిత ఇంటలెక్చువల్స్ ఎక్కువ అన్నరు. మాదిగలు కూడా అన్నరు, అర్థం కాదు, అట్ల ఎందుకు రాయాలె అని. మా హమాలి యూనియన్ వాళ్ళన్నరు గదా, 'బాగుంది ఇట్లనే రాయాలి, ఇట్ల రాస్తెనే మాకు అర్థమైతది. పది మంది కోసం ఎందుకు రాయాలి? మేమంతా వున్నం కదా, మేమంతా చదివనం కదా' అన్నరు. వాళ్ళందరు దాదాపు ఆరు, ఏడు వరకు చదివి వుంటరు, తెలుగు చదవుతరు.

***ప్ర : మీరు బాగ చదువుకున్నారు గదా, అంతా ఇంచు మించు సిలబస్, రాతలు, భాషా అంతా ప్రామాణిక భాషలోనే వుంటాయి గదా, ఆ చదువు మీకు రాయటానికి అడ్డు రాలేదా?***

జ : నేను ఉస్మానియాలో ఎమ్.ఎ చేసిన. ఇప్పుడు పి.హెచ్.డి చేస్తున్న. మధ్యల విశ్వనాధ సత్యనారాయణ రాసిన **వేయి పడగలు** నవల కూడా చదివిన. మంచిగనే అర్థమయింది. కానీ అది మనకు సంబంధించింది కాదు, అట్లని మనం వాళ్ళను తక్కువ చేసేది ఏముండదు. దాన్ని నేను సెకండరీగ తీసుకున్న. నేను రాసేటప్పుడు కష్టాలేమీ రాలే గానీ, కొద్దిగా ఓపిక చేసుకొని రాయాలె. రాసిన తర్వాత పదిసార్లు మళ్లీ రాస్తుండాలె. పది, ఇరవై సార్లు ఎడిటింగ్ అయితుంది. ఒక్కొక్కసారి దాన్ని చింపేసుకోవచ్చు కూడా.

***ప్ర : మీ మాటలు అర్థమయితయి కానీ రైటింగ్ ఎందుకంత కష్టంగా ఉంటుంది?***

జ : ఇప్పుడు మీరు రాయటానికి నేను రాయటానికి తేడా వున్నది కదా. మా భాష పది మంది కోసం కాదు. అట్లని ఆ పది మందిలో ఉన్న మీ ఇద్దరిని తీసి వేయలేను గదా. మీ కోసం అర్థమయ్యేట్లు మాట్లాడుతున్న కానీ, మా కోసం వేల మందున్నరు గదా, వాళ్ళ కోసం నేను రాస్తే తప్పేంది?

***ప్ర : మీరు కులంలో వుండే మనుషులలోనే కాకుండా బయటి ప్రపంచంలో చాలా టైమ్ స్పెండ్ చేసినారు. చదువుకున్నారు. స్కూల్ అయిపోయింది. కాలేజీ అయిపోయింది. యూనివర్శిటీ అయిపోయింది. దీంతో మీ మీ భాషలోనూ మార్పు వచ్చి వుంటుంది. మీ వూర్లో ఏమీ చదువుకోని వ్యక్తికీ, మీకూ చాలా తేడా వుంటది. ఆయనకీ, మీరు మాట్లాడే భాషకీ తేడా వుంటుంది. మేము ఏమడుగుతున్నామంటే ఆయన మాట్లాడే భాషలో రాయాలంటే ఈ అప్పర్ క్యాస్ట్ ఎడ్యుకేషన్ వాతావరణంలో వచ్చిన దాన్నంతా వదలగొట్టు కోవాలి గదా?***

జ : సులభమే. ఈయన (మా ఊరి మనిషి) నా దగ్గరికొచ్చిండు గదా, ఈయన నాలాగ తయారు కావలెగదా, కాబట్టి నేను మాట్లాడేది ఇంటుండడు గదా, మళ్ళీ ఈయన పట్టుకొచ్చిన భాష నా దగ్గరి కొస్తది, నేను పట్టుకొచ్చిన భాష

నీ దగ్గరి కొస్తది, ఇట్ల చేస్తుంటది భాష నిర్మాణం. వాళ్ళ భాషను తీసుకుంటం. వాళ్ళు మమ్మల్ని అనుకరిస్తరు. భాష ఎవరి సొంతం వుండదు గదా. మనిషి మారుతుంటే భాష మారుతుంటది గదా.

***ప్ర : మీరు మాట్లాడే భాషలో బూతులుంటయి అని కొంత మంది ఎగతాళి చేయటం, లేకపోతే నీచంగా చూడటం జరుగుతోంది. దానికి మీరు ఏం సమాధానం చెపుతారు?***

జ : వాళ్ళతోని మనకు సంబంధం లేదు గదా.

***ప్ర : ఇది సాహిత్యం కాదు, దీంట్లో అన్ని బూతులున్నయి అంటరు కదా?***

జ : మంచి రాసినోనికి కూడా అంటరు. కళ్యాణరావ్ మంచి ఆంధ్ర భాషలోనే రాస్తడు. దళిత కవులు వాడేం కవి అని అంటరు.

***ప్ర : సాహిత్యం అంటే అకాడమీలో వుండకూడదు. శ్రమ చేసే వాళ్ళ భాషలుంటాయి కదా, దాంట్లో బూతులు తిట్లు ఎక్కువుంటయి అంటారు, అది లిటరేచర్‌లో రావాల్నా రాకుడదా?***

జ : లిటరేచర్‌లో రావాలి, అవి వస్తేనే భాష తేలిపోతది, ఈ భాష ఎందుకు మాట్లాడ వలిసి వచ్చింది అని అప్పుడు ఆలోచిస్తరు. నేను మనిషి. నీవు మనిషే. ఎందుకు మాట్లాడుతుండు, వానికి కోపం వుందా, సంతోషం వుందా అని తెలవాలే గదా నీకు.

***ప్ర : ఎందుకు? కోపం చూపించాలంటే బూతులే మాట్లాడాల్నా? దాని వల్ల ఏమయితది?***

జ : సంతోషముంటది. విషయం బయటికి వస్తుంది గదా, ఇప్పుడు నేను నిన్ను దెంగుతా అంటా, ఎందుకు దెంగుతా అన్నవనుకో. నువ్వు నాకు మంచిగనిపిస్తునవు అంట. సంతోషముంటద, నన్ను ఎందుకు దెంగుతవురా లంజ కొడుకా అని అంటరు. ఏదో ఒకటి జరుగతది పంచాయతీ. అప్పుడు మనకు మంచి కావాల్నా, చెడు కావాల్నా అనేదుంటది. గొడవుంది, మేలుకూడా వుంది. ఇది తెలియక మీది చాలా ఛండాలమయిన భాష అని అన్నరు. ఛండాలం ఎట్లయింది అని నేనొచ్చి 'నల్లగిరితోని మాట్లాడుతవు కదా అది ఛండాలం ఏం కాదు మంచిగ కూడ చేసుకోవచ్చు' అన్న. పశువు పెండ వుంది, అది రోడ్డు మీద వుంటది. దాన్ని మంచిగ లేదు, వాసన వస్తుంది అంటరు. దాన్ని మనం వాకిలి వూకి, సాంపి జల్లి వేస్తం గదా అప్పుడది వాసనుంటదా, మంచిగుంటది శుభ్రత అయింది కదా, శుభ్రత అనేది కూడా వున్నది అని మీకు తెలవాలి కదా. మలినం ఒకటే అనుకుంటున్నం దానివల్ల వంద మేల్లు కూడా జరుగుతయి కద.

***ప్ర : నేను రాస్తేనే అందరికీ అర్థం అవుతుంది, అప్పుడే కుల నిర్మూలన జరుగుతుంది అని అన్నారు, కాని మీరు రాసింది చాలమందికి సొసైటీలో అర్థం అవకుంటే మీరు రాసిన వుద్దేశం (పర్‌పస్) ఎలా సాధ్యమవుతుంది అనే ప్రశ్న వస్తుంది గదా.***

జ :నన్ను అడిగేటోళ్ళలో ఇంగ్లీష్ తెలిసినోళ్ళున్నరు గదా, వాళ్ళకు ఫస్టు ఇంగ్లీషు రాలేదు కదా, మరి నువ్వు ఇంగ్లీషు నేర్చుకుంటవు కాని నా భాష నేర్చుకోవా, నువ్వు నేర్చుకోక నన్ను అనటమేమిటి?

***ప్ర : ఒక రచయితగా మీరనేది ఏంటంటే 'నా అణిచివేత నువ్వు తెలుసుకోవాలంటే, దానికి నా భాషకూడ నేర్చుకోవాలి, నేర్చుకోక పోతే, ఆ కృషి నువ్వు చేయకపోతే అర్థం చేసుకోవటం లేదు అని. అవునా?.***

జ : అవును.

***ప్ర : అంటే మీ మాటల్లో చెపితేనే ఎటువంటి అణిచివేత జరుగుతుందో తెలుస్తుంది?***

జ : అవును, మీకు తెలుస్తుంది. నిజమే కదా అని కంక్లూషన్‌కి వస్తరు. కృశ్చన్ చేసే వాని దగ్గర కూడ వాదించగల్గుతవు.

***ప్ర : మార్క్సిజంలో, దళిత్ థియరీలో కూడా అణిచివేత వుంటుందని వుంది కదా, మీ భాషలోనే అది ఎందుకు రావాలి?***

జ : ఉద్యమాలలో కూడా మేమే వున్నాం కాబట్టి. క్రింది క్యాడర్ అంతా మేమే కదా. కూలి పని నుండి ప్రొఫెసర్ వరకు మేము వస్తున్నం అనుకో, వస్తున్న కొద్దీ కులం కూడా అలాగే వస్తుంది. మేము మాట్లాడితేనే కుల నిర్మూలన సాధ్యమవుతుంది. మమ్మల్ని మాట్లాడనియ్యకుంటే ఆగుతది కదా? అప్పుడు వాళ్ళు కోవర్టులు అవుతరు. ఆయన చెప్పింది వినకుంటే ఆ సందిగ్ధత, అనుమానం శత్రువుకి దారి ఇస్తయి. కింద స్థాయిలో పని చేసే వాళ్ళలో అనుమానం వస్తది. వీళ్ళేమంటరు? చెప్పిందే చెయ్యాలె అని. నాకు మంచిగుండదు. శ్రమకు తగ్గ ఫలితం ఉండాలె. ఫలితం అంటే డబ్బు ఒక్కటే కాదు. వంద రకాలుంటయి.

***ప్ర :స్కూళ్ళలో భాషలో మార్పు రావాలనే విషయంపై మీ అభిప్రాయం ఏమిటి?***

జ : మాకు సంబంధించి కుల కథలు సబ్జెక్టుగా వెళ్ళిపోవాలి, భాష అంతా అందులో వుంది. డక్కలోడు జాంబవ పురాణం చెప్తడు, చిందోడు చెప్తడు, ఈ రెండు పురాణాలల్ల తేడా వుంటది. డక్కలోడు చెప్పేది ఇంకా కింద వుంటది. చిందోడు చెప్పేది మాకు దగ్గరుంటది. ఈ రెండింటికి పోలిక వచ్చినప్పుడు ఒక సౌందర్యమైన భాష వస్తది. క్రింది నుంచి వచ్చిన కథలన్నీ సబ్జెక్ట్‌లోకి వెళ్ళిపోతే భాష స్కూల్ భాష వస్తది.

***ప్ర : ఇప్పుడున్న స్కూల్ భాషల్లో క్రింది కులాల పిల్లలందరికీ మాట్లాడి నేర్చుకోవటం చాలా కష్టమవుతోంది. ఈ భాషలో వస్తే నేర్చుకోవడం ఈజీ అవుతుంది.***

జ : ఈజీ అవుతుంది, ఇంగ్లీషు మీడియం తగ్గిపోతుంది. ఇది నేర్చుకొంటారు.

***ప్ర : చదివిన తర్వాత వుద్యోగం రావాలంటే ఇంగ్లీషు మీడియం రావాలి కదా?***

జ : వుద్యోగం వచ్చేటోడు వుద్యోగానికి పోతడు, భాష అనేది ఆగదు కదా, భాష నిర్మాణం అనేది వచ్చేస్తునే వుంటది కదా, ఇంగ్లీషులోకి మన పదాలు కూడా వెళ్ళిపోతయి కదా, అప్పుడు వానికి తెలుస్తది కదా. చిందు అనే వ్యక్తి వుంటడు మద్దెలనేది వుంటది అని. అక్కడ డ్రమ్స్ అంటరు కదా. ఇదే ఎంప్లాయిమెంట్ అని ఎందుకు అనుకుంట లేరు?

***ప్ర : స్కూల్ భాషలోకి రావటానికి పూర్తిగా నాకైతే సమ్మతమే కాని ఈ మోడర్న్ వుద్యోగంలో రికార్డులు రాయటం లాంటి రకరకాల పనులుంటయి కదా, దానికి ఒక స్టాండర్డ్ లాంగ్వేజ్ కావాలంటరు కదా?***

జ : ఇప్పుడు దళిత భాష క్రింది భాష. వీనెనుక వీని తమ్ముడు వస్తుండు కదా వీడు భాష మోసుకొస్తుండు కదా, ఇదంతా ఎంప్లాయిమెంటుకే కదా, దీనికోసం దాన్ని ఆపటం తప్పుకదా. ...అంటే తమ్ముడు వచ్చేదానికి ఈ భాష వుండాలి. తమ్ముడు వద్దనుకోని వీడు ఈడికి పోయిండా, మానవ సంబంధాలు పోయినయా, మనిషి కాదా వీడు, పశువుకు సంబంధించిన భాష కూడా వుంటది.

***ప్ర: అంటే మీరనేది స్కూళ్ళలో కూడా స్టెప్ బై స్టెప్ భాష మార్చాలి అని?***

జ : భాష ఇంటింటికి తేడా వుంటది. నేను ఎమ్.ఏ చేసిన, మా అన్న వున్నడు నాకంటే పెద్దోడే. టెన్త్ వరకే చదివిండు. ఆ భాష అక్కడి వరకే వుంటది. మళ్లీ ఆయన పిల్లలు చదువుకుంటరు. అప్పుడు నావెంబడి వస్తుంటరు ఇక్కడికొచ్చినప్పుడు ఇంగ్లీషు మీడియం దాకవస్తదు. ఎంప్లాయిమెంట్ ఇక్కడనే వుంటది. ఎంప్లాయ్‌మెంట్ వస్తలేదని దీన్ని ఆపితే ఎట్లా వుంటది. అంటే చదువు అనే నిచ్చెనను కట్ చేయకూడదు. ఎంప్లాయ్‌మెంట్ అని కట్ చేస్తే దారి దొరుకత లేదు. భాష అనంతం అంటే మార్పు నిరంతరం వుంటుంది, ఆ మార్పుని మనం తీసుకరావాలి. మార్పు తీసుకరాకుండా, ఈ చదువుకు ఎంప్లాయ్‌మెంట్‌కు సంబంధం లేదంటే ఎట్ల, వీడు ఇక్కడి నుంచి తయారయి వచ్చినోడే కదా.

***ప్ర : కులం గురించి, తన సంస్కృతి, తన భాషా ఇట్లాంటి వన్ని రాసుకోవడం వల్ల ఇప్పటి వరకూ ఉన్న దళిత పాలిటిక్స్ కులాన్ని నిర్మూలించటం అనేది కాకుండా, ఇప్పుడు కులాన్ని ప్రతిష్టించడంలాగ దాన్ని గట్టిగా నిలబెట్టటం లాగా అవుతుందని ఒక అపవాదు కూడా వుంది. ఇలాంటి భాషను తీసుకొచ్చి రాయడం వల్ల ఈ భాష వేరు దీనికి ఈ కులంలో వున్న మనుషులకు విడదీయరాని బంధం వుందన్నట్టు చెప్తున్నాం. కులం పోవాలనే ఉద్దేశంలోనే దళిత సాహిత్యం అంతా పుట్టుకొచ్చిందని మనం అనుకుంటున్నం. మరి దానికి, దీనికి కొంత విభేదం వున్నట్టు అనిపిస్తుంది కూడా.***

జ : విభేదం ఏం లేదు. ఇప్పుడు ఇది మేం రాస్తున్నాం కాబట్టే ఇది మీ అందరికి తెలిసింది గదా, మరందరికి తెలిసింది కాబట్టి వీళ్ళకొన్ని బాధలున్నయి గదా కులం నిర్మూలన జరగాలనే ఐడియా మీకొస్తది. ఇవేం మేం మాట్లాడకపోతే, రాయకపోతే మీకు తెలియదు గదా. కుల నిర్మూలనకు దారి తీయటానికే భాషను వాడుతున్నం. కుల నిర్మూలన జరుగుతది.

*తెలంగాణకు చెందిన వేముల ఎల్లయ్య ప్రముఖ దళిత రచయిత.*

*ఆయన నవలలు కక్క, సిద్ధి భాషా విషయంపై చర్చకు దారితీసాయి.*

# “ప్రామాణిక భాష” పరిధిని దాటి ఆలోచించాలి

■ దుగ్గిరాల వసంత

‘ప్రామాణిక’ భాష అంటే ఏమిటి, ‘మాండలికం లేక దేశీ’ భాష అంటే ఏమిటి అనే దాని గురించి సామాజిక భాషాశాస్త్ర సాహిత్యంలో విస్తారంగా రాయటం జరిగింది. భాషను ప్రమాణీకరించే క్రమం గురించీ, పశ్చిమ దేశాలలో ప్రత్యేకించి ఉత్తర అమెరికాలో ‘ప్రామాణిక భాష’, మాండలికం’ మధ్య నున్న వివాదాల గురించీ చాలా చర్చ జరిగింది. ప్రపంచంలోని చాలా ప్రాంతాలలో క్రమంగా రెండు, అంత కంటె ఎక్కువ భాషలు మాట్లాడుతుండటం వల్ల ‘ప్రామాణిక’ భాష, ‘మాండలికం’ గురించి ఉనికిలో ఉన్న భావాలను సవాలు చేయటం జరుగుతోంది. నేడు దృష్టి భాషల నుండి భాషలను ఉపయోగించే వారి పైకి, సామాజిక నేపథ్యం పైకి నెమ్మదిగా మరలుతున్నది. నేను ఈ వ్యాసంలో ప్రామాణిక అమెరికన్ ఆంగ్ల భాషకు, ఆఫ్రికన్ అమెరికన్ దేశీ ఆంగ్ల భాషకు మధ్య ఉన్న వైరుధ్యం పై జరుగుతున్న వాదోపవాదాల నుండీ, ఐరోపాలో పాఠశాల విద్యలో ట్రాన్స్ లాంగ్వేజింగ్ (పలు భాషలను ఉపయోగించే కొత్త ప్రక్రియ) అనే భావన నుండి నా వాదనలను ముందుకు తెస్తున్నాను.

**అమెరికన్ ప్రామాణిక ఆంగ్లం – ఆఫ్రికన్ అమెరికన్ దేశీ ఆంగ్లం**

ప్రామాణిక భాష అనేది ఆధిపత్య సమూహం అదుపు చేసే భాష. దానిని విద్యలో బోధనా మాధ్యమంగా ఉపయోగిస్తారు. అది ప్రభుత్వ విధానాలలో, ప్రింటు ప్రచారమాధ్యమం, ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమంలో కనిపిస్తుంది. ఒక భాషను అధికార భాషగా గుర్తించాలంటే అది ప్రామాణీకరించబడాలి. ఆ భాష (కోడిఫై) క్రోడీకరణ ద్వారా ప్రామాణీకరించబడుతుంది. క్రోడీకరించబడిన భాష మాత్రమే మాట్లాడే సమూహాల సమగ్రమైన కమ్యూనికేషన్ అవసరాలను తీర్చగలదని పరిగణిస్తున్నారు. ఒక భాషను మాట్లాడే ప్రజలకు అందుబాటులో ఉండే పత్రాలలో ఆ భాష క్రోడీకరింపబడుతుంది. ఆ భాషను మాట్లాడే ప్రజలు లేక సమూహం అప్పటికే ఆధునికీకరణను సాధించినదో లేక సాధించాలని ఆశిస్తున్నదో అయి వుంటుంది.

భాషాపరమైన నిబంధనలను ఏర్పరచటం ద్వారా పత్రాలను ప్రచురించటానికి సంబంధించిన నియమాలను రూపొందించే బాధ్యతను విద్యా మంత్రిత్వ శాఖ వంటి నిర్దిష్టమైన సంస్థ విద్యాపరమైన కమిటీలకు అప్పగిస్తుంది. ప్రయివేటు ప్రచురణా సంస్థలు, సంపాదక వర్గాల ద్వారా కూడా క్రోడీకరణ జరుగుతుంది. నిఘంటువులు, వ్యాకరణ పుస్తకాలు, కరదీపికలను తయారు చేసే నిపుణుల ద్వారా కూడా కోడిఫికేషన్ జరుగుతుంది. ప్రామాణీకరణ ప్రక్రియలో మూడు భిన్నమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది. (1) ఆ భాష యొక్క నిర్మాణపరమైన లక్షణాలు (2) దానిని ఉపయోగించే సమాజంలో ఆ భాష నిర్వర్తించే విధులు (3) అది ప్రజలలో రేకెత్తించే వైఖరులు. ఒక భాషను అధికారికంగా గుర్తించటం (ఉదా: ఆంగ్ల, ఫ్రెంచ్ భాషలు కెనడా దేశంలో అధికార భాషలు) ద్వారా గానీ లేక సాంప్రదాయం ద్వారా గానీ (ఉదా: అమెరికాలో తెల్లవాళ్ళు మాట్లాడే ఆంగ్ల భాష ప్రామాణిక భాష అయింది) అందరి పైనా రుద్దబడుతుంది. ఈ ప్రక్రియ వల్ల ‘సాధారణీకరణ’ జరుగుతుంది. అంటే అధికారికంగా గుర్తించిన భాషా రూపమే ప్రభుత్వ ప్రజా సాధికార రంగాల్లో చాలా వరకు స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఈ అంశాన్ని చాలా మంది భాషా శాస్త్రవేత్తలు గమనించరు. అదే దేశంలో నివశిస్తూ ఆ భాషను మాట్లాడే చాలా ప్రజా సమూహాలకు అటువంటి ‘అధికారీకరణ’ చెందిన భాష వారి అస్థిత్వానికి గుర్తుగా వుండదు. అమెరికాలో అమెరికన్ ఇంగ్లీషుకి, ఆఫ్రికన్ అమెరికన్ దేశీ ఇంగ్లీషుకి మధ్య జరుగుతున్న వాదోపవాదం సామాజిక భాషా శాస్త్రవేత్తలలో ప్రామాణిక భాషకు, మాండలికానికీ మధ్య ఉన్న బేదాభిప్రాయానికి సాధారణ ఉదాహరణగా ఉల్లేఖించటం జరుగుతుంది. భాష ప్రామాణీకరణ ప్రక్రియను, దాని వెనుక ఉన్న ఉద్దేశాలను, ప్రామాణీకరించబడిన భాషా వినియోగాన్ని కేవలం భాషాపరమైన కోణం నుండి మాత్రమే కాక విస్తృత సామాజిక నేపథ్యం నుండి పరిశీలించాలనే కొద్ది మంది భాషా శాస్త్రవేత్తలతో నేను ఏకీభవిస్తున్నాను. ఎందుకంటే, భాష అనేది దానిని ఉపయోగించే వివిధ గ్రూపులకు సంబంధించిన విషయం, అది కేవలం భాషా శాస్త్రపరమైనది మాత్రమే కాదు. ఆఫ్రికన్ అమెరికన్ దేశీ ఇంగ్లీషు గురించి జరిగిన కొన్ని వాదోపవాదాలు ఈ అంశం యొక్క ప్రాముఖ్యతను వివరించటంలో సహాయపడతాయి.

డిసెంబరు 1996లో కాలిఫోర్నియాలోని ఓక్‌లాండ్ పాఠశాల బోర్డు విద్యా విధానాన్ని మార్చబోతున్నట్లు ప్రకటించింది, అత్యధికులైన పాఠశాల విద్యార్థుల స్వంత భాష పట్ల ఉపాధ్యాయులు ఎక్కువ దృష్టి పెట్టటం దీని ఉద్దేశమని ప్రకటించింది. పిల్లలు వారి ఇళ్లలో మాట్లాడే భాషలోని మంచి అంశాలను గుర్తించి వాటిని తరగతి గదులలోకి తీసుకొచ్చే విధంగా అధ్యాపకులకు శిక్షణ ఇవ్వబడుతుందని పేర్కొంది. పిల్లల తల్లితండ్రులు, వారి సమూహం ఈ ప్రయత్నంలో భాగం పంచుకోవటం, ఇందు కోసం నిధుల కేటాయింపును పెంచటం, అత్యధిక పిల్లలు వారి ఇళ్ళలో మాట్లాడే భాషనే మాట్లాడే ఉపాధ్యాయులను నియమించే చర్యలు తీసుకోవటం వంటి సలహాలను కూడా పాఠశాల బోర్డు ముందుకు తెచ్చింది. ఈ సూచనలను వార్తా పత్రికలు ఎగతాళి చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. “అవి వెక్కిరించాయి, కోపంతో ఊగిపోయాయి, రగిలిపోయాయి” అని కొంత మంది మేధావులు పత్రికల స్పందనను వర్ణించారు. మీడియా ఈ విధంగా ఎందుకు ప్రతిస్పందించింది? ఎందుకంటే ఇళ్ళలో మాట్లాడే భాష అని బోర్డు ప్రస్తావించినది ఓక్‌లాండ్‌లో ఉపయోగించే ఆఫ్రికన్ అమెరికన్ దేశీయ ఆంగ్ల భాష. ఓక్ లాండ్ శాన్‌ఫ్రాన్సిస్‌కో బే తూర్పు తీరంలో ఉన్న ఒక పేద నగరం. అక్కడ నివసించే జనాభాలో 50 శాతం కంటే ఎక్కువగా వుంది ఆఫ్రికన్ అమెరికన్లు. ప్రామాణిక అమెరికన్ ఆంగ్ల భాషను మాట్లాడే చాలా మంది, ఆఫ్రికన్ అమెరికన్లు మాట్లాడే భాష మంచి ఇంగ్లీషు కాదనీ, దాని నిండా వ్యాకరణ దోషాలు, ఉచ్ఛారణా దోషాలు వున్నాయనీ నమ్ముతారు. న్యూయార్క్ టైమ్స్ పత్రిక దానిని “నల్లయాస” అని పేర్కొంది. చాలా మంది వ్యాఖ్యాతలు ఆఫ్రికన్ అమెరికన్ ఆంగ్ల భాషని సిగ్గుపడాల్సిన భాషగా పరిగణించారు. వారు కాలిఫోర్నియా పాఠశాల బోర్డు విద్యా విధానంలో మార్పు గురించి చేసిన ప్రకటనలోని ముఖ్యమైన అంశాన్ని విస్మరించారు. చికాగోలోని కళాశాల విద్యార్థులు ఆఫ్రికన్ అమెరికన్ దేశీ ఆంగ్ల భాషకు, ప్రామాణిక అమెరికన్ ఆంగ్లంలోని వ్యాకరణానికి మధ్య వైరుధ్యం గురించి నేర్చుకున్న తర్వాత ప్రామాణిక ఆంగ్ల భాషలో వ్రాసే నైపుణ్యాన్ని పెంచుకోగలిగారు అనే విషయాన్ని కూడా వారు విస్మరించారు. ప్రజాభిప్రాయం ఎంత వ్యతిరేకంగా వ్యక్తమయిందంటే 1997 జనవరి 15వ తేదీ నాటికి పాఠశాల బోర్డు తన ప్రకటనను సవరించుకోవలసి వచ్చింది, పిల్లలు తమ ఇళ్ళలో మాట్లాడే భాషలో బోధించాలనే అంశాన్ని తన ప్రకటన నుండి తొలగించవలసి వచ్చింది. ఆ పాఠశాల ఉపాధ్యాయులలో కొంత మంది బయట స్వయంగా ఆఫ్రికన్ అమెరికన్ ఆంగ్ల భాషను మాట్లాడతారు అనే విషయాన్ని కూడా విస్మరించవలసి వచ్చింది. గతంలో మిచిగన్ రాష్ట్రంలోని ఆన్ ఆర్బర్‌లో అదే విధమైన సవరణ, 1978లో కోర్టులో ఆమోదం పొంది

గెలిచింది కాని క్లాసు రూములో విఫలమయింది, ప్రామాణిక ఆంగ్ల భాషలో నిర్వహించిన పరీక్షలలో నల్ల విద్యార్థులు ఫెయిలవటం కొనసాగింది. ఇటీవల 2012లో, అమెరికాలో రంగు (నల్ల) ఉపాధ్యాయులు సంఖ్య పెరిగిన కారణంగా ఆఫ్రికన్ అమెరికన్ ఆంగ్ల భాష పట్ల వైఖరిలో కొంత మెరుగైన మార్పు వచ్చినట్లు పరిశోధకులు నివేదిస్తున్నారు. ఉపాధ్యాయులకు భాష పట్ల వుండే వైఖరులను ప్రత్యేకించి సవాలు చేసే ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని వారు సూచించారు.

1960లలో అమెరికన్ కోర్టులలో 'ప్రామాణీకరించబడని ఆంగ్ల భాష–తర్కం' గురించి వాదించిన ప్రముఖ సామాజిక భాషా శాస్త్రవేత్త విలియం లాబోవ్ 2010లో ఈ అంశంపై చర్చను ప్రబలమైన మలుపు తిప్పటానికి ప్రయత్నించాడు. ఆయన దృష్టిలో మనం వేసుకోవలసిన ప్రశ్న ఏ భాష ప్రామాణికమైనది, ఏ భాష మాండలీకం లేక దేశీయం అనేది కాదు. ఆఫ్రికన్ అమెరికన్ ఆంగ్ల భాష ఒక అంతరించిపోతున్న మాండలికం కాదనే వాస్తవాన్ని అందరూ గుర్తించాలని ఆయన అందరి దృష్టికి తెచ్చాడు. నిజానికి నివాస ప్రాంతాలను వేరు చేయటంతోపాటు అమెరికాలోని లోతట్టు నగరాల సామాజిక జీవితంలో పేదరికం పెరగటం తదితర లక్షణాల వల్ల ఆ మాండలికం మరింత వికసిస్తున్నది. ఆఫ్రికన్ విద్యార్థులు చదవటం, రాయటం నేర్చుకోవటంలో ఎందుకు విఫలమవుతున్నారో అర్థం చేసుకోవాలన్నా, దానికి పరిష్కారం ఆలోచించాలన్నా ఆఫ్రికన్ అమెరికన్ దేశీయ ఆంగ్ల భాషను మాట్లాడే వారి ఉనికే ఆపదలో పడటం గురించి (వారు మాట్లాడే భాష గురించి కాక) ఆలోచించక తప్పదని వాదిస్తూ ఆయన అనుభవపూర్వకమైన రుజువులను ముందుకు తెచ్చాడు.

లాబోవ్ ఏమనన్నారంటే: "ఆఫ్రికన్ అమెరికన్ దేశీయ ఆంగ్ల భాష ప్రస్తుత రూపం ప్రపంచం ముందెన్నడు చూడని తీవ్ర జాతి వివక్ష ఆధారంగా మనుషులను విడదీయటం అనే చట్రంలో జరిగింది. పౌరహక్కుల ఉద్యమం పురోగమించిన కొద్దీ నల్లజాతి ప్రజలలో ఎక్కువ భాగం లోతట్టు నగరాల నుండి బయటికి రావటానికి మార్గాలతోపాటు వారికి విద్య, ఉపాధి అందుబాటులోకి తెచ్చింది. నివాస ప్రాంతాలను వేరుచేయటమనే సమస్యపైనే మనం కేంద్రీకరించి ఆలోచిస్తే ఆఫ్రికన్ అమెరికన్ దేశీయ ఆంగ్ల భాష ఇతర మాండలికాల వైపు మళ్ళగల అవకాశం కనిపిస్తుంది. ఫిలడెల్ఫియాలో పాఠశాలలను విలీనం లేక ఏకీకరణ చేసిన కొంత కాలం తర్వాత నల్లజాతి పిల్లలు తెల్లవారు ఉపయోగించే దేశీ భాషలోని అంశాలను ఉపయోగించే స్థితికి చేరవచ్చు, ఆ రకంగా తెల్లజాతిని చుట్టుముట్టే ఒక మౌలికమైన మార్పులో భాగం పంచుకోవచ్చు". 'తెల్లజాతి దేశీభాష' అనే పదాలను ఆయన ఉద్దేశపూర్వకంగా ఉపయోగించటాన్ని గమనించాలి, ఇది భాషా శాస్త్ర విద్యాపరమైన చర్చలలో చాలా అరుదుగా ఉపయోగించటం జరుగుతుంది. భాషాపరమైన మైనారిటీలు మెజారిటీల మధ్య (సంఖ్యాపరంగానే కానవసరం లేదు) రెండు భిన్నమైన భాషాపరమైన విలువల వ్యవస్థల మధ్య వివాదం తలెత్తవచ్చు, కానీ భాషాపరమైన మైనారిటీలే పలు రకాల మౌఖిక సంపదను ప్రదర్శిస్తారనే అంశాన్ని కూడా గమనించాలి.

**బహుభాషా వినియోగం (ట్రాన్స్ లాంగ్వేజింగ్) అనే భావన**

21వ శతాబ్దపు ప్రపంచీకరణ జరిగిన తరువాత రకరకాల భాషల వాడకం నేపథ్యంలో భాషల సరిహద్దులలో స్పష్టత లేకుండా పోయిందనీ, భాషల గుర్తింపు, అస్తిత్వాలు అస్థిరంగా మారుతున్నాయనీ ఇంగ్లాండు, ఐరోపాలలో భాషాశాస్త్రవేత్తలు, విద్యావేత్తలు సిద్ధాంతీకరిస్తున్నారు. కొంత మంది సామాజిక భాషాశాస్త్రవేత్తలు బహుభాషా వినియోగం అనే భావనను ప్రతిపాదించారు, అంటే అధికారిక, అనధికారిక రంగాలలో అనేక భాషలను ఉపయోగించటం. ఇది సులభంగా మార్చుకోవటానికి వీలైన ద్విభాషా ప్రయోగం; దీనిలో ఏ ఒక్క భాషా ఆధిపత్యం వహించదు. ట్రాన్స్‌లాంగ్వేజింగ్ లేక బహుభాషా వినియోగం అనే ఈ భావన భాషపై గాక, భాషను ఉపయోగించే పద్ధతులపై కేంద్రీకరిస్తుంది. ఈ పదం సంకరమైన భాషను పద్ధతి ప్రకారం, వ్యూహాత్మకంగా, అనుబంధంగా, అర్థవంతంగా ఉపయోగించటాన్ని వర్ణిస్తుంది. ఈ బహు భాషా వినియోగం అనే సౌకర్యాన్ని చాలా మంది పిల్లలు అనుసరిస్తున్నారు, కాని దానికి విద్యావ్యవస్థలలో తగిన విలువ ఇవ్వటం లేదు. బహు భాషా వినియోగం కొత్త విద్యా పద్ధతుల అవసరాన్ని సూచిస్తుంది – అంటే, తరగతి గదులలో రెండు భాషలను ఉపయోగించటం, వివిధ భాషలను మాట్లాడే పిల్లలను కలగలపటం, విద్యాపరమైన భాషను ఒకటికంటే ఎక్కువ రకాలలో అభివృద్ధి చేయటం, పిల్లలు చదువులో విజయాన్ని సాధించగలిగేందుకు అవసరమైన సామాజిక భాషా శాస్త్ర భద్రత, గుర్తింపును అభివృద్ధి చేసుకోవటానికి దోహదపడగల పద్ధతులు మొదలైనవి. ఇందుకోసం కొత్త రకమైన ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాలను, పాఠ్య పుస్తకాలలో బహుళ సంస్కృతిని వివరించే పాఠాలను చేర్చే విధంగా ప్రణాళిక తయారు చేయవలసిన అవసరముంది.

**ముగింపు : తెలంగాణాలో భాషా వినియోగంపై ఆలోచించాల్సిన అవసరం**

ప్రామాణిక అమెరికన్ ఆంగ్లం, ఆఫ్రికన్ అమెరికన్ దేశీ ఆంగ్లం చుట్టూ జరిగిన చర్చ, వాదోపవాదాల నేపథ్యానికి (వ్యవస్థీకృతమైన జాతి వివక్ష) మన తెలంగాణా నేపథ్యానికి సరైన పోలిక లేకపోవచ్చు కాని రాబోయే సంవత్సరాలలో కొత్త రాష్ట్రమైన తెలంగాణలో తలెత్తటానికి అవకాశమున్న భాషా సంబంధిత పోరాటాలకు అంత:సూచనగా ఉపయోగపడవచ్చు. అవేమిటంటే (1) సామాజిక/సాంస్కృతిక/విద్యాపరమైన సందర్భాలలో తెలంగాణా 'మాండలికాన్ని' పక్కకు పెట్టి "ప్రామాణిక" కోస్తా ఆంధ్ర తెలుగు భాషనే అధికారికంగా గుర్తించటాన్ని కొనసాగించటం (2) ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి ఇంగ్లీషు బోధనా భాషగా చేయటం.

భారత దేశ వ్యాప్తంగా తరగతి గదులలోనూ, ప్రచార సాధనాలలోనూ, అధికార ప్రభుత్వ ప్రకటనల మాధ్యమాలలోనూ "ప్రామాణిక ఆంగ్ల భాష", "ప్రామాణిక తెలుగు" లేక "ప్రామాణిక హిందీ" భాషలు ఒక ఆధిపత్య పాత్రను పోషిస్తూ వస్తున్నాయి. అయితే మన పిల్లలకి నాణ్యమైన విద్యను అందించటమంటే ఒకటి రెండు భాషలను "ప్రామాణిక" రూపంలో వారు చదవటం, రాయటం, బోధించటంగా మాత్రమే చూడనక్కరలేదు.

నాణ్యమైన విద్యలో పాఠ్య పుస్తకాలలో కొత్త పాఠాలు, భాషను పరీక్షించే భిన్నమైన అంశాలను డిజైను చేయటం వంటి వినూత్న పద్ధతులు భాగంగా వుండాలి. ఈ పద్ధతులలో ఒక భాష యొక్క భిన్నమైన రూపాలను కలగలపటానికి అవకాశం కల్పించాలి. అయితే అనేక భాషలు మాట్లాడుతున్న భారతదేశ నేపథ్యంలో వివిధ సమూహాల సభ్యులు సామాజికంగా ప్రాముఖ్యత గల సంభాషణలలో, చర్చలలో ఉపయోగించటానికి ప్రస్తుతం ఎటువంటి భాషాపరమైన వనరులు అందుబాటులో వున్నాయో మనకు ఎక్కువ తెలియదు. రెండు లేక అంతకంటే ఎక్కువ భాషలకు సంబంధించిన సంభాషణలు చర్చలలో ముందుకొస్తున్న అంతర్భాషా సూచికలపై పరిశోధన జరగాలి. ఈ అంతర్భాషా సూచికలకు ఒక ఉదాహరణ : హిందీ – ఇంగ్లీషు భాషలను మాట్లాడే వారు "పఢ్‌నా" అనే మాటను 'చదవటం' అనే అర్థంలో వాడితే "స్టడీకర్నా" అనే పదాలను "పరిశోధన చేయటం" అనే అర్థంలో వాడతారు. వివిధ భాషలు వివిధ హోదాలలో ఒకేచోట కలిపి ఉపయోగించినప్పుడు అటువంటి సూచికలు సంభవించే అవకాశముంది. ఇంగ్లీషు, ఇతర భారతీయ భాషల అనువాదాలలో కూడా ఇది జరుగుతుంది. మాట్లాడుతున్న వారి లేక రాస్తున్న వారి గుర్తింపులను (అవి తమకు తాము ప్రకటించుకున్నవి కావచ్చు లేక ఆపాదించుకున్నవి కావచ్చు) సూచించటంలో ఈ అంతర్భాషా సూచికలు పాత్ర పోషిస్తాయి. ఈ అంతర్భాషా సూచికల సామాజిక అర్థం ఆ భాషలను ఉపయోగించే సందర్భంపై ఆధారపడి ఉంటుంది. అవి నిరంతరం సంప్రదించటం, నిర్వచించటం అనే ప్రక్రియలకు లోనవుతుంటాయి. తెలంగాణా రాష్ట్రంలో పాఠ్య పుస్తకాలను తిరిగి రాయటానికి మన భాషలకు సంబంధించిన అంతర్భాషా వినియోగాలను గుర్తించే అధ్యయనాలను పద్ధతి ప్రకారం సాగించటం ఒక ప్రారంభ అంశం కావచ్చు.

**అనువాదం : ఆశాలత.**

*డి.వసంత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భాషా శాస్త్ర విభాగంలో అధ్యాపకులు.*

*ఆశాలత సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్‌లో పనిచేస్తారు.*

# చేరా : ఒక అసమాపక క్రియ

■ కె.శ్రీనివాస్

ఒక పక్క తెలుగు భాష ప్రమాదంలో పడిందనుకుంటున్నాం. మరో పక్క ఇంగ్లీషు మాత్రమే ఉపాధిని ఇవ్వగలుగుతుందని భావిస్తున్నాం. మా భాష వేరు మా యాస వేరు అని ఆత్మగౌరవాన్ని ప్రకటిస్తున్నాం. మాటలకు అక్షరాలకు అస్తిత్వ పరిమళముంటుందని నమ్ముతున్నాం. పత్రికల్లో, పాఠ్యపుస్తకాల్లో– అప్పట్లో సరికొత్త ప్రమాణభాషను రూపొందించుకుంటామని చెబుతున్నాం. ఈ నేపథ్యంలో ఒక భాషాశాస్త్రజ్ఞుడి నిష్క్రమణ– తెలుగు సమాజాలను ఎట్లా ప్రభావితం చేస్తుంది? ఆకాంక్షలను అర్థం చేసుకుంటూనే పురోగతికి కట్టుబడుతూనే, శాస్త్రీయమైన వివరణలతో ఆధునిక అజ్ఞానాన్ని తొలగించగలిగే పెద్ద దిక్కులు లేకుండా పోతే, రేపటి రోజులకు మార్గదర్శనమేది?

చేకూరి రామారావు(చేరా) భాషాశాస్త్రవేత్తగా, తెలుగు సాహిత్య విమర్శకుడిగా ప్రసిద్ధులు. తెలుగు వాక్యం నిర్మాణరహస్యాల అధ్యయనం ఆయన ప్రధానమైన పరిశోధనారంగం. దానితోపాటు భాషకు సంబంధించి ప్రత్యక్ష క్షేత్రశోధన అవసరమైన, తక్షణ ఉపయోగ విలువ కలిగిన అనువర్తిత రంగాలలోనూ ఆయన విశేషంగా కృషి చేశారు. తెలుగుభాషకు ఆధునిక అవసరాలకు అనుగుణమైన హంగులను, వ్యవస్థలను కల్పించడానికి, తద్వారా అభివృద్ధి చెందిన సమాజాలతో మాదిరిగా భాషను పరిపుష్టం, సమర్థం చేయడానికి దోహదపడే రంగాలలో ఆయన పనిచేశారు. మాండలిక వృత్తిపదకోశం నిర్మాణంలో పదసేకర్తగా పని చేయడం దగ్గర నుంచి, పత్రికా నిఘంటువుల నిర్మాణం దాకా, దూరవిద్యలో భాషాశాస్త్ర పాఠాలు రాయడం దగ్గరనుంచి, పాత్రికేయ శిక్షణార్థులకు మెళకువలు చెప్పడం దాకా ఆయన సేవలను అందించారు. భాషా వినియోగం జరిగే అవసరాలను, ప్రయోజనాలను, పద్ధతులను, ప్రయోగాలను, వేదికలను, మాధ్యమాలను, జనశ్రేణులను నిత్యం పరిశీలిస్తూ, చేరా జీవితాంతం పరిశోధనలను నిర్వహిస్తూ. తనను తాను మార్చుకుంటూ కొత్త చేర్పులు చేస్తూ, కొత్త సూత్రాలను ఆవిష్కరిస్తూ వచ్చారు. సాహిత్య విద్యార్థిగా సంస్కృత, తెలుగు అలంకారిక, ఛందో సంప్రదాయాలను అధ్యయనం చేశారు. భాషా శాస్త్రాన్ని ప్రాచీన, ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకు సమర్థంగా వినియోగించుకొని కొత్త విమర్శను పరిచయం చేశారు. భాషాశాస్త్రాన్ని పరిచయం చేసే సాధారణ రచనలలో సాహిత్య ఉదాహరణలను, ప్రస్తావనలను అన్వయించారు. విషయంపై సాధికారంగానూ, ప్రజాస్వామికంగానూ ఉంటూ చర్చలలో పాల్గొన్నారు. భాష విషయంలో ఆధునిక మూఢ విశ్వాసాలను, అపోహలను నిరాకరించి, హేతుబద్ధమైన శాస్త్రీయమైన వైఖరి ఎట్లా ఉండాలో సూచిస్తూ వచ్చారు. శాస్త్ర సంబంధ రచనలలో వచనం ఎట్లా ఉండాలో తన ఆచరణతో నిరూపించారు. భాషా శాస్త్రంలో ఆయన చేసిన కృషిని స్వీకరించి, ఆయనతో ఏదో ఒక స్థాయిలో సంభాషించే ప్రయత్నం ఆ శాస్త్ర రంగానికి వెలుపల జరగలేదు. సాహిత్య రంగంలో ఆయన చేసిన ప్రధానమైన విమర్శాకృషి, ఆయనకు జనరంజకతను, ప్రసిద్ధిని తెచ్చి పెట్టాయి కానీ, ఆయన విమర్శ విధానాన్ని కానీ, అవగాహనను కానీ సాహిత్య రంగం సరిఅయిన స్ఫూర్తితో కానీ, అర్థంలో కానీ జీర్ణం చేసుకోలేదు. ఆయన ఆవిష్కరించిన కొత్త అంశాలు కానీ, ఇతరులను, భవిష్యత్తుకు వదిలివేసిన విషయాలు కానీ సామాన్యమైనవి కావు.

తెలుగు వాక్యనిర్మాణం గురించి మౌలికమయిన ఆలోచనలు చేసినవారు చేరా. నిజానికి తెలుగు వాక్య నిర్మాణాన్ని పరిశీలనకు తీసుకున్న మొదటి భాషాశాస్త్ర విద్యార్థి ఆయనే. ఒక వాక్యం ఇంకో వాక్యంలో నామబంధం (noun phrase)గా ఉండడాన్ని నామ్నీకరణం (nominalization) అంటారు. 1955 నుంచి 1968లో పిహెచ్.డి పొందే దాకా చేరా నామ్నీకరణాలపైనే దృష్టి పెట్టారు. అదే సమయంలో ఫొనాలజీ, మార్ఫాలజీలను కూడా అధ్యయనం చేశారు. అమెరికాలో ఉండి భాషాశాస్త్రంలో పరిశోధనా వ్యాసం పూర్తి చేసిన వెంటనే పాఠకులతో తన పరిశోధనా ఫలితాలను పంచుకోవాలని అనుకున్నారు. అందుకే, నామ్నీకరణాలపై 'భారతి'లో ఆ వెంటనే వరుసవ్యాసాలు రాశారు. తెలుగు వాక్యంలో ఉండే ప్రత్యేకతలను మాత్రమే కాక, ద్రావిడ భాషలతో ఉండే సామ్యాలు–భేదాలు, ప్రపంచ భాషలతో ఉండే సామాన్య లక్షణాలను గుర్తించడం చేరా ఆసక్తి. చామ్‌స్కీ పరావర్తన సిద్ధాంతం చేరాను ఆకట్టుకోవడానికి ఆ సిద్ధాంతం మానవ భాషలన్నిటిలో ఉన్న సామాన్య గుణాలను అన్వేషించడానికి ప్రయత్నించడం ఒక కారణం కావచ్చు. 1967లోనే చేరా ఇంగ్లీషులో రాసిన ఒక వ్యాసం తెలుగులోని ప్రత్యక్ష పరోక్ష కథనాలను గుర్తించి, అవి మానవ భాషలన్నింటిలోను ఉంటాయని ప్రతిపాదించింది. తెలుగులో క్వార్థక క్రియ గురించి, భూతకాల అసమాపక క్రియల మీద, 'అని' చేసే పని గురించి, తెలుగు ధ్వనుల నిర్మాణం గురించి చేరా ప్రతిపాదనలు మౌలికమయినవి. వచనపద్య లక్షణం గురించి, ముత్యాల సరాల గురించి చేసిన రచనలు, చర్చలు ఛందస్సుకు సంబంధించినవైనా, ఆయన భాషాశాస్త్ర ఆలోచనలకు కొనసాగింపులే. తన పరిశోధనాంశాలను వివరిస్తూ యథాలాపంగా ప్రస్తావించినట్లు చేసిన అనేక వ్యాఖ్యలు, పరిశీలనలు కూడా ఒక్కొక్కటి ఒక ఆవిష్కరణతో సమానంగా కనిపిస్తాయి. తెలుగులో మాండలిక భేదాలను సూత్రబద్ధం చేయడానికి ప్రయత్నించిన తొలి పరిశోధకుడు చేరా. తెలుగు భాష ఆధునికీకరణకు, ప్రమాణీకరణకు ఉన్న పరిమితులను, అవరోధాలను కూడా చేరా గుర్తించారు. వాటిని అధిగమించవలసిన బాధ్యత అనంతర తరాలవారిదే. ఆధునిక తెలుగు అనుపానులన్నిటినీ వివరించగలిగిన సమగ్ర వ్యాకరణ రచనకు కావలసిన పునాదులను చేరా ఏర్పరచారు. చేరా ఒక ప్రసంగంలో ఎంతో మొహమాటంగా ఇలా చెప్పుకున్నారు. 'భాషాశాస్త్ర సిద్ధాంతాలలో వచ్చిన గుణాత్మకమైన మార్పుల తోటీ, నిత్యం మారుతూ వచ్చిన భాషాశాస్త్ర పద్ధతులతో పాటు నా పరిశోధనా క్షేత్రం విస్తరిస్తూ వృద్ధి చెందింది'.

అయితే చేరా చేసిన ఈ కృషి అంతా తెలుగు సమాజాలకి ఎంత వరకు తెలుసునో తెలియదు. ఎంతో కొంత తెలిసి ఉండవచ్చును కానీ, దాని నుంచి నేర్చుకున్నది మాత్రం తక్కువ. భాషాశాస్త్ర పండితులూ విద్యార్థులూ, అనురక్తులూ, కొందరు సాహిత్యవ్యక్తులూ, మినహా ఎవరికయినా చేరా ప్రతిపాదనలు, పాండిత్యం, ఆలోచనలు, అవగాహన అవగతమయ్యాయా అన్నది అనుమానమే. సమాజం ఆయన చేసిన దాని నుంచి పొందగలిగినంత లబ్ధినీ పొందలేదు. ఆయన చెప్పినదాని నుంచి చెందవలసినంత పరిణతినీ చెందలేదు. తెలుగు సమాజం లేదా సమాజాలు అనడంలో అర్థం–భాషా సాంస్కృతిక అంశాలకు సంబంధించిన సమూహాలు మాత్రమే కాక, ప్రభుత్వాలు, విధాన నిర్ణాయక బృందాలు, ప్రభావశీల వ్యక్తులు, బృందాలు అన్నీ కలిసిన ఒక విస్తృత సమాజం / సమాజాలు అని. ఈ సమాజానికి శుద్ధ భాషాశాస్త్రం గురించి తెలియనవసరం లేకపోవచ్చును కాని, భాషా శాస్త్రం ఉపయోగవిలువ అయినా తెలిసి ఉండాలి. స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లో ఏర్పడిన వివిధ వ్యవస్థలు కొంత దూరదృష్టితోను, చరిత్ర, భాష, సంస్కృతులపై అభిమానంతోను, విద్యావిషయిక స్వయంప్రతిపత్తిపై గౌరవంతోను వ్యవహరించి ఉండడం వల్ల విశ్వవిద్యాలయాల్లో భాషాశాస్త్ర విభాగాలు ఏర్పడ్డాయి. పరిశోధనలకు అనుకూల వాతావరణం సమకూరింది. శుద్ధభాషాశాస్త్రం పండిత వర్గానికి, పరిశోధకులకే పరిమితమై ఉన్నా, అనువర్తిత రంగాలైనా మొత్తం సమాజానికి చెందినవిగా గుర్తింపు పొందేవి. మాండలిక వృత్తిపదకోశాల వంటి అద్భుతమైన ప్రాజెక్టులకు నిధులు సమకూరాయి. రానురాను, క్షీణత అన్ని రంగాలలో వ్యాపించినట్టే, ప్రభుత్వాల విచక్షణలోను, సంస్కారంలోను వ్యాపించింది. బౌద్ధిక కృషిని సమాజహితానికి అన్వయించే ధోరణి, దీర్ఘకాలిక దృష్టి మందగించాయి. అధికార భాషాసంఘాలు ఏర్పడ్డాయి కానీ, చేరా స్వయంగా చెప్పినట్టు, ఒక్క భాషా శాస్త్రవేత్తా వాటికి సారథ్యం వహించలేదు. భాషా రాజకీయాలు దేశమంతా అనేక సంచలనాలకు, మార్పులకు కారణమయ్యాయి కానీ, భాషను అభివృద్ధి సాధనంగా గుర్తించే స్పృహ లేకపోయింది. ప్రత్యక్షంగా, తక్షణం ఉపయోగ విలువ కనబరచగలిగే జ్ఞానరంగాలు మినహా తక్కినవన్నీ నిష్ఫలమనుకునే పాలకులు పెరిగారు. జనసామాన్యానికి కూడా కళా, మానవీయ శాస్త్రాలన్నీ వృథాగా కనిపించసాగాయి. అంతో ఇంతో గౌరవం, గుర్తింపు ఉన్న రోజుల్లోనే భాషాశాస్త్రం ఉపయోగమేమిటి? అన్న ప్రశ్న తరచు ఎదురయ్యేది. చేరా కూడా ఆ ప్రశ్నకు బాధితుడే, భాషాశాస్త్రం భౌతిక ప్రయోజనాలేమిటో ఒక ప్రసంగంలో ఆయన పూసగుచ్చవలసి వచ్చింది. పరిభాషా నిర్మాణం దగ్గర నుంచి, వైకల్యం ఉన్నవారికి ఇచ్చే భాషా శిక్షణలు, వివాదాల పరిష్కారానికి చేసే 'కౌన్సెలింగ్'ల దాకా అనేక ప్రయోజనాలను ఆయన వివరించారు. నిజానికి అటువంటి ప్రత్యక్ష, తక్షణ ప్రయోజనాల కంటె, దీర్ఘకాలికమయిన పునాది ప్రయోజనాలను భాషాశాస్త్రానికి చెప్పవచ్చు. కానీ, అవి ఎవరికి కావాలి? అందుకే, మా శాస్త్రానికీ ఉపయోగముంది. గుర్తించమన్నట్టు అభ్యర్థనపూర్వకంగా చెప్పవలసి వస్తుంది.

భాషలన్నిటి సమానతను, వ్యవహర్తలందరి సమానతను గుర్తించినప్పటికీ, చేరా తెలుగు భాషను, తెలుగు వారిని

అమితంగా ప్రేమించారు. తెలుగుకు మంచి మనుగడ ఉండాలని, దానికి ఆధునికమైన హంగులన్నీ సమకూరాలని కోరుకున్నారు. భాషను ప్రేమించడమంటే, దాని వ్యవహర్తల సమాజాన్ని ప్రేమించడమే. భాషల వైభవపతనాలు వాటి వ్యవహర్తల బాగోగులపైనే ఆధారపడతాయి. నిత్యం అభివృద్ధి జపం చేసే ప్రభుత్వాలు, దేశీయ, స్థానీయ పురోగతికి దేశభాషల ప్రగతిని ఒక సూచికగా గుర్తించడం లేదు. తెలుగు భాషను వివిధ శాస్త్రవిజ్ఞాన రంగాలలో మౌలిక పరిశోధనలకు మాధ్యమంగా మలచాలంటే. అందుకు మౌలిక సదుపాయాల కల్పన అవసరం. నిఘంటువులు, పదకోశాలు, యాంత్రిక భాషా వినియోగ సామర్థ్యం, పరిభాషా కల్పన వంటివన్నీ మౌలిక సదుపాయాల కిందకే వస్తాయి. పదాల అక్షరక్రమాలే తెలుగులో ఇంకా నియతి సాధించలేదు. పరిభాషలే ఇంకా స్థిమితం పొందలేదు. ఇందుకు వ్యవస్థాగత అవరోధాలతోపాటు, మనలోని కొన్ని అపోహలు, అవగాహన రాహిత్యం కూడా కారణాలని చేరా భావించారు. అభ్యుదయ ప్రగతిశీల భావాల శిబిరాలలోనే ఈ పొరపాటు ఉన్నదని చెప్పడానికి ఆయన వెనుకాడలేదు. భాషలో వచ్చే మార్పులకు వర్గ స్వభావం ఉండదని, వ్యాకరణ నిర్మాణం, ధ్వనివ్యవస్థల్లో వచ్చే మార్పులకు ప్రత్యక్ష సామాజికార్థిక కారణాలుండవని కూడా ఆయన తడుముకోకుండా చెప్పారు. రాజకీయ అభిప్రాయాల్లో, పక్షపాతాల్లో చేరా ఎటువైపున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

ఆధునిక భాషాశాస్త్ర పరిశీలన తెలుగులో గిడుగు రామమూర్తితో ప్రారంభమైనదని చేరా గుర్తిస్తారు. కానీ, వ్యవహారిక భాషావాదానికి చరిత్ర ఆపాదించే గుణాలన్నిటినీ ఆయన ఆమోదించరు. వ్యావహారిక భాషావాదం విధ్వంసం చేసినంతగా నిర్మాణం చేయలేదని చేరా చెప్పారు. నాటికి ఆ వాదం ఒక చారిత్రక అవసరమే అయినా, అనంతరం తెలుగు సమాజం దాన్ని దాటి మరింత ముందుకు తీసుకుపోవలసి ఉండింది. అలా జరగక, వ్యావహారిక భాషావాదమే పరమమన్న ధోరణి స్థిరపడిందని చేరా విమర్శిస్తారు. వాడుకభాష, లిఖిత భాష వేరువేరుగానే ఉంటాయని, రెంటి వినియోగాలు, ప్రయోజనాలు వేరువేరని చేరా అనేక ఉదాహరణతో పదేపదే చెబుతూ వచ్చారు. వ్యవహారంలోని లేని మునుపటి పదజాలం కూడా లిఖిత భాషలో అందుబాటులో ఉంటుందని, రచయితలు వర్తమాన భాషతోపాటు, గత నిక్షేపాలను ఉపయోగించుకుంటాడని ఆయన గుర్తు చేశారు. ఆధునిక వాడుకభాష అవసరాన్ని గుర్తిస్తూనే చేరా, దాని పరిమితులను కూడా తెలుసుకోవాలని, అదే సర్వస్వం అన్న ధోరణి పనికిరాదని సూచించారు. భాష గురించి ఆధునికుల నుంచి అభ్యుదయవాదుల నుంచి కూడా పొరపాటు వాదనలు ముందుకు రావడంతో, వాటిని ఆయన ఒకింత కటువుగానే పూర్వపక్షం చేశారు. తప్పొప్పుల పద్ధతిలో, శాసకుల వలె భాషతో వ్యవహరించకూడదని చేరా చెబుతారు. మాండలికాలకు ప్రజా ఉద్యమాలు జోడించే రాజకీయమైన ప్రాధాన్యం భాషాశాస్త్రంలో చెల్లదని, కళాసాహిత్యాలలో తప్ప వాటి వినియోగం ఇతరత్రా ఉండదని చేరా స్పష్టం చేస్తారు. శాస్త్రవిషయాలు రాసేప్పుడు వాడే భాష, వాడుక భాషకు దగ్గరగా ఉండాలనుకోవడం సరికాదని నిర్మొహమాటంగానే చెప్తారు. అలంకారిక వచనాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తారు. జ్ఞానసంబంధ విషయాలను చర్చించేటప్పుడు అలంకారిక శైలి, చమత్కారాలు వచనంలో ఉండకూడదనేది ఆయన నియమం. దాన్ని ఆయన పాటించారు. సూటి, సరళ వచనం ఎట్లా ఉండాలో, విషయంలో లోతు, గాఢత తగ్గకుండా సాధారణ వచనం ఎట్లా రాయవచ్చో ఆయన నిరూపించారు. నిర్మమమైన శైలి, ఉత్తమపురుషలో రాసినా వినయం కనిపించే శైలి, ఉద్వేగాలకు ఆవేశాలకు ఆస్కారం లేని శైలి – వీటికి కూడా చేరా వచనమే ఒక నమూనా. దీనిని ప్రజాస్వామిక వచనం అని అనవచ్చునేమో? అయితే, ఈ కోవలో వచనం రాసేవారు చేరా ఒక్కరే కాక మరి కొందరు కూడా ఉన్నారు.

నియమోల్లంఘనల వల్లనే భాష విస్తృతి పొందుతుందని స్పష్టంగా చెప్పిన చేరా, అపప్రయోగాల గురించి అదే పనిగా పట్టించుకునే ఛాదస్తాన్ని ఖండించిన చేరా – తాను మాత్రం తన వచనంలో నియమాలకే కట్టుబడ్డారు. భాషలోకి ఇతర భాషాపదాల రాకడ సహజమేనన్న చేరా, అరుదుగా తప్ప ఇంగ్లీషు మాటలను తన వచనంలో వాడలేదు. అతి క్లిష్టమయిన పరిభాషను కూడా ఆయన తెలుగులో వ్యక్తం చేస్తారు. ఆయన కల్పించిన పరిభాష విశిష్టమైనది. ఏ శాస్త్రానికి సంబంధించిన సాంకేతిక పదాలైనా అర్థస్ఫోరకంగా ఉండాలని ఆయన చెప్పారు.

తెలంగాణాలో మాట్లాడే తెలుగును భాష అనాలన్న భావన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాలంలో బలంగా వ్యక్తమయింది. ప్రస్తుతం ప్రమాణ భాషగా కనిపిస్తున్న పత్రికల్లోని భాషను మార్చి, తెలంగాణ భాషను ప్రవేశపట్టాలన్న సంకల్పం కూడా రాష్ట్ర అవతరణ అనంతరం వినిపిస్తోంది. నిజానికి, తెలుగులో ప్రమాణ భాష అంటూ ఒకటి స్థిరపడలేదు. అది స్థిరపడే దారిలోనూ ఉన్నట్టు కనిపించడం లేదు. రాసే పదాలను ఒకే రకంగా రాయడం అన్నది ఇంకా జరగడం లేదు. ఏ అర్థానికి ఏ పదాన్ని వాడాలన్న (ముఖ్యంగా ఆధునిక, రాజకీయ, సామాజిక వ్యవహారాలకు సంబంధించి) నిశ్చయం జరగలేదు. అంటే, ఎవరో వాటిని నిశ్చయపరుస్తారని. అవి శిలాశాసనాలుగా ఉంటాయని కాదు. తెలుగు భాషలో కానీ, తెలంగాణలోని తెలుగులో కానీ వాడుకలో ఉన్న, మౌఖిక, లిఖిత సాహిత్యంలో గర్భస్థమై ఉన్న పదజాలాన్ని క్రోడీకరించి, ప్రమాణీకరించడానికి వీలుగా కొన్ని సాధారణ లక్షణాలను గుర్తిస్తే తప్ప–తెలంగాణ ప్రమాణభాష ప్రయాణం ప్రారంభం కాదు. లిఖిత భాషను వినియోగించుకోకుండా ప్రమాణభాష సాధ్యం కాదు. వాడుక భాషకు అంత విస్తృతి, శక్తి ఉండదు. మాట్లాడే భాష మీద అధికంగా ఆధారపడడం శాస్త్రీయం కాదని చేరా చెబుతారు. ఉద్యమ ఆకాంక్షకు, భాషశాస్త్రానికి సమన్వయం కుదరాలంటే, భాష గురించిన పొరపాటు అవగాహనలను సరిదిద్దుకోవాలి.

పరిభాషా నిర్మాణంలో, ఆంగ్లపదాలకు సమానార్థకాలను నిర్ధారించే విషయంలో చేరా కేవల అనువాద ధోరణిని తప్పుపట్టారు. ఈ అనువాద ధోరణిని పత్రికా రంగంలో పెరిగిపోయి, భావం పాఠకులకు చేరడమే లేదు. ఒక ఇంగ్లీషు మాటకు, ఒక తెలుగు మాటను యాంత్రికంగా ఎంచుకోవడం వల్ల, మూల పదంలోని భావం స్ఫురించక, డొల్లగా ధ్వనిస్తుంది. అలా కాక, అర్థస్ఫోరకమయిన అనువాద పదాలను రూపొందించాలన్నది చేరా ధోరణి. అందుకోసం అవసరమైతే వివరాణాత్మకమైన అర్థాలను కూడా నిఘంటువులలో ఇవ్వాలన్నది ఆయన పద్ధతి. ప్రెస్ అకాడమీ నిఘంటువు మొదటి ముద్రణలో చేరా ధోరణిని స్పష్టంగా గమనించవచ్చు. తెలుగుభాషకు సమగ్ర నిఘంటువు కానీ, ఇంగ్లీషు– తెలుగు ప్రామాణిక నిఘంటువు  కానీ ఇంకా నిర్మాణం కావలసే ఉన్నవి. తెలుగు ఆధునికీకరణకు కావలసిన మౌలికమయిన సాధనాలలో సమగ్ర నిఘంటువు ఒకటి. ఈ దశలో అవి పదార్థాలతోపాటు, వివరణలు కూడా ఇవ్వవలసిన అవసరం ఉన్నది.

వచనకవిత్వ లక్షణం చర్చించడం దగ్గర నుంచి, కవిత్వ నిర్మాణ పద్ధతులను విడమర్చి చెప్పడం దాకా, సాహిత్య విమర్శకు భాషాశాస్త్ర పరికరాల ద్వారా చేరా దోహదం చేశారు. అన్ని రకాల కవిత్వానికీ సమ్మతి చెబుతూనే, సరళమైన, కాల్పనికమయిన కవిత్వాన్ని ఆయన విరివిగా లక్ష్యం చేసుకున్నారు. వచన కవిత్వంలో శైలులను కనిపెట్టి వివరించారు. కవులకు పదసంపద, అర్థఛాయల పరిచయం, ఔచిత్య దృష్టి ఎంత అవసరమో ఆయన స్నేహపూర్వకంగా సూచించారు. తన పరిశీలనా పద్ధతికి ఎక్కువ ఆస్కారం ఇస్తాయి కాబట్టే ఆయన స్త్రీవాద కవుల ఉదాహరణలు అధికంగా తీసుకున్నారేమో అనిపిస్తుంది. 'చేరాతలు' కాలమ్ ఆయనను కవిత్వ లోకంలో 'స్టార్'ను చేసింది. అభిమానాన్ని, వ్యతిరేకతను కూడా సంపాదించింది. ప్రధాన స్రవంతి పత్రికలో రావడం వల్ల, ఆ శీర్షికను కలిగిన ప్రాచుర్యం అనేక అనుబంధ సమస్యలను కూడా తెచ్చిపెట్టింది. చేరాతల రచనలో తన పద్ధతులకే ఆయన కట్టుబడినప్పటికీ, రకరకాల ఒత్తిడులు ఆయనను ఉక్కిరిబిక్కిరి చేశాయి. చేరా ఎంపికల గురించి చర్చ జరిగినంతగా, ఆయన ఏమి చెప్పారన్నదాని మీద జరగలేదు. ఆయన సుభాషితాలన్నీ నిష్ఫలమయ్యాయి. వాటిని ఇప్పుడు పునర్దర్శించవలసి ఉన్నది. వచన కవిత్వంలో శైలీ భేదాలనే కాదు, వచన రచనల శైలి పై కూడా చేరా పరిశీలనలు విలువైనవి. చేరా శైలీశాస్త్రం ఒక ప్రత్యేక విమర్శా మార్గం.

చేరా భావపరిధి, ఆసక్తుల పరిధి సాహిత్య, భాషా రంగాలకు పరిమితమైనది కాదు. స్పష్టమైన ప్రగతిశీలత, సంస్కార దృష్టితో పాటు. క్రమశిక్షణతో అధ్యయనం చేసిన సాహిత్య నేపథ్యం, విద్యావిషయికమైన నిబద్ధత, సాహిత్య అధ్యయనం అందించిన సృజనాత్మకత, తన జ్ఞానాన్ని సమాజంతో పంచుకోవడానికి ప్రజాస్వామికమయిన ప్రయత్నం, భాషాశాస్త్రం అలవరిచిన తార్కికతను, నిర్మాణ సూత్రాల అవగాహనను ఇతర శాస్త్ర సిద్ధాంతాల అవగాహనతో బేరీజు వేసుకుని సమన్వయించే విశాలత– ఆయన వ్యక్తిత్వపు లోతులను విశదం చేస్తాయి. అనేక విషయాలలో ఆయన చేసింది మౌలికమయిన కృషి. దాని విస్తరణకు ఎట్లాగూ అనంతర పరిశోధకులకు అవకాశాలుంటాయి. అవే కాక, ఆయన సూత్రప్రాయంగా చెప్పి వదిలివెళ్లిన ప్రతిపాదనలెన్నో ఉన్నాయి. వాటన్నటిని గుర్తించి విస్తరించ వలసిన బాధ్యత కూడా భవిష్యత్తుదే. తెలుగు సమాజం బాగు కోసం ఆయన సూచించిన అనేక కర్తవ్యాలున్నాయి. వాటిని బుద్ధిజీవులు, విధాననిర్ణేతలు పరిపూర్తి చేసే ప్రయత్నం చేయాలి. ఆయన రచనల నుంచి ఆయన అవగాహనను, ఆలోచనా పద్ధతిని, రచనా విధానాన్ని ప్రత్యేకంగా కూర్చగలిగితే, భాషాసాహిత్య రంగాలకు ఎంతోమేలు జరుగుతుంది. అందుకోసం, చేరా రచలన్నిటిని తిరిగి కొత్తగా సందర్శించవలసి ఉంటుంది, సమకాలంలో విస్మరించిన, అందుకోలేకపోయిన ఆయన ఆలోచనలను, అవగాహనను, జ్ఞానాన్ని సాధ్యమైనంతగా సేకరించవలసి ఉంటుంది. చేరా విషయంలోనే కాదు, వర్తమానంలో పారేసుకుంటున్న అనేకమంది విషయంలో కూడా రేపు పశ్చాత్తాపంతో అదే పనిచేయవలసి ఉంటుంది.

*కె.శ్రీనివాస్ ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులు.*

# భాష, రాజకీయ ఉమ్మడి వనరు

■ ఎం.మాధవ ప్రసాద్

**భాషకూ,** జాతిరాజ్యాలకు మధ్య ఉన్న సంబంధం ఏమిటి? నేరుగా దీనికి సంబంధించినది కాకపోయినా వేరొక సందర్భంలో ఐరోపా చరిత్ర గురించి ఇటీవల ఒక వ్యాసంలో చేసిన వ్యాఖ్యను పరిశీలిద్దాం

"చాలా కాలం క్రితం, సమాజంలోని ఉన్నత వర్గం వారు లాటిన్ మాట్లాడేవారు. మిగతా వాళ్ళంతా, అంటే అలగా జనాలంతా ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మన్ మాట్లాడేవారు. ఆ ఉన్నత వర్గం పామరులను విస్మరించింది. పామరులు ఉన్నత వర్గాన్ని పట్టించుకోలేదు". (1)

ప్రస్తుతం భారత దేశంలో నెలకొన్న పరిస్థితులకు దీనితో పోలికేమయినా ఉందా? ఉన్నత వర్గం వాళ్ళు ఒక భాష మాట్లాడటం, మిగతా వారంతా ఇతర భాషలు మాట్లాడటం అన్నది మన విషయంలో గతానికి సంబంధించిన అంశం ఎంత మాత్రం కాదు. ఇప్పుడు వర్తమానంలో జరుగుతున్నది ఇదే. కాకపోతే మన విషయంలో ఉన్నతులు/కులీనుల భాష ఒకటే కాగా మిగతా సామాన్యులు మాట్లాడే భాషలు మాత్రం చాలానే ఉన్నాయి. ఇవాళ్టి రోజున ఉన్నత వర్గాల భాషగా ఇంగ్లీషు చలామణి అవుతోంది. ఈ స్థానంలో ఒకప్పుడు ఐరోపాలలో లాటిన్‌లాగా మన దేశంలో సంస్కృతం, పర్షియన్‌లు అధికార, ఉన్నత వర్గ భాషలుగా కొనసాగాయి. ఇక మిగతా వారు మాట్లాడే భాషలు – 'ప్రాకృతాలు'గా, 'దేశ భాషలు'గా పిలువబడినవి – చాలానే ఉండేవి. ఇవి కాల క్రమంలో మారుతుండేవి కూడా. వీటినే ఇప్పుడు మనం 'ఆధునిక భారతీయ భాషలు'గా, 'దేశీయాలు'గా (వర్నాక్యులర్స్), ఇంకా తేలికగా చెప్పుకోవాలంటే 'ప్రాంతీయ భాష'లు గా కూడా పిలుచుకొంటున్నాం. ఇప్పటి పరిస్థితి చూస్తే మన ఈ వర్తమానం... ఐరోపా దేశాల గతంతో సరిపోలుతున్నట్లుగా అనిపిస్తుంటుంది. ఇక పైన చెప్పుకొన్న వ్యాఖ్యల్లోని రెండవ భాగం: సమాజంలోని రెండు వర్గాల మధ్య ఉన్న సంబంధాలకు వద్దాం. వీటి విషయంలో మాత్రం ఐరోపా దేశాలకు మనకు చాలా ఖచ్చితమైన, కొట్టొచ్చినట్లు కనబడే తేడాలున్నాయి. పై వ్యాఖ్యలో చెప్పినట్లుగా అటు ఉన్నత వర్గంగాని, ఇటు సామాన్య/పామర ప్రజానీకానికి గాని ఒకరిని ఒకరు విస్మరించుకోవటమన్నది మన దేశంలో ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రస్తుత వ్యవస్థాత్మక ఏర్పాట్లలో అస్సలు సాధ్యమయ్యేదే కాదు. చాలా కాలం క్రితం ఐరోపాలో జరిగిందే. ...మన దేశంలో కూడా చాలా కాలం క్రితం జరిగింది. వీటి మధ్య ఎంతో సారూప్యం ఉంది. కానీ వర్తమానానికి వచ్చేసరికి – ఇప్పుడు భారత దేశంలో జరుగుతున్నది పాక్షికంగానే ఒకప్పటి గతానికి దగ్గరగా ఉంది. ఐరోపాలో ఒకప్పటి ఆ గతానికీ, ప్రస్తుత వర్తమానానికీ మధ్య చోటుచేసుకున్న బలీయమైన పరిణామాలు–ఉన్నత, సామాన్య వర్గాలు రెండూ ఒకే దేశంలో ఉంటూ రెండు వేర్వేరు భాషలు మాట్లాడే పరిస్థితికి ఎటువంటి ఆస్కారం లేకుండా చేశాయి. 18, 19 శతాబ్దాల్లో వెల్లువెత్తిన విప్లవాల తర్వాత – 'జాతీయ భాష' అన్న భావన పైకొచ్చి బలంగా స్థిరపడింది. 'జాతీయ భాష(లు)' ఆయా దేశాల్లో పౌరులందరి భాష అవుతుందన్నది ఒక రీతి రివాజుగా, సార్వత్రిక సూత్రంగా అవతరించింది. నిజానికి ఆ విప్లవాలేవీ కూడా సమాజంలోరి వివిధ వర్గాల మధ్యనున్న ఆర్థిక తారతమ్యాలను, హోదాల అంతరాలనేం నిర్మూలించలేదు. కాని ఇవి అప్పటి వరకూ– సంప్రదాయాల పేరిటో, వారసత్వాలనో, దైవదత్తాలనో ఇలా రకరకాల సమర్థింపులతో అమలవుతున్న ప్రత్యేక ప్రయోజనాలను, అధికార హంగులను పటాపంచలు చేసి.. 'రాజకీయ సమానత్వానికి' అవసరమైన ఒక భూమికను, ఉమ్మడి వేదికను ఏర్పాటు చేశాయి. ఈ విప్లవాలు పరిఢవిల్లిన ప్రతిచోటా– మిగతా వాటి సంగతి ఎలాగున్నా ఒక పరిణామం మాత్రం విస్పష్టంగా చోటుచేసుకుంది. రెండు అంతస్తుల భాషలన్నది కూలిపోయింది. దాని స్థానే 'ఒక జాతి–రాజ్యానికి ఒకటే భాష' అన్న భావన ప్రస్ఫుటంగా పైకొచ్చింది (2). ఇలా ఎందుకు జరిగిందన్నది ఆసక్తికరం. ఈ అనివార్యత ఎక్కడి నుంచి పుట్టుకొచ్చింది? భాష(ల) విషయంలో వచ్చిన ఈ మార్పు దేన్ని ప్రతిఫలిస్తోంది? నిర్మాణపరంగా చాలా బలంగా వేళ్లూనుకున్న రెండు భాషల నిమ్నోన్నత క్రమం (స్ట్రక్చరల్ బైలింగ్యువలిజం) మరి ఏక భాషా రాజ్య విధానంగా (మోనో లింగ్యువల్ పోలిటీ)గా ఎలా రూపాంతరం చెందింది? వీటిని అర్థం చేసుకోవటం అవసరం.

ఈ సందర్భంగా 'కామన్స్' అన్న భావనను వివరంగా చూడటం అవసరం. మన దేశంలో రకరకాల పేర్లతో (ఉదాహరణకు తెలుగులో 'ఊరుమ్మడి' అనీ, కన్నడంలో 'ఊరొత్తు' అనీ) గుర్తింపులో ఉన్న ఈ భావన ప్రపంచీకరణ నేపథ్యంలో ఇటీవలి కాలంలో మళ్లీ ప్రాముఖ్యాన్ని సంతరించుకుని పున:ప్రచారంలోకి వచ్చింది. 'క్రియేటివ్ కామన్స్', 'రీ క్లెయిమింగ్ ద కామన్స్' వంటివి విస్తృతంగా వాడకంలోకి రావటం దీనికో నిదర్శనం. పెట్టుబడిదారీ వ్యవస్థ మోసుకొచ్చే సకల అవసరాలకూ మళ్లీ ఈ ఉమ్మడి తనాన్నీ, ఉమ్మడి వనరులను, అంటే 'కామన్స్' ను పునరుద్ధరించి వీటిని పున:ప్రతిష్టించటం ఒక్కటే సరైన విరుగుడని భావించే వారూ ఉన్నారు. ప్రస్తుత కాలంలో ఈ 'ఉమ్మడి వనరు' అన్న భావనను సాంస్కృతికంగా పునర్నిర్వచించటం జరిగిందనీ, దీన్నిప్పుడు కేవలం సమాజం ఉమ్మడిగా అనుభవించే నీరు, భూమి వంటి ఆర్థిక వనరులకే కాదు, ఆ సమాజానికి సంబంధించిన సాంస్కృతిక అంశాలకు (ఉదా॥సంగీతం) కూడా వర్తింపజెయ్యచ్చని చెబుతుంటారు. నిజానికి నీరు, సంగీతం వంటివి భౌతికమైన వనరులు, వీటిని మానవ సమాజం నుంచి వేరు చెయ్యొచ్చు కూడా. కానీ ఇలా వేరు చెయ్యటానికి వీల్లేని ఉమ్మడి వనరు (కామన్స్) గురించిన ఆలోచన, ప్రస్తుతం మనం ఉంటున్న పెట్టుబడిదారీ కాలానికి మరింత అవసరమైన ఆలోచన, అలాగే అసమానతల మీద నిర్మితమైన సమాజాలన్నింటికీ పనికొచ్చే ఆలోచన (ఈ 'ఉమ్మడి వనరు' అన్న భావనకు అసమాన సమాజాల్లోనే ప్రాముఖ్యముంటుందని గుర్తుంచుకోవాలి) ఒకటుంది. అదే భాష. ఒక సమాజంలో ప్రయోజనాలు, ఆసక్తులు, విలువలవంటివన్నీ అందరూ పంచుకోవటానికి, వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు దోహదం చేసే ఒకే ఒక మాధ్యమం భాష. అందుకే దీన్ని అత్యంత మౌలికమైన ఉమ్మడి వనరుగా, ఫౌండేషనల్ కామన్స్‌గా చెప్పుకోవచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థ కొత్త తరహా సామాజిక అసమానతలను తెచ్చి పెడుతున్నా కూడా.. ఈ అసమానతల మధ్య కూడా కొన్ని ప్రయోజనాలు, ఆసక్తులు, విలువల విషయంలో కొంత ఉమ్మడిదనం (కామనాలిటీ) ఉండేలా చూసేది ఈ మౌలికమన ఉమ్మడి వనరే. అందుకే ఈ ఉమ్మడి వనరు అన్న భావనను కేవలం ఆర్థిక, సాంస్కృతిక సందర్భాల్లోనే కాదు – దీనికి రాజకీయపరమైన అర్థాన్ని కూడా గ్రహించే అవకాశం, అవసరం కూడా ఉంది. ఆధునిక జాతి–రాజ్యాల్లో ఉమ్మడి భాష, భాషా సమైక్యత అన్నది చాలా మౌలికమని, అదే పునాది అని, ఇది గనక లేకపోతే సిద్ధాంత భావజాలాలేవీ కూడా తమ పని తాము చెయ్యలేవని అర్థమవుతుంది. పైగా ఈ రాజ్యాల్లో ఒకప్పుడు అసమానతలన్నవి పూర్తి అధికారికంగా, పరంపరాగతంగా, ఆమోదనీయమైనవిగా కొనసాగుతుండేవి. అలాంటి వాటి స్థానే ఇప్పుడు కొత్తగా నిర్మాణపరంగా పైకి ఏమాత్రం కనబడకుండా, సామాజికంగా మాత్రం చాలా సమర్థంగా అమలయ్యే అసమానతలు వచ్చి చేరాయి. పైకి చూడటానికి ఎక్కడా అసమానతలన్నవి లేనట్టే ఉంటుంది కానీ అవి మరింత బలపడ్డాయి. ఒకవైపు ఇవిలా సువ్యవస్థితంగా కొనసాగుతూనే మరోవైపు ఇదే సమయంలో 'సమాజం' కూడా చెదిరిపోకుండా అస్తిత్వంలో ఉండేలా చూసేదెవరంటే అంతిమంగా ఉమ్మడి భాషే అని అర్థమవుతుంది. ఉమ్మడి భాషకు (కామన్స్‌కు) ఉన్న ఈ శక్తి– ఈ కోణం– చాలా అరుదైన సందర్భాల్లోనే, అదీ మన భారతదేశం లాంటిచోట

మాత్రమే ప్రస్ఫుటంగా బయటపడి మరీ కనబడుతుంది. నిజానికి ఇక్కడున్నది రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యం అయినాగానీ అది ఒక మైనారిటీ భాషలోనే కార్యకలాపాలన్నీ సాగిస్తుండటం ఆశ్చర్యకరమైన విషయం. ఇది లోక రీతికి విరుద్ధం కూడా! అసలీ కార్యకలాపాలన్నీ కూడా ఉమ్మడి భాషలో (ఉమ్మడి వనరు – కామన్స్‌లో) జరిగినప్పుడే ప్రజలందరి పూర్తి భాగస్వామ్యానికి ఆస్కారం ఉంటుంది. అప్పుడే వారి పూర్తి భాగస్వామ్యం సాధ్యమవుతుంది. ఒక ప్రజాస్వామ్య రాజ్యం తన వ్యవహారాలన్నింటినీ ఒక మైనారిటీ భాషలో నిర్వర్తిస్తోందంటే దానర్థం – సంప్రదాయంగా ఊరుమ్మడి రావిచెట్టు–రచ్చబండ మీద జరపాల్సిన పంచాయితీ సభని కాస్తా అందరికీ ప్రవేశం లేని స్థానిక భూస్వామి ఇంట్లోకి మార్చేసినట్లే!

ఉమ్మడి భాష అవసరం ఎందుకు తలెత్తిందన్నది తరచి చూస్తే – ఆధునిక కాలంలో 'సార్వభౌమత్వం' (రాజకీయ ఆధిపత్యం) అన్న భావనకున్న నిర్వచనం మారిపోవటమే దీని అవసరాన్ని పెంచిందని అర్థమవుతుంది. ఈ సార్వభౌమత్వమన్నది ఒక రకంగా 'సామాజిక ఒడంబడిక (సోషల్ కాంట్రాక్ట్)' సిద్ధాంతాన్ని భూమికగా చేసుకుని, దాని నుంచి ఉత్పన్నమైన సైద్ధాంతిక రూపం. స్థూలంగా చెప్పుకోవాలంటే ఈ సిద్ధాంతం – సమాజంలోని సభ్యులంతా తమలో తాము 'ఒక కొత్త పాలనా సంవిధానాన్ని స్థాపించుకోవాలని అంగీకారానికి రావటం' అన్న భావన నుంచి పురుడు పోసుకుంది. ఇది జరగాలంటే ఆ సభ్యులంతా, అంటే ఆ సమాజంలోని ప్రజలంతా ముందు తామందరము సమానులమన్న ఒక ఒడంబడికకు రావాలి. సార్వభౌమత్వం లేదా రాజ్యాధికారం అన్నది వాళ్ళందరికి సమానంగా చెందాలి, దానిలో వారందరికీ సమ భాగం ఉండాలి. ఒక రకంగా ఇది అప్పటి వరకు అమల్లో ఉన్న రాజకీయ సార్వభౌమత్వ రూపాలన్నింటికి ముగింపు లాంటిది. అప్పటి వరకు రాజులు తమ అధికారాన్ని తమకంటే బలీయమైన మరో ఉన్నత శక్తి నుంచి పొందటం, పురోహిత వర్గం దాన్ని అధీకృతం చెయ్యటం వంటివి జరుగుతుండేవి. ఈ విధానాలన్నింటికి ఒడంబడిక సిద్ధాంతం చరమగీతం పాడింది. అయితే – ఒడంబడిక ఆధారంగా ఏర్పడిన సమాజంలో కూడా చట్టబద్ధంగా పాలన నిర్వహించేందుకు, ఇతర విధులు నిర్వర్తించేందుకు అధికారాన్ని ఎవరో ఒకరికి అప్పగించక తప్పదు. ఈ బదలాయింపు రకరకాల రూపాల్లో, ప్రాతినిధ్య విధానాల్లో సాగుతుంటుంది. గత పరిపాలకులకూ, దీనికి కీలకమైన తేడా ఏమంటే ఇలా అధికారాన్ని చేపట్టిన వ్యక్తి ఒక నిర్ణీత కాలావధి వరకే ఆ అధికారాన్ని నిర్వర్తిస్తారు. ఆ తర్వాత తన తదనంతరం ఎన్నికయిన వ్యక్తి కోసం ఆ అధికార పీఠాన్ని ఖాళీ చెయ్యక తప్పదు. అందుకే రాజకీయ తత్వశాస్త్రాల్లో తరచుగా – 'ఆధునిక ప్రజాస్వామ్యాల్లో అధికార పీఠం ఖాళీగానే ఉంటుంది'(ద సీట్ ఆఫ్ పవర్ ఈజ్ ఎంప్టీ) అని వ్యాఖ్యానిస్తూంటారు. ఇక్కడ మనం గుర్తించాల్సిన మరో విషయం ఏమంటే – సమాజంలోని సభ్యులంతా ఒక చోట కూడటం, అంతా కలిసి నిజంగానే ఒక ఒడంబడిక / ఒప్పందం మీద సంతకాలు పెట్టటమనేది వాస్తవంగా జరిగే విషయం కాదు, అసంభవం కూడా. అందుకని ఈ ఒప్పందానికి సర్వసాధరణ రూపంగా ఉనికి లోకి వచ్చింది రాజ్యాంగం! మన దేశ రాజ్యాంగం కూడా ఇలాంటిదే. సాధారణంగా ఈ రాజ్యాంగాన్ని కొద్దిమంది వ్యక్తులు రూపొందించి, చట్టంగా ఆమోదించడం జరుగుతుంది. ఆ కొద్ది మంది వ్యక్తులు కూడా చాలావరకూ మార్పు కోసం అక్కడ జరిగిన పరిణామాలను నడిపించిన వాళ్ళే అయ్యుంటారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ ఒడంబడిక మీద సంతకం చెయ్యకపోయినా దీనికి అందరి ఆమోదం ఉందనే భావించటం జరుగుతుంది – ఇప్పుడున్న వాళ్ళే కాదు, భవిష్యత్తరాలతో సహా! అందుకే దీన్ని 'కల్పితం(ఫిక్టివ్)' అని కూడా అంటూంటారు. ఒకసారి ఇది స్థిరపడిన తర్వాత ఇదే చట్టమవుతుంది, సమాజంలోని ప్రతి ఒక్కరూ – ప్రస్తుత, భవిష్యత్ సభ్యులంతా కూడా – దీన్ని అంగీకరించారని, ఈ ఒడంబడికపై సంతకాలు చేసారనే భావించటం జరుగుతుంది.

కాబట్టి ఒడంబడిక సిద్ధాంతం అన్నది ఒక కల్పన. ఇంకా చెప్పాలంటే కల్పన మీద నిర్మితమైనది. అయినప్పటికీ రాజ్యాధికారం విషయంలో 18వ శతాబ్దపు జన విప్లవాలు తెచ్చిన పెనుమార్పుల స్ఫూర్తిని ఎంతోకొంత పట్టుకొని, దాన్ని ప్రతిఫలించగలిగింది ఇదే. దీనితో ఉన్న ఒక లోపం / సమస్య ఏమంటే పూర్తిగా అంతా దీనితోనే మొదలయినట్లు, ఇదే సరికొత్త ప్రారంభమన్న భ్రమను కలిగిస్తుంది. సమాజమన్నది ఈ ఒడంబడికతోనే ఏర్పడినట్లు, అంతకు ముందేమీ లేకుండా అంతా దీనితోనే ఆరంభమైందన్న భావన కలిగించటం దీనితో పెద్ద సమస్య. ఇదెంత అసంభవమో అందరికీ తెలిసిందే. అందుకే హెగెల్ దీన్ని కాస్త లోతుగా గుచ్చిగుచ్చి చూస్తూ ఇంతకీ 'ఆ ఒడంబడికను ఏ భాషలో రాశారో?' అంటూ చాలా తేలికైనదిగానే కనిపించినా, కాస్త ఘాటైన, మౌలికమైన ప్రశ్న వేశాడు. ఆయన లేవనెత్తిన ఈ ప్రశ్న – ఒక ఉమ్మడి భాష మాట్లాడే వాళ్లే ఒడంబడిక రాసుకోగలరని, దానిపై సంతకాలు చేయగలరన్న వాస్తవాన్ని మన ముందుంచుతుంది. దీన్నే మన మాటల్లో చెప్పుకోవాలంటే – రాజరికాల అనంతరం ప్రజా సార్వభౌమత్వంతో ఏర్పడిన ఏ సమాజమైనా అప్పటికే భాషా పరంగా, ఒక సమైక్య సమూహంగా ఏర్పడి ఉండాలి. ఇది చూపిస్తోంది మనకు..ప్రజాస్వామ్యానికి, ఉమ్మడి భాషకూ మధ్య ఉండే అనివార్యమైన, రాజ్యాంగబద్ధమైన సంబంధం ఏమిటో! ఒక 'జాతి'గా గుర్తింపు కోసం (నేషనల్ ఐడెంటిటీ) జరిగే ప్రయత్నాలన్నీ కూడా సాధారణంగా జాతి (రేస్), మతం, భాష వంటి వాటిలో ఏదో ఒక దాన్ని లేదా కొన్నింటిని ఆలంబనగా చేసుకొనే తలెత్తుతాయని జాతీయవాదంపై వచ్చిన చాలా సిద్ధాంతాలు చెబుతూంటాయి. ఇందులో కొంత నిజమున్నా – ముఖ్యంగా జాతీయతా గుర్తింపు కోరుకుంటున్నప్పుడు మిగతావన్నీ ఎలా ఉన్నా 'ఉమ్మడి భాష' మాత్రం ఖచ్చితంగా అవసరం అని అనుకుంటే తప్పుదారి పట్టినట్లే. ఎందుకంటే సంస్కృతి ఆధారంగా జాతీయ గుర్తింపు కోరుతున్నంత కాలం అందులో భాష కూడా ఒక ముఖ్యమైన అంశంలాగే అనిపిస్తుంటుంది. కానీ ఆ గుర్తింపు ఆధారంగా ప్రత్యేక రాజ్యం / దేశం కావాలన్న డిమాండ్లు బయలుదేరిన మరు క్షణం భాష అనేది పక్కకి తప్పుకొంటుంది. రాజకీయ అస్తిత్వాన్ని లేదా అధికారాన్ని సాధించుకునేందుకు భాష ఒక మార్గంగా మాత్రమే తయారవుతుంది. జాతి–రాజ్యాల్లో భాష అనేది ఏదో ఒక జాతి సమూహానికి (ఎథ్నిక్) విశేష లక్షణంగా మాత్రమే లేదు– అది రాజకీయ ఉమ్మడి వనరుల్లో కలిపి వేయబడి, ఒక ఉత్కృష్ట స్థానాన్ని కూడా ఆక్రమిస్తుంది. దాన్ని ఇంకా ఆ జాతి– తనకు మాత్రమే సంబంధించిన, పూర్తిగా తనకే సొంతమైన, ఇతరత్రా ప్రయోజనాలేవీ ఆపాదించటానికి వీల్లేని – సొత్తుగా ఇంకే మాత్రం చెప్పుకోలేదు.

ఇలా సమూహాలన్నీ ఒడంబడికలతో పునర్వ్యవస్థీకృతమవ్వటమన్నది పరిపాటిగా, సర్వసాధారణంగా మారిన ఆధునిక కాలంలో కూడా, ఇప్పటికీ ఏవైనా సమూహాలు దాన్ని సాధించటంలో విఫలమై అలాగే ఉండిపోతే– వాటిని పరిపాలనాశాస్త్ర చర్చల్లో కేవలం నిర్దుష్ట జాతులుగా..'ఎథ్నిసిటీస్'గా మిగిలిపోయిన సమూహాలుగానే గుర్తించటం జరుగుతుంది. అటువంటి సందర్భాల్లో భాష కూడా కేవలం ఆయా జాతులకు సంబంధించిన విశేషంగానే మిగిలిపోతుంది. గత కొద్ది సంవత్సరాలుగా భారతదేశంలోని ప్రాంతీయ/దేశీయ భాషలన్నీ (వర్నాక్యులర్స్) కూడా ఈ నిర్వచనానికి దగ్గరగా ఉండేందుకు తంటాలు పడుతున్నాయి. ఇవి రాజకీయంగా ప్రాధాన్యాన్ని ప్రత్యేక ప్రాభవాన్ని కోల్పోవటమే దీని వెనకనున్న ముఖ్య కారణం. ఉదాహరణకు తెలుగునే తీసుకుంటే, ఇప్పుడు మనం తెలుగు భాషను పరిరక్షించుకోవటానికంటూ ఎన్నో సంస్థలు, వ్యక్తులందరూ రకరకాల ప్రయత్నాలు చేస్తుండటం చూస్తూనే ఉన్నాం. కొద్ది సంవత్సరాల క్రితం తిరుపతిలో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో ఏం జరిగిందో గమనిస్తే ఈ భాషా పరిరక్షకులందరూ– ప్రభుత్వంలో ఉన్నా, ప్రైవేటు సంస్థలకు చెందిన వారైనా– వీరంతా కూడా తెలుగును రాష్ట్రానికి సంబంధించిన సాంస్కృతిక వారసత్వంలో భాగంగానే పరిగణించటం కనబడుతుంది. అందుకనే వీరు తెలుగు పండగలు, తెలుగు వంటలు, తిరుపతి లడ్డూ, కూచిపూడి నృత్యం..సరసనే తెలుగు భాషను కూడా చేర్చి మాట్లాడుతుంటారు. వీరి దృష్టిలో ఇవన్నీ ఒకే తరహావి. ఇవన్నీ తెలుగు సంస్కృతిలో భాగం, వీటన్నింటినీ రక్షించుకోవాలి! దీన్నిబట్టి రాజకీయ సాధికారతకు, అధికారానికి ప్రజల భాషే ఒక మాధ్యమంగా, సాధనంగా ఉంటుందన్న రాజకీయ వాదనలకు– అధికారంలో ఉన్నవాళ్లుగానీ, ఇతర ప్రముఖులు గానీ ఎవరూ ప్రాధాన్యం ఇవ్వటం లేదని, దాన్ని ఎవరూ కీలకమైనదిగా పరిగణించటం లేదని అర్థమవుతుంది. భాష ఒక రాజకీయ ఉమ్మడి వనరు (పొలిటికల్ కామన్స్) స్థానాన్ని

ఆక్రమించలేనప్పుడు, దానికా స్థానం లేనప్పుడు ఒక బలమైన ప్రజా సార్వభౌమత్వమన్నది ఉండదు. ఒక బలమైన ప్రజా సార్వభౌమత్వమన్నది లేనప్పుడు. దానికి బదులుగా ఎంతో మంది చిన్నచిన్న సార్వభౌములు, దాని రూపాల్లాంటివారు చాలామందే బయల్దేరటం, ఎక్కడెక్కడి నుంచో పుట్టుకురావటంలో ఆశ్చర్యం లేదు. ఇది సామాజిక శాస్త్రవేత్తలు ఎప్పటి నుంచో చెబుతున్న సహజ పరిణామమే. ఇప్పుడు మనం చూసే నానా రకాల ప్రముఖులు- రాజకీయ నాయకులు, సాధువులు, సినిమా తారల వంటి వారందరినీ ఇందులో భాగంగానే అర్థం చేసుకోవచ్చు. వీళ్లంతా సమాజంలో ప్రత్యేక ఉన్నత స్థానాల కోసం తమను తాము దైవాంశ సంభూతులుగానో, మరేదోగానో చెప్పుకొంటుంటారు. ఒక ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి అవసరమైన కీలక, మౌలికాంశాలు సమకూరనప్పుడు లేదా వాటిని అణిచివేసినప్పుడు మతపరమైన ఏకత్వ దిశగా జరిగే ప్రయత్నాలు కూడా ఊపందుకుంటాయి.

ఇరవయ్యో శతాబ్దాన్ని ప్రపంచ వ్యాప్తంగా జాతి-రాజ్యాల విస్తరణ శతాబ్దంగా చెప్పుకోవచ్చు. జాతి-రాజ్యాలన్నవి 19వ శతాబ్దంలో కొన్నే ఉండేవి. అవి కూడా చాలా వరకూ ఐరోపాకే పరిమితమయ్యేవి. వీటిలో చాలా భాగం సామ్రాజ్యవాద శక్తులు కూడా. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడెక్కడో ఉన్న భూభాగాలను కూడా తమ వలసలుగా మార్చేసుకుని పరిపాలన సాగించాయివి. ఈ వలసల్లో స్వేచ్ఛా కాంక్ష బలపడి, అక్కడ స్వతంత్ర్యోద్యమాలు మొదలైనప్పుడు ఐరోపా పాలకులు క్రమేపీ ఉపసంహరించుకోవటం, స్వతంత్ర రాజ్యాలు ఏర్పడటం జరిగింది. ఈ స్వతంత్ర రాజ్యాలు ఏర్పాటవుతున్న కాలంలో జాతి-రాజ్యాలన్న భావన ఎంత బలంగా ఉండిందంటే- చాలా దేశాలు తమకు తాముగానే దీన్ని ఎంచుకున్నాయి. లేదా అవి చారిత్రక పరిణామాల అనివార్యతల కారణంగా జాతి-రాజ్యాల రూపాన్ని తీసుకోవాల్సి వచ్చింది. కానీ ఇక్కడ పెద్ద సమస్యేమంటే ఐరోపా పరిస్థితులకూ, ఇక్కడి పరిస్థితులకూ చాలాచోట్ల పొంతన లేదు. అందుకే ఐరోపాలో ఉన్న జాతి-రాజ్యాల స్వరూపానికీ, ఈ వలసానంతరం ఏర్పడిన రాజ్యాల వాస్తవ పరిస్థితులకూ మధ్య ఉన్న అంతరం, ఆ వ్యత్యాసం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ జాతి రాజ్యాలన్నీ కూడా చాలావరకూ అంతర్గతంగా రకరకాల సమూహాలుగా- ఆదివాసీ, మతాలు, మూల జాతులు, ఉపజాతులు, తెగలుగా- రకరకాలుగా విడిపోయి ఉన్నాయి. వీటిలో చాలా సమూహాలకు ఎవరి ప్రత్యేక భాష వారికి ఉంది. ఇన్ని అంతరాలుండటం వల్ల వీరందరినీ కలసికట్టుగా ఉంచటమన్నది పెద్ద సమస్యగా పరిణమిస్తుంటుంది. దీన్నే అంతా తరచుగా 'జాతీయ సమైక్యత'కు సంబంధించిన సమస్యగా చెబుతుంటారు గానీ వాస్తవానికి ఇది రాజ్యానికి సంబంధించిన 'రాజ్య సమగ్రత'కు సంబంధించిన సమస్య. వలసానంతరం ఏర్పడిన ఒక రాజ్యాన్ని సమగ్రంగా ఉంచటమెలాగన్న సమస్యనే- చాలాసార్లు జాతీయ సమైక్యతకు సంబంధించిన సమస్యగా చూపించటం జరుగుతోంది. ప్రతి రాజ్యమూ కూడా తనకున్న చారిత్రక, ప్రాదేశిక, సామాజిక స్వభావాలన్నింటినీ మరిచిపోయి (లేదా వాటన్నింటికీ అతీతంగా) - తప్పనిసరిగా - తనను తాను ఒక జాతి (నేషన్)గా చాటుకోవాలన్న అనివార్యతను సృష్టించి పెడుతోంది ఇది. దీని పర్యవసానం, ప్రత్యక్ష ఫలితం ఏమంటే - వాస్తవంగా ఇప్పటికే ఒక జాతి (నేషన్)గా ఉన్నా లేదా జాతిగా అవతరించే అవకాశం బలంగా ఉన్న జాతులు(నేషన్స్) కూడా దీని వల్ల బలవంతాన తిరోగమించి ఒక చిన్న జాతి(ఎథ్నిసిటీ) కిందకు కుంచించుకుపోవాల్సి వస్తోంది. ఎందుకంటే తమ భాషల్లోనే రూపొందిన రాజ్యాంగం ముందు, దానికున్న ప్రభావవంతమైన, ఉన్నతీకరణ శక్తుల ముందు ఆయా జాతులన్నీ చిన్నబోక, ఒదిగిపోక తప్పదు. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న సమకాలీన రాజ్యవ్యవస్థలన్నీ కూడా జాతీయవాదాన్ని, మానవస్వేచ్ఛా సాధనకు ఒక మార్గంగా, సాధనంగా చూడటాన్ని తీవ్రంగా నిరుత్సాహపరచడమే కాదు, దీన్నో అవాంఛనీయ పరిణామంగా కూడా చూస్తాయి, చూపిస్తున్నాయి. స్వేచ్ఛా భావన అన్నది నేడు కాలం చెల్లినదిగా, మొత్తానికి అటకెక్కిచ్చిన లేదా మూలన బడిన అంశంగా తయారైంది. ఈ మధ్యలో రకరకాల జాతులు(ఎథ్నిసిటీస్) లోలోపలే ఉడుకుతూ, అప్పుడప్పుడు కలకేసినట్లుగా అర్థరహితమైన హింసలో పెచ్చరిల్లుతూ ఉంటాయి.

భాషకు- రాజకీయసాధికారతకు సంబంధించిన ఈ ప్రశ్నలు విద్యారంగంలో భాషకు సంబంధం లేనివేం కాదు. ప్రస్తుతం మన దేశంలో ఈ బోధన భాషల గురించి విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఒకవైపు ప్రభుత్వ బడుల్లో ప్రాంతీయ లేదా దేశీయ భాషల్లో బోధన, ప్రైవేటు స్కూళ్ళల్లో 'ఇంగ్లీషు మీడియం' (ఎంత నాసిరకంగా ఉన్నా) బోధన అన్నట్టు దేశ విద్యావిధానం ఒక అరాచక వ్యవస్థగా పరిణిమించింది. నాణ్యమైన ఇంగ్లీషు బోధన అనేది దేశంలోని చాలా కొద్దిమంది ఉన్నత/కులీన వర్గాల వారికే అందుబాటులో ఉంటోంది. మిగతా వారంతా- ఎందుకూ కొరగానిదిగా భావించే (అన్నిసార్లూ ఇది నిర్హేతుకమేం కాదు!) ప్రాంతీయ భాషా బోధన కావాలో లేక ఉద్యోగాలు, ఎన్నో అదనపు ప్రయోజనాలను చేకూర్చిపెడుతుందని భావించే 'ఇంగ్లీషు మీడియం' చదువులు కావాలో తేల్చుకోవాల్సిన అనివార్య పరిస్థితుల్లో చిక్కుకుపోతున్నారు. (20 మంది స్కూలు పిల్లల ప్రాంతాలు బలిగొన్న మెదక్ ప్రమాదం తర్వాత అక్కడ చెల్లాచెదురుగా పడి ఉన్న శిథిలాల మధ్య MATHEMETICS పాఠ్య పుస్తకం కూడా కనిపించింది. పాఠ్యపుస్తకం పేరులోనే ఉన్న పెద్ద అక్షరదోషం ఈ విద్యాప్రమాణాలను చెప్పకనే చెబుతోంది) ఒక రకంగా తల్లిదండ్రులంతా ఈ ఇంగ్లీషు మీడియం స్కూళ్లకు కట్టే ఫీజు- తమ పిల్లల భవిష్యత్తుకు గొప్పగా చూడాలన్న తపనతో కట్టే 'ఆశల పన్ను' లాంటిదే. ఇది నేరుగా ఎలాంటి నీతి నియమాల్లేని వ్యాపారుల జేబుల్లోకి వెళ్లిపోతోంది. మన రాజ్యం వీరితో కుమ్మక్కై చేజేతులా ఈ పరిస్థితిని సృష్టించేందుకు తన వంతు కృషి చెయ్యటమే కాదు. పరిస్థితులను బాగు చెయ్యలేనంతగా దిగజార్చింది. పైగా ఇప్పుడు విద్యను ఇవ్వటం కాదు- విచిత్రంగా 'విద్యా హక్కు' నిస్తోంది. విద్యారంగంలోకి కేంద్రం చొరబడటం- వలసవర్గ ప్రయోజనాలను కాపాడేందుకు రూపొందించిన ఈ విధానం- ఇంగ్లీషును అందరూ కలలు గనాల్సిన అందని మావిపండులా చూపించి ఊరిస్తూ ఈ దోపిడీ, ఈ మోసం ఇలాగే కొనసాగేలా చూసేందుకే ఉపకరిస్తోంది. ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతి దేశమూ కూడా తమ పౌరులను సమర్థమైన పనిమంతులుగా తీర్చిదిద్దాలంటే ఇప్పుడు తమ భాషతోపాటుగా ఇంగ్లీషును కూడా నేర్పించక తప్పని పరిస్థితి నెలకొంది. మన భారతదేశంలోని పిల్లలకు కూడా ఇంగ్లీషులో ఇదే రకమైన ప్రవేశం, అభినివేశం కల్పించటం అవసరం. వద్దనటం అహేతుకం కూడా. కానీ మన దేశంలో ఇంగ్లీషు అన్నది- ఒక వర్గం సొత్తుగా దాన్నుంచి దూరం చెయ్యబడిన వారికి అసూయా హేతువుగా మిగిలిపోతోంది. ఇంగ్లీషు విషయంలో చోటుచేసుకున్న ఈ పరిణామం, దీని పర్యవసానాలన్నీ కలిసి ఇంగ్లీషు అన్నది ఒక ఉపయోగకరమైన పనిముట్టుగా అందరికీ అందుబాటులోకి రాకుండా అడ్డుపడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలంటే మళ్లీ మూలాల్లోకి వెళ్లి భాషకూ, ప్రజాస్వామ్యానికీ మధ్య నున్న సంబంధం గురించిన ప్రశ్నలను.. పైకి రాకుండా నొక్కివేయబడిన, అణచివేయబడిన ఆ ప్రశ్నలను...మళ్లీ పైకి తేవటం అనివార్యం. అది చెయ్యకుండా మార్పు అసంభవం!

**ఫుట్‌నోట్ :**

1. ఉన్నది ఉన్నట్టుగా వాడుకోవచ్చు.

2. కాలక్రమంలో నిపుణుల భాష (న్యాయం, సైన్స్ వంటి రంగాల్లో) మరింత ప్రత్యేకమైనదిగా తయారై, ఇప్పుడు సగటు ప్రజలకు ఏమాత్రం అర్థం కాని స్థాయికి చేరుకుంది. ఈ పరిణామాలన్నీ ప్రజల హక్కులకు విఘాతంగా తయారైనా, దానర్థం మనం మళ్లీ రాజుల, రాజ్యాల కాలం నాటి రెండు భాషల విధానానికి మళ్లాలని మాత్రం కాదు. అధికారంలో ఏక భాషా విధానానికి స్విట్జర్లాండ్, కెనడా వంటి దేశాలను తరచూ మినహాయింపులుగా చెబుతుంటారు గానీ వాస్తవంగా అవేమంత పెద్ద మినహాయింపులు కాదు. మన భారతదేశం, ఇతర వలసానంతర రాజ్యాలు కూడా మినహాయింపులేం కాదుగానీ వీటిని ఒక రకంగా వలసవాద చరిత్ర నుంచి పుట్టుకొచ్చిన అవకరాల బిడ్డల్లా పరిగణించి.. వీటిపైన ప్రత్యేక అధ్యయనం చెయ్యటం చాలా అవసరం. అప్పుడే ఇది తెచ్చిపెట్టే ప్రమాదకర పరిణామాలను అర్థం చేసుకోవటం సాధ్యమవుతుంది.

**అనువాదం : ఏ. వెంకట్**

*మాధవ ప్రసాద్ EFL విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు.*

*ఏ.వెంకట్ సాహిత్యం, భాష, అనువాదంలో ఆసక్తి కలవారు.*

# జాతీయకవి వేమన బాటలో జాషువ

■ కత్తి పద్మారావు

వేమన మతంలోని మూఢాచారాన్ని భుజం తట్టి గుర్తు చేశాడు. ముందు మనిషికి మానసిక సంస్కారం కావాలి అని చెప్పాడు. ఈ మూఢాచారాల మీద ధ్వజమెత్తిన ప్రభావం ఆంధ్ర సాహిత్యంలో ఆ తరువాత వచ్చిన కవులందరి మీద పడింది. ఆ తరువాత కవులు సమాజాన్ని ఏ విధమైన దడుపు లేకుండా ఎండకట్టడానికి బాటవేసిన వాడు వేమన అనుటలో ఎటువంటి సందేహం లేదు.

వేమనది ఒక సామాజిక విప్లవ భాష. ఒక తాత్విక జీవన వ్యథ, ఒక మానవ వ్యక్తిత్వ ఆవేదన, ఒక సముజ్వల సాహస సంభాషణ, ఒక జ్వలిత ప్రజా ఆక్రోశం, ఒక చారిత్రక వాస్తవిక అభివ్యక్తి, ఒక ఉజ్వల జీవన సంఘర్షిత మానవతా మూర్తిత్వం, వేమన ఎందరో సామాజిక విప్లవ మూర్తులకు తన భాషని, స్ఫూర్తిని, చైతన్యాన్ని, ఆలోచనని, ఉద్విగ్నతని, ఉజ్వలతని, సంఘర్షణని, సముజ్వలతని అందిస్తూనే వున్నాడు. ఆయన చెప్పిన పద్యాలలో తెలుగు వారి ప్రాకృతిక జీవన వ్యవస్థల భాష దాగి వుంది. తనకు తానుగా మాట్లాడిన తెలుగు ఆదికవి వేమన.

రాతిబొమ్మ కేల రంగైన వలువలు<br>
గుళ్ళు గోపురములు కుంభములును<br>
కూడు గుడ్డ తాను కోరునా దేవుడు<br>
విశ్వదాభిరామ ! వినురవేమ !

ఇందులో వేమన – రాయి, బొమ్మ, ఏల, రంగు, అయిన, వలువలు, గుళ్ళు, గోపురములు, కుంభములు, కూడు, గుడ్డ, తాను, కోరునా, దేవుడు, విశ్వద, అభిరామ, వినుర, వేమ అనే పదాలు ఉపయోగించారు. ఇంత చిన్న పద్యంలో ఇన్ని పదాలు వేమన వాడగల్గడం ఆయన ప్రతిభకు చిహ్నం.

దీనికి భావం రాతి బొమ్మకు రంగు రంగు వస్త్రాలు, గుళ్ళు, గోపురాలు ఎందుకు? దేవుడు కూడు, గుడ్డ కోరుతాడా అని. శబ్దశక్తితో పాటు భావనా శక్తి కూడా ఆయన సొంతం. సమకాలీన సమాజాన్ని ప్రశ్నించగల్గిన వాడేగొప్ప కవి. కవికి తప్పకుండా తాత్విక భావజాలం వుండాలి. ఆ తత్వశాస్త్రం మనిషి మెదడును మేల్కొల గలగాలి. చిన్న పదం గొప్ప అర్థాన్ని ఇవ్వగలగాలి. నాలుక మీద ఆ పదం లయబద్ధంగా ముద్రించబడాలి. ఈ లక్షణాలు వున్న కవిని మనం మహాకవి అంటాం. తత్వశాస్త్ర పరంగా చూసినప్పుడు వేమన లోకాయతుడు. ఆయన కవిత్వంలో ప్రశ్న గొప్పది. ఆయన సమకాలీన సమాజాన్ని నిలదీశాడు. ఆయన ఒక చక్కని తెలుగు నిఘంటువు. ఆయన పద్యాలతోపాటు తెలుగు భాష మన నోటికి వస్తుంది. తెలుగు వారి సామాజిక పరిణామం. ఆర్థిక జీవనం మనకు అవగతం అవుతాయి.

**వేమనను ప్రచారం కాకుండా చూసిన బ్రాహ్మణ వర్గం**

1829లో వేమన పద్యాలు (సి.పి.బ్రౌన్) సెయింట్ జార్జి కాలేజి వారు ప్రచురించారు. బ్రాహ్మణులను అపహాస్యం చేస్తూ పద్యాలు చెప్పిన వేమన గ్రంథం ముద్రణ కావడం బ్రాహ్మణులకు ఆనాడు ఇష్టం లేదు. కాలేజీ బోర్డు వారు ఈ పుస్తకాన్ని 500 ప్రతులు ముద్రించారు. 50 కాపీలు బ్రౌను దొరగారికి ఇచ్చారు. మిగిలిన 450 ప్రతులు దేశం మీదకు వెళ్ళవలసినదే కాని కాలేజీ గోడౌన్‌దాటి బయటకు వెళ్ళినట్టులేవు. ఈ ముద్రణ కాగితాలను కట్టని చుట్టబెట్టి, కాలేజి చిత్తుకాగితాలలో జమకట్టారు. ఇది ఎవరు చేసిన పనో చెప్పనక్కర్లేదు. వేమనగారి పద్యాలను అటువంటి రచనలను ప్రచారం లోనికి రానివ్వనివర్గాల గురించి ఆదిలోనే ఆబేదుబాయ్ వ్యాఖ్యానించారు.

దుబాయ్ రాసిన గ్రంథాన్ని పరిష్కరించిన డాక్టర్ పోప్ తన అభిప్రాయాల్ని స్పష్టంగా వివరించారు. బ్రాహ్మణులు వేమన పద్యాలు చెప్పడానికి నిరాకరించారని వేమన మీద వారికి వ్యతిరేకత వుండటమే గాక ఆ వ్యతిరిక్తతను బహిరంగపరచే వారని ఆయన ఇలా వివరించారు.

**ప్రజల నాలుకల మీద వేమన**

తెలుగు ప్రజానీకంలో వేమన పద్యాలకున్న పలుకుబడి అపారమైనది. కాని ఈ ప్రసిద్ధి శూద్రులకే పరిమితం. వారిలో కూడా హిందూమతం పట్ల గౌరవ ప్రపత్తులు కలవారికి వేమన పట్ల ఉన్నది చిన్న చూపే. వేమన పద్యాలను ప్రభుత్వ పాఠశాలల్లోని పాఠ్యపుస్తకాల్లో చేర్చినప్పుడు ఈ వ్యతిరేకత మరీ కొట్టొచ్చినట్లు కనిపించింది. అధ్యాపకులు, విద్యార్థులూ కూడా ప్రభుత్వ ఉత్తర్వులను తప్పించుకోవడానికి చేయవలసినదంతా చేశారు. అనేక పర్యాయాలు, అనేక కారణా మీద ఈ చేర్పు వాయిదా వేయబడింది. చేర్చిన తర్వాత కూడ, మతం మీద దుర్బుద్ధితో కూడిన విమర్శలు ఈ పద్యాల్లో చేయబడ్డాయనే నెపంతో అధ్యాపకులు కొన్ని పద్యాలను అసహ్యించుకోవడానికి కొందరు బ్రాహ్మణులు వాటిలోని గ్రామ్యధోరణిని, అశ్లీలత్వాన్ని కారణంగా చూపేవారు. **(ప్రజాకవి వేమన, పే.274)**. వేమన పద్యాలు పాఠ్యాంశంలోకి రాకుండా బ్రాహ్మణులు ఎంత వ్యతిరేకించారో మనకు అర్థమౌతుంది.

వేమన ఒక ఉద్యమంగా జీవించాడు. వేమనను ఒక తాత్వికుడిగా గుర్తించిన నార్లవారు ఆయన వ్యక్తిత్వ నిరూపణలో స్పష్టమైన అభిప్రాయాల్ని ప్రకటించాడు. సమకాలీన సమాజంలో వున్న రుగ్మతల్ని తొలగించ లేనివాడు గొప్ప కవి కాలేడు. సమకాలీన సమాజం సహజంగా యుద్ధప్రియుల్ని నిరాకరిస్తుంది. వారికి అనేక ఆటంకాలు కలిగిస్తుంది. వారిని అనేక సందర్భాల్లో నిర్బంధిస్తుంది. వేమన సమకాలీనంలో మత తాత్విక అణచివేతల స్వభావాల్ని బయటకీడ్చాడు. ఆయనొక న్యాయవాదిగా ఒక తీర్పరిగా కూడా వ్యవహరించాడు.

మేధావుల నుంచి సామాన్యజనం వరకు వేమన పద్యాలు నాలుకమీద నర్తించడమే గాక వాటికి లోతైన అర్థాలున్నవి. ఎవరికి వారు చెప్పుకోగల్గిన స్థాయిలో చెప్పుకోవడానికి అవకాశం ఇచ్చారు. కవి అంటే కేవలం ఉపమాన ఉపమేయ జ్ఞానమే గాక వివేచన, హేతుదృక్పథం ప్రేరేపించే వాడిగా వుండాలని వేమన తెలియ జెప్పాడు. తెలుగు పదాలు, పదబంధాలు, క్రియాపదాలు సమకాలీనంలో వున్న వాటిని ఆయన ప్రోది చేశాడు. ఇదే నేటి తెలుగు నిఘంటువుకి ప్రేరణ. ఆ రోజుల్లో ఆర్థిక జీవనంలో కాసు, వీసం, దమ్మిడి, తారము, రూక వంటి నాణెములను వాడేవారు. ఈ పదాలన్నింటిని ఆయన వాడుతూనే వచ్చాడు.

**సజీవ పదాల నిఘంటువు వేమన**

వేమన పద్యాలను మనం పదపదాలుగా విభజించుకున్నట్లైతే కొని వేల పదాలు మనకు లభ్యమౌతాయి. తెలుగు భాషకు మళ్ళీ పునరుజ్జీవనం వస్తుంది.

ఉర్వివారికెల్ల నొక్క కంచముపెట్టి

పొత్తు గుడిపి కులము పొలయ జేసి

తలను చేయిపెట్టి తగనమ్మ జెప్పరో

విశ్వదాభిరామ వినురవేమ! ***(వేమన పద్యరత్నాకము – 77)***

మొత్తం పద్యాన్ని తెలుగు పదాలతో కట్టాడు. భావం చాలా లోతైంది. మానవులందరూ ఒకటని సామాజిక విప్లవ సిద్ధాంతానికి ఆయన పునాదులు వేశాడు. ఎన్ని

తత్వశాస్త్రాలు వున్నా మానవుడు, మానవతావాదం చాలా విశిష్టమైనవి. మానవతావాదం పునాదిగా కవిత్వం చెప్పటం చాలా క్లిష్టమైన పని. కులం తెలుగు సమాజాన్ని కకావికలం చేస్తున్నప్పుడు ఈ మహోన్నతమైన పద్యాన్ని చెప్పాడు వేమన. మనుష్యులు ముందు సహపంక్తిలో కూర్చోవాలి. అందరూ కలిసి భోజనం చేసిన తరువాత మానవులంతా ఒకటేనని ఎలుగెత్తి చాటమన్నాడు. ఒక్క చిన్న పద్యంలో భాషతో పాటు మానవతా భావపూర్ణమైన సిద్ధాంతాన్ని జొన్పాడు వేమన. వేమన ప్రభావం ఆ తరువాత వచ్చిన సామాజిక సంస్కర్తల మీద, కవుల మీద బలంగా పడింది. మతం మనుషుల్ని గుంపులు గుంపులుగా చీలుస్తున్నప్పుడు, కులం మనిషిని మరింత సంకుచిత పరిధిలోకి నెడుతున్నప్పుడు. ఒక మతవాదో, ఒక కులవాదో విస్తృతమైన తత్వశాస్త్రాన్ని చెప్పలేడని ఆయన భావం. తప్పకుండా కవి మానవతావాద తాత్వికుడై వుంటే అతని శబ్దజాలం వల్ల సమాజాన్ని మార్చగలుగుతాడని వేమన పద్యాల వలన మనకు అర్థమౌతుంది. పద్యాన్ని ఏదో పదాల గుంపుగా కాకుండా దాన్నొక సామాజిక విప్లవాస్త్రంగా మార్చాడు.

వేమన సాంఘిక విప్లవానికి భయపడి బ్రాహ్మణులు వ్యతిరేకించినా ఆయన తెలుగు భాష వ్యాపించి వున్నంత కాలం వుంటాడని ఆయన మీద పరిశోధనలు గావించిన క్యాంబెల్ 1890లోనే ఇలా విశ్లేషించాడు.

**కులం వ్యథను చెప్పిన జాషువ**

ఒక మనిషిని రంగు పరంగానో, ప్రాంతపరంగానో, భాషా పరంగానో నిందించినపుడు ఆయనపడే వేదనను కవి బలంగా చెప్పగలడు. కుల వివక్షను త్రిపురనేని చెపితే జాషువా కులం వ్యథను కూడా చెప్పాడు.

*“వేద చతుష్టయంబు ప్రభవించిన వ్యాసుని దివ్య వాణిలో*
*మాదిగలుందురా? రుధిర*
*మాంసములుంగల యంటరాని వా*
*రాదిమవాసులక్కటకటా! తలపోసిన నల్లగుండెలో*
*సూదులు మోసులెత్తునుగృశోదరి! యెట్లు సహించుకొందువో!*

కవిత్వంలో ప్రశ్న వేమన నేర్పాడు. జాషువా దానికి బలం తెచ్చాడు. జీవితంలో ఎదురౌతున్న అనేక అంశాల్ని తాత్వికంగా ప్రశ్నించగల్గడం వేమనకు ముందున్నా, తెలుగు పదాల చిక్కదనాన్ని వేమనే తీసుకొచ్చాడు. వేదాలు పుట్టిన వ్యాసుని వాక్కుల్లో మాదిగలున్నారా అని ప్రశ్న వేసి, మాల మాదిగలు జాతికి మూలపురుషులని నిలదీయడం చరిత్రను చెప్పటం జాషువాలోని వేమన వారసత్వాన్ని బహిరంగపరుస్తుంది. కులమత భేదాలు పోతేనే జాతి మన్నన పొందేదని తన కాందిశీకుడులో బలంగా చెప్పాడు.

*సమరసభావ నిశ్చల పరిశ్రమకు బ్ర*
*హ్మాండంబు లున్ముఖంబయినదాక,*
*వ్యత్యయంబైన తీవ్రాస్పృశ్యతాజాడ్య*
*మన్నివిధాల రూపఱినదాక,*
*నాజాతి నాయూరు నా దేశమని పొంగు*
*స్వాభిమానము శూన్యమయినదాక,*
*విశ్వసౌభ్రాత్రంబు వెలయించు నైక్య సం*
*ఘవ్యాప్తి దిశల పెంపారుదాక*
*జ్ఞానమత సాంఘిక స్వేచ్ఛ నల్వురకును*
*నేకరీతి లాభించునందాక, రాదు*
*భావిభారత కల్యాణ పరమ సుఖము!*
*కాక చల్లార దెపుడు సంగ్రామ మఖము* ***(జాషువ రచనలు – 2, 136)***

జ్ఞాన మతసాంఘిక స్వేచ్ఛ నలుగురికి ఏకరీతి లభించుగాక భారతదేశానికి శుభం కలుగుదని కవి ఆక్రోశం వెనక ఎంత సాంఘిక అణచివేత అనుభవించిన వ్యథ వుందో మనకు అభివ్యక్తి అవుతుంది. ఈ భాషంతా సామాజిక విప్లవ భాషే. తీవ్ర అస్పృశ్యతా జాడ్యమని జాషువా వాడటంలో ఒక గుండె చప్పుడు ఈ భాష విద్యార్థుల నోటికి రావాలి. అప్పుడు ఒక సమాజాన్ని సంస్కరించే వాతావరణం రూపొందుతుంది. వేమన సామాజిక విప్లవ భాషకు ఒక కొనసాగింపు వస్తుంది.

*ఆచారాంతరముల్, నిరంకుశ మతవ్యత్యస్తముల్, వర్ణముల్*
*నీచత్వోచ్ఛత, లంటరానితనమున్ బీజంబులై విశ్వధా*
*త్రీ చక్రప్రళయంబు రేచెడి, విచారింపంగ నేలా? వృథా*
*వాచాలత్వములున్ బ్రలోభ నటనల్ వారింప గా నేర్చునే?*
***(జాషువ రచనలు – 2, 136)***

ఇప్పటి వరకు తెలుగులో సాంప్రదాయ భాషకి వచ్చినంత ప్రాధాన్యం ఈ సామాజిక విప్లవ భాషకి రాలేదు. సామాజిక విప్లవ భాషని మనం ప్రచారం చేసినట్లైతే కులమతాలు అంతరించి తెలుగు జాతి ఒక్కటిగా రూపొందుతుంది. ఏ మతమైనా, ఏ కులమైనా తెలుగు జాతి ఒక్కటే అని చెప్తూ ప్రసిద్ధ రచయిత భూపతి నారాయణ మూర్తిగారు తన తెలుగు జాతి – తెలుగు జాతీయతలో ఇలా వ్యాఖ్యానించారు.

“ఒక జాతి మనుగడకు భాష జీవనాడిలాంటిది. ప్రజల అభ్యుదయానికి, సాహిత్య, చరిత్ర, సంస్కృతుల అభివృద్ధికి భాష ముఖ్యమైన సాధనం. పుట్టిన ప్రతి మానవునికి ఒక జాతి వుంది. ఆ జాతి మాట్లాడటానికి ఒక భాష వుంది. ఆ జాతి పెరగడానికి, తిరగడానికి ఒక గడ్డ వుంది. భాషలేని జాతి మనజాలదు. ప్రతి జాతికి వున్నట్లే తెలుగు జాతికి ఒక భాష వుంది. అదే మన మాతృభాష. అదే తెలుగు సాహిత్యం జాతి జీవన ప్రతిబింబము. సాహిత్యమే మానవుని సంస్కృతీ జీవనమునకు గొప్ప ఉపనిషత్తు అంటారు పండితులు. ఆధునిక ప్రపంచంలో జాతుల మధ్య వాటి సంస్కృతుల మధ్య సరిహద్దులు రోజు రోజుకి మారిపోతున్నాయి. అయినప్పటికిని ఒకజాతి మాట్లాడు భాష యిప్పటికి ఆ జాతి యొక్క ప్రత్యేక చిహ్నముగా పరిగణించబడుతుంది. తెలుగు మాతృభాష కలవారు ఏ దేశంలోవున్నా, ఏ ప్రాంతములోవున్నా తెలుగు జాతీయులుగా పరిగణించబడుతున్నారు. ఒకే జాతిలో వేరు వేరు కులాలు, మతాలు వున్నప్పటికిని ఆ జాతి మాట్లాడేభాష ఆ జాతి సమైక్యతకు తోడ్పడుతుంది.”

*‘నడుస్తున్న చరిత్ర’ ఫిబ్రవరి 2006 సంచిక నుండి*

*కత్తి పద్మారావు దళిత ఉద్యమకారుడు, దళిత మహాసభ వ్యవస్థాపకులు. భాషా చరిత్ర పరిశోధకులు. ప్రముఖ కవి.*

## షాజహానా

‘సెల్లె, గరీబుదాన్నయితె అయినగని, ఇంటికొచ్చిన సుట్టాన్ని అప్పదెచ్చయిన పానం తీర్గ జూసుకుంటగాదె, గీ ఎండాకాలం సెల్వలనన్న మున్నిని పంపరాదె, ఆడపొల్లలు లేకపోతిరి, నాల్గ దినాలుంచుకోని పువ్వో, పత్రో పెట్టి పంపిస్త..’ అని ‘అయిన నా దివానతనం గనీ మా గరీబిళ్ళకు మీ దొరసాన్లసొంటి బిడ్డలొస్తరా.. ఐతెపాయెలె సెల్లె, మరి నేనొస్త. మల్ల ఎన్నాల్లకొ కండ్లజూసేది..’ అని ఏడ్సుకుంట మా అమ్మీ యాకుబ్బీని కౌగిలించుకొని నెత్తిన మందార పువ్వుని గట్టిగ లోపలికి దోపుకుని ముక్కు చీది చీర కొంగుతో తుడ్సుకుంట ఎనక్కెనక్కి సూసుకుంట ఎర్రబడ్డ కండ్లతోని ఎల్లిపోయింది కరీంబి బడెమ్మ.

డిగ్రీకొచ్చి ఇంతమటుకి ఎప్పడు సెలవులిచ్చినా మా అబ్బవేపు వాళ్ళిళ్లకే ఎల్లినగని అమ్మీవేపు వాళ్ళిళ్లకు ఎల్లనేలేదు. ఎప్పడో ఎల్లినగని గుర్తే లేదు. ఈ ఎండాకాలం సెలవులల్ల ఎట్లయిన కరీంబి బడెమ్మింటికి పోవాల్నని గట్టిగ అనుకున్న. ఈడొచ్చిన ఆడపొల్లను తోడులేకుంట ఏడికి పంపియ్యని వీళ్ల భయానికి ఇరుగాడాలోచించి మా తమ్ముణ్ని గూడ తీసుకెళ్లాల్ననుకున్న ఆ మాటే అమ్మీతో అనంగనె ఆమె ముఖం పెరట్లో పూసిన ముద్దబంతి పువ్వులా కళకళలాడింది.

**సిల్ సిలా కథ,**
**వతన్ ముస్లిం కతలు**
**నసల్ కితాబ్ ఘర్, నల్గొండ. 2004**

# ఆధునిక తెలుగు సాహిత్యంలో దళిత కవుల భాషా ఒరవడి

■ గోగు శ్యామల

తరతరాలుగా దళిత కవులు తమదైన ప్రాపంచిక దృక్పథంతో మనువాద పుక్కిటి పురాణాల సాహిత్య కళారూపాలపైనా, వాటి ఊకదంపుడ్లపైన యుద్ధం చేస్తూనే ఉన్నారు. దళితుల రక్తం రుచి మరిగిన బ్రాహ్మణీయ కుత్సితాన్ని, వివిధ సిద్ధాంతాల, రాజకీయ ముసుగులలో ఉన్న మనువాదాన్ని ఎప్పటికప్పుడు దళిత సాహిత్యం బట్టబయలు చేస్తూ వస్తోంది. ఆధిపత్య భావజాలాన్ని సవాలు చేస్తూ ఎప్పటికప్పుడు నూతన చైతన్యంతో తను పునరుజ్జీవమౌతూ మిగతా సమాజాన్ని సైతం సమానత్వ దిశగా నడిపించే పూనికని చేపట్టి కొనసాగుతోంది. ఆది నుంచి కూడా హిందూ బ్రాహ్మణ పితృస్వామ్య సాహిత్యాన్ని నిలదీస్తూ, విభేదిస్తూ తనదైన షరతులను విధిస్తూ బోనులో నిలబెట్టింది కూడా దళిత సాహిత్యమే! దళిత కళారూపాలే! అంతిమంగా హిందూ మత సాహిత్యానికి ప్రత్యామ్నాయ శక్తిగా నిలబడుతూ మొత్తం బహుజన సమాజానికి ప్రాతినిధ్యం వహించే దిశగా దళిత సాహిత్యం సమున్నతంగా నిలబడింది.

ఆధునిక తెలుగు సాహిత్యంలో దళిత సాహిత్యం ఈనాడు నిత్యం అనేకానేక భావపరమైన, భాషాపరమైన వ్యక్తీకరణ రూపాలను బయటకుతెస్తూ, గుణాత్మకమైన మార్పులతో విరాజిల్లుతున్నది. ఈ దళిత సాహిత్య పరంపరను నేటివ్ సాహిత్యమని, మూలవాసీ సాహిత్యమని, బహుజన సాహిత్యమని ఒక సాహిత్య ప్రపంచం పిలుచుకుంటే, వెలివాడ సాహిత్యం, బడుగుల సాహిత్యం, చిన్న కులాల సాహిత్యం, కింది కులాల సాహిత్యం, అంటరాని సాహిత్యం అని అధికార సాహిత్య ప్రపంచం పిలుస్తోంది.

**దళిత సాహిత్యం – భాష :** దళిత కవులు రాస్తున్న సాహిత్యం ఎంతో వైవిధ్యభరితమైనది. ఆ వైవిధ్య లక్షణాలలో భాషను గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఈ కవులు తమ నిర్ణీత ప్రాంతం, అక్కడి భూమి, నీరు, జీవావరణం, జీవ వైవిధ్యం, వ్యవసాయోత్పత్తి, సొంత వనరులు, పనిముట్లు మరియు తమ కమ్యూనిటీ, కుటుంబాల వస్తూత్పత్తిని ప్రాతిపదికగా చేసుకుని తమదైన భాషను సాహిత్యంలో ఉపయోగిస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగానే తాము నివసించిన 'వాడ', కుటుంబం – మాదిగ, మాల, బ్యాగరి, చిందు, డక్కలి, బైండ్ల, మన్నెం, నేతకాని, పంబాల, బుడగ జంగాలు, మాష్టిన్ మొ॥ – యొక్క సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక స్థితిగతులను, అస్తిత్వ కోణాలను వస్తువుగా మార్చుకుని శిల్పంలో తమదైన పలుకుబడిని అపూర్వంగా వాడుతున్నారు. వెలికి గురై అణచివేతలతో మగ్గుతున్న ఈ వాడ కుటుంబాల పద బంధాలు, సామెతలు, ఉపమేయాలతో మానవీయ కోణం గల ప్రాపంచిక దృక్పథం కలగలిపి అగ్రహారాలతో తలపడుతున్నారు.

ఈ నేపథ్యంలోనే దళిత కవుల భాషను, తత్వాలను, సృజనను ఈ కింది ఉదాహరణలో మనం చూడవచ్చు.

"కవిత్వం నా కుల వృత్తిలోని చర్మతత్వ రహస్యం
ఒకే వస్తువును ముట్టలేను
ఒకే రకం చెప్పులను కుట్టలేను
*గబ్బిలమా! నీ పాదాలకు నా కవిత్వపు కొత్త జోళ్ళు*
తొడుగుతున్నాను"

అంటూ ***కొత్త గబ్బిలం*** అనే కవితలో ఎండ్లూరి సుధాకర్ తన కవితా తత్వాన్ని నూతన ఒరవడిలో తీసుకొచ్చాడు.

దళిత సాహిత్య ప్రక్రియ క్రమంలో భాష కీలక పాత్ర వహించిందని చెప్పాలి. దళిత కవులు తమ సాహిత్యానికి తాము ఉపయోగించే భాషకు ప్రత్యేక పేర్లను పెట్టుకున్నారు. 'మట్టి భాష', 'కాకి భాష', 'నలుపు భాష', 'గబ్బిలం భాష', 'లంద భాష', 'కిర్రు చెప్పుల భాష' వీటిలో కొన్ని. నిజానికి బహుజన మూలవాసీ భాష మరియు బ్రాహ్మణీయ హిందూ భాషపై తులనాత్మక పరిశోధనలు జరగాల్సి ఉంది. ఆధునిక దళిత సాహిత్యానికి, భాషకు, వ్యక్తీకరణకు పునాది మౌఖిక సాహిత్యం అని ఇప్పటికే పరిశోధనల్లో వెలువడింది. ఈ సాహిత్య భాషలో కింద పేర్కొన్న కోణాలపై పరిశోధనలు జరగాల్సి ఉంది.

**హిందూ మూలాల తిరస్కరణ :** నిశితంగా పరిశీలించినట్లయితే ఈ రచయితలందరూ కూడా హిందూ సాంస్కృతిక మూలాల ప్రామాణీకతను తిరస్కరించటం గమనించచ్చు. కుల వ్యవస్థలో నిత్య బాధితులయ్యే దళితుల గుండె గొంతుకల నుండే సజీవమైన సాహిత్యం ఉద్భవిస్తుందని, "మా కడుపుల్లో పద్దాకనే కదా అక్షరం అగ్నిపునీతయింది" అని పైడి తెరేష్ బాబు రాస్తే, "ఆరెల్తో దూడ తోళ్ళ మీద మహా కావ్యాలు రాస్తాను" అని మద్దూరి నగేష్‌బాబు ప్రమాణం చేశాడు. సతీష్ చందర్ తన ***పంచమ వేదం*** కవితలో

"నాలుగు పదాలు కలవకూడదన్నదే నిన్నటి వ్యాకరణం
నాలుక కంటిన ఏ అయిదో పదమూ గ్రాంధికం కాలేదు
క్రియల్ని కిందకు తొక్కి మనువే మహాకవయ్యాడు
భాషా అప్రవీణులారా ఉలికి పడకండి
మీరు కుదిర్చిన ఛందోబద్ధ కాపురాలను కాలదన్ని పదాలు
లేచిపోతున్నాయి
వర్ణక్రమాలు లేని వాడలకు వలసపోతున్నాయ్" అంటూ
భాషా ప్రవీణులకు సవాల్ విసిరాడు.

దళిత భాషకు, కుల భాషకు నడుమ కొట్టొచ్చే తేడాని, దళిత సాహిత్యంలో పొడచూసే పురాణ వ్యతిరేక నిర్మాణ పద్ధతిని స్పష్టంగా శివసాగర్ రాసిన ***నడుస్తున్న చరిత్ర*** కవితలో చూడొచ్చు.

"శంభూకుడి పెదాల మీద చిరునవ్వుతో
రాముణ్ని వధిస్తున్నాడు
ఏకలవ్యుడు ద్రోణుడి బొటన వేలుని గొడ్డలితో నరుకుతున్నాడు
బలి తన చిరుపాదాలతో వామనున్ని
పాతాళానికి తొక్కేస్తున్నాడు
మనువు కళ్ళలో సూదులు గుచ్చుకుని
నాలుక తెగ్గోసుకుని
చెవిలో సీసం పోసుకొని
స్మశానంలో దొర్లుతున్నాడు. ఇప్పుడు నడుస్తున్నది పరమ
ఛండాల చరిత్ర".

**దళిత చరిత్ర – అధికార చరిత్ర :** అధికార చరిత్రను ప్రశ్నించడంలో, తిరగ రాయడంలో, తమ స్వంత చరిత్రను పునర్నిర్మించుకోవడంలో భాగంగానే దళిత భాష "కాలం కదులుతున్నకొద్దీ – కొత్త దర్పేత్తుకొంది కొత్తతొవ్వల ... అంటూ కొత్త పుంతలు తొక్కింది. దీనికి మోదుకూరి జాన్సన్ రాసిన ***మాతంగ సమ్రాట్ వీరబాహు*** నాటకం ఒక సజీవ సాక్ష్యం. వీర బాహు వంశపు రాజులు ఢిల్లీ రాజధానిగ నాల్గు వందల ఇరవై సంవత్సరాలు పరిపాలించిన కాలంలోనే మాతంగ రాజుల సంస్థానాలు విరాజిల్లినాయి. వారిలో ఒకరయిన సమ్రాట్ వీరబాహు హరిశ్చంద్రుడ్ని విశ్వామిత్రుడు నుంచి ఋణవిముక్తుడ్ని చేసి కొనుక్కొంటాడు. ఈ సందర్భంగా వీర బాహునికి, హరిశ్చంద్రుడికి, సభికులకి మధ్య అత్యంత ఆశక్తికరమైన సంభాషణ జరుగుతుంది. వీరబాహు మంత్రి హరిశ్చంద్రుడ్ని ఇలా అడుగుతాడు.

మంత్రి : ప్రజలను కులాలుగా విడదీసి పరిపాలించే బదులు అందరినీ ఒకటిగా కలిపి పాలించవచ్చు కదా?

హరిశ్చంద్రుడు : మనుగడకు ప్రమాదం మహా మంత్రి ... యుక్తితో, కుయుక్తితో, సమయస్ఫూర్తితో, వ్యూహంతో, కొత్త

ఆయుధాలతో మిమ్మల్ని జయించగలమేమో కానీ మా బలాలతో, బలగంతో కాదు కదా ప్రభూ! మీ ప్రజా బలంలో మా బలమెంత?

విధూషకుడు : ధాన్యరాశుల్లో మట్టి గడ్డలంత.

ఈ సమాధానంలోని పోలికను ప్రత్యేకంగా చూడాల్సి వుంది. మాతంగ వంశం రాజులుగా పాలించినప్పటికీ వీరికి వ్యవసాయంతో అనుబంధం ఉందని, సాగుచేయు నైపుణ్యంతో పాడి పంటలు, ధాన్యరాశులు పుష్కలంగా ఉండేవని కనుకనే 'ధాన్యరాశుల్లో మట్టిగడ్డలంత' అన్న పదబంధాన్ని ఆ విదూషకుడు అంత బలంగా ప్రయోగించాడని అర్థం చేసుకోవచ్చు.

హరిశ్చంద్రుణ్ని బానిసగా కొనడానికి ముందు అతడ్ని వీరబాహు, రాణి, మంత్రి, కవి / సలహాదారుడు అయిన విదూషకుడు కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు అడుగుతారు. బోనులో నిలబడిన హరిశ్చంద్రుడు ప్రశ్నలకు సమాధానం చెపుతూ తాను ఎన్ని అబద్ధాలు ఆడేడో, ఎందుకాడేడో సొంతగా వివరిస్తాడు, అబద్ధాలు ఆడానని దాదాపు ఒప్పుకొంటాడు. మోదుకూరి జాన్సన్ తను రాసిన నాటకంతో ఈ విధంగా మనకు తెలిసిన దాన్ని పూర్తిగా తిర్గమర్లేసి సత్యహరిశ్చంద్రుడ్ని అసత్య హరిశ్చంద్రుడిగా నిలబెడతాడు.

**కాకి కవులు, కోకిల కవులు :** హిందూ బ్రాహ్మణీయ భావజాలంతో రాసే కవులకు భిన్నంగా, దళిత దృక్కోణపు కవుల ప్రతీకలు ఉంటాయి. హిందూ కవి పొడుగ్గా ఉన్న వ్యక్తిని 'ధ్వజ స్తంభం లాగా' ఉన్నాడని అంటే దళితకవి 'తాటి..ఈత చెట్టు'లా ఉన్నాడని పోలుస్తారు. అలాగే బేకారుగ తిరిగే వారిని దళిత దృక్పథం ఉన్న వారు 'పని పాటా లేకుండా తిరుగుతున్నాడని' అంటే హిందూ భావజాలం ఉన్న వారు 'చదువు సంధ్య లేకుండా తిరుగుతున్నాడని' అంటారు. మోదుకూరి రాసిన **కాకి** కవితను ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కాకికీ, కోకిలకీ ఉన్న ప్రధాన తేడాను ఆసక్తికరంగానూ, శక్తివంతంగానూ కవి వర్ణిస్తాడు.

"ఏమిటి కవీ కోకిల వ్యక్తిత్వం?
బిడ్డలని కని ఆయాల ముఖాన పారేసి
క్లబ్బుల్లో సల్లగా తిరిగే మాతృత్వంలేని
శిఖండి తల్లుల్లా
గుడ్లను నా గూట్లో పారేసి
పొదగడం కూడా చేత కాక
మా రెక్కల వెచ్చదనంతో వెలుగు బాటలైన భావితరానికి
వూపిరినిచ్చే
మా కాకులదా? వ్యక్తిత్వం
కోకిలదా?
అసలు వ్యక్తిత్వమంటే ఏమిటి కవీ?
పొలమెక్కడుందో తెలియక
కష్టమంటే ఎరుగకనే
పదిమందీ పండించిన పంటనంతా
తన పాతరలో పోసుకునే
ధనిక రైతు ఆసామిలా
ఎప్పుడో వసంత రుతువులో మాత్రమే వచ్చి
మెత్తని చిగురుటాకులు మెక్కి
పొగరెక్కి వగరు కూతలు కూసే కోకిల గీతాలే
మీ కలాలకు కవితలవుతాయి"

భాషాపరంగా చూసినా, కవితావస్తువు ఎంపికపరంగా చూసినా, కాకి కోకిలల మధ్య తేడాలను చూసినా తిరుగులేని విధంగా తర్కించాడు కవి జాన్సన్. అంతకు ముందు కాకి అంటే హేయ, చులకన భావం ఉన్న చాలా మందికి ఈ కవిత చదివిన తరువాత అసాంతం అభిప్రాయం మారిపోయి కాకి అంటే గౌరవం పెరగడం కద్దు. అంతవరకే ఆగలేదు. ఒకానొక సందర్భంలో సాహిత్య రంగంలోను, సినీ రంగంలోను కాకి కవులుగా, కోకిల కవులుగా నిలువునా చీలిపోవడం, వారికి వారు కాకి కవులుగా ఒకవైపు కోకిల కవులుగా మరొకవైపు ప్రకటించుకోవడం మామూలు విషయం కాదు.

బానిసత్వాన్ని, అంటరానితనాన్ని ధిక్కరించే భాషను దళితులు సృష్టించారు. రాసే సాహిత్యంలోనూ, మాట్లాడే మాటల ద్వారానూ ప్రయోగిస్తున్నారు. చరిత్రలోనే కాక వర్తమానంలో కూడా కొత్త కొత్త రూపాలలో ఎడతెరిపి లేకుండా ప్రతి గ్రామంలోనూ, తెలంగాణాతో సహా, కొనసాగుతున్న వెలి, అంటరానితనం, బానిసత్వం, అత్యాచారాల నేపథ్యంలో ఈ ధిక్కార భాషను వాడుతున్నారు.

## హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో దళిత విద్యార్థులు, ఇంగ్లీషు

### మిరప మాధవి

హైదరాబాదు విశ్వవిద్యాలయం వంటి సెంట్రల్ యూనివర్శిటీల్లో జాతీయ, అంతర్జాతీయ విద్యార్థుల ప్రవేశం ఉంటుంది కాబట్టి బోధనా మాధ్యమంగా ఇంగ్లీషు ఉంటుంది. అందరినీ కలిపి ఉంచే భాష అది.

ఇక్కడ ప్రవేశం పొందే అనేక మంది దళిత విద్యార్థులు ఇంగ్లీషులో మాట్లాడలేక పోవటం వలన వేరే విద్యార్థులతో కలవలేక పోవటం, తరగతి గదుల్లో ఉపాధ్యాయుల ఉపన్యాసాలకు ప్రతిస్పందన ఇవ్వలేకపోవటం, నోట్సు రాసుకోలేక పోవటం, ఉపన్యాసాలు అర్థం చేసుకోలేక పోవటం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. అయితే ఇంగ్లీషు భాషలో మాట్లాడటాన్ని విద్యార్థుల అకడమిక్ సామర్థ్యానికి ప్రమాణంగా తీసుకోవటంతో దళిత విద్యార్థులు కెరీర్ తీవ్ర ఇబ్బందులకు గురవుతోంది. వారి వారి మాతృభాషల్లో సబ్జెక్టు పై ఉన్న జ్ఞానం, దాన్ని వ్యక్తపరిచే సామర్థ్యం ఇక్కడ పనికి రానివిగా పరిగణిస్తారు. ఇంగ్లీషు రాకపోవటం వల్ల సబ్జెక్టు గురించి మాట్లాడలేకపోతారు. దాని వల్ల దళిత విద్యార్థులంటే ఉండే సాధారణ అభిప్రాయాలు - వారికి 'మెరిట్' లేదనీ, అజ్ఞానులనీ, విశ్వవిద్యాలయ విద్యకు పనికి రారనీ బలపడుతున్నాయి.

రిజర్వేషన్లు లేనిదే వారు విశ్వవిద్యాలయాలకు చేరుకోలేరనీ కూడా అభిప్రాయం కొనసాగుతుంది. అకడమిక్ ప్రపంచంలో వుండే 'ఇంగ్లీషు కాంప్లెక్స్' దళిత విద్యార్థుల్లో విశ్వ విద్యాలయ విద్య అంటే భయం పెంచుతోంది. దీన్ని సాకుగా తీసుకున్న అగ్రకుల ఉపాధ్యాయులు వారిని అదే పక్ష పాత ధోరణిలో చూడటం, అవమాన పరచటం జరుగుతోంది. కొంత మంది దళిత టీచర్లు కూడా ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు.

ఇంగ్లీషు భాష సమస్యను తీర్చటానికి దళిత విద్యార్థులకి రెమెడియల్ కోర్సుల పేరుతో ఇంగ్లీషు తరగతులు నిర్వహిస్తున్నారు కానీ విద్యార్థులు దానితో సంతోషంగా లేరు. వారు ఆశించిన దానికీ, అక్కడ జరుగుతున్న దానికీ పొంతన లేదు. తరగతి గదుల్లో వినే ఉపన్యాసాలు అర్థం చేసుకోవటానికి ఈ రెమెడియల్ కోర్సు ఉపయోగపడు తుందని విద్యార్థులు ఆశిస్తే, ఆ కోర్సులు వారికి 'భాష' నేర్పటానికి రూపొందించబడినాయి. ఈ రెండు ఇంగ్లీషులు భిన్నమైనవి. అంతే కాక దళిత విద్యార్థులు అనే గుర్తింపు రావటం ఇష్టం లేని వారు కూడా ఈ తరగతులకు హాజరు అవటం లేదు.

దళిత విద్యార్థులు ఇంగ్లీషు నేర్చుకోవటానికి అనేక మార్గాలు చేపడుతున్నారు. ఇంగ్లీషు మాట్లాడే వారితో మాత్రమే కలిసి మెలిసి తిరగటం, ఇంగ్లీషు వార్తా పత్రికలు చదివి, ఇంగ్లీషు వార్తలు చూడటం; సీనియర్ల నుండి నేర్చుకోవటం కొంత మంది దీన్ని సవాలుగా తీసుకుంటే, మరి కొంత మంది దీన్ని సమస్యగా చూస్తున్నారు. సవాలుగా తీసుకున్న వారు సమస్యగా భావించిన వారి కంటే ఇంగ్లీషు నేర్చుకోవటంలో ముందున్నారు.

**అన్వేషికి సమర్పించిన రిపోర్టు 'హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో దళిత విద్యార్థుల సమస్యలు' నుండి.**

**మిరప మాధవి హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డి. చేస్తున్నారు.**

# మాతృభాష మారువేషం

■ ప్రసేన్

ఏ భాష ఏ యాస
ఏ గ్రాంథికం ఏ గ్రామ్యం
నాకిపుడు సందేహాల్లేనేలేవు!

నత్తినత్తిగా ఎలాస్టిక్ అక్షరాలతో నేను కొత్త
మాట తడబడుతున్నపుడు ఉచ్చారణలేని
పదాలు నిప్పుల స్నానం చేసాయి కదా మీ
భాష కోసం నా అర్థాన్ని బియ్యం గింజల
పలక మీద జంజెం కట్టిన ఉంగరంతో
రచించారు కదా!

నూనెలో లేని అక్షరాలు
ఏం పలికాయో తెలీదు
పెదబాలశిక్ష నాయాసలో ఎందుకు లేదో
మాతృభాష చుట్టపు చూపెందుకయిందో!
ఏమీ తెలీదు...
ద్విత్వాలు దంత్యాలు తాలవ్యాలు తేడా
పలకలేను నిజమే. వత్తులూ పొల్లులూ
యాసలో విరిగిపోతాయి నిజమే. వాక్యం
తెగాల్సిన చోట తెగదు అవిరామచిహ్నాల
గాయాలను పులుముకుంటుంది నిజమే.

మార్కులు రాని మాతృభాష నాది
ఇప్పుడు ఏ అక్షరాన్ని దిద్దాలి
ఏ మాండలికాన్ని బట్టీపట్టాలి
ఏ సమాధానం అప్పజెప్పాలి
నాకు సందేహాల్లేవు!

సంస్కృతాన్ని తెలుగించిన కొత్త భాష నా
బాల్యం దేవతల పలుకుబడిని నేలజార్చిన
దౌర్జన్యం నా అక్షరాభ్యాసం నిశ్శబ్దంలోకి
వేళ్ళే అభావం స్వభావం

నోరెప్పుడూ మెలికలు పడదు నిజవే
ఐదారేడు అక్షరాలు లుంగలు చుట్టుకుని
శబ్దాలుగా దొర్లుకొస్తాయి నిజమే
ఇది ఆధునిక మాండలికమూ
అర్థాన్ని మాత్రమే గొణిగే నిరక్షరమూ
సందేహమూ సమాధానమున్నూ
ఏ భాష మాట్లాడాలి ఏ యాస రాయాలి
ఏ ప్రాస పాడాలి
అణుమాణాల్లేవు!
నా శ్రార్ధం నా పిండాకూడు
స్పష్టంగా పలకడమూ గ్నాపకమే
తప్పుడు ఉచ్చారన
అరచేతి నెత్తుటి పూవుగా
మారడమూ గ్ణాపకమే
గోడ ఖుర్చీ వీపు మీది వాత గీతలూ
బుగ్గ మీది పంతులోరి మొరటు సంతకమూ
దవడల మధ్య పగిలిన పలుకురాళ్ళ
పలకరింతలూ అన్నీ జ్నాపకమే
ఇపుడైతే నాకిక
అచ్చరం రూపంతో పనిలేదు
భావంతో కదా నా వివాదం
బోల్డెన్ని తప్పులు
గొనిగాను
రాసాను
పళికాను
ఇపుడు నాకెంతో
పొగరుగా వుంది...
(మరాఠీ దళిత కవి అరుణ్ కాంబ్లేకి క్షమాపణలతో)

(సాహిత్య వేదిక, ఆంధ్రజ్యోతి)
చిక్కనవుతున్న పాట దళిత కవిత్వం నుండి
కవిత్వం ప్రచురణలు–1995, పేజీ 151–153
ప్రసేన్ ఖమ్మంలో TV5 జర్నలిస్టు






# భాష, జీవనం

■ దీపా శ్రీనివాస్

'అన్వేషి' సంస్థ కోసం నేను 'డిఫరెంట్ టేల్స్' అనే ప్రాజెక్ట్ చేస్తున్న క్రమంలో, నాకు కలిగిన అనుభవాల నుండి కూర్చినదే ఈ వ్యాసం. 'కథల ప్రాజెక్ట్'గా ప్రాచుర్యం పొందిన ఈ ప్రాజెక్ట్ కోసం, అచ్చులో మనకు అరుదుగా కనిపించే అణగారిన వర్గాల పిల్లల కథల కోసం అన్వేషించాము. ఈ ప్రాజెక్ట్‌లో పాల్గొన్న అందరికి, ఇదొక సందేహాలతో, సంక్లిష్టమైన ప్రశ్నలతో కూడుకున్న సుదీర్ఘ ప్రయాణం! కానీ ప్రధాన స్రవంతిగా పేరు పడ్డ జీవితాల్లోని బాల్యాలు కాక ఇతర బాల్యాల గూర్చి తెలుసుకుని, వాటిపై చర్చకు తెరలేసిన గొప్ప అనుభవంగా కూడా దీన్ని చెప్పవచ్చు. ఈ ప్రాజెక్ట్ ఫలితంగా పెద్ద పిల్లలకు ఉద్దేశించిన ఒక పాతిక కథలను సేకరించి 'డిఫరెంట్ టేల్స్' పేరిట ప్రచురించటం జరిగింది. తెలుగు, మళయాళంలోని ఈ కథలను పరస్పరం మరియు ఆంగ్లంలోకి కూడా అనువదించటం జరిగింది. మనకు సాధారణంగా బాల సాహిత్యంలోనూ, పాఠ్యపుస్తకాల్లోనూ, వినిమయ సంస్కృతిలోనూ, ప్రసార మాధ్యమాల లోనూ 'బాల్యం' ఒక అమాయకత్వం నిండిన కాలంగా, పెద్దరికపు బాధ్యతలు, ఆందోళనల నుండి దూరంగా విభజింపబడి, చీకూ చింతలు లేని తనంగా చిత్రీకరింపబడుతూ ఉంటుందనే విమర్శ నుండే ఈ ప్రాజెక్ట్ ఆరంభింపబడింది.

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి, మన దేశంలో విడుదలయిన ప్రామాణిక పఠనా సామగ్రిని, మనం పరిశీలిస్తే, అందులో కథనాలన్నీ కూడా మధ్య తరగతి నేపథ్యం నుండి వచ్చిన పిల్లల రోజువారీ జీవితాలు, ఆర్థిక వనరులు, కుటుంబ బంధాలు, నమ్మకాలు, ఆహారపు అలవాట్లు, వారి భావోద్వేగాలు వంటి వాటి చుట్టూనే సర్వసాధారణంగా అల్లబడుతూ ఉన్నాయి. ప్రధాన జీవన స్రవంతి లోకి రాని పిల్లలు కూడా అక్కడక్కడ ఈ కథల్లో దర్శనమిస్తారు. కానీ వారిలో ఏదో ఒక అసాధారణ విషయం ఉంటే తప్ప వారు ఆమోదింపబడరు. భాషకు, జీవన ప్రపంచాలకు మధ్య గల సంబంధం అనేది 'డిఫరెంట్ టేల్స్' చేస్తున్నప్పుడు ఒక ప్రధానమైన ప్రశ్నగా ఉత్పన్నమైంది. ప్రస్తుత వ్యాసంలో ఈ సంబంధం గురించే క్లుప్తంగా చర్చిద్దాం. ఈ ప్రాజెక్ట్ మొదట్లోనే మేము కనుగొన్న విషయం ఏమిటంటే విభిన్న బాల్యాల కోసం జరిపే అన్వేషణ, సహజంగానే భిన్న పదకోశాలు, విభిన్న వ్యక్తీకరణల అన్వేషణకు కూడా దారి తీస్తుందని. పిల్లల కథల్లో సాధారణంగా వాడబడే భాష, బాల్యం గూర్చి ప్రచారంలో ఉన్న ఒక ప్రబలమైన భావనకి అనుగుణంగానే ఉంటుంది. అంటే కథల్లోని భాష, పిల్లల మనసులు, మెదళ్ళ లాగే 'సరళం'గా ఉండాలి అనేది. భాష సూటిగా, సులువుగా, పారదర్శకంగా ఉండాలి. ప్రధాన స్రవంతి బాలల సాహిత్యంలోని భాషను దగ్గరగా పరిశీలించినప్పుడు దాని సైద్ధాంతిక అంచనాలు బయటపడ్డాయి. ఆ భాషకు మధ్యస్థమైన 'అమాయకత్వం', మధ్య తరగతి అగ్రవర్ణ దృష్టి కోణం నుండి పుట్టినదే! ఉదాహరణకి బాలలకు ఉద్దేశించిన ఒక నమూనా కథనం ఇలా సాగుతుంది....'అదిగో రాము! ఒక వడ్రంగి! ఆ గది మధ్యలో నున్న అందమైన బల్ల చూశారా? రాము అలాంటి బల్లలు ఎన్నో తయారు చేస్తాడు. రాము చాలా మటుకు కష్టించి పని చేయాల్సి వస్తుంది. కానీ అతనికి తన కళ పట్ల చాలా ఇష్టం. అతని మొహంపై ఎప్పుడూ చిరునవ్వు ఉంటుంది'. ఈ భాషలో కనపడే సరళత్వం రాము మూర్తిమత్వాన్ని అత్యంత సామాన్యం చేసేస్తుంది. అంటే అతనిని కేవలం సంపన్న వర్గాలకు అతను చేసే సేవల ద్వారా మాత్రమే గుర్తిస్తుంది.

హిందూ పురాణాల నుండి తీసుకున్న ఇంకో కథలో రావణుడి సోదరి అయిన శూర్పణఖ, రాముడిని చూసి మోహించటం, ఆమెను వదిలించుకోవటానికి, లక్ష్మణుడు ఆమె ముక్కు, చెవులు కోసేసి లంకకు తిప్పి పంపటం చెప్పబడుతుంది. ఒక ఆదర్శ బాల సాహిత్యంలో, నిజానికి హింసకు చోటు ఉండకూడదు. కానీ వింతైన విషయం ఏమిటంటే, పై కథలో లక్ష్మణుడి చర్యల్లోని క్రూరత్వాన్ని చిత్రీకరించేటప్పుడు, భాషను కాస్త సున్నితం చేసే ప్రయత్నం ఏమీ జరగదు. ఆ హింస చాలా సూటిగా, దారుణంగా చెప్పబడుతుంది. అంటే ఈ కథ, పిల్లల్లో, రెండు రకాల భావోద్వేగాలను ఉసిగొల్పటానికి ప్రయత్నిస్తుంది. ఒకటి లక్ష్మణుని వీరత్వం పట్ల అబ్బురం ! ఇంకొకటి, ఆర్యపుత్రుడు, రాజవంశీకుడు అయిన రాముని పట్ల శూర్పణఖ యొక్క అసంగతమైన, అక్రమమైన కోరిక పట్ల పరిహాసం!

దళిత మరియు ఇతర అణగారిన / మైనారిటీ వర్గాలకు చెందిన రచయితలు, ఇప్పుడు ప్రబలమైన బాల సాహిత్యంలోని భాష నుండి దూరంగా జరుగుతున్నారు. ప్రముఖ దళిత రచయిత్రి, స్త్రీవాది అయిన గోగు శ్యామలతో నేను జరిపిన సంభాషణలను గుర్తు చేసుకోవటం ద్వారా ఈ అంశాన్ని నేను విశదపరుస్తాను.

'డిఫరెంట్ టేల్స్' పుస్తకంలో గోగు శ్యామల కథలు రెండు ప్రచురింపబడ్డాయి. అవి 'తాటకి' ఇంకా 'మాదిగ బడెయ్య'. తన కథల్లో తెలంగాణ ప్రాంతపు మాదిగ భాషను, మాండలికాన్ని వాడటం అనే ప్రక్రియ, తన ప్రాంతపు, కమ్యూనిటీ చరిత్రని పునరుద్ధరించే ప్రక్రియగా కూడా శ్యామల భావిస్తున్నారు. ఆమె మాటల్లో చెప్పాలంటే, 'నా కథలన్నీ నా బాల్యం గురించీ, మా కుటుంబమూ, మా వర్గ ప్రజలూ, వారి వృత్తులూ, వారి పనితనం, వారి ఉత్పాదకత గురించి! 'నేను పెద్దయి, వ్రాయటం మొదలు పెట్టాక, ఆ భాషకు నేనే దూరమయ్యాను. ఒక్కొక్కసారి మా అక్కకు ఫోన్ చేసి. ఆ పదం ఏమిటి? అని అడిగేదాన్ని...ఆమెకూ గుర్తుకు రాకపోతే, మా అత్తమ్మను అడిగే దాన్ని".

శ్యామలకు తన భాష పట్ల తపన, ఆమె ఉపయోగించే కొన్ని పదాలలోనే ప్రతిఫలిస్తుంది. ఉదాహరణకి 'మాదిగ బడెయ్య' లో 'లంద' అనే పదం. మాదిగ ప్రజలు సాధారణంగా తోలు తయారీలో వాడే గుంటలను 'లంద' అంటారు. చుట్టూ కొండరాళ్ళు ఉండి మధ్యనున్న గుంటలో నీళ్ళు, సున్నం తంగేడాకులు పోసి, తోళ్ళను నానపెడతారు. తోళ్ళ పరిశ్రమలో అనేక ఆధునిక పద్ధతులు వచ్చాక లందలు పనికి రాకుండా పోయాయి. నేడు ఆ పదం వాడుకలో లేదు. అందుకే చాలా మంది మాదిగ ప్రజలకి కూడా ఆ పదం ఇప్పుడు తెలీదు. కానీ ఆ పదంలో తమ ప్రజల ఉత్పాదక మరియు సాంస్కృతిక చరిత్ర దాగి ఉందని శ్యామల అంటారు. గ్రామంలోని అన్ని వర్గాల వారు వచ్చి ఆ లందకు భక్తిగా మొక్కటాన్ని ఆమె గుర్తు చేసుకుంటారు. ఆ లందలో తయారయిన తోలునే కుమ్మరి, కమ్మరి వంటి వారు, తమ పని ముట్లల్లో వాడేవారు. గ్రామంలోని ఉత్పాదక కులాల మధ్య గల పరస్పర ఆధారతత్వం, సయోధ్య దీని ద్వారా తెలుస్తాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెందిన ముస్లిం రచయిత మొహమ్మద్ ఖదీర్‌బాబు. ఆయన రచించిన కథ 'తలకాయ కూరతో...' లోని భాష ఒక సమూహ జీవనానికి, ఆహార సంస్కృతికి గల సంబంధాన్ని బాగా వ్యక్తపరుస్తుంది. ఈ కథలో ఖదీర్‌బాబు, తమ ప్రాంతంలో, తమ కమ్యూనిటీలో బాగా ప్రసిద్ధి పొందిన వంటకమైన తలకాయ కూరను తన బాల్యంలో, తమ ఇంట్లో ఏ విధంగా వండేవారో ఆ మధుర స్మృతులను వివరిస్తారు. బాలసాహిత్యంలో బాగా బలంగా నాటుకుని ఉన్న శాకాహార సంస్కృతికి విరుద్ధంగా మాంసాహారాన్ని వండటం, తినటంలోని ఆనందాన్ని ఈ కథ పరిచయం చేస్తుంది. కథలో వర్ణనలన్నీ, కథానాయకుడైన బాలుడి దృష్టి కోణం నుండే చెప్పబడతాయి. ఆదివారం పొద్దున్నే లేచి వెళ్ళి, మాంసం కొట్టే మాబ్బాషా దగ్గర నుండి గొర్రె తలకాయ సాధించుకురావటం దగ్గర మొదలుపెడితే,

ఈ కథ – క్లిష్టమైన ఆ వంటకాన్ని జాగ్రత్తగా వండటం... ఎంతగానో ఎదురుచూసిన ఆ నోరూరించే వంటకాన్ని తినటానికి, కుటుంబ సభ్యులంతా హడావిడిగా దాని చుట్టూ చేరటంతో ముగుస్తుంది.

ఖదీర్ బాబు మాటలు, ఆ వంటకంలోని రుచుల కలనేతను, అది తినటంలోని ఆనందాన్ని అద్భుతంగా చిత్రీకరిస్తాయి.

“నిజం చెప్పాలంటే పొట్టేలులో ఉండే సమస్త అవయవాలూ అలవిగాని రుచే. తొడ మాంసం ఒక రుచి. చింత చిగురు వేసి చేస్తే పక్కటెముకల మాంసం ఒక రుచి. నిప్పుల్లో వేపి గుండెకాయను కాల్చి తింటే ఒక రుచి. దానినే తియ్యకూర చేసుకొని తింటే ఇంకో రుచి. కాలేయంది ఒక టేస్టు. ఊపిరితిత్తులది యింకో టేస్టు. గోంగూరలో వేసి వండితే పొట్ట పేగులది యమా టేస్టు. ఇవన్నీ పోంగా తలకాయ కూర చేస్తే అద్దిరిపోయే టేస్టు”.

భాష తెలిగ్గా ఉంటూనే, పిల్లల కథల్లో సాధారణంగా కనపడని ఎన్నో రూపకల్పనలను, రుచులను, వాసనలను అలవోకగా పరిచయం చేస్తుంది. ఈ కథలోని భాష, పిల్లల కథల్లో ఉండవలసిన దాని కన్నా చాలా హింసాత్మకంగా ఉందని కొందరు విమర్శకులు అన్నారు. వారి ఈ విమర్శకు, నివ్వెరపాటుకు కారణం, ఇప్పటికీ మైనారిటీ వర్గాల మాంసాహార సంస్కృతిని వారి ఆటవికతకు, అసహజ ధోరణులకు చిహ్నంగా భావించే ఈ విమర్శకుల స్వాభావిక దృష్టికోణమే! బాలల సాహిత్యంలోని భాష బాగా శుచిగా, శుభ్రంగా ఉండటానికి కారణం, బాల్యంలోని ఇబ్బందులను, దు:ఖాలను గుర్తించి, పరిగణించి, వాటిని వ్యక్తపరిచేందుకు నిరాకరించటమే!

కానీ, వాస్తవానికి చాలా మంది పిల్లల జీవితాల్లో, ముఖ్యంగా అణగారిన వర్గాల్లో బాల్యం, ఎంతో కొంత బాధ, హింస లేకుండా గడవదు. డిఫరెంట్ టేల్స్, ఈ వాస్తవాన్ని వ్యక్తపరటానికే ప్రయత్నిస్తుంది. గోగుశ్యామల కథ ‘తాటకి’, పదకొండేళ్ళ బాలమ్మ గూర్చిన కథ. తమ కుటుంబానికి చెందిన చిన్నపాటి పొలంలో నీళ్ళు పెట్టటానికి బాలమ్మ పొద్దు పొడవక ముందే లేచి, పొలానికి వెళ్ళి, కాలువ నుండి వదిలిన నీళ్ళను ముందుగా తమ పొలంలోకి మళ్ళిస్తుంది. అలా చేయటం ద్వారా ఆమెకు తెలీకుండానే ఊళ్ళోని అతి ముఖ్యమైన, ఎదురులేని నియమాన్ని అతిక్రమిస్తుంది. అదేంటంటే, అగ్రవర్ణానికి చెందిన భూస్వామి–కరణం యొక్క పొలాలకు ఊళ్ళో అందరి కంటే ముందు నీళ్ళు పెట్టాలన్నది. ఈ ఉల్లంఘునకి, నిప్పులు చెరిగిన కరణం, ఆమెను ‘లంజ ముండా’ అని తిడుతూ, ఆమె పై అత్యాచారం చేయబోతాడు.

ఈ కథ ప్రామాణిక బాలలసాహిత్యంతో పోలిస్తే, రెండు విధాలుగా భిన్నంగా ఉంటుంది. మొదటిది, బాలసాహిత్యంలో నిషేధంగా భావింపబడే లైంగిక హింస గూర్చి ప్రస్తావించటం, రెండోది పిల్లల కథల్లో వాడుకకు ఆమోదింపబడని, బూతు మాటలు వాడటం. కానీ ఆ బూతు మాటను కథలో ఉంచటం అనేది చాలా ముఖ్యమైనదిగా శ్యామల నమ్ముతున్నారు. ఎందుకంటే అగ్రవర్ణాల వారు, దళిత స్త్రీలను, పిల్లలను కించపరచటానికి ఈ మాటను సర్వసాధారణంగా వాడుతూ ఉంటారు. పైగా బాలమ్మ వయసులో చిన్నది కాబట్టి, ఆమె తప్పును క్షమించేయటం లేదా చూసీ చూడనట్టు వదిలేయటం ఏమీ జరగదు. అగ్రవర్ణ నియమ ఉల్లంఘున అనేది వయసుతో నిమిత్తం లేకుండా శిక్షార్హత గల నేరంగానే పరిగణింపబడుతుంది.

ఈ కథలో శ్యామల వాడిన భాష బాలమ్మ జీవితంలోని వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. కానీ కథ హింసతోనూ, అణచివేతోనే ఆగిపోదు. బాలమ్మ, తమ వర్గంలోని స్త్రీలు, ఇలాంటి పరిస్థితుల నుండి తమ సమయస్ఫూర్తితో ఎలా బయటపడతారో గుర్తు తెచ్చుకుని అదే విధంగా తనను తాను రక్షించుకుంటుంది. కథ లైంగిక హింసను ప్రస్తావించినా, బాలమ్మ సాహసాన్ని, పట్టుదలను, ఆమె సామాజిక వర్గంలోని స్త్రీలతో ఆమెకు గల అనుబంధంపై ఎక్కువగా దృష్టి సారిస్తుంది.

‘డిఫరెంట్ టేల్స్’ కథలు అణగారిన వర్గాలకు చెందిన పిల్లలను బలోపేతం చేసే విధంగా ఉన్నాయి. ఎందుకంటే అది వారి జీవితాలను, కుటుంబాలను, బాంధవ్యాలను, పనిని పరస్పరం ఇచ్చి పుచ్చుకోవటాన్ని ప్రతిబింబిస్తుంది. అయితే ఈ కథల్లో మధ్య తరగతి పిల్లలకు, నచ్చేది పనికొచ్చేది ఏదీ లేదా? అంటే ఉందనే నమ్ముతున్నాను ఎందుకంటే ప్రామాణిక బాలలసాహిత్యం, మధ్య తరగతి పిల్లల సృజనాత్మకతను పూర్తిగా సంతృప్తి పరచలేదు. దానిని అది నియంత్రిస్తుంది కూడా. ప్రధాన స్రవంతి కథా వస్తువులకు దూరంగా ఉన్న ఈ కథలు అందరు పిల్లల్లో కొత్త అవగాహనను పెంపొందించి, కొత్త వినోదాంశాలకు బాటలు వేస్తాయి. ‘భిన్నత్వంలో ఏకత్వం’, ‘మనందరం భారతీయులమే’ అనే అరిగిపోయిన పాత భావజాలాన్ని దాటుకుని భిన్నంగా ఉంటాయి.

‘డిఫరెంట్ టేల్స్’ ప్రాజెక్ట్‌లో ఉత్పన్నమైన సంక్లిష్టమైన ఈ భాషాపరమైన ప్రశ్నలకు ఈ వ్యాసం, సంపూర్ణమైన సమాధానమేమీ కాదు. కానీ, ఇప్పటి వరకు ప్రచారంలో ఉన్న ఒక ‘ఆదర్శ బాల్యపు ఊహాచిత్రం’ యొక్క నిర్దేశిత మార్గంలో కాక, అణగారిన వర్గాల పిల్లల కథల్లోని భాష వారి సొంత జీవితనుభవాలు, నేపథ్యాల నుండి ఎలా పుట్టుకొచ్చిందో తెలుపుతుందని ఆశిస్తున్నాను. అలాగే, భిన్న బాల్యాలకు, విభిన్న పార్శ్వాలకు ప్రాతినిధ్యం వహించాలనుకునే బాలల సాహిత్యానికి, ‘డిఫరెంట్ టేల్స్’ ఒక అద్భుతావకాశంగా భావిస్తున్నాను.

**అనువాదం : సింగరాజు రమాదేవి**

*దీపా శ్రీనివాస్ హైదరాబాద్ యూనివర్శిటీలో సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్‌లో అధ్యాపకులు.*

*సింగరాజు రమాదేవి వరంగల్‌కు చెందిన కథా రచయిత.*









# దళిత కవిత్వానికి ‘తిట్టు’ అంతిమ లక్ష్యం కాదు!

■ **జిలుకర శ్రీనివాస్**

‘బూతు’ కవిత్వం అవుతుందా? ఆవేశం కవిత్వమై పాఠకున్ని ఊపేస్తుందని విమర్శకులంతా అంగీకరించిన సత్యం. ఆవేశం హద్దులు దాటినప్పుడు అది ‘ధర్మాగ్రహం’ అని సమర్ధించిన దాఖలాలెన్నోవున్నాయి. ‘ధర్మాగ్రహం’ అంటేమిటి? ఏ కులస్తులు వ్యక్తం చేస్తే అది ధర్మాగ్రహం అవుతుంది? ‘దొంగలంజకొడుకులసలేమెసిలే..’ అని శ్రీశ్రీ రాస్తే ధర్మాగ్రహం అన్నారు. అవే మాటల్ని దళితకవి రాస్తే బూతులు రాయటమేంటని నిలదీశారు.

ఆగ్రహాన్ని వ్యక్తీకరించే పద్ధతులెన్నో వుంటాయి. కోపాన్ని హింసాత్మకంగా వ్యక్తీకరించటం ఒక రూపం. కానీ అదే కోపాన్ని తిట్టురూపంలో వ్యక్తీకరించటం మరో రూపం. ఒక మనిషికి కోపం ఎందుకొస్తుంది? తనకు అన్యాయం జరిగిందనే ఎరుక కల్గినప్పుడు. ఆ ఎరుక లేని స్థితిలో కూడా కోపం వస్తుంది. అది సహజాతం. కానీ తనకు లేదా తన సమాజానికి అన్యాయం జరిగిందని గ్రహించే చైతన్యం వ్యక్తిలో వచ్చినప్పుడు, ఆ చైతన్యాన్ని వ్యక్తంచేసే సమయం, సందర్భం (స్థల,కాలాలు) అనుసరించి ఆ కోపం యొక్క తీవ్రత ఆధారపడి వుంటుంది. ఆ తీవ్రత పెరిగినప్పుడు దాన్ని వ్యక్యం చేసే పదాలను లేదా సంజ్ఞలను వక్త లేదా కవి వెతుక్కుంటాడు. ఆ ఆగ్రహ తీవ్రతను, బరువును మోయగలిగే సంస్కారవంతమైన పదాలు లేదా సంజ్ఞలు సాధారణంగా దొరకవు. అలాంటి స్థితిలో తన సాంస్కృతిక నేపథ్యంలోంచి బూతులను ఎంపికచేసుకుంటాడు.

సంజ్ఞలు సాంస్కృతిక నిర్మాణాలని ఫెర్డినాండ్ డి సజూర్ సూత్రీకరించాడు. దళితుల మీద ఆధిపత్య సంస్కృతి అనేక సంజ్ఞలను రుద్దింది. అవి చాలావరకు శరీరాలను కేంద్రంగా చేసుకొని నిర్మాణం అవుతాయి. బూతులు కూడా సాంస్కృతిక నిర్మాణాలు కాబట్టి అవి మనిషి శరీరంలోని, మరీ ముఖ్యంగా స్త్రీ దేహంలోని అవయవాలను ఆధారం చేసుకొని నిర్మాణం అవుతాయి. స్త్రీ శరీరాన్ని వర్ణిస్తే ప్రబంధ కావ్యమైంది. అదే స్త్రీ, పురుషుల అవయవాలను తిట్టుగా ఉపయోగిస్తే దళితకవిత్వం నిండా బూతులని ఈసడించారు. సంస్కారవంతులు రాసే భాష ఒకటి వుంటుందని, అలాంటి భాష మాత్రమే కవిత్వ రచనలో వాడాలని నిర్దేశించారు. కావ్యభాషగా అగ్రకులాల భాషను ఉపయోగించాలని ఒకరకంగా బెదిరించారు. కానీ దళితభాషలోని నిరుపమాన సౌందర్యాన్ని కవిత్వంలోకి ఎలా తేవొచ్చో అనేకమంది దళితకవులు చూపించారు. నిశానీ కవులు మద్దూరి నగేష్‌బాబు, పైడితెరేష్‌బాబు, ఖాజా దళిత కవిత్వంమీద అగ్రవర్ణాలు చేస్తున్న విమర్శలకు సమాధానం చెప్పారు. ఆ పరంపరను కొనసాగిస్తూ, తెలంగాణ మాదిగకవులు వేముల ఎల్లయ్య తన ‘కక్క’, ‘సిద్ధి’ నవలల్లో తిట్టును అద్భుతరీతిలో ప్రయోగించాడు.

నల్లజాతి మీద తెల్లవాళ్లు అనేక ఘోరాలకు పాల్పడ్డారు. వాళ్లకు ఒక సంస్కృతి అంటూ లేకుండా చేశారు. సంస్కృతిని భాషే ప్రదర్శిస్తుంది. నాగరికతకు భాష చిహ్నం. అనాగరికతను నల్లజాతిమీద బలవంతంగా రుద్దటం వల్ల ఆ జాతి ప్రజల భాష తెల్లవాళ్ల వ్యవహారానికి భిన్నంగా వుంటుందనీ, నత్తినత్తిగా మాట్లాడటం, తెల్లవాళ్ల ముందు వినయవిధేయతలతో, గొంతులో భయం, గౌరవం తొణికిసలాడుతూ మాట్లాడటం, స్వరం తగ్గించి మాట్లాడటం వంటి లక్షణాలు ఫ్రాంజ్ ఫానన్ తెలిపాడు. కానీ అదే నల్లజాతీయుడు తన జాతివ్యక్తితో మాట్లాడే తీరులో ఎంతో తేడా వుంటుందనీ, అందులో బూతు ప్రధానపాత్ర పోషిస్తుందని అంటాడు. నల్లజాతి కవులు రాసిన అనేక కావ్యాల్లో బూతు సర్వసాధారణాంశం. బూతులు మాట్లాడని నల్లజాతి పాత్ర ఇంగ్లీషు సినిమాల్లో ఎక్కడా కనిపించదు. అదే తెల్లహీరోలు మాత్రం చాలా సంస్కారవంతమైన, కన్సెప్చువల్ లాంగ్వేజ్‌ను మాట్లాడుతుంటారు. నల్లవాళ్లు గట్టిగట్టిగా మాట్లాడుకోవటం, తెల్లవాళ్లు మూడోవ్యక్తికి వినపడనంత చిన్నశబ్దాలతో మాట్లాడుకోవటం మనం చూడొచ్చు. ఇలాంటి దృశ్యాన్ని మనం అగ్రవర్ణాల్లోనూ అణగారిన వర్గాల్లోను చూడొచ్చు. సరిగ్గా ఇలాంటి స్థితినే సాహిత్యంలో చూడొచ్చు.

దళితవాదం సంప్రదాయిక సాహిత్యసూత్రాలను, కవితాపరికరాల (పోయెటిక్ డివైసెస్)ను తిరస్కరించింది. అలంకారశాస్త్ర పరిమితిలో ఇమడని ఉద్యమం ఇది. మనువాద కవిసమయాలతో దళితకవి లక్ష్యం నెరవేరదు. బ్రాహ్మణీయభాషలో దళితజీవితం సంపూర్ణంగా వ్యక్తం కాలేదు. జీవితానుభవాలే భాషను నిర్ణయిస్తాయి. కాబట్టి దళితజీవితానుభవాన్ని దళితభాష మాత్రమే సరిగ్గా వ్యక్తీకరించగలదు. అందుకే, దళితులు తమదైన భాషను, స్వరాన్ని ఎంచుకున్నారు. ఈ స్వతంత్రత, స్వయంనిర్ణయాధికార కాంక్ష, స్వేచ్ఛాపూరిత దళిత పోయెటిక్స్ సంప్రదాయక సాహిత్య ప్రమాణాల పరిధులను దాటిపోయాయి. ఈ మార్పును విమర్శకులు అర్థం చేసుకోలేకపోయారు. కవిత్వభాష లేదా కావ్యభాషలో తిట్లు వాడొచ్చా? తిట్లు పాఠకుల హృదయసంస్కారానికి, సంఘ పరివర్తనకు ఉపకరిస్తాయా అన్న మీమాంసను చాలా తెలివిగా ముందుకు తెచ్చారు.

కావ్యభాష ఏది? మధ్య యుగాల కాలంలో సంస్కృతం కావ్యభాష. అది బ్రాహ్మణవర్గం యొక్క అధికారభాష. అది సంస్కారవంతుల వ్యక్తీకరణ సాధనం. పండితవర్గం మాత్రమే దాన్ని వాడేది. తెలుగు పేరుతో చలామణి అయ్యిందంతా బ్రాహ్మణవర్గాలు సృష్టించిన సంస్కృతం. ఆంధ్రమహాభారతం మొదలుకొని ఆధునిక కాలం వరకు కావ్యభాషగా విప్రవర్గాల నుడికారమే పెత్తనం వహించింది. ముఖ్యంగా ప్రబంధ యుగంలో వచ్చిన రచనలన్నీ పచ్చి బూతును శృంగారంగా వర్ణించిన బ్రాహ్మణీయభాషలో వచ్చినవి. ప్రబంధ నాయికా వర్ణనలో దారుణమైన బూతులు వాడారు. విమర్శకులు వాటిని ఎంతో సహృదయతతో అర్థం చేసుకున్నారు. కానీ జానుతెనుగును, అచ్చతెనుగును విమర్శకులు చిన్నచూపు చూశారు. ద్విపద ఛందస్సులో వచ్చిన పాల్కురికి సోమనాథుడి కావ్యాలను కూడా రెండోశ్రేణి రచనలుగానే పరిగణించారు. ఎవరు మాట్లాడే భాష, మార్గ–దేశి ఛందస్సు అనే తేడాను బట్టి ఆయా రచనలకు గౌరవం, అవమానాలు దక్కాయి. ఒక్క భాష విషయమే కాదు, కావ్యవస్తువు, నాయికా–నాయకుల వర్ణ కుల హోదాలను అనుసరించి రచన ప్రామాణ్యాన్ని లెక్కించే ఒక పరిస్థితి ఉండేది. రచయిత కులాన్ని బట్టి కావ్యగౌరవం లభించేది. తెలుగు కావ్యప్రపంచాన్ని మనువాద అలంకారశాస్త్రం నియంత్రించింది. నిర్దేశించింది. ఆ నిరంకుశ కావ్యశాస్త్రాన్ని ధిక్కరిస్తూ దళితవాదం కొత్త అలంకారసూత్రాలను తన కవిత్వంతో ఆధునిక కాలానికి అందించింది. బ్రాహ్మణీయ కావ్యభాషను కాలదన్ని దళితభాషతో ఉపమ, రూపాక, ప్రతీకలను ఉద్దీపింప చేసింది.

దళితులు రాసిన కవిత్వంలో శత్రువుమీద దాడిచేయటమే తొలిదశ. పాఠకుడు అగ్రవర్ణస్తుడు. అతడితో సరదాలు, సయోధ్యలు లేవని దళితకవి నిర్ణయించుకున్నాడు. అగ్రకులస్తులు కంచికచర్ల కోటేశును హత్యచేసినప్పుడు, మహదేవమ్మను నగ్నంగా ఐదురూపాయల కోసం ఊరేగించి హింసించినప్పుడు, కారంచేడులో ఊచకోత కోసినప్పుడు, చుండూరులో మారణహోమం సృష్టించినప్పుడు మర్యాదస్తుల భాషలో, ఇంకా చెప్పాలంటే ‘మీ పిండాకూడు’ లాంటి బ్రాహ్మణీకం భాషలో కవిత్వం రాయాలని కోరుకోవటమే పెద్దతప్పు. దళితుల జీవితాల నిండా హింసను, బూతును నింపి ఆనందించిన అగ్రవర్ణ సమాజం, అవే బూతులను శక్తిమంతంగా అగ్రవర్ణ సమాజం మీదికి ఆయుధంగా విసిరితే బిత్తరపోయింది. అంతలోనే తేరుకొని ఎదురుదాడి మొదలుపెట్టింది. తిట్టే కవిత్వం కాదు. అగ్రవర్ణ సమాజాన్ని తిట్టడమే దళితకవి అంతిమ లక్ష్యమైనట్టు ప్రచారం చేశారు. తిట్టడం వల్లనే సంఘం మారుతుందని ఏ దళితకవీ చెప్పలేదు. దళితకవిత్వం ఆ దశను దాటి పరిణత దృక్పథాన్ని ప్రదర్శించింది. అనేక నూత్న విలువలను తెలుగు సాహిత్యసమాజానికి అందించింది. దళితకవిత్వం ప్రతిపాదించిన భావజాలపరమైన, సైద్ధాంతిక అంశాలను చర్చించకుండా, అలంకారశాస్త్ర సంకెళ్లను తెంచి, కొత్తగా నిర్మించిన కవితానిర్మాణ మర్మాలను, సౌందర్యశాస్త్ర వికాసానికి దళితవాదం అందించిన ఈస్థెటిక్ కాంట్రిబ్యూషన్ గురించి చర్చించకుండా ఒక కుట్రపూరితంగా మనువాద విమర్శకులు వ్యవహరించటం దారుణం. ఇలాంటి మనువాద దృక్పథం సాహిత్యప్రజాస్వామ్యానికి ఏమాత్రం తోడ్పడదు.

*జిలుకర శ్రీనివాస్ దళిత మేధావి, రచయిత, ఉద్యమకారుడు.*

# మెలిస్సా మోర్

# హోలీ షిట్ : ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ స్వేరింగ్

## పుస్తక సమీక్ష

■ **ఆర్.శ్రీవత్సన్**

"హురాలే, నీ భార్య వేరొతో ఆరోగ్యంగా, రతిసుఖం అనుభవించు". మొదటి శతాబ్దపు క్రిస్టియన్ యుగం రోమన్ కాలంలో గోడమీద రాసిన వాక్యాలు అవి.

పాశ్చాత్య దేశాల్లో రోమన్ కాలం నుంచి ఇరవయ్యొక్క శతాబ్దం వరకూ కనిపించే బూతుమాటల చరిత్ర గురించిన ఒక హాస్య భరితమైన పుస్తకం "హోలీషిట్". ఇన్ని శతాబ్దాల చరిత్రను పరిశీలించేటప్పుడు  విషయాల లోతుల్లోకి పోకుండా వుంటుందేమోనన్న అనుమానం రానీకుండా ఈ పుస్తకంలో చేసిన గంభీరమైన కొన్ని పరిశీలనలు మనకు ఆశ్చర్యం కలిగిస్తాయి.

పాశ్చాత్య భాషా చరిత్రలో 'పవిత్రం' (హోలీ) 'అపవిత్రం' (షిట్) అనే పదాల మధ్య సంబంధాన్ని పరిశీలిస్తుంది మోర్. క్రిస్టియన్ సంస్కృతిలో ఆకారణంగా దేవుడి పేరు ఉచ్ఛరించటమే ఒక పాపం. ఉదా။ 'జీసస్ క్రైస్ట్' 'గుడ్ గాడ్' వంటి ఉపయోగాలు. మన దేశంలో ఇటువంటి పదాలు వినిపించే చరిత్ర లేదని మళ్ళీ చెప్పనక్కర లేదు. 'హే భగవాన్', 'దేవుడా' 'కడవళే' వంటి పదాల ఉపయోగం పూర్తిగా వేరు. మన భాషలకి, పాశ్చాత్య భాషలతో ఉన్న సారూప్యత 'నీయమ్మ' 'నీయమ్మని దెంగ' వంటి బూతు పదాల వినియోగంలో కనిపిస్తాయి.

అయితే ఇటువంటి బూతుపదాల ఉపయోగం గురించి ఎన్ని రకాల సిద్ధాంతాలున్నాయి? శరీర శాస్త్ర సంబంధమైన, భాషాస్వరూప సంబంధమైన, చరిత్ర సంబంధమైన అంశాలను పరిశీలిస్తుంది మోర్. ఆమె వాదన ప్రకారం బూతు పదాల వినియోగం మన మెదడుపైన, శరీరంపైన కూడా ప్రభావాన్ని కల్గిస్తుంది. ఆ ప్రభావాన్ని మనం అంచనా వేయవచ్చు. అట్లాగే శరీర శాస్త్ర పరిశోధనల ప్రకారం, 'టూరెట్స్ సిండ్రోమ్' వంటి సమస్యలున్న వాళ్ళల్లో బూతుపదాల ఉపయోగం, శరీర కదలికలు కూడా ఎక్కువగా ఉంటాయి.

భాషాపరంగా మోర్ వాదనలో బూతుపదాలు, వాటి వాస్తవిక అర్థాల నుంచి అర్థాన్ని తరలించి కొత్త అర్థాలను స్ఫురింపజేస్తాయి. ఇంగ్లీషులో 'దీని రుచి అద్భుతంగా ఉంటుంది' అనటానికి 'దిస్ టేస్ట్ ఫకింగ్ గుడ్' అంటారు. ఇందులో 'ఫకింగ్' అనేది తెలుగులో అనాలంటే 'దెంగటం' అనాలి. ఇంగ్లీషులో వాడే బూతుపదాలకి భారతీయ భాషల్లో సరైన ప్రయోగాలు లేవు. ఇంకో రకంగా చెప్పాలంటే, బూతు వాడకం సాహిత్యానికి ఆమడ దూరం అనుకున్నా, దానికి ఒక బలమైన అర్థం ఉంటుంది కాని, బలమైన అర్థం అంటే ఏమిటి?

మోర్ వాదన ప్రకారం చరిత్రను గమనిస్తే, స్ఫురించే అర్థానికి పూర్తి వ్యతిరేకమైన స్థానం నుంచి బూతు పదం ఒక బలమైన శక్తిని సంతరించుకుంటుంది. ఇంకే పదాలు సాధించలేనంత సూటిగా, అర్థవంతంగా ఈ పని సాధిస్తుంది. అందుకే 'షిట్' అనే (దీనికి కూడా మన దేశ భాషల్లో సారూప్యతలు లేవు) ఆశ్చర్యార్థకం, ఎటువంటి అర్థాన్ని స్ఫురించేది అయినా, వాస్తవానికి దుర్వాసనతో కూడిన మల విసర్జనను సూచించక తప్పదని ఆమె అభిప్రాయం.

చరిత్ర వివిధ దశల్లో వైవిధ్యతతో కూడిన బూతు పదాల ప్రయోగం గురించి మోర్ వర్ణిస్తుంది. ఉదాహరణకి రోమన్ కాలంలో దాదాపు రెండు వేల సంవత్సరాల క్రితం, బూతు ప్రయోగం అంతా పురుషుల మీదే ఎక్కుపెట్టేదిగా కనిపిస్తుంది. ప్రత్యేకంగా, ఒక రకమైన సెక్స్ జీవితం గడపటం అలవాటైన వ్యక్తులను ఉద్దేశించిన ప్రయోగాలివి. కొన్నిసార్లు అటువంటివే పొగడ్తలు కూడా! మచ్చుకి, క్రీస్తుపూర్వం 46లో జూలియస్ సీజర్ విజయానంతరం తిరిగి వచ్చిన సందర్భంలో ఆయనను 'పెడికేటర్' (అంటే 'బట్ ఫకర్' 'మలద్వారంతో రతి' చేసిన వ్యక్తి) అని శ్లాఘించారు. ఇతర్ల ఈర్ష్య నుంచి రక్షణగా, యుద్ధంలో శౌరత్వం ప్రదర్శించిన గొప్ప వ్యక్తిగా ఆయన మీద చేసిన పొగడ్త అది. అదే సమయంలో, పురుషుడు 'రతి'లో స్త్రీ స్థానం ఆక్రమించి (అది పురుషుడితో కావచ్చు, స్త్రీతో కావచ్చు, ఒక పిల్లవాడితో కావచ్చు) నోటితో లైంగిక చర్య జరిపితే అతన్ని ప్రత్యేకమైన దూషణలతో శపించేవాళ్ళు.మధ్య యుగాలలో (అంటే క్రీస్తు తర్వాత 200 నుంచి 1300 వరకు) దేవుడి పేరును అసందర్భంగా వాడినా, అనవసరంగా ఉచ్ఛరించినా తీవ్రమైన శిక్ష పడాల్సిన పాపంగా పరిగణించేవాళ్ళు. పవిత్రంగా తల్చుకోవాల్సిన దేవుణ్ణి, పవిత్రత లేని హృదయంతో తలవడం అన్నింటినీ మించిన నేరం. మధ్య యుగాల చివర్లో, 'దేవుడి రక్తాన్ని' (బ్లడీ), దేవుడి గాయాల్ని (ఆ తర్వాత ఇంగ్లీషు భాషలో దీన్ని శుద్ధి చేసి వూండ్స్‌ని జూండ్స్‌గా మార్చారు) ప్రస్తావించటం కూడా ఆ కోవకు చెందినవే. క్రైస్తవ మత ప్రచారానికి సంబంధించినవే ఇటువంటి ప్రయోగాలు.

మధ్య యుగాల తర్వాతకాలం గురించిన విశ్లేషణలకు సంబంధించి 'మర్యాద పూర్వకం' అనే సూత్రాన్ని ప్రతిపాదించిన చారిత్రక సమాజ శాస్త్రవేత్త 'నార్‌బర్ట్ ఎలియాస్'తో అంగీకరిస్తుంది మోర్. ఇంకో రకంగా చెప్పాలంటే, సమాజం (పబ్లిక్) దృష్టిలో ఒక వ్యక్తి చేయగలిగినదీ, చెప్పగలిగినదీ, మర్యాద పూర్వకమైన వ్యక్తుల మధ్య ఏ విధంగా ప్రవర్తించగలిగేదీ నిర్దేశించిన సాంస్కృతిక నిబంధనల సృష్టితోపాటే ఆధునిక సమాజ ఆవిర్భావం జరిగింది. శతాబ్దాల పాటు రూపుదిద్దుకుంటూ వచ్చిన ఈ నిబంధనా సూత్రాలు పంధొమ్మిదవ శతాబ్దం వరకూ విక్టోరియన్ నీతినియమాలుగా స్థిరీకరించబడినయి. ఈ సందర్భంలో కనీసం కాళ్ళు, కాళ్ళకు తొడుగుకునే పాంట్లు వంటి పదాలు కూడా అశ్లీలంగా ధ్వనించసాగినయి. ఏదేమైనా పంధొమ్మిదో శతాబ్ద సాహిత్యం సాక్ష్యంగా రమణీయమైన అశ్లీల భాష ఒక కుటీర పరిశ్రమగా వర్ధిల్లుతూ  వస్తోంది.

ఈ కాలంలోనూ, ఆ తర్వాత ఇరవయ్యవ శతాబ్దం మొదట్లోనూ డిహెచ్ లారెన్స్ రాసిన "లేడీ ఛాటర్లీస్ లవర్", జేమ్స్ జాయిస్ రాసిన "యులిసిస్" వంటి పుస్తకాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం చూస్తే – సాహత్యంలో అశ్లీల పదాలు, అశ్లీల భాష వినియోగంతో సమాజం తల తిరిగి పోయిందనిపించక మానదు.

మొత్తానికి చరిత్ర గమనానుసారం బూతు పదాల వాడకం గతంలోనే జరిగేదనీ, మర్యాదపూర్వకమైన ఆధునిక ప్రపంచంలో దాని అవసరం ఉండదనే వాదనని అనుసరించే సులభ మార్గం మోర్‌కు ఉండదనిపిస్తుంది. అంతేకాదు ఇప్పటికీ సభ్య సమాజపు మాటా, రాతా తీరు తెన్నులను నిర్ఘాంతపరిచే శక్తివంతమైన అశ్లీల భాష మూడు పువ్వులు, ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది.

అశ్లీల భాష విన్నప్పుడు కలిగే షాక్, అసౌకర్యం, శరీరం జలదరించటం వంటి ప్రభావాల గురించి మోర్ బూతు చరిత్రలో సూత్రప్రాయంగా కూడా చర్చించక పోవటం నాకు ఆశ్చర్యం కల్గించింది. బూతు ప్రయోగంతో స్ఫురించే అర్థం ఏమిటో మోర్ వివరించినా, ఆ స్ఫురణ అనేది పద అర్థంలోనూ, దాని ప్రత్యేకతలోనూ భాగంగా కనిపిస్తాయి. ఆమె వివరించే ప్రభావాలు శారీరకం మాత్రమే. జీల్ దెల్యూజ్ అటువంటి పదాలని 'ఇతర పదాలు'గా, అంటే శారీరక ప్రభావం మాత్రమే కల్గించేవిగా విశ్లేషిస్తాడు. వాటికి వేరే అర్థమేమీ ఉండదు. ఉత్తమమైనదనిపించే ఈ గ్రంథంలో ఇటువంటి సూత్రీకరణ లేకపోవడం విచిత్రం. ఇటువంటి అంశాల పరిశీలనల నుంచి ఇంకొక అంశం మన ముందుకు వస్తుంది. అది, మాట్లాడే సందర్భం, రాసే సందర్భాలలో అశ్లీల పదాలు, వాటి ప్రభావం ఏ విధంగా భిన్నంగా ఉంటుందనేది. ఒక రకంగా చెప్పాలంటే ఒక చర్యతో కలిగించే ప్రభావాన్ని ఒక మాటతో సాధించటం. అందుకే మోర్ రోజువారీ భాషలో వాడే బూతుపదాలకీ,

సాహిత్యంలోని అశ్లీలతకు తేడా చూడలేకపోతుంది. ఆమెకు ఒక సిద్ధాంతపరమైన చట్రం లేకపోవటమే దానికి కారణం. ఆమె గ్రంథం లాంటి ఒక సిద్ధాంత వ్యాసంలో కానీ, ఒక సాహిత్యపరమైన నవలలో కానీ, అశ్లీల ప్రస్తావన, భాషా ప్రయోగాల గురించి మనం ఎట్లా అర్థం చేసుకోవాలి? మనం మాట్లాడే సందర్భంలో వాడగలిగే అశ్లీల పదాలకు, అటువంటి మాటలను రాతపూర్వకంగా ప్రతిబింబించే సమయానికి అంతరం ఏమిటి?

రెండో విషయం: కావ్యాలలో అశ్లీలతను విశ్లేషించే సందర్భంలో స్త్రీ ప్రశ్న, వర్గం, జాతి వంటి అంశాల మధ్య అంతర్ వర్గ(కుల, మత. ప్రాంత, వర్గాల మధ్య - ఇంటర్ సెక్షనల్) విశ్లేషణ ఎట్లా ఉంటుందనే సమస్య మోర్ పట్టించుకోదు. సామాజిక వర్గం, జాతి వంటి విషయాల గురించి విశ్లేషించగలిగిన మోర్, అశ్లీల భాషా ప్రయోగంతో ఎటువంటి అర్థాలు, ప్రభావాలు కలిగించవచ్చు, వాటికి 'జెండర్' ప్రత్యుత్తరం ఏమిటని మాట్లాడకపోవటం గమనార్హం. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఒక నిర్దిష్ట సాంస్కృతిక చారిత్రక సందర్భంలో అశ్లీల భాషను ప్రయోగించే వాళ్ళుగా, ఎదుర్కునే వాళ్ళుగా, దానిప్రభావాన్ని సహించే వాళ్ళుగా, స్త్రీ పురుషులను విడివిడిగా ఎట్లా చూడాలనే అంశం. అంటే ఎల్లవేళలా స్త్రీలే అశ్లీలతకు, బూతుపదాలకు బలయి పోతారని అర్థం కాదు. ఒక సిద్ధాంతపరమైన వాదనలో, చరిత్రపరంగా స్త్రీ పురుషుల మధ్య అంతరాలు గమనించాలంటే అశ్లీలతను వ్యక్తం చేయటంలో లేదా ఎదుర్కోవటంలో ప్రత్యేక అంతరాలుంటాయని గ్రహించటం అవసరం[1].

చివరగా, మన దేశంలో దూషణ చరిత్రను మనం అధ్యయనం చేయాలంటే ఏం చేయాలి అని నేను ఆలోచించటం మొదలు పెట్టాను. నల్ల జాతి గురించిన దూషణ వంటిది మన దేశంలో ఉందా? మోర్ వివరంగా చర్చించిన ఉదాహరణ, 'నిగ్గర్' (నల్ల జాతీయుడు) అనే ఇబ్బందికరమైన అంశం. మన దేశంలో అటువంటి ప్రయోగాలు ఉన్నాయా? కులం పేరుతో తిట్టటం అటువంటిదేనా? అగ్రకుల వ్యక్తి, ఇంకొకరిని 'మాదిగ' అని తిడితే దానర్థం ఏమిటి? కులం పేరుతో సాధారణంగా జరిగే దౌర్జన్యాలతో కులాన్ని కించపరిచే దూషణలకు ఎటువంటి సంబంధం ఉంటుంది? అంతేకాదు. కులం పేరుతో, నోటితో దూషించినా శిక్షార్హం అయిన ఎస్.సి, ఎస్.టి "కుల దౌర్జన్యాల చట్టం"లో దూషణకి, కుల దౌర్జన్యాలకి ఎటువంటి సంబంధం ఉంటుంది?. శ్రామిక కులాలు ఉపయోగించే 'అశ్లీల భాష' గురించి మన అవగాహన ఎట్లా ఉండాలి? అగ్రవర్ణ సమాజం తమ ఔన్నత్యాన్ని చూపించుకునే ప్రామాణిక భాషను తిరస్కరించటం కోసమే 'దెంగు', 'మొడ్డ' వంటి అశ్లీల పదాలు వాడుకలోకి వచ్చాయా? ఈ వివిధ కోణాల కలయిక స్త్రీలపై కలిగించే ప్రభావం ఏమిటి?

'దెంగు', 'మొడ్డ' వంటి పదాలు కో కొల్లలుగా రావటానికి వెనక, అగ్రకుల సమాజపు ప్రామాణిక భాషకున్న అధికారాన్ని 'అసభ్యం'గా తోసిపుచ్చటమనే అర్థం కనిపిస్తుందా! పవిత్ర హిందూ గ్రంథాలలో లైంగిక అవయవాల నుద్దేశించిన(యోని, అంగం, మిథునం) వంటి పదాలను వినియోగించటం ఆ గ్రంథాల 'సభ్యత'కు, 'ఆమోదానికి' కారణమా? ఈ భాషా ప్రయోగాలతో ప్రత్యేక ప్రభావం వివిధ వర్గాల, కులాల స్త్రీలపై ఎట్లా ఉంటుంది?

**ఫుట్ నోట్ :** 1. నేను ఈ పరిమితుల్లోనే ఉండటంతో, జూడిత్ బట్లర్, కాథరిన్ మెకిన్నన్ ల మధ్య "బూతు సాహిత్యం"... ప్రభావం గురించిన చర్చకు కొంత దూరంగా ఉండాల్సి వచ్చింది. జూడిత్ బట్లర్ పుస్తకం "ఆంటీ పోర్నోగ్రఫీ పారడైమ్", 1994లో Against proper objects : Introduction a journal of feminist studies 6.2+3 (1994): 1-26 అనే వ్యాసం.

**అనువాదం : కె.లలిత**

*కె.లలిత ప్రముఖ స్త్రీవాద మేధావి, పరిశోధరకురాలు.*

*ఈ పుస్తకాన్ని 2013లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్ ప్రచురించింది.*

# గురజాడ అప్పారావు

## కన్యాశుల్కంలో తిట్లు

పే. 27 - ఓర్వలేని వెధవ యెవడైనా చెప్పి వుంటాడు.

పే. 28 - మనవాళ్లు వుట్టి వెధవాయలోయ్

పే.30 - రేప్పొద్దున్న యివ్వకపోతే మాలవాడి కొడుకు ఛండాలుడు

పే. 30 - ఈ పిశాచాన్ని వదుల్చుకునేసరికి తల ప్రాణంతోక్కొచ్చింది

పే. 32 - యీ గిరీశం గుంట వెధవ

- అన్న వేళగానివేళొచ్చాడు గాడిద కొడుకు
- వెధవని ముట్టుకో నివ్వకుండా యెత్తు యెత్తింది!

పే. 33 - యీముండ నన్ను బయలుబెడుతుంది కాబోల్రా దైవమా!

- వెధవముండకి పాతివ్రత్యం అన్న మాట యీనాటికి విన్నాను!
- మీరుండగా వెధవెలా అవుతుంది?

పే. 34 - తియ్యొద్దు ఆ పిలిచే మనిషి వెఱ్ఱి ముండ, మనుషుల్ని కరుస్తుంది.

- దొంగలంజ సరసుణ్ణి దాచిందోయ్ మంచం కింద
- నన్నడిగితే యిలాంటి లంజల్ని యిరవై మందిని మీకు కన్యాదానం చేతునే
- అన్నా యీ లంజని యన్నడూ నమ్మకండీ

పే. 35 - నాకు దాచడం ఖర్మవేమి నేను మొగనాల్నికాను. వెధవముండనీ కాను

- ఓర్నాయనా, నన్నెందుక్కొడతావే దండుముండా?
- ఆ వెధవ కూడా వున్నాడూ మంచం కింద
- నీ సానిముండ యెలా అడ్డుకుంటుందో చూస్తాను
- ఈ ముండ మంచం కిందనించి రాదేం?

పే. 38 - ప్రతీ గాడిదె కొడుకు అమ్మావమ్మా వంఛాంచాడు

పే. 40 - ఆడముండల్తోనా ఆలోచన?

పే. 41 - వట్టి మూర్ఖప గాడిదకొడుకు

పే. 42 - ముద్దెట్టు కున్నాడటోయి ముండాకొడుకు

పే. 43 - యీ రోజుల్లో నీ సంస్కృత చదువెవడిక్కావాలి? దరిద్రులి క్కావాలి.

పే. 44 - యీ వెధవ యింగ్లీషు చదువునించి బ్రాహ్మణ్యం చెడిపోతూంది.

పే. 45 - రాస్కెల్ వులక లేదు పలక లేదు

- బండివాడికి నాషనల్ కాంగ్రెస్ విషయమై రెండు ఘంటలు లెక్చరు యిచ్చేసరికి ఆ గాడిద కొడుకు, వాళ్ల వూరు హెడ్ కానిస్టేబిల్ని కాంగ్రెసువారు యెప్పుడు బదిలీ చేస్తారని అడిగాడు!
- స్కౌండ్రల్ కర్ణాటకశాస్తుల్లు వెళ్లిపోయినాడని సంతోషించానుగాని

పే. 49 - వెధవముండా సాద! పెద్దమనుష్యుల్తో వ్యవహారం మాట్లాడుతూంటే రామాయణంలో పిడకల వేట్లాటలాగ అదే పిలవడవా!

**గురజాడ రచనలు కన్యాశుల్కం రెండవ కూర్పు**

**1909 విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**

# దళిత బహుజనుల 'గ్రామ్య భాష'పై 'గ్రంధ చక్షువు'ల దాడి చరిత్ర

■ ఎన్.మనోహర్ రెడ్డి

**1980-90లలో** దళిత సాహిత్యం ఒక ఉప్పెనలా వచ్చినపుడు దళిత సాహిత్య భాష అసభ్యకరంగా అశ్లీలంగా వుందని సనాతన బ్రాహ్మణ పండితుల దగ్గర్నుంచి విప్లవవాదుల వరకు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ బ్రాడ్‌షీట్‌లోని జిలుకర శ్రీనివాస్ గారు రాసిన వ్యాసం దాని గురించే. అయితే దళిత భాషపై అగ్రకులాల దాడులు ఈనాటివి కావు. గిడుగు గురజాడలు వ్యావహారికోద్యమం నడిపినపుడు మాల మాదిగల భాష గురించి, బహుజనుల భాష గురించి, యించుమించు అదే కాలంలో తెలంగాణలో 'తురక తెలుగు భాష' గురించి అగ్రకులాల పండితులు విమర్శలు చేశారు.

దళిత బహుజన వర్గాల భాషని నీచ భాషగా పరిగణించడమనేది నన్నయ కాలం నుంచే, అంటే వెయ్యి సంవత్సరాలకు ముందే మొదలయ్యింది. ఆ కాలంలోనే భాష కుల ప్రాతిపదికపైన విభజింపబడింది. 'పామరుల' భాషని 'గ్రామ్యం' అని పండితులు అసహ్యించుకున్నారు. తెలుగులో ఆది కవిగా పేరు పొందిన, భారతాన్ని తెలుగులోకి అనువదించిన నన్నయ, తెలుగు ప్రజల చేత ఆరాధింపబడే ఆయన, 'వస్తాదు' 'తెస్తాదు' 'పోతాదు' లాంటి పదాలను శాస్త్ర విరుద్ధమైనవని, సాహిత్య రచనకు పనికిరానివని ఒక శాసనాన్ని జారీ చేశాడు (ఆంధ్ర శబ్ద చింతామణి, పే.20). తర్వాతి కాలంలో వచ్చిన అప్పకవి, కేతన, చిన్నయసూరి యింకా చాలా మంది నన్నయ ఆలోచనా దోరణిని కొనసాగించారు. కేతన, గ్రామ్యాన్ని తెలుగు ప్రజలు ఒప్పుకోరు. అది కేవలం ఇతరులను తిట్టడానికి మాత్రమే ఉపయోగపడుతుందని తీర్మానించాడు. (ఆంధ్ర భాషా భూషణము, పే.8) అప్పకవి, ఆయన కాలంలో గ్రామ్య జనులు వాడే వస్తాండీ, తెస్తాండీ, చూస్తాండీ, ఇస్తాండీ లాంటి పదాలను అపభ్రంశాలనీ, వాటిలో వర్ణ లోపముందనీ, కావ్యరచనకు అనర్హమనీ, యిలాంటి పదాలను వాడిన కావ్యాలను సంస్కారరహితమయిన హీనలక్షణ కావ్యాలుగా పరిగణించాలని సెలవిచ్చాడు (అప్పకవీయము, పే.41).

19,20వ శతాబ్దాలలో స్కూలు పిల్లల కోసం రాసిన తెలుగు వ్యాకరణాల్లో కూడా వస్తాదు, తెస్తాదు లాంటి పదాలు లాక్షణిక విరుద్ధాలని, ప్రయోగార్హములు కావని మేధావుల్లో కల్లా మేధావిగా పరిగణించబడే చిన్నయసూరి (బాల వ్యాకరణము, పే.9), ఆధునిక వచన రచనకు ఆద్యుడుగా పరిగణించబడే కందుకూరి వీరేశలింగం (సంగ్రహ వ్యాకరణం, పే.2) లాంటి వాళ్ళు వెలివేశారు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు లాంటి సంస్థలు కొన్ని దశాబ్దాల పాటు "గ్రామ్య భాషను గ్రంధములలో జేర్చుట, మీదు మిక్కిలి యట్టి గ్రంధములు పాఠశాలలోనని బాలురకు బఠనీయములుగా నిర్ణయింపబడుట యనర్థదాయక"మని జయంతి రామయ్య పంతులు గర్వంగా చెప్పుకొన్నాడు (ఆంధ్ర సాహిత్య పరిషద్వృత్తాంతము, పే.5). శంకర నారాయణ తెలుగు-ఇంగ్లీషు నిఘంటువులో గ్రామ్యాన్ని 'pertaining to the low nature in man' అని నిర్వచించారు. జి.ఎన్.రెడ్డి గారు ఇంకో రెండడుగులు ముందుకేసి తన తెలుగు నిఘంటువులో గ్రామ్యాన్ని 'అశ్లీలము' 'అసభ్యమగుమాట' 'తెలివి లేనిది' 'నాగరికతలేని' భాషగా అభివర్ణించాడు (www.andhrabharati.com). బహుజనపల్లి సీతారామయ్య ఏకంగా గ్రామ్యానికి సంబంధించిన సమాచారం తెలుసుకోవాల్సిన అవసరమేలేదని తన పుస్తకంలో దానిపై చర్చనే నిషేధించాడు (ఆంధ్ర శబ్ద మంజరి, పే.4).

భాషపైన జరిగిన చర్చలో 'పామరులు', 'గ్రామజనులు' లాంటి పదాలతోపాటు, బహిరంగంగా కులాల పేర్లు ప్రస్తావనలో కొచ్చింది ఆధునిక కాలంలోనే. గిడుగు వ్యావహారికోద్యమానికి వ్యతిరేకంగా పనిచేసిన పండిత వర్గానికి నాయకత్వం వహించిన వారిలో ముఖ్యమైన జయంతి రామయ్య పంతులు, "బ్రాహ్మణులు మొదలగు విద్యావంతులు మాటలాడు భాష వేఱు. విద్యా గంధములేని కేవల పామర జనులు మాటలాడు భాష వేఱు" అని, గ్రాంధిక భాష "వడపోసిన నిర్మల జల ప్రవాహము" లాంటిదని, గ్రామ్య భాష "కల్మషములతో కూడిన వాన నీరు వచ్చిపడుచుండుటచే గలుషమైన నీటి జాలు వంటిది"అని, "గ్రాంధిక భాషా ప్రవాహము నియమ సహితమై సుస్థిరములైన కూలముల నడుమనే ప్రవహించును గాని గ్రామ్య భాష వోలె గంగవెఱ్ఱు లెత్తి దారి తప్పిపోదు" అని, గ్రామ్య భాషలో సాహిత్య రచన చేస్తే "భాష యొక్క పరిశుద్ధత పోవును, శబ్దములు చెడిపోవును, కాబట్టి గ్రామ్య భాషలో వ్రాసిన గ్రంధములను పాఠశాలలోనుపయోగింప కూడదు" అని వ్యాఖ్యానించారు. (ఆధునికాంధ్ర వాఙ్మయ వికాస వైఖరి, పే.169-199). అలాగే వేదం వెంకటరాయశాస్త్రి సాకలోళ్ళ, మంగలోళ్ళ భాషను అశ్లీలమైన భాషగా వర్ణించి, అలాంటి భాషలో రచన చేయడమంటే "గంగి గోవును తతిమివైచి...గాదిదలను తెచ్చుకొనుట గాదా!" అని గుండెలు బాదుకొన్నాడు.

అయితే బ్రాహ్మణ పండితులు గ్రామ్య భాషను, అంటే దళిత బహుజనుల భాషను, సాహిత్యంలోను విద్యాలయాల్లోను నిషేధించడానికి బలమైన కారణాలే వున్నాయి. ఆ రోజుల్లో సాహిత్యం, విద్య వాళ్ళ గుత్తాధిపత్యంగా వుండేది కాబట్టి, అందులో గ్రామ్య భాష ప్రవేశిస్తే వాళ్ళ అధికారానికి కొర్రుబడుతుందేమోనని, వాళ్ళ పదవులకు ముప్పు కలుగుతుందేమో ననే భయం వుండేది. గిడుగు వ్యావహారికోద్యమాన్ని వ్యతిరేకించిన సూరిశాస్త్రి అనే పండితుడు "గ్రామ్య భాష ప్రబలము జేసి, పండితులకుద్యోగములు లేకుండా జేసి వారి స్థానములను బెస్తలు, ఈడిగలు, తాగుబోతులు, యానాదులు, శబరులు ఆక్రమివ్వజూచిరి" అని తన అక్కసును వెళ్ళగక్కాడు (గ్రామ్యాగ్రామ్య వివాద పట్టిక, 1913).

అంతేకాదు గ్రామ్యం సాహిత్యంలోకి, విద్యాలయాల్లోకి ప్రవేశిస్తే కులాధిపత్యంతోపాటు మతాధిపత్యం కూడా పోతుందని వాళ్ళ భయం. వేదం వెంకటరాయ శాస్త్రి వ్యవహారికోద్యమంను విమర్శిస్తూ "అది కేవలం భాష మీదకి మాత్రమే వచ్చిన దాడియని పలువురు భ్రమించుచున్నారు. ఇది అట్టిది కాదు. ఇది హిందూ మతము మీదకి ఎత్తి వచ్చిన దాడి. ఇటిక యిటిక లాగా లాగి, కన్నము వేసి, ఇల్లు కొల్లగొట్టినట్లుగా, భాష భాషగా దేశ భాషలన్నిటినీ ఇట్లు చెఱచి మన మతమునకు సమూల హరణము చేయునట్టి యుద్యమ మిది" అన్నాడు. గ్రామ్య భాష అభివృద్ధి చెందినట్లయితే గ్రాంధిక భాష కనుమరుగై పోతుందనీ, అందువల్ల హిందూ పురాణాలను ఎవరూ చదువగలిగే వాళ్ళు వుండరనీ, అంతేకాక విద్యార్థుల చేత బైబిలును చదివిస్తున్నారనీ ఆయన ఆరోపించారు (గ్రామ్యా దేశ నిరసనము, పే.43-45).

ఇప్పటి వరకు గ్రామ్య భాషను వ్యతిరేకించిన కొంత మంది సనాతన బ్రాహ్మణ పండితుల అభిప్రాయాలను తెలుసుకొన్నాం. వీళ్ళంతా కుల మత వ్యవస్థల్ని కాపాడుకోవాలనే బలమైన కోరిక వున్న వాళ్ళు. ఆ విషయం వాళ్ళ రాతల ద్వారా అర్థమవుతుంది. కానీ గిడుగు గురజాడలు లౌకిక వాదులని మనకు తెలుసు. వాళ్ళు కులాలు, వర్గాలు పోవాలన్నారు. పండితులు, పామరులు కలిసి జీవించాలన్నారు. కులతత్వాన్ని ఈసడించుకొన్నారు. సమానత్వాన్ని కోరుకున్నారు. ప్రజాస్వామ్య సమాజం కోసం

ఉద్యమించారు. అణచి వేయబడ్డ వర్గాలు పైకి రావాలని ఆశించారు. అలాంటి వాళ్ళకు విజ్ఞానాన్ని అందించడానికి సరళమైన భాష అవసరమని గుర్తించారు. ఇవన్నీ ఆధునిక భావాలు. అందులో అనుమానం లేదు. కానీ వాళ్ళు దళిత బహుజనులు మాట్లాడుకొనే భాష సాహిత్యభాషకు పనికొస్తుందని మాత్రం నమ్మలేదు. అందుకనే గ్రామ్యాన్ని కాకుండా, బ్రాహ్మణులు మాట్లాడుకొనే శిష్ట వ్యావహారికంను ఆధునిక సాహిత్య భాషగా, ప్రామాణిక భాషగా ప్రతిపాదించారు. పండితులు శిష్ట వ్యావహారికాన్ని తప్పుగా అర్థం చేసుకొన్నారనీ, శిష్టవ్యావహారికం, గ్రామ్యం వేరు వేరని వాళ్ళకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. 'శిష్టులు రాత్రి పగలు వాడుకు చేసే భాషను గ్రామ్యమనడము అనాలోచితమను కొంటాను... గనుక యిటు పైని బ్రాహ్మణవాదులు వాడుకొనే నాగరికమైన భాషను పండితులు గ్రామ్య మనకపోవడము ఉచితమని భావిస్తాను' అని గురజాడ కాంక్షించాడు. అలాంటి శిష్టవ్యావహారికాన్ని పండితులు గ్రామ్యమని, 'లంజ సంతతి భాష' అని, 'కులట' అని వర్ణిస్తే బాధపడ్డాడు (గురజాడలు, పే.555-562). అలాగే గిడుగు రామమూర్తి కూడా "వాడుకలో ఉన్న తెలుగు" అనగా "నాగరికులుగా ఉన్న తెలుగు వారందరూ (కోమట్లు, తెలగాలు, కంసాలులు, కాపులు, రాజులు, బ్రాహ్మణులు, ఇంకా ఇతరులు) లోకవ్యవహారములో నిత్యమూ నోటను మాటలాడుతూ ఉత్తరములలో వ్రాస్తూ ఉన్న వ్యావహారిక భాష - తేట తెలుగు. ఇది మంచి భాషకాకేమి? మాల-మాదిగలు మాట్లాడే గ్రామ్య భాష కాదే!" అని సమర్థించుకొన్నాడు. అలాగే, 15-1-1940వ తేదీన గూడవల్లి రామబ్రహ్మం గారి 'ప్రజామిత్ర' పత్రిక కార్యాలయంలో గిడుగు రామమూర్తి ఇచ్చిన చివరి ఉపన్యాసంలో (22-1-1940న ఆయన మరణించాడు) యిలా విన్నవించారు :

"వ్యావహారిక భాష అంటే గ్రామ్యమన్న దురభిప్రాయం మన పెద్దలకి వదలలేదు....వ్యావహారిక భాషను గ్రామ్యమనకూడదని మరియొకసారి గట్టిగా నచ్చ చెప్తున్నాను...గొల్లలు మొదలయిన పామరుల భాష గ్రామ్యమని సంస్కృత సారస్వతములో అలంకారికులన్నారు. లక్షణ విరుద్ధమైన భాష గ్రామ్యమని తెలుగు పండితులన్నారు. ఏ అర్థంలో చూచినా మన వ్యావహారిక భాషకు గ్రామ్యమన్న పేరు అన్వయించదు. ఎందుచేతనంటే, నేను గత 30 సంవత్సరముల నుండీ సమర్థిస్తూ వచ్చిన వ్యావహారిక భాష శిష్టజన వ్యావహారిక భాషే కాని గొల్లలు మొదలయిన పామరులు పలికే గ్రామ్య భాష కాదు... సర్వేశా రామేశం గారు, ఆంధ్ర విశ్వవిద్యాలయ కళాశాలాధ్యక్షులయిన విస్సా అప్పారావుగారు, పండితులును కవులును అయిన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారు, వేటూరి ప్రభాకర శాస్త్రి గారు, విశ్వనాథ సత్యనారాయణ గారు మొదలయిన పెద్దలు తమ వ్యావహారిక భాషలో రేడియో ప్రసంగాలు చేశారు. వారందరూ శిష్టులే. వారి భాష వర్తమాన శిష్ట జన వ్యావహారిక భాష ("తుది విన్నపము", ప్రతిభ.. పే.206-207).

తెలంగాణలో భాషా పితామహుడిగా సురవరం ప్రతాపరెడ్డిని చాలా మంది గుర్తు చేసుకొంటారు. అలాంటి సురవరం కూడా "కరీంనగర్ జిల్లాలో బోయిలు ఉన్నారు. వారి భాష అందరికంటే అధ్వానమైనట్టిది. వారికి 'వ' కారము సరిపడనే సరిపడదు. అయికాయ, అంట, అచ్చినాను అని అంటారు" అని అభిప్రాయపడ్డాడు. అలాగే తెలంగాణలోని జనుల భాష కన్నడ, మరాఠీల మూలాన, కచ్చేరి ఉర్దు మూలాన సర్వసంకరం అయిందని చిన్నబుచ్చు కొన్నాడు. ఉత్తర సర్కారును (ఆంధ్ర) సరిహద్దుగా ఉన్న వరంగల్ భాషే కొంతలో కొంత స్వశ్చంగా ఉందన్నాడు (గోల్కొండ పత్రిక సంపాదకీయాలు. వాల్యూమ్.2.1936-1945, పే.178-180).

దళిత బహుజనుల భాష పట్ల అగ్రకులాల మేధావులకున్న యిలాంటి అభిప్రాయాల వల్లే జాషువా 'తిర్లిక' అనే ఒక వ్యాసం రాయవలసి వచ్చింది (భారతి. ఆగస్టు 1936). శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రి అనే ఆయన భారతిలో ఒక చర్చలో పాల్గొంటూ 'తిల్లిక' అచ్చ తెలుగు పదము కాదు, 'తిర్వలిపు' యను అరవపదము వ్యవహార భ్రష్టమై 'తిల్లిక' అయిపోయిందని వాదించాడు. అయితే జాషువా 'తిల్లిక' అంటే 'ఇంటి దీపం' అని తమ ప్రాంతంలో పసిపిల్లలకు కూడా తెలుసనీ, కావ్య నాటకాల యందు, నిఘంటువులలో లేని, పండితులకు తెలియని అనేక పదాలు వాడుకలో వున్నాయని, మహా పండితులు వాటిని ఉపయోగించనంత మాత్రాన అవి అంతరించి పోవనీ, స్పష్టంగా చెప్పాడు. అంతేకాదు పండితులకు మాలమాదిగ బేధమే తెలియదని, "ఆంధ్ర శబ్దము లేప్రాంతముల నేయే విధముగా వ్యవహరింపబడుచున్నదో తెలిసికొన వలయునన్న గ్రామీణుల నిత్యజీవనము, వారి ఆచార వ్యవహారములు స్వయముగా బరిశీలించిన వారికి గాని, కేవల గ్రంధ చక్షువులకు దుస్సాధ్యము" అని పండితులకు చురకలు గాదు వాతలు పెట్టాడు ('తిర్లిక', భారతి ఆగస్టు 1936).

## నామిని సుబ్రహ్మణ్యం నాయుడు

ఇలామంతునాయుడు వాళ్లది ఈ వూరుగాదు. ఈ వూరు మిట్టూరు, ఇలామంతుకి అత్తగారూరు. వాళ్ల సొంతూరు రంగం పేట. యాడ మిట్టూరు, యాడ రంగం పేట? తిరపతి దాటుకోని, చంద్రగిరి దాటుకోని, కళ్యాణి డాము దాటుకోని పోవాల రంగం పేటకు. ఆ రంగంపేట అయితే యింకా గొట్టు కూలిపాయ్‌న చోటు. ఆడ చెరువులకింద సేద్యం జరుపుకోవాలంట. అంతా యిసికె నేల. చెరువులోకి నీళ్లొస్తేనే పంట. అక్కడుండేదంతా యెలిచేసేనంట. మడికింద చేను ఎవురికో మత్తేపులకే వుంటిందంట. అదంతా వొట్టి ముండమోపి నేలంట. అక్కడున్నా గోచి పాతంత కయ్య లేదు ఇలామంతుకి. పియ్యి దినో, పిడకలేరో ఈ సంసారాన్ని యింతమటుకు ఎలనీదుకొచ్చినాడు. ఇప్పుడు పిలకాయిలు పెద్దోళ్లయి పోయ్‌నారు. గింజికర్చు జాస్తయి పూడిసింది కాపరం నిగ్గలా.

ఇలామంతు బామార్దిది మిట్టూరే. ఒకనాడు గురప్పనాయుడు రంగం పేట కొచ్చి, "ఈ వూరు మీకు అచ్చిరాలా. ఎంత కష్టం జేసినా బూడిదిలో పోసిన పుచ్చ మాదిరిగా నిలవకుండా పోతుండాది. ఈడజేసే కష్టం ఆడ జేసుకోవచ్చులే. వొచ్చెయ్యండి, మా వూరికి. నన్ను జూపెట్టుకొని మీరు, మిమ్మల్ని జూపెట్టుకొని నేను బతికిపోదారి" అన్నాడు.

ఇలామంతు ఆ మాటకు ఒప్పుకోనేలా. "వుండూర్లో ఎప్పడో పలచనై పాయ్‌నాం. అత్తగారూర్లోనన్నా మనంగా వుండనియ్యేమి? ఆడికొచ్చి, ఆడ కూలిపన్లు చేసి ఆడా ఎందుకు బైసొల్లయి పొయ్యేది? మంచినీళ్లు తాగినా మా వూళ్లో వుండేదే మేలు"అనేసినాడు.

'మునికన్నడి సేద్యం' నుండి
నవోదయ పబ్లిషర్స్, విజయవాడ 2, 1990

# నిశ్శబ్దపు భాష :

# కె.లలితతో ఇంటర్వ్యూ

■ గోగు శ్యామల, ఏ.సునీత

***1) పుస్తకం వెలువడినప్పుడు తెలంగాణా (స్త్రీల) భాష గురించి చర్చ జరిగిందా? ఏ విధమైన చర్చ జరిగింది?***

మనకు తెలియని మన చరిత్ర 1985లో ప్రచురణ అయింది. ఆ సందర్భంలో ప్రధానంగా జరిగిన చర్చ అంతా పుస్తక సంపాదకుల దృక్పథంలో లోపాలను ఎత్తి చూపేది అనే చెప్పాలి. స్త్రీల గురించిన మౌఖిక చరిత్రలను 'చరిత్ర'గా అర్థం చేసుకోవటంలో ఉన్న అవగాహనా లోపం గురించి, వాటిని ప్రచురించే క్రమంలో ఎదురయ్యే సమస్యల గురించి, మొత్తం మీద స్త్రీ శక్తి సంఘటన ప్రయత్నం విఫలం అయిందని చెప్పే ధోరణిలోనే చర్చ ఎక్కువ జరిగింది. ఉదాహరణకి, అప్పటి వివిధ దిన పత్రికలలో, అరుణతార వంటి మాస పత్రికలలో వచ్చిన విమర్శలు ఏమిటో కొన్నింటిని మనం పరిశీలించవచ్చు.

అరుణతారలో బాల్‌గోపాల్ ..."ఆ ఇంటర్వ్యూలు అన్నీ చాలా మందికి అర్థం అవుతాయని (కూడ) అనుకోను. ఇది భాషకు (తెలంగాణ భాష గాని, స్త్రీల భాష గాని) సంబంధించిన సమస్య కాదు. మాట్లాడిన మాటలను ఉన్నదున్నట్లు ట్రాన్స్‌క్రైబ్ చేస్తే మాట్లాడిన వ్యక్తులు చదువుకున్న వాళ్ళు – అంటే రాసే భాషకు సన్నిహితంగా మాట్లాడే వాళ్ళు – అయినా కూడా సరిగ్గా అర్థం కాదు. ఇక పాలకుర్తి ఐలమ్మ, దూడల సాలమ్మల సంగతి చెప్పనవసరం లేదు" అని కొట్టిపడేసాడు. పుస్తకంలోని మౌఖిక చరిత్రలు పాఠకులకు అర్థమయ్యే ప్రసక్తే లేదని ఆయన భావన. "...ప్రజల భాషను అందులో ప్రత్యేకించి స్త్రీల భాషను, రాసే భాషలోనికీ, 'మగవాళ్ళు' నిర్ణయించిన వాక్య నిర్మాణం లోనికీ తీసుకురావడం జరుగుతుందని జంకి అట్లాగే వదిలేయడం వల్ల తెలంగాణ భాషతోనూ, తెలంగాణ స్త్రీలు వాడే నుడికారంతోనూ పరిచయం ఉన్న వాళ్ళకు కూడా కొన్ని ఇంటర్వ్యూలు అర్థం కాని పరిస్థితి ఏర్పడింది", అని ఇందులోని భాషాపరమైన అంశాల్ని కొన్ని టెక్నికల్ విషయాల కింద ఆయన జమకట్టడం జరిగింది(పే. 51).

పుస్తకాన్ని, ఇందులో తెలంగాణ భాషని మెచ్చుకున్న సందర్భాలు మొత్తం మీద తక్కువే అయినా, అసలు లేకుండా పోలేదు. "ఈ పుస్తకంలో భాషకు మంచి కొత్త మట్టి వాసన ఉంది....సజీవమైన రోజువారీ భాష, వ్యాకరణ సంకెళ్ళు లేని భాష, అనవసరపు అలంకరణలు లేని భాష...పచ్చటి పైర్ల పై నుంచి వచ్చే ఈ భాష హుషారెక్కిస్తుంది" అని పాలకుర్తి ఐలమ్మ జీవిత కథనుదహరించాడు వాకాటి పాండురంగారావు. (న్యూస్ టైమ్, 11 జనవరి 1987). అయితే ఇందులో మనకు కనిపించేది ఆయనలోని భావుకత మాత్రమే. "మన ఆశల ఆకాశంలో సగమైన స్త్రీల పాత్ర గురించి వాళ్ళ సొంత మాటల్లో అందించటం భాషా పరిశోధకులకు కూడా ఇది విలువకట్ట లేని కానుక", అని 'చేరాతలు' శీర్షికలో చేకూరి రామారావు భాష గురించే ప్రధానంగా వ్యాఖ్యానించాడు. కానీ, అంతకు మించిన చర్చ అందులో మనకి కనిపించదు. ఈనాడు దినపత్రికలోని "నిశ్శబ్ద సంగీతం" శీర్షికలో ఓల్గా "...స్త్రీల మాటల్ని వున్న వాటిని వున్నట్లుగా మనం చదువుతాం. వాళ్ళ ఆలోచనలూ, ఆలోచనా ప్రవంతి, విషయాలను అర్థం చేసుకోవటంలో, చెప్పటంలో వాళ్ళ పద్ధతీ, ఆ పద్ధతిలో ప్రతిబింబించే వాళ్ళ వ్యక్తిత్వం, ఇవన్నీ మనకు గొప్ప అనుభవాన్నిస్తాయి" అని చేసిన వ్యాఖ్య ఒకటి మాత్రం అప్పటి మా భావనకు దగ్గరగా ఉన్నది. ఈ వ్యాఖ్యానాలను పరిశీలిస్తే నిజానికి, పుస్తకంలో లేవనెత్తిన భాషాపరమైన ప్రశ్నలను చర్చించే వాతావరణం, సందర్భం కూడా ఆ రోజుల్లో లేవనేది స్పష్టం అవుతుంది.

***2) స్త్రీల అనుభవాల ఆధారంగా మీరు ఈ పుస్తకంలో వామ పక్ష ఉద్యమాలపై రాడికల్ విమర్శ చేసారు. దానికి ఇంటర్వ్యూ చేసిన స్త్రీల స్వరం ఏ రకంగా ఉపయోగపడింది? ఆ స్వరంలో వారు వాడిన భాష పాత్ర ఎంత?***

మాలో చాలా మంది వామపక్ష ఉద్యమాల నేపథ్యం నుండి వచ్చిన వాళ్ళం. విప్లవోద్యమాలలో స్త్రీల గురించీ; చరిత్రలో పారిస్ కమ్యూన్ నుంచి రష్యా, చైనా విప్లవాలలో స్త్రీల పాత్ర గురించి; పాశ్చాత్య దేశాలలో స్త్రీవాద ఉద్యమాల గురించి స్త్రీ శక్తి సంఘటనలో విస్తృతంగా చర్చలు జరిపే వాళ్ళం. చరిత్రాత్మక తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో అసంఖ్యాకమైన స్త్రీలు ఎన్నో రకాల బాధ్యతలను తలకెత్తుకున్న సందర్భం మనకున్నది. ఆ పోరాటాన్ని ప్రత్యక్షంగా చూసిన వ్యక్తులెందరితోనో మాకున్న పరిచయాలను ఆధారంగా చేసుకొని అప్పటి వరకు ఏ చరిత్రా గుర్తించని 'మన స్త్రీల చరిత్ర'ను రికార్డు చేయాలనుకోవటమే మా ప్రధాన లక్ష్యం. వామపక్ష ఉద్యమాలపై రాడికల్ విమర్శ చేయాలనుకోవటం మా ప్రధాన ఉద్దేశం కాదు. స్త్రీల మౌఖిక చరిత్రలు, అందులో ఆయా స్త్రీల స్వరం పరిశీలిస్తే ఈ విషయాలు కొన్ని స్పష్టమవుతయి. దూడల సాలమ్మ, తను పోరాటం ద్వారా పొందిన విజ్ఞానం, శక్తి సామర్థ్యాల గురించి ఏమంటుందో గమనించటం అవసరం. దూడల సాలమ్మ "ఇండ్లనుంచెట్లచ్చిందో నాకా తెలివి...మీకాన్నా అచ్చరం తెలుసు. నేను బర్లు గాసుకోని బతికినదాన్ని నాకన్నీ జిమ్మల్నే ఉంటై"అన్నది. (పే.276 మనకు తెలియన మన చరిత్ర). అదే సమయంలో ప్రియంవద పార్టీని విమర్శించిన విషయం కూడా ప్రస్తావించటం ముఖ్యం. "ఆడ మగ కలిసి పనిచేసే పార్టీల్లో వాళ్ళు(ఆడవాళ్ళు) కూడా పనిచేస్తే వాళ్ళ బతుకుల్లో మంచి మార్పొస్తుందని బహుశా అనుకొని ఉంటారు....కానీ పార్టీ మాత్రం వాళ్ళకు మద్దతివ్వ లేకపోయింది. భర్తల్ని వదిలేసి స్త్రీలు పార్టీలో కొస్తే వచ్చే సమస్యలెట్లా పరిష్కరించాలనే దాన్ని గురించి పార్టీకి స్పష్టత లేదు. అంతే కాకుండా అటువంటి స్త్రీలను వాళ్ళ భర్తల్నించి విడదీయటం అసలు సరైనదా, కాదా అని కూడా పార్టీకి తోచలేదు".(ప్రియంవద, మనకు తెలియని మన చరిత్ర, పే.277/78) ఇక రహస్య జీవితంలో గర్భధారణ, పిల్లల్ని కనటం వంటి సందర్భాలలో కమలమ్మ పడ్డ వేదన, కడుపు కోత ఆమె మాటల్లోనే చూడాలి "నేను కడుపుతో ఉన్నాను కానీ వాళ్ళతో పాటే నేనూ తిరిగాను. కనే టైము దగ్గర పడింది. మాకక్కడ రక్షణ లేదాయె. మంత్రసాని రావటం కూడా సమస్యనే.'నువ్వు వాణ్ణెక్కడనయినా ఇవ్వాలె. లేదా నువ్వు వాణ్ణి తీస్కపోయి ఎక్కడనయినా ఉండాలె... నువ్వు వెళ్ళినవంటే నిన్ను కత్తి కొక కండజేస్తరు కారం బెదతరు, నిన్ను చంపుతరు, ఆగం చేస్తరు నీ ఇష్టం నువ్వు ఆలోచించుకో, అని పార్టీ నాయకులు బెదిరించారు. ఆమె "భర్తని పిలవండి చూపించుదాము" అని అంటే, "ఇది కార్మిక వర్గానికి తగ్గ చైతన్యం కాదమ్మా! అన్నరు. ఆ మాట అనేప్పటికి నా తలకాయ తిరిగిపోయింది. ఇంత మాట నేనెందుకన్పించుకోవాలె! నేను బతకడానికి రాలే ఈ పోరాటం లోకి...నా శరీరం నాచేతుల లేదు. నా మనసు నా చేతుల లేదు. నా కళ్ళు నా చేతిల లేవు. కంటికి మంటికి ఒకటే ధార". అని కమలమ్మ(పే.280, పే.20) మేము ఇంటర్వ్యూ చేసిన సందర్భంలో కూడా కన్నీరు మున్నీరయింది.

ఇంటర్వ్యూలలో వారి భాష, పాత్ర వారి స్వరంలో ఎట్లా కనిపిస్తుంది అనే ప్రశ్నకి జవాబు చెప్పాలంటే ప్రియంవద

వ్యాఖ్యను చూడాలి, "పోలీసాక్షన్ అయి పార్లమెంటు ఎన్నికలయిన తర్వాత మా కలలకీ, ఆలోచనలకీ ఎంత దెబ్బ! కోడిగుడ్డు చితిపితే చితికిపోయినట్లయి పోయింది. ఎన్నికలయిన తర్వాత ఎట్లుండెనంటే 'ఎక్కడున్నవే గొంగడీ అంటే వేసిన చోటనే కంబళి' అన్నట్టు".(పేజి. 289 అదే పుస్తకం.) కొండపల్లి కోటేశ్వరమ్మ రాజకీయాలను అర్థం చేసుకోవటం తనకెంత కష్టమయ్యేదో వివరించిన పద్ధతి చూద్దాం. "అన్న ప్రాసన రోజు ఆవకాయ పెట్టినట్టవుతుందేమో అనిపించింది. ఏమేమో రాజకీయాలు చెప్పేవారు. ఇనుప గుగ్గిళ్ళలాగ మింగుడు పడేవికావు." (పే.290 అదే పుస్తకం).

***3) ఐలమ్మ వంటి స్త్రీలు వాడిన భాషను మీరు ఉన్నదున్నట్లు రాసారు. అయితే ఆవిడ సామాజిక నేపథ్యానికి, మీ నేపథ్యానికి (కుల, వర్గ, చదువుపరంగా) చాలా అంతరాలు వున్నాయి. అంతేకాక మేథోపరంగా, పుస్తకంలో చెప్పిన దాన్ని బట్టి చూస్తే, మీకు భారత సమాజంతో సంబంధం లేని పాశ్చాత్య స్త్రీవాదం ఉపయోగపడింది అని అర్థమవుతుంది. మరి మీరు ఇన్ని రకాల అంతరాలని ఏ రకంగా అధిగమించారు? మీ బృందంలో ఈ విషయం పైన ఎటువంటి చర్చలు జరిగాయి?***

ఈ ప్రశ్నలో చాలా అంశాలున్నయి. వాటికి సమాధానం చెప్పాలంటే ఈ ప్రయత్నం మొదలు పెట్టటానికి వెనక ఉన్న కారణాలు ఇక్కడ ప్రస్తావించటం అవసరం. ఒక స్త్రీవాద సంఘంగా మా చరిత్రను శోధించాలనే లక్ష్యం మొదటిది. తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్న స్త్రీలు కొంత మందితో కలిసి పనిచేసే అవకాశం రెండవది.

రమీజాబీ పై లైంగిక అత్యాచారం జరిగిన తర్వాత ఏర్పడిన ఉద్యమంలో ఆ స్త్రీలతో కలిసి పని చేసిన సందర్భంలో వాళ్ళందరితో మాట్లాడి వాళ్ళ వెనకటి అనుభవాలు తెలుసుకోవాలనే ఆలోచన కలిగింది. మా గ్రూపులో కొంతమంది పోరాటంలో పాల్గొన్న కుటుంబాల నుంచి వచ్చిన వారయితే, కొంత మంది ఇతర దేశ పోరాటాలలో పాల్గొన్న స్త్రీల చరిత్రలు చదివిన వాళ్ళు. ఉదాహరణకి, నికరాగ్వా విప్లవం గురించి ఇంగ్లీషులో మార్గరెట్ రాండాల్ రాసిన 'సాండినోస్ డాటర్స్' అనే పుస్తకం 1981లో వచ్చింది. అదే సమయంలో హెచ్.బి.టి 1983లో వేసిన పుస్తకం 'మా కథ' పేరుతో డొమితిల బారియోస్ ది చుంగారా అనే లాటిన్ అమెరికన్ స్త్రీ జీవిత కథ వచ్చింది. పోరాట పథంలో బొలీవియా మహిళల గురించిన కథ అది. దాని ఆంగ్ల మూలం గ్రూపు సభ్యులం అందరం చదివాం. స్త్రీల చరిత్రలకు సంబంధించిన పుస్తకాలెన్నో ఆ సందర్భంలో చదవటమే కాకుండా జీవిత కథలను యథాతథంగా రికార్డు చేసి ప్రచురించటం అనే కొత్త తరహా ప్రయత్నాలు కూడా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయనే అవగాహన మమ్మల్ని ఈ ప్రయత్నానికి పురికొల్పింది. స్త్రీల జీవితాల్ని తమదైన శైలిలో వారి స్వంత భాషలోనే డాక్యుమెంటు చేయాలనే తలంపు కలిగింది. ఆ విధంగా మొదలైన ఈ మౌఖిక చరిత్రా ప్రయత్నంలో రకరకాల గొంతులు ధ్వనించటం పుస్తకంలో కనిపిస్తుంది. అందులో మధ్య తరగతి స్త్రీలు, గ్రామీణ స్త్రీలు, చదువుకున్నవారు, చదువు రానివారు, తెలంగాణ యాస నుడికారంతో మాట్లాడినవారు, శుద్ధ బ్రాహ్మణ భాషలో మాట్లాడినవారు, అందరూ ఉన్నారు. ఈ పుస్తకంలో మేం చేసిన ప్రయత్న మంతా వారి భావాలు, భాష, ఆవేశం, ఆవేదన, రాజకీయ పరిజ్ఞానం సర్వస్వం యథాతథంగా పాఠకుల ముందు ఉంచాలనే!

నాకు గుర్తున్నంత వరకు మా చర్చలలో ఏది గొప్ప భాష, ఏది తేలికయినది, దేన్ని సవరించాలి, దేన్ని వదిలేయాలి అనే విషయాలకు చోటు ఇవ్వలేదు. మేము చేసిన మొట్టమొదటిది ఐలమ్మ ఇంటర్వ్యూ. పాలకుర్తి గ్రామంలో ఆమె ఇంట్లో కలిసి మాట్లాడాం. అది రికార్డు చేసినపుడే ఆమె గొంతు, మాట్లాడే పద్ధతి, కవితలల్లినట్టు, సంగీతం ధ్వనించినట్టు అనిపించింది. కాని దానిని రాయటం అనేది ఒక భగీరథ ప్రయత్నం అయింది. విన్నదే వినటం, తిరిగి సవరించటం – మొత్తానికి పట్టుదలగా అంతా ఆమె చెప్పినది పొల్లు పోకుండా, ఉన్నదున్నట్టుగా పేపర్ మీద పెట్టటం మా లక్ష్యం. మా ప్రధాన ఉద్దేశం వాళ్ళ గొంతులను పాఠకుల ముందుంచటమే. తెలంగాణా భాషకున్న స్థానం. దాని వెనక రాజకీయాలు అనే అంశాలకు రెండవ స్థానం మాత్రమే. దాని గురించి అవగాహన ఉన్నా, అదే ప్రధాన విషయం కాలేదు. ఉదాహరణకు పుస్తకం చివర తెలంగాణ భాష గురించి చెప్పినది చూడవచ్చు. "ఒకప్పుడు తెలంగాణా భాషలో రాయటమే కష్టంగా ఉండేది. కాని క్రమంగా అది కూడా ఒక ప్రాంతీయ భాషగా గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు సబ్ సెక్షన్, అంటే స్త్రీలు మాట్లాడే విషయాన్నీ, భాషనీ వెలుగుకి తీసుకురావాలనే ప్రయత్నం ఇది".(పేజి.293 అదే పుస్తకం).

మేథోపరంగా స్త్రీ వాదం ఉపయోగపడింది అనటంలో అది పాశ్చాత్య ప్రభావం అనే భావం స్ఫురిస్తుంది. అది సరయినది కాదు. నిజానికి ఈ ప్రయత్నంలో మా గ్రూపును ప్రభావితం చేసిన రెండు పుస్తకాలు లాటిన్ అమెరికాకు సంబంధించిన స్త్రీలు వారి పోరాటాల గురించే. కాకపోతే ఈ పుస్తకాలు మాకు అందుబాటులోకి రావటానికి మాధ్యమం మాత్రం ఇంగ్లీషు భాషనే! ఆ విధంగా చూస్తే రెండు వెనకబడ్డ దేశాలకు వారధి ఇంగ్లీషు భాషే మరి.

అలవాటు లేని నుడికారమైనా, ఉచ్ఛరించే విధానం అయినా ఇబ్బందికరం అనిపిస్తే దాన్ని సరిదిద్దటం వంటి ప్రయత్నాలు గ్రూపు సభ్యులే కాక చదివిన మిత్రులూ, చివరికి ప్రింటింగ్ ప్రెస్‌లో కంపోజర్స్ (లెటర్ ప్రెస్ రోజులవి) దగ్గర్నించి ప్రతి వాళ్ళూ చేసిన పని. ఒక పద్ధతిలో తీసుకొని రావటానికి, ఒక్కొక్క జీవిత కథ ప్రత్యేకతను నిలబెట్టటానికి చేసిన ప్రయత్నంలో అందరికీ తలప్రాణం తోకకొచ్చింది. అక్షరాలు, పదాలు సరిగ్గా రాయలేదనో, రాయాల్సిన పద్ధతిలో రాయలేదనో, వాక్యాల నిర్మాణం సరిగ్గా లేదనో, మాకు ఎడిటింగ్ అంటే ఏమిటో తెలియదనో వ్యాఖ్యలు చేశారు శ్రేయోభిలాషులు. అసలు ప్రామాణిక భాష అంటే ఏమిటి? గుంటూరు, విజయవాడ (ఉభయ గోదావరి) తెలుగేనా? ఈ సూత్రం ఎట్లా పుట్టుకొచ్చింది?

మా 'ముందు మాట'లో చెప్పినట్టు పబ్లిక్ చరిత్రలు రాసే ప్రామాణిక భాషలో అందరూ ఆమోదించి నటువంటి నుడికారం; చట్టబద్ధమైన, అధికారయుతమైన పదశైలి; వాక్య నిర్మాణం ఉంటయి. అప్పటి వరకూ 'రాసే భాష'కు మరియు రచించిన చరిత్రలకు అంచుల్లో ఉన్న స్త్రీల జీవితాలు, వారి అనుభవాలను ఉన్నదున్నట్టుగా రాయాలనే మా ప్రయత్నంలో నిజానికి ఎన్నో అడ్డంకులను ఆనాడే అధిగమించాల్సి వచ్చింది. మా గ్రూపులోనే వాడి వేడి చర్చలు జరిగేవి. భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థ అణిచివేత గురించి ఎక్కువ తెలుసుకుంటాం అని అనుకుంటే స్త్రీ, పురుష సంబంధాలు, డెన్‌లలో స్త్రీల జీవితాలు, స్త్రీల బాధ్యతలు, వాళ్ళు అనుభవించిన మానసిక వేదనలు మాకు ఎక్కువగా విన్పించినయి. టేపులు ఉన్నదున్నట్టుగా రాయటం పెద్ద సమస్య. గ్రూపులో తెలంగాణా భాషతో పరిచయం ఉన్నవాళ్ళు ఇద్దరు, ముగ్గురు ఉండినా టేపులు రాయటానికి ఓపిక ఉన్నవాళ్ళు తక్కువ. ఉమామహేశ్వరి తెలంగాణా భాషను యథాతథంగా రాయటంలో చాలా కృషి చేసింది. తెలియకుండానే అధికార భాషలో రాసే ప్రమాదం మాకు మళ్ళీ మళ్ళీ ఎదురయ్యేది.

ఇక్కడ స్త్రీల జీవిత చరిత్రలకు మేము ప్రాతినిధ్యం వహించలేదని చెప్పాలి. మేము ఒకరి తరఫున మాట్లాడకుండా వాళ్ళ అనుభవాల్ని వాళ్ళ స్వరాలలో వినిపించాలనుకున్నాం. ఇక్కడ ముఖ్యమైన విషయం, మేం అడిగిన ప్రశ్నలకి వాళ్ళు జవాబివ్వటం కాదు. ప్రధానమైనది వాళ్ళు చెప్పటం, చెప్పిన విషయాల్ని మేం వినటం, విన్నది విన్నట్టుగా కాగితంపైన పెట్టటం. అయితే ఇది అనుకున్నంత సులభం కాలేదు. అంత వరకు ఎటువంటి భాషలోనూ వ్యక్తీకరించని, ఎవరికీ అప్పటి వరకు అంతుపట్టనటువంటి ఈ స్త్రీల అనుభవాల లోతులు చెప్పటం ఎంత కష్టమో, ఆ చెప్పటం అనే క్రియకు అవసరమైన భాషను వెతుక్కోవటం అంతే కష్టంతో కూడిన పని. భాషను వెతుక్కోవటమే కాదు. దాన్ని అంచుల వరకూ లాగాలి. మౌఖిక చరిత్రకారులు ప్రస్తావించిన 'నిశ్శబ్దపు భాష' అది. కానీ ఈ అంశాన్ని అర్థం

చేసుకోలేని మేథావులు ఆనాడు చేసిన వ్యాఖ్య ఇక్కడ ప్రస్తావించాలి. "స్త్రీల ఉద్యమాల పట్ల, స్త్రీల చరిత్ర పట్ల స్త్రీ శక్తి సంఘటన'కున్న పొరపాటు అవగాహనను (ఈ చరిత్రలు) తెలియజేస్తాయి. వారి ... అశాస్త్రీయ దృక్పథం – మనకు తెలియని మన చరిత్ర. ...ఏవో కొన్ని మాటలకు 'నిశ్శబ్ద భాష' అన్న పేరు పెట్టి విపరీతార్థాలు తీయడం, వాస్తవాన్ని గమనించ లేకపోవడం ఈ పుస్తకం సారంగా మిగిలిన అంశం". (సుధీర్ – ప్రజాశక్తి 14/12/86).

***4) తిరిగి చూసుకున్నప్పుడు, పుస్తకంలో రాసిన ఐలమ్మ భాషకు, అప్పుడు వాడుకలో ఉన్న భాషకు – మేధోపరమైన, మీడియాలో, పుస్తకాల్లో గానీ – మధ్య ఉన్న తేడాల గురించి కొంచెం చెప్పగలరా?***

మనకు తెలియని మన చరిత్ర తెలుగులో 1985లో అచ్చయింది. 80లలో తెలంగాణ భాషలో జరిగిన రచనలు చాలా తక్కువనే చెప్పచ్చు. 1985/86లో 'ఉదయం' పత్రికలో నామిని సుబ్రహ్మణ్యం నాయుడు 'పచ్చనాకు సాక్షిగా' రాయలసీమ మాండలికంలో రాసేవాడు. అదే కాలంలో పాశం యాదగిరి, దేవులపల్లి అమర్ తెలంగాణ భాషలో రాసినవి తరచూ వచ్చేవి. తెలిదేవర భానుమూర్తి 'చెల్‌నేదో బాల్ కిషన్' అనే శీర్షికతో ఉదయంలో రాసేవాడు. 90ల తర్వాత 'నోటి మాటకు సేతి రాత' అనే శీర్షికతో మల్లేపల్లి లక్ష్మయ్య సాధారణ జన జీవితాల ఆధారంగా రాసిన మౌఖిక కథనాలు సుప్రభాతంలో వచ్చేవి. కానీ ఇవన్నీ సాహిత్యపరంగానో, ఎడిట్ పేజీలలోనో వచ్చినవే కానీ వార్తా పత్రిక మొత్తం తెలంగాణ భాషలో వచ్చిన సందర్భం అప్పటికీ, ఇప్పటికీ కూడా లేదు. నమస్తే తెలంగాణ వంటి దిన పత్రిక కూడా. కొన్ని శీర్షికలుగా తప్ప మొత్తం తెలంగాణ భాషలో మనకు కనిపించదు. భాష అందరికీ అందుబాటులో ఉండాలను కోవటమే దానికి కారణం కావచ్చు.

ఇక పాఠ్య పుస్తకాల గురించి చెప్పే పనే లేదు. తెలంగాణ భాషలో అవి ఉండే ప్రసక్తే లేదు. తెలంగాణ భాషలో రాసిన పుస్తకాలు రాలేదని కాదు. వట్టికోట ఆళ్వారు స్వామి రచనలు 40లలోనే వచ్చినయి. తరువాత దాశరథి రంగాచార్య, కాళోజిల రచనలు ఉన్నయి. అప్పటి కాలపు రచయిత్రులు యశోదారెడ్డి, ముదిగొండ సుజాతా రెడ్డి ప్రముఖులు. 80ల తర్వాత ప్రముఖంగా తెలంగాణ భాషలో కాలవ మల్లయ్య, అల్లం రాజయ్య రాసిన కథలు, నవలలు వచ్చినయి. తెలంగాణ భాషలో రాసిన స్త్రీలు గోగు శ్యామల, జూపాక సుభద్ర, జాజుల గౌరి, జ్వలితలు అద్భుతంగా రాస్తున్న కథలు, కథానికలు పాఠకులందరికీ సుపరిచితమే. అయినా, తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న సందర్భంలో మాత్రమే ఈ సాహిత్యాలన్నింటిని సొంతం చేసుకొని కొత్త స్థాయికి తీసుకొని పోవటం జరిగిందని నా అభిప్రాయం. తెలంగాణ జాతి భాషారీత్యా అనుభవించిన అవమానాలను, హేళనలను నూతన తెలంగాణ ఉద్యమం ద్వారా తిప్పికొట్టే ప్రయత్నంలో ఈ రచనలన్నీ ప్రాముఖ్యతను సంతరించుకున్నయి.

***5) మీ పుస్తకం తెలంగాణా భాషను వ్యక్తీకరించిన ముఖ్యమైన పుస్తకాలలో ఒకటని చెప్పుకోవచ్చు. ఇటీవలి తెలంగాణా రాష్ట్ర ఉద్యమ నేపథ్యంలో మీ పుస్తక ప్రాముఖ్యతని ఏ విధంగా చూస్తున్నారు?***

ఈ ప్రశ్నలో భాష గురించే ప్రస్తావన ఉంది. నూతన రాష్ట్రం ఏర్పడిన సందర్భంలో పుస్తక ప్రాముఖ్యతను భాషాపరంగా చూడాలంటే దానికి జవాబు ఇప్పటి వరకూ రాసిన విషయాలన్నింటిలోనూ కనిపిస్తుంది. 'మనకు తెలియని మన చరిత్ర' లేవదీసిన ఎన్నో అంశాలలో భాష ఒకటి. అందులో రాసేభాష, మాట్లాడే భాష, చదువుకున్న వాళ్ళ భాష, చదువు రాని వాళ్ళ భాష, స్త్రీల భాష, కులపరమైన భాష, ఆధిపత్య తెలుగు భాష (కృష్ణా, గుంటూరు); ఇత్యాది అంశాలు అందులో కనిపిస్తయి. ఒక రకంగా చెప్పాలంటే ఈ పుస్తకంతో భాషాపరమైన ఎన్నో అంశాలు మన ముందుకొచ్చినయి. ఇదేకాక పుస్తకం లేవనెత్తిన ఎన్నో ఇతర అంశాలు ఇప్పటి నూతన తెలంగాణ రాష్ట్రం ఉనికిని ప్రభావితం చేసేవిగా చూడవచ్చు. అందులో స్త్రీలకు, మరీ ముఖ్యంగా ఉద్యమాలలో వివిధ పాత్రలు వహించిన స్త్రీలకు సంబంధించిన ప్రశ్నలు ప్రధానమైనవి. గత దశాబ్దంగా 7ఉధృతంగా జరిగిన తెలంగాణ రాష్ట్ర పోరాటంలో వందలు వేలాదిగా స్త్రీలు తరలి వచ్చి ఎన్నో రకాల ఉద్యమ రూపాలలో వారి పాత్రని నిర్వహించిన విషయం తిరిగి చెప్పనక్కరలేదు. అయితే ఈనాడు రాజకీయ జీవితంలో స్త్రీలెక్కడ ఉన్నారు? చట్ట సభలలో, నాయకత్వ స్థానాలలో, ప్రభుత్వ నిర్మాణాలలో వాళ్ళెక్కడా కనిపించకుండా పోవటానికి కారణాలు ఏమిటి? చరిత్ర పునరావృతం కావటమేనా? ఇత్యాది ప్రశ్నలు మళ్ళీ మనం వేసుకోవాల్సిన సమయం ఇది.

## కేశవ రెడ్డి

పొద్దు పొడుస్తుండగా వారు హరిజనవాడకు చేరారు. మంగళ వాయిద్యాలను భజన మందిరంలో ఉంచి యెవరి ఇండ్లకు వారు వెళ్లిపోయారు.

సుంక్రేసు చెట్టు కింద రామచంద్రుడు నిలుచుకొని వుండడం గమనించి సాతానివాడు, "యావూరన్నా మనది? ఇంతకు ముందు యాడా చూసినట్టు లేదు" అన్నాడు.

రామచంద్రుడు, "మాది తూరుపు దేశమన్నా" అన్నాడు.

సాతానివాడు, "అట్టనే అనుకున్నా. నువ్వు గుడ్డ కట్టుండే తీరు, తలగుడ్డ చుట్టి ఉండే తీరు చూస్తానే అనుకున్నా నువ్వు ఈ పాయికట్టోడివి కాదని" అని కొంత ఆగి, "ఏమిటోల్లో?" అనడిగాడు.

"మాలోల్లం" అన్నాడు రామచంద్రుడు.

"అద్దెలస్తానే వుంది. మాలోడు గాకపోతే మాతో బజినపాడేదానికి ఇంగెవులొస్తారు. రెడ్లూ, బాపనోల్లూ వస్తారా? ఏవి మాల్లోలని అడగతా వుండా" అన్నాడు.

"తూరుపురాజ్జాన రంపాలోల్లు ఇసోసం గదా. నేను రంపాలోణ్ణి"

బండ మీద కూర్చుని వున్న గూనివాడు, రామచంద్రునితో "నిలుచునే వుండావే. ఇట్ల కూర్చో" అని బండ తావు చూపించి, "తూరుపురాజ్జం యిడిసి ఏం పనిమీదొచ్చినావు?" అనడిగాడు.

సాతానివాడు వేళాకోళంగా, "రంపాలోళ్ళు రాజ్జం తిరగడంలో యిచిత్రం ఏముంది? పుట్టిన ఊర్లోనే రంపాలోడు సావడం నేను యిన్లా. రెడ్ల దగ్గిర తలకాయ లెగరేసి మాట్లాడడము, వాళ్ళు నడుము లిరగదన్నితే చెవులు జాడించుకుంటూ పరుగెత్తడమూ - అదే రంపాలోల్ల బతుకు" అని రామచంద్రుని వైపు తిరిగి, "ఏమంటావు?" అన్నారు.

**ఇన్‌క్రెడిబుల్ గాడెస్ (క్షుద్రదేవత నుండి), హైదరాబాద్ బుక్ హౌస్, ఏప్రిల్ 2011 పే.129**

# అనువాద ప్రపంచం

## ■ సునీత, శ్రీవత్సన్ మరియు మోయిద్‌ల మధ్య సంభాషణ

శ్రీవత్స్ : అనువాదం లో ఒక ప్రపంచాన్ని మరో ప్రపంచానికి అందించాలి అని అనటంలో మీ భావం ఏమిటి?

సునీత : ఎవరైనా రాసేటప్పుడు వున్న చర్చనుద్దేశించి, ఆ విషయంపై జరుగుతున్న సంభాషణలో భాగం కావటానికి ప్రయత్నిస్తారు. విషయ పరిధితో పాటు రచయిత వున్న నేపథ్యం, సందర్భం, ఆ చర్చ స్వభావం కూడా రచనలను ప్రభావితం చేస్తాయి. ఏమి రాయాలి, దేని గురించి రాయాలి, ఎలా రాయాలి అన్న వాటిని నిర్ణయించేవి ఇవే. ఆంగ్ల భాషకు దేశీయ భాషలపై ఆధిపత్యం ఒక పక్కనుంటే, ప్రతి దేశీయ భాషకు దాని ప్రజా ప్రపంచం (పబ్లిక్ డొమైన్) ఒకటుంటుంది. అది ఆ భాషా చరిత్ర, నేపథ్యం, రాజకీయాలపై నిర్మించబడుతుంది. ప్రతి దేశీయ భాషలో విషయ చర్చలు ఈ రెండు అంశాలపై ఆధారపడి ఉంటాయి. దీనికొక ఉదాహరణ ఉర్దూ భాషలో జరిగే చర్చల స్వభావం. అవి జాతీయ హద్దులకి పరిమితం కాక, అంతర్జాతీయ రాజకీయాల నేపథ్యంలో జరుగుతాయి. అరబిక్, పర్షియన్ భాషలు, ఇస్లామిక్ చర్చల ప్రభావం వాటిపై వుంటుంది. అలాగే భారత దేశంలో ఆంగ్ల భాషా చర్చలు కూడా జాతీయ, అంతర్జాతీయ పాఠకులని దృష్టిలో పెట్టుకుంటాయి. తెలుగు భాషలో చర్చలు, భాష ప్రయుక్త రాష్ట్రం వచ్చి, తెలుగు అస్తిత్వం 50 సంవత్సరాల కాలంలో స్థిరపడిన నేపథ్యంలో ఎక్కువగా రాష్ట్ర రాజకీయాల నేపథ్యంలో రూపుదిద్దుకుంటాయి. వేరే భాషల పాఠకులని దృష్టిలో వుంచుకోవు. మనం తెలుగు నుండి ఇంగ్లీషులోకి, ఉర్దూ నుండి తెలుగులోనికి అనువదించేటప్పుడు ఆయా భాషా ప్రపంచాల వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.

మొట్టమొదటి బ్రాడ్ షీట్‌లో హైదరాబాదు ముస్లిముల గురించిన విషయాలని అనువదించటంలో ఆసక్తికరమైన విషయాలు చర్చకొచ్చాయి. 'ఇంగ్లీషులో, ఉర్దూలో హైదరాబాదు చరిత్ర పై జరిగిన సుదీర్ఘ చర్చ వల్ల ఆ విషయాలపట్ల కొంత అవగాహన ఏర్పడి ఉండింది. హైదరాబాదు ముస్లింలు అనంగానే ఆ పాఠకులకి అర్థమవుతుంది. తెలుగులో ఈ చర్చ జరగక పోవటం వల్ల ఈ విషయాలు చాలా విచిత్రంగా అగుపిస్తాయి. తెలుగులో ముస్లిములందరూ అల్ప సంఖ్యాకులు అన్న మేరకు మాత్రమే చర్చ నడిచింది తప్ప హైదరాబాదు ముస్లిములుకున్న ప్రత్యేక అస్తిత్వం, చరిత్ర, సంస్కృతీ గురించి గుర్తింపు లేదు. మరి తెలుగులోకి ఈ విషయాలని తీసుకు రావటం ఎలా?

శ్రీవత్స్ : నాకు ఈ సందర్భంలో సెజ్ బ్రాడ్ షీట్ లో కె.సంధ్య చేసిన అనువాదం గుర్తుకొస్తోంది. అక్కడ సమస్య చైనీస్ ప్రపంచాన్ని తెలుగు లోనికి తీసుకు రావటం కాదు; అకాడెమిక్ వ్యాసాన్ని తెలుగు లోనికి సమగ్రంగా తీసుకురావటం. సాంస్కృతిక పరమైన రచనల కంటే భిన్నమైన సంక్లిష్టతతో కూడిన అకాడెమిక్ రచనల ప్రపంచం ఒకటుంది. చైనాలోని సెజ్‌ల గురించి వ్యాసకర్త చేసిన వాదనని ఆవిడ తన అనువాదంలో అంతే నిర్దిష్టంగా తీసుకొచ్చారని నాకు అన్పించింది. 'ప్రపంచం' గురించి మనం జరుపుతున్న చర్చకి నేను కొంత జోడిస్తాను. ఇక్కడ ప్రపంచం అంటే భూగోళం కాదు. అది ఒక వ్యక్తి చుట్టూ ఉ ండే విశాల ఆవరణం. ఆమె చేసే పనులకి ఒక సందర్భం, దిశా నిర్దేశం, ప్రయోజనాన్ని కల్పించి, ఆ పనులకు ఒక ఉద్దేశాన్ని కల్పిస్తాయి. రచించే వ్యక్తి ఈ ఉద్దేశంతో స్పందిస్తుంది – సెజ్ అంటే ఏమిటి, చైనీస్ ఆధునికీకరణకు దానికీ ఉన్న సంబంధం, ఆ ప్రక్రియను విశ్లేషించిన విధానం మొదలయినవి. రచయిత భౌతిక ఆవరణానికి కాక తన ఆలోచనకి రూపమిచ్చే తన చుట్టూ ఉన్న ప్రశ్నలకి, చర్చకి స్పందిస్తుంది. తెలుగులోకి ఏదైనా రచనని అనువదించేటప్పుడు పాఠకులకి దాన్ని నిర్దేశించే ఆవరణం యొక్క రూపాన్ని కూడా తెలియచేయాలి. స్పష్టంగా చెప్పాలంటే ఒక వ్యక్తి సంకల్పాన్ని చుట్టూ వున్న ప్రపంచం నిర్దేశిస్తుంది; రాజకీయ, సామాజిక నేపథ్యం వ్యక్తి ఎదుర్కొనే సమస్యల రూపాన్ని నిర్ణయిస్తుంది. చైనా సెజ్‌ల గురించి రాసిన రచయిత చైనా సంబంధం గురించి. తెలుగు లోనికి అనువదించేటప్పుడు ఆ చైనీస్ రచయిత ఏ చర్చలో భాగంగా రాస్తున్నారో దాన్ని కూడా పాఠకులకి అందచెయ్యాలి. అలాగే తెలుగు నుండి ఇంగ్లీషు లోకి అనువాదం చేసేటప్పుడు కూడా ఈ వ్యవహారం గురించి జాగరూకతతో వుండాలి, తెలుగులో రాసిన రచయిత ఆలోచన, అవస్థ, ఇక్కడి చర్చలు, పోరాటాలు ఆంగ్ల పాఠకులకి అందచేయగలగాలి.

మోయిద్ : నా ఉద్దేశంలో ప్రపంచం అంటే ప్రాపంచిక దృష్టి. అది వ్యక్తికున్న ప్రాపంచిక అనుభవం నుండి రూపు దిద్దుకుంటుంది. మన దేశంలో ఇన్ని భాషలు, ఇన్ని ప్రాపంచిక దృష్టులు వుండటం నాకు ఒక పక్క చాల ఆసక్తికరంగాను, ఇంకో పక్క ఛాలంజింగ్‌గా అనిపిస్తుంది. ప్రతి భాష ఆయా ప్రజలకున్న ప్రత్యేక సాంస్కృతిక అనుభవాలను, ప్రాపంచిక దృక్పథాన్ని, ఆవరణాన్ని ప్రతిబింబిస్తుంది. అలా చూసినప్పుడు కొన్ని అందరికీ చెందినవి గాను, కొన్ని కావనీ అర్థమవుతుంది. ఉదాహరణకి తెలంగాణా తెలుగుకీ, ఆంధ్ర తెలుగుకీ మధ్య ఉన్న బేధాలు. ఒక దేశీయ భాష నుండి మరొక దేశీయ భాషకి ఎలా అనువదించాలనేది పెద్ద సమస్య – సంస్కృతీ, భావనలు, అనుభవాలు, ఆలోచనలు, అనుభూతులు ఎలా అనువదించాలి?

సునీత : మీ ఇద్దరూ చెప్పిన విషయాలు మళ్ళా నొక్కి చెప్తాను: భాషా ప్రపంచాలు ఒకటితో ఒకటి సంబంధం లేకుండా ఉండవనీ, ప్రాపంచిక దృష్టులు, దృక్పథాలు వాటిని కలుపుతాయనీ. రాజకీయ, సాంస్కృతిక, అకాడమిక్ రచనలు ఏవయినా సరే. బహుశా ఈ సంబంధాలే అనువాదాలకి సహకరిస్తాయి.

మోయిద్ : నా ఉద్దేశంలో బ్రాడ్ షీట్ రెండు భాషల్లో తీసుకు రావటం వల్ల విషయాల పట్ల మన అవగాహన పెరిగింది. ఇంగ్లీషులోనే తీసుకు వచ్చి వుంటే, మనకే సమస్యలు వచ్చేవి కావు, ఈ అనువాద సంబంధిత విషయాలు అర్థమయి ఉండేవి కావు.

సునీత : అనువాదంలో 'బలం' అంటే మీ ఉద్దేశంలో అర్థమేమిటి?

శ్రీవత్స్ : పరిమిత భాషా ప్రపంచం అన్న భావనకి బదులు భాషలో ప్రతి వాక్యానికి, భావనకీ వుండే బలంపై దృష్టి పెట్టాలని నా అభిప్రాయం. భాషా ప్రపంచం అన్న భావన అనువాద ప్రక్రియ గురించి ఒక విశాల చిత్రాన్ని ఇస్తుంది కాని అనువాద బలం అన్న భావన పదం లేదా వాక్యం యొక్క వివరాల కున్న ప్రాముఖ్యతను అర్థం చేయిస్తుంది. ఇంగ్లీషు నుండి తెలుగు లోకి అకాడెమిక్ రచనను అనువదించేటప్పుడు, అనువాద బలం దాని నిర్దిష్టతలోను, దానికి చుట్టూ ఉన్న సైద్ధాంతిక పదాలతో అది ఏర్పరచుకునే సంబంధంలోను వుంటుంది. తెలుగు నుండి ఇంగ్లీషులోకి కవిత్వాన్ని అనువదించేటప్పుడు బలానికున్న అర్థం మారిపోతుంది. కవి వాక్యం ద్వారా ఏ అర్థాన్ని పలికించింది, ప్రతి వాక్యంతో తానుండే ప్రపంచాన్ని ఎలా సంబోధించింది అన్నవి ముఖ్యమవుతాయి. రచయిత ప్రపంచాన్ని అనువదించటానికి ఒక పద్ధతి – ప్రతి వాక్య నిర్దిష్టత, తీవ్రతను సరిగ్గా పట్టుకుని, దాని బలాన్ని పాఠకులకి అందచేయటం. సరిగ్గా చెయ్యటం అంటే, సమానార్థ పదాన్ని అనువాదం చేస్తున్న భాషలో వాడటం కాదు; రచయిత రాసిన భాషలో పదాలని, వాక్యాలని ఏ తీవ్రత తో వాడారో, అటువంటి తీవ్రతని అనువాద పాఠకులకి తెలియ చెయ్యటం. రచయిత రాసిన భాషలో పాఠకులు దానికున్న బలాన్ని అర్థం చేసుకోగలుగుతారు కానీ, ఆ ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే ఆసక్తితో చదివే అనువాద పాఠకుల కి రచన బలాన్ని తెలియచేయాల్సిన బాధ్యత అనువాదకులదే. అదే అనువాదానికి జీవాన్నిస్తుంది. అంటరాని వసంతం వంటి రచనను ఇంగ్లీషులోనికి తీసుకురావాలంటే ఆ రచన బలాన్ని, తీవ్రతని తెలియచేస్తేనే అనువాదం బలంగా వుంటుంది.

లేకుంటే రచయిత చెప్పింది అనువాద పాఠకునికి ఎంతో కొంత అర్థమవుతుంది కాని రచన బలం అర్థంకాదు. దాన్ని మూల రచన లోని తీవ్రత, బలం, ఉత్సాహంతో అనువదిస్తేనే దానికి ఇంగ్లీషులో కూడా జీవం వస్తుంది.

సునీత: అనువాదంలో పదాలని ఒక పరిమితిలో వాడాల్సి వుంటుంది. అంటే దానర్థం పదాలని ఒక దానితో ఒకటి జోడించటం / కూర్చటం కాదు. కొన్నిసార్లు ఒక పదం అనువదించటానికి రెండు మూడు వాక్యాలు అవసరమవుతాయి. మరికొన్ని చోట్ల నేను ఉద్దేశపూర్వకంగా వివరించే వాక్యాలని, పదాలని వాడను. తక్కువలో తక్కువ పదాలు ఉపయోగిస్తాను. పాఠకులు ఈ రచయిత ఏమంటున్నారో అర్థం చేసుకోవటానికి కొంత అవస్థ పడాలని నా ఉద్దేశం. నా ఉద్దేశంలో రచన బలాన్ని తెలియచేయడానికి అనువాదకులు విభిన్న ఎత్తుగడలు వాడాల్సి ఉంటుంది.

మోయిద్ : అనుభూతులని, భావాలని తెలియచేయటానికి 'బలం' అన్న భావన అత్యంత అవసరం. ఒక శాస్త్ర రచనని అనువదిస్తున్నప్పుడు బహుశా ఈ సమస్య తలెత్తకపోవచ్చు. అక్కడ నిర్దిష్టత ముఖ్యం. ఒక సాంస్కృతిక రచనని, అనుభవాలని అనువదిస్తున్నప్పుడు ఈ బలం భావన ముఖ్యం. ఇక్కడ మరొక సమస్య కూడా వస్తుంది: రచన పట్ల విశ్వాసంతో వుండాలా లేక దాని అర్థాన్ని అందచేయాలా? ఏది ముఖ్యం? ఎంపిక కష్టం. ప్రధానంగా రచన పైనే దృష్టి కేంద్రీకరిస్తే చాలాసార్లు అర్థం పాఠకునికి అందకపోవచ్చు అలాగని అర్థం పై దృష్టి కేంద్రీకరిస్తే రచన ని మూల గ్రంథంగా మాత్రమే వాడుకున్నట్లు అనిపించొచ్చు.

సునీత : అవును.

శ్రీవత్స్ : కొన్నిసార్లు వాక్యం స్థాయిలో, కొన్నిసార్లు పదం స్థాయిలో చేయాల్సి వుంటుంది. మంచి అనువాదం అంటే ఈ తూకం నైపుణ్యంతో జరిగిందని అనుకోవచ్చు.

సునీత : మీరిద్దరూ చెప్పినవి – రచన కున్న బలం, భాష, రచయిత ఆలోచనల గురించి – నా కేమనిపిస్తోందంటే అనువాదం అనేది కేవలం సామర్థ్యానికి సంబంధించిన విషయం కాదేమో నని. అది ఒక నమ్మకంతో చెయ్యాల్సిన పని. ఒక కళ లాంటిది. ప్రతిసారి కొత్తగా చెయ్యాలి. యాంత్రికంగా చెయ్యలేము. ఒక రకంగా అది ఎప్పటికీ అసంపూర్ణ క్రియ. పరిపూర్ణత సాధించటం అన్నిసార్లు సాధ్యం కాదు.

మోయిద్ : యాంత్రిక అనువాదానికి మనం చేసే ప్రత్యే అనువాదాలకి చాల తేడా వుంటుంది. రెండిటినీ పోల్చి చూడటం సాధ్యం కాదు.

శ్రీవత్సన్ : మనం చర్చించాలనుకున్న మూడవ అంశం సైద్ధాంతిక భావనలు అనువదించటం.

సునీత : సైద్ధాంతిక భావనలు 'ప్రపంచం'పై చర్చని నిర్దిష్ట స్థాయికి తీసుకు వస్తాయి. మనం మొదటి బ్రాడ్ షీట్ నుండి ఈ సైద్ధాంతిక భావనల్ని తెలుగులోకి తీసుకు రావటం ఎలా అని ఆలోచించాల్సి వచ్చింది. కనోటేషన్ పదానికి స్ఫురణ అని, ఆరోగ్య శ్రీ బ్రాడ్ షీట్‌లో ఆరోగ్య సంబంధిత పదాలు, లైంగికత–వేధింపులు బ్రాడ్‌షీట్‌లో లైంగికతకి సంబంధించిన పదాలు అనువదించేటప్పుడు కొత్త తెలుగు పదాలు సృష్టించాల్సి వచ్చింది. సెజ్ బ్రాడ్ షీట్‌లో ఎమినెంట్ డొమైన్, పబ్లిక్ పర్పస్‌ను తెలుగులోకి అనువదించటంలో కూడా సమస్య ఎదురయింది. పబ్లిక్ అన్న పదానికి ప్రజలు అని తెలుగులో వాడతాము. కానీ పబ్లిక్ అన్న పదం అందరూ కలిస్తేనో, సమిష్టిగానో ఏర్పడేది కాదు, ప్రజలందరిదీ కూడా కాదు, ప్రజలకు సంబంధించిందే కానీ వారికి పూర్తిగా చెందని సార్వత్రిక స్వభావం కలిగిన ఆధునిక సామాజిక పరిణామం.

మోయిద్ : మన ప్రయత్నం సఫలీకృతమయిందని నేను అనుకుంటున్నాను.

సునీత : నాకు అనుమానమే...

శ్రీవత్స్ : అవును...ప్రతి సైద్ధాంతిక భావన ఒక చర్చలో భాగంగా వుంటుంది...దాని అనువర్తిత పదాలు దానికున్న అర్థాన్ని స్థిరీకరిస్తాయి...దాన్ని ఆయా పదాల నేపథ్యంలోనే అర్థం చేసుకోగలం...ఆ సైద్ధాంతిక భావనని ప్రతిపాదించిన వ్యక్తులు దానికీ, ఆయా అనువర్తిత పదాలకీ మధ్య గల సంబంధాన్ని, దానికి గల ప్రత్యేకతను వివరించి వుంటారు. అనువాదంలోనికి దాన్ని తీసుకు రావాలంటే మూల భాషలో జరిగిన ఆ సైద్ధాంతిక శ్రమని అర్థం చేసుకోవాలి.

మోయిద్ : మనం ఈ ప్రయత్నంలో సఫలీకృతులయ్యామని ఎందుకంటున్నానంటే నేను ఉర్దూ లోకి అనువదింపబడిన ఆధునికానంతర రచనలను చదివినప్పుడు చాలా సార్లు ఏమీ అర్థం కాలేదు. బ్రాడ్ షీట్ చదివేటప్పుడు అలా అన్పించలేదు.

శ్రీవత్స్ : డిలూస్ అనే ఫ్రెంచ్ సైద్ధాంతకర్త ఏమంటారంటే ఒక సైద్ధాంతిక భావన ప్రవాహాన్నుంచి విషయాన్ని పైకెత్తి చూపుతుందని. నేనెందుకు ఇది ప్రస్తావిస్తున్నానంటే, వీటిని అనువదించేటప్పుడు అనువాద భాషలోకి ఒక కొత్త భావనని ప్రవేశ పెడుతున్నాము. అంటే దానిలో అప్పటికే ఉన్న సిద్ధాంత వరవడి నుండి ఎత్తి చూపాలి, అదీ మూల భాషలోని చర్చ ప్రతిబింబించే విధంగా; అనువాద పాఠకునికి ఒక ప్రతిబింబాన్ని చూపుతున్నాం అన్న మాట. మూల భాషలోని సైద్ధాంతిక భావన ప్రతిబింబించేటట్లు అనువాద భాషలో ఒక అద్దాన్ని మనం నిలబెట్టాలి.

మోయిద్ : బ్రాడ్‌షీట్ ప్రధాన ఉద్దేశం కూడా అదే కదా? ప్రతి సంచికనీ ఒక అంశంపై కేంద్రీకరించి సంబంధిత నేపథ్యం, సైద్ధాంతిక క్షేత్ర పరిచయం చేసే ప్రయత్నం చేసాం. ప్రతి బ్రాడ్ షీట్ లో అనేక దృక్పథాలని, సంబంధిత సైద్ధాంతిక భావనల్ని చర్చించాము. అన్నీ ఒకే రాజకీయ మూసలో లేకపోవచ్చు గానీ అనువాద భాషలో చర్చకు ఒక సైద్ధాంతిక చట్రం ఉండాలనే ప్రయత్నం చేసాం. ఒక విషయం యొక్క చలనశీలతను చూపించాము.

**అనువాదం : ఏ.సునీత**









# జ్ఞానరంగాలు-భాష

■ ప్రథమా బెనర్జీ

మన దేశంలో భాష పై చర్చ సాధారణంగా బోధనారంగ సమస్యగా ముందు కొస్తోంది. ఆంగ్లంలో ఇప్పటికే పుష్కలంగా వున్న విషయ పరిజ్ఞానాన్ని దేశీయ భాషల లోనికి తీసుకురావటం ప్రధాన అంశంగా భాషా సమస్యను బోధనా రంగంలో అనువాదానికి సంబంధించిన సమస్యగా పరిగణించటం జరుగుతోంది. దీని కోసమే ప్రభుత్వం తలపెట్టిన జాతీయ అనువాద మిషన్ ప్రారంభం కాకుండానే చతికిల పడింది.

నా ఉద్దేశ్యంలో దీనికి ప్రధాన కారణం అనువాద ప్రక్రియకు విద్యా పరమయిన, మేధో పరమయిన విలువ, గుర్తింపు లేకపోవటమే. అనువాదంపై పరిశోధనలు, అకాడమిక్ సంస్థల్లో మిగిలిన విద్యావేత్తలతో సమానంగా అనువాదకులకి ఉద్యోగావకాశాలు, దానిలో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు అదనపు మార్కులు ఇవ్వటం వంటివి జరగట్లేదు. పరిశోధనా రంగంలో అయితే అసలు భాషను ఒక అంశంగా కూడా గుర్తించట్లేదు. గొప్ప పరిశోధనలు కేవలం ఆంగ్ల భాషలోనే వస్తాయని అందరి నమ్మకం. సామాజిక శాస్త్ర పరిశోధనలో దేశీయ భాషలు క్షేత్రస్థాయి శోధనలలోనో, ఇంటర్వ్యూల రూపంలోనో, ప్రాచీన దస్తావేజుల రూపంలోనో కనిపిస్తాయి కానీ వాటిని ప్రాథమిక సమాచారం గానే పరిగణిస్తారు. ఆంగ్ల భాషలో వాటిని వండి పరిశోధనా వంటకాన్ని తయారు చేస్తే తప్ప  ఆ సమాచారాన్ని జ్ఞానంగా పరిగణించరు. అంతేకాదు అలా తయారు చేసిన పరిశోధనా పత్రాలని తిరిగి దేశీయ భాషలలోనికి అనువదించి అందరికీ అందిస్తారు.

ఈ సందర్భంలో మనం గుర్తు తెచ్చుకోవాల్సింది ఏమిటంటే– 1950ల నుండి కేంద్ర సాహిత్య అకాడెమి ఆధ్వర్యంలో 'ప్రాంతీయ' భాషల సాహిత్యాన్ని ఆంగ్లంలోనికి అనువదించటం మన సాంస్కృతిక అస్తిత్వానికి కేంద్ర బిందువుగా రూపొందింది. ఈ మధ్య జరిగిన స్త్రీ వాద, దళిత రచనల అనువాదాలు కూడా అనువాదానికున్న కేంద్ర స్థానాన్ని సుస్థిర పరచటమే కాక సామాజిక శాస్త్రాలపై అనుకూల ప్రభావాన్ని చూపాయి. అయితే ఈ క్రమంలో జరిగిన అనుకోని పరిణామం-దేశీయ భాషలు సాహితీ పరమయినవనీ, విద్యా రంగానికి పనికి రానివనే ముద్రకూడా పడిపోయింది. విద్యా సంస్థలతో పెద్దగా సంబంధం లేని విశాల ప్రజా రంగంలో ఆయా భాషల్లో చిన్న పత్రికలూ, వ్యాస రచనలు, అనేక రకాల పుస్తకాల రూపంలో మేధోపరమైన చర్చలు నిరాఘాటంగా సాగుతూ ఉన్నాయన్న విషయం మరుగున పడిపోయింది. అందువల్లే భాషా చర్చను మనం అంతర్-శాస్త్ర అధ్యయనం (ఇంటర్ డిసిప్లినారిటీ)పై జరుగుతున్న చర్చలోనికి తీసుకు రావల్సిన అవసరముంది.

మొదటిగా మనం అనువాద అధ్యయన విభాగాలను విశ్వవిద్యాలయాల్లో అంతర్-శాస్త్ర పరిశోధనా కేంద్రాలుగా స్థాపించవలసిన అవసరం గురించి సీరియస్‌గా ఆలోచించాలి. అనువాద ప్రక్రియను బహు భాషా నైపుణ్యంగానో, భాషా శాస్త్రానికి అనుబంధ రంగం గానో మాత్రమే పరిగణించకూడదు. విద్యా రంగంలో ప్రతి శాస్త్రం తనదైన సైద్ధాంతిక పరి భాషను రూపొందించుకుందనీ, ఆయా పరిభాషల తీరు తెన్నులను అర్థం చేసుకున్నప్పుడే సామాజిక శాస్త్ర జ్ఞాన రంగంలో అనువాదం సాధ్యమవుతుందనీ గుర్తించాలి. సామాజిక శాస్త్ర రంగంలో అనువాదాన్ని మనం ఆంగ్లం మరియు దేశీయ భాషల మధ్య బేధాలు గానూ, సాహిత్యానికి మరియు మౌఖిక భాషల మధ్య బేధాలుగానో కుదించి చూడలేము. అప్పుడే మనకి మరొక ముఖ్యమైన ప్రశ్న లేవదీసే అవకాశం వస్తుంది – ఆంగ్లం లోను, తెలుగు లోను, మలయాళం లోను, మనం జరిపే మేధోపరమైన, అకాడమిక్ చర్చల్లో వాడే సైద్ధాంతిక పరిభాషలు ఒకటే అని మనం భావించవచ్చా అని. అవి ఒకటి కానప్పుడు దేశీయ భాషల్లో జరిగే సామాజిక శాస్త్ర చర్చలకు, ఆంగ్లంలో జరిగే అకాడమిక్ చర్చలకు మధ్య జరగాల్సింది కేవలం అనువాదం మాత్రమే కాదు – అంతర్ శాస్త్ర అధ్యయనం అని గుర్తించాలి. ఇక్కడ భాష భిన్న రూపాలు, విలువలు, తీరుతెన్నులు, పఠనా పద్ధతులూ కలిగున్న విభిన్న జ్ఞాన సముదాయాల మధ్య సంబంధాల విషయంగా ముందుకొస్తుంది. అనువాద అధ్యయనాలు అంతర్-శాస్త్ర అధ్యయనాలుగా రూపొందాలి. సామాజిక శాస్త్రాలలో అనువాదం రెండు రకాలు – భావ పరమయింది, భాషా పరమయింది. అంతేకాక అది భిన్న శాస్త్ర రంగాల / శాస్త్రాల మధ్య, భాషల మధ్య జరిగేది కూడా.

ఇదే ప్రశ్నని తిరగేసి కూడా అడగచ్చు. అంతర్ శాస్త్ర పరిశోధననే, 'భాషా' సమస్య అన్న పట్టకం నుండి చూడొచ్చా అని. ఉదాహరణకి, చరిత్ర, ఆర్థిక శాస్త్రాలను పరస్పరం అభిముఖంగా చేర్చామనుకోండి. దీనర్థం ఈ రెండు శాస్త్రాలు తమ కోసం ప్రత్యేకంగా రూపొందించుకున్న రెండు సైద్ధాంతిక పరిభాషలను దగ్గరకు చేర్చామన్నమాట. అవి అనువాదం ద్వారానో, ఇతరత్రా మధ్యవర్తిత్వం ద్వారానో లేదా వాటిని దగ్గరికి తీసుకొచ్చే క్రమంలో పుట్టే సరికొత్త పరిభాష ద్వారానో తప్ప తమంతట తామే ఒకదాన్నొకటి అర్థం చేసుకోలేవనే సత్యాన్ని మనం గుర్తించాలి. ఇక్కడ అంతర్ శాస్త్ర అధ్యయనాల గురించి పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉంది.

అంతర్ శాస్త్ర అధ్యయనం అంటే – చరిత్ర, ఆర్థిక శాస్త్రం లాంటి శాస్త్రాలను పరస్పరం ఒకదానితో ఇంకొకటి సంబంధం లేని జ్ఞానక్షేత్రాలను చేరుకునే క్రమంలో రూపొందినవిగానో, లేక ఏ సంబంధం లేని వేరు వేరు అధ్యయన పద్ధతులను పాటించే క్రమంలో ఏర్పడిన శాస్త్రాలుగానో కాక, ఒకే లేదా ఉమ్మడి జ్ఞానలక్ష్యాన్ని చేరుకునే క్రమంలో రూపొందిన వేరు వేరు భాషలుగా వాటిని మనం గుర్తించటం ఉపయోగకరంగా ఉంటుందేమో?

అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో ప్రస్తుతమున్న 'క్షేత్ర అధ్యయనాల'కంటే కొంత భిన్నంగా మనం కూడా మన విద్యా సంస్థల్లో 'ప్రాంతీయ అధ్యయనా కేంద్రాల'ను ఎందుకు స్థాపించుకోకూడదు? వీటి వల్ల భాష, అనువాద సంబంధిత విషయాలను 'స్థానిక రంగ పరిజ్ఞానం' అనే విస్తృతార్థంలో చూసి, వాటిపై మరింత దృష్టి సారించటానికి అవకాశం కలుగుతుంది. తమిళ, బెంగాలీ లేదా ఈశాన్య అధ్యయన కేంద్రాలను మనం ఏర్పరిస్తే అవి ఏక కాలంలో అన్ని సాంఘిక శాస్త్రాలను, ఆర్థిక శాస్త్రం, సినిమా శాస్త్రం, పర్యావరణ శాస్త్రం మొదలయిన వాటి దృష్టిని భారత దేశంలోని 'ప్రాంతాలను' ఎలా చూడాలనే విషయంపైన దృష్టి పెట్టగలవు. ఇటువంటి విస్తృత చట్రం లోనే మనకు భాష, అనువాదం, స్థానిక సామాజిక శాస్త్రాలను ఏక కాలంలో చర్చించ గలిగే అవకాశం కలుగుతుంది. అయితే 'ప్రాంతం' అంటే ఇప్పటికే భారత సమాఖ్యలో ఉన్న రాజకీయ విభాగం గా చూసే ప్రమాదం లేకపోలేదు కాబట్టి 'ప్రాంతం' అనే కాన్సెప్ట్‌ని విమర్శనాత్మక దృష్టితో పునరాలోచించుకోవాల్సిన అవసరం చాలా వుంది.

సెమినార్ పత్రికలో వ్యాసం నుండి

**అనువాదం : ఏ.సునీత**

ప్రథమా బెనర్జీ సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవెలపింగ్ సొసైటీస్‌లో పరిశోధకురాలు, అధ్యాపకులు.